సాహిత్య
సాంస్కృతిక
మాసపత్రిక

★ అరుణతార

134 డిసెంబర్'91-జనవరి'92

విషయసూచిక

DEC '91/JAN '92 134

సంపాదకీయం I-X

కాలిన నీలి నేల - త్రిపురనేని మధుసూదనరావు 1

మధ్యయుగంలో తెలుగు సాహిత్యం - త్రిపురనేని మధుసూదనరావు 3

జాతీయోద్యమ కవిత్వం - వర్గీకరణ - పాపినేని శివశంకర్ 39

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట నేపథ్యంలో తెలుగు సాహిత్యం - మానేపల్లి 46

ఆదివాసి జీవితంలో కళారూపాలు - సాధన 65

సాహిత్యంపై నిషేధాలూ, నిర్బంధాలు - చలసాని ప్రసాద్ 82

అమెరికాలో రచయితలపై నిఘా - వి. తిరుపతిరావు 90

సాంకేతికాభివృద్ధి - సాహిత్యం - ఎన్. వేణుగోపాల్ 95

ఖఫన్ కవిత - వస్తురూప విశ్లేషణ - వరవరరావు 105

కల్లోల వర్తమానానికి 'భూమిక' - స్నేహమాల 112

అరుణతార చందా ఈ నెలతో ముగిసిన వారు తమ చందాలను పునరుద్ధరించుకోండి. కొత్తవారిని చేర్పించండి. వచ్చే సంచిక నుంచి పత్రిక ధర పెరిగింది. గమనించండి.

సంవత్సర చందా - 50 రూపాయలు

విడి ప్రతి - 5 రూపాయలు

చిరునామా : వి. చెంచయ్య

6-5-13

పిన్నంరాజువారివీధి

కావలి – 524 201

111

1932 - 91

ఆలోచనలకు అంతంలేదు
ఆయనొక నిరంతర ఆలోచనాపరుడు

చైతన్యానికి చావులేదు
ఆయనొక జ్వలిత మానసం

నిండైన వ్యక్తిత్వానికి మరణంలేదు
ఆయనొక మనిషెత్తు వ్యక్తిత్వం

జ్ఞాపకాలకు మరుపుండదు
ఆయనొక అద్భుత జ్ఞాపకం

మనసుకు వయసుండదు
ఆయనొక మనసైన మనిషి

(1991 అక్టోబర్ 29న రోడ్డు ప్రమాదంలో మరణించిన కేతవరపు రామకోటి శాస్త్రి స్మృతిలో....)

IV

I

సంపాదకీయం

సాహిత్యం - సమాజం

సాహిత్యం సమాజానికి ప్రతిబింబమనీ, సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉందనీ, అది ఆనందాన్ని కలిగిస్తుందనీ సాధారణంగా అందరూ చెబుతున్నమాట. కానీ సాహిత్యానికీ సమాజానికీ ఉన్న అంతస్సంబంధం ఏమిటన్నది ప్రధాన ప్రశ్న. ఏ కాలంలో ఏ సాహిత్యం ఎందుకు పుట్టిందో తెలిస్తే దానివల్ల జరిగే లాభనష్టాలు కూడా తెలుస్తాయి. దాన్ని సమీక్షించి సరైన అంచనా వెయ్యడానికి అవకాశం ఉంటుంది.

సాహిత్య ప్రయోజనం దేశకాలాల్ని బట్టి ఉంటుంది. ప్రయోజనం అనేమాట ఒకటే అయినా దేశకాలాల్ని బట్టి దాని అర్థాలు వేరు. "విశ్వశ్రేయః కావ్యమ్" అని 11వ శతాబ్దంలోని "ఆంధ్రశబ్ద చింతామణి" లో ఉన్నా ఆ 'విశ్వశ్రేయస్సు' కూ మన 'విశ్వ శ్రేయస్సు' కూ సంబంధం లేదు. 'ధర్మం' అనేమాట ప్రాచీనులు ఎన్ని సార్లు ప్రయోగించినా ఆ 'ధర్మం' వేరు మన 'ధర్మం' వేరు. ప్రాచీనుల 'విశ్వ శ్రేయస్సు' మోక్షాన్ని కోరుకునేది. మన 'విశ్వ శ్రేయస్సు' ఆర్థిక సామాజిక రాజకీయ సమానత్వాన్ని కోరుకునేది. ప్రాచీనులు 'ధర్మం' అని ప్రయోగిస్తే దానికి వర్ణధర్మం అని అర్థం. ఈనాడు 'ధర్మం' అనేమాట న్యాయం అనే అర్థంలో వాడుతున్నాం. వర్ణ, కుల, మత, సంపద ప్రమేయంలేని న్యాయాన్ని ధర్మంగా భావిస్తున్నాం. వర్గ వ్యవస్థ బలంగా ఉన్న ప్రాచీన భూస్వామ్య వ్యవస్థలో ధర్మం అనేమాట వర్ణ వ్యవస్థకు అతీతమైంది కాదు. ధర్మాన్ని కాపాడ్డం అంటే వర్ణ ధర్మాన్ని కాపాడ్డమనే అర్థం. ఎవరైనా ధర్మాన్ని అతిక్రమించారంటే వర్ణ ధర్మాన్ని అతిక్రమించారనే అర్థం. శూద్ర వర్ణ ధర్మాన్ని అతిక్రమించి తపస్సు చెయ్యడానికి పూనుకున్నాడు కాబట్టే శంబుకుణ్ణి రాముడు చంపాడు. ఆ విధంగా రాముడు 'ధర్మా'న్ని కాపాడాడు. రామరాజ్యం ధర్మాన్ని కాపాడిన రాజ్యం. అంటే వర్ణధర్మాన్ని కాపాడిన రాజ్యం. కాబట్టి ప్రాచీన సాహిత్యం కూడా తన శ్రేయస్సును కోరుకున్నదనీ, ధర్మాన్ని గురించి చెప్పిందనీ అంటే ఈ స్పృహతో ఆలోచించడం అవసరం. దేశకాలాల్ని బట్టి మాటలకు అర్థాలు మారడం అనేది ఏ భాషకైనా సహజం.

ఎక్కడయినా సాహిత్యం పుట్టుక ప్రజల జీవన విధానంతో ముడిపడి

వుంటుంది. కాలక్రమంలో అది ఎవరి ప్రయోజనాల్ని అయినా నెరవేర్చడానికి ఉపయోగపడవచ్చు. వర్గపూర్వ వ్యవస్థలో కూడా మానవులు తమ అనుభూతుల్నీ, ఆశల్నీ వ్యక్తం చేస్తూ సాహిత్యాన్ని సృష్టించుకున్నారు. సాహిత్యం తొలిరూపం మౌఖికంగానే ఉంటుంది. వేదాలు అలా పుట్టినవే. వేదాలు మొదట రాయబడలేదు, చెప్పబడ్డాయి. ఒకరు చెబుతుంటే తక్కినవాళ్లు పలికేవాళ్లు. విని మాత్రమే నేర్చుకునేవాళ్లు. అందుకే వేదాలకు 'శ్రుతులు' అని కూడా పేరు. భాషకు లేఖన సంప్రదాయం వచ్చిం తర్వాత అవి లిఖితరూపాన్ని పొందాయి. "ఓ ఇంద్రుడా! మాకు వర్షాన్నివ్వు, మాకు పశువుల నివ్వు" లాంటి మాటలు వేదాలలో కనిపిస్తున్నాయంటే, ఆనాటి మానవుల అవసరాలు వాటిలో వ్యక్తం అవుతున్నాయని అర్థం. తమ జీవితాలకుపయోగపడే, తమ జీవితాల్ని తీర్చిదిద్దే ప్రకృతిని ఆరాధించేవాళ్ళు. ప్రకృతి ఆరాధన వారికి సరదా కాదు, అవసరం. ఆ అవసరం నుంచి పుట్టిందే తొలి సాహిత్యం. ప్రకృతి శక్తుల్ని దైవ శక్తులుగా భావించడం, ఆ తర్వాత అవి అనేక అద్భుత శక్తులుగా చిత్రింపబడడం మొదలయినవన్నీ తర్వాతి పరిణామాలు. వేదాలు ఒక కాలంలో, ఒక ప్రాంతంలో ఒకరు చెప్పినవి కావు. భిన్నకాలాలలో, భిన్న ప్రాంతాలలో ఎందరో చెప్పినవి. కొంత కాలం అయిం తర్వాత అవన్నీ ఒక క్రమ పద్ధతిలో కూర్చబడ్డాయి. వేదాల్లోగానీ, పురాణాల్లోగానీ ఎప్పటి కప్పుడు అనేక విషయాలు చేర్చబడ్డాయి. వీటినే ప్రక్షిప్తాలు అంటారు. ఈ సంప్రదాయం మనకు చాలా కాలం కొనసాగింది. వేమన పద్యాలలో కూడా అనేక ప్రక్షిప్తాలున్నా యనేది తెలిసిన విషయమే.

ప్రాచీన కాలంలో అభివృద్ధికరమైన ఆలోచనలు మతం ఆధారంగానో, తాత్విక చింతన ఆధారంగానో వ్యక్తం చెయ్యబడ్డాయి. ప్రతి కొత్త ఆలోచనా మత రూపాన్ని ధరించేది. చివరకు చార్వాకుల అభిప్రాయాల్ని కూడా చార్వాక మతం అన్నారు. వైదికమతంలోని జంతుబలినీ, కర్మకాండల్నీ, వర్గవ్యవస్థలోని అణచివేత ధోరణినీ నిరసించింది బౌద్ధమతం. వైదిక మతంలోని అణచివేత ధోరణిని తీవ్రంగా నిరసించిన అంబేద్కర్ చివరకు బౌద్ధమతాన్ని ఆశ్రయించాడు. ఆ రోజుల్లో బౌద్ధమతం నిర్వహించిన పాత్ర గొప్పదే కావచ్చు కానీ ఈ రోజుల్లో కూడ దాన్నే ఆశ్రయించాల్సిన అవసరం లేదు. బుద్ధుడికీ, ఈ కాలానికి రెండున్నర వేల సంవత్సరాల అంతరం ఉంది. ఇవాళ మన సమస్యలకు పరిష్కారాన్ని మతంలో

వెతకక్కరలేదు. ఆధునిక దృక్పథంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ చేసుకోగలుగుతున్నాం. మూల కారణాలు తెలుసుకోగలుగుతున్నాం. రెండున్నర వేల సంవత్సరాల క్రితం ఒక సమస్యను పరిశీలించడానికి ఇవాళ మన కున్న వనరులు బుద్ధుడికి లేవు. ఆనాడు బుద్ధుడు చెప్పిన అహింస వేరు, ఈనాడు మనం చెప్పుకుంటున్న అహింసవేరు. వ్యవసాయ సమాజం అభివృద్ధి చెందుతున్న సమయంలో వైదికమత కర్మకాండల పేరుతో జరుగుతున్న విపరీతమయిన జంతుబలుల్ని నిరసించాడు బుద్ధుడు. ఆనాటి సమాజానికి జంతువుల అవసరం బాగా ఉంది. అందుకే బుద్ధుడు చెప్పిన భూతదయ, అహింస అనేవి ప్రజల నుంచి రాజుల దాకా అందరినీ ఆకట్టుకున్నాయి. బౌద్ధమత సాహిత్యాన్ని ఈ నేపథ్యంలో చూడాలి.

ప్రాచీన కాలంలో దేవతల చరిత్రనీ, మతచరిత్రనీ పరిశీలిస్తే మానవజాతి చరిత్రనూ తెలుసుకోవచ్చు. వీటన్నిటినీ తెలుసుకోడానికి ఇతర ఆధారాలతోపాటు ఆనాటి సాహిత్యం కూడా ఒక ముఖ్యమైన ఆధారమే. భారత యుద్ధంగానీ, రామ రావణ యుద్ధంగానీ ఆస్తి తగాదాలు తప్ప వేరు కావు. రాజుల ఆస్తి రాజ్యమే. ఆ రాజ్యం కోసమే అన్నదమ్ములయిన పాండవులూ, కౌరవులూ తలపడ్డారు. పురాణ కథల్లోని అద్భుత సంఘటనలనూ, దైవశక్తులనూ, నీతులనూ పక్కనబెట్టి చూస్తే ఆనాటి సమాజంలోని వైరుధ్యాలు కొంతవరకైనా అర్థం అవుతాయి. ఉత్పత్తిసంబం ధాల్లోనూ, ఆస్తి సంబంధాల్లోనూ వచ్చిన మార్పులు ఆ కట్టు కథల్లోకూడా కనిపి స్తాయి. నిజంగా ఇది జరిగిందా లేదా అనిగాక ఈ కథ పుట్టటానికి గల సామాజిక వైరుధ్యం ఏమిటని పరిశీలించాలి. పరశురాముడు బ్రాహ్మణుడైనా గండ్రగొడ్డలి ధరించి రాజులందరినీ ఇరవయ్యొక్కసార్లు నరికిపారేశాడని కథ. రాజులందర్నీ ఒక్కసారి నరికెయ్యడం కూడా ఎవ్వరికీ సాధ్యం కాదు. అసలీ కథ ఎందుకు పుట్టిం దనేది ముఖ్య విషయం. మానవుడు ఆహారసేకరణ దశ దాటి ఆహారోత్పత్తి దశలో ప్రవేశించిం తర్వాత వ్యవసాయం అభివృద్ధి చెందింది. నాగలి అనే పనిముట్టు వ్యవ సాయంలో గణనీయమైన అభివృద్ధిని తీసుకొచ్చింది. వ్యవసాయం వల్ల అదనపు ఉత్పత్తి రాసాగింది. ఇది ఎవరికి చెందాలి అనే విషయంలో సహజంగా రాజులూ, బ్రాహ్మణులూ పోటీ పడతారు. రాజ్యాధికారం, భూమ్మీద అధికారం రాజులదయితే, వారి అధికారాలకు ఆమోదముద్ర వేసేది బ్రాహ్మణవర్గం అంటే పురోహితవర్గం. వీళ్ళిద్దరిమధ్యా మిగులు ఉత్పత్తికోసం తగాదావస్తే చివరకు గెలిచేది రాజులే. అందుకే

రాజులపట్ల బ్రాహ్మణవర్గంలో ఉన్న అసంతృప్తిని పోగొట్టుకోడానికీ కసిని తీర్చుకోడానికీ ఈ కథను సృష్టించి ఉండాలి. వర్ణవ్యవస్థ నియమాల ప్రకారం పరశురాముడు ఆయుధం పట్టకూడదు. అయినా పట్టాడు. దీని లక్ష్యం వర్ణధర్మాల చట్రాన్ని చెరిపెయ్యడం కాదు. ఇలాంటి ఉదాహరణల్ని చూసి ఆనాడు కూడా వర్ణభేధాలు లేవని చెప్పడానికి ప్రయత్నించడం అశాస్త్రీయం. ఋగ్వేద కాలానికి ఇంద్రుడే ప్రధానమైన దేవుడు. ఆ తర్వాతి కాలంలో ఇంద్రుడు ప్రాధాన్యాన్ని కోల్పోయి త్రిమూర్తులు అవతరించారు. వ్యవసాయ సమాజంలో వ్యవసాయంతో ముడిపడివున్న అనేక ఇతర వృత్తులు ఏర్పడ్డాయి. ఒక్కొక్క వృత్తిని అనుసరించే మానవబృందాలు ఏర్పడ్డాయి. మానవ సమాజంలో వచ్చిన శ్రమ విభజనకూ, త్రిమూర్తుల సృష్టికీ ఎంతో కొంత సంబంధం ఉండి ఉండాలి. చరిత్ర రచనకు మన ప్రాచీన సాహిత్యం కూడా ఒక ఆధారం అవుతుందని సుప్రసిద్ధ ఆధునిక చరిత్రకారుడు కోశాంబి నిరూపించాడు

తెలుగు సాహిత్యం నన్నయ్యతోనే ప్రారంభం కాలేదు. మనకు దొరికినంత వరకు లిఖిత సంప్రదాయంలో వచ్చిన మొదటి పెద్ద రచన భారతం. నన్నయ భారతానువాదానికి నడుంగట్టారేగాని, స్వతంత్ర కావ్యరచనకు పూనుకోలేదు. భూస్వామ్య సమాజంలో సంస్కృతానికున్న ఆదరణ, గౌరవం ఇతర భాషలకు లేవు. అందుకే ప్రముఖ కవులందరూ సంస్కృత కావ్యాలనే అనువదించారు లేదా అనుసరించారు. సంస్కృతంలోనూ కావ్యాలూ, లక్షణ గ్రంథాలూ రాశారు. సంస్కృత సాహిత్యం ఉన్నవారికే రాజాస్థానాల్లో చోటు. తెలుగు సాహిత్యం సంస్కృత పదభూయిష్టం కావడానికి ఈ నేపథ్యం కారణం. అయితే సంస్కృతానికి ఇంత గౌరవం ఎందుకొచ్చింది ? వైదిక మత సంబంధమైన రచనలు సంస్కృతంలో ఉన్నాయి. సంస్కృతం కాలక్రమంలో సంస్కరింపబడ్డ భాష. ఈ సంస్కరింపబడిన సంస్కృతం ఎవరికీ మాతృభాష కాదు. ఇది రాజభాషగా చెలామణి అయింది. ఈ భాషను ఆధారం చేసుకొని వృద్ధిచెందిన వైదికమతం దాని అభివృద్ధికి దోహదం చేసింది. భారతాన్ని అనువాదం చెయ్యమన్న రాజులుగానీ, చేసిన కవులుగానీ వైదికమత పునరుద్ధరణను కోరుకున్నవారే. అందుకే రాజులు సంస్కృతానికి అంత ప్రాధాన్యం ఇచ్చారు. వైదికమతం పుట్టుకతోనే దోపిడీ స్వభావం కలిగింది. ఏ తిరుగుబాటునైనా నిర్వీర్యం చేసి తనలో ఇముడ్చుకోగల శక్తి దానికుంది. కాబట్టే ఇది పాలక వర్గాలకు బాగా ఉపయోగపడుతుంది. అందువల్ల రాజులందరూ సంస్కృత భాషకూ సంస్కృత సాహిత్యానికీ, సంస్కృతం తెలిసిన పండితులకూ విలువ ఇచ్చారు.

గొప్ప కవులుగా పేరు ప్రతిష్ఠలు పొందిన వాళ్ళందరూ రాజుల్ని ఆశ్రయించిన వాళ్ళే. రాజులకు కవిత్వాన్ని అమ్ముకుని బతికిన వాళ్ళే. పాల్కురికి సోమన వంటి శివకవులు సంస్కృత ప్రాబల్యాన్నుంచి తెలుగు కవిత్వాన్ని కొంతవరకు రక్షించారు. అంతవరకూ వైదిక మతంలో ఉన్న దారుణమైన అసమానతలకు అడ్డుకట్ట వేశారు. శివభక్తులైతే చాలు అన్ని వర్ణాల వాళ్ళూ ఒకడే అని చాటారు. ఈ సమానత్వం ఉండడం వల్ల శివకవుల కవిత్వం ఆనాడు ప్రజలకు దగ్గరైంది. కొంతవరకైనా ప్రజల భాషను స్వీకరించింది. కవితా సరస్వతిని రాజులకు అమ్మనని చెప్పుకున్న పోతనగానీ, "రాజత్మత్తులు, వారిసేవ నరకప్రాణంబు" అని చెప్పిన ధూర్జటిగానీ సారాంశంలో నన్నయాది కవుల కంటే భిన్నంకాదు.

కృష్ణదేవరాయల కాలం కవులకు మాత్రమే స్వర్ణయుగం. రాజులతో బాటు కవులు కూడా సుఖభోగాలనుభవించిన కాలం అది. ఆ సుఖభోగాలే వాళ్ళ కవిత్వంలోనూ చోటు చేసుకున్నాయి. రాయల కాలంలో కొత్త ప్రక్రియగా వచ్చిన ప్రబంధం రాజుల విలాస జీవితానికి ప్రతిబింబం అయింది. స్త్రీ కేవలం భోగ వస్తువుగా చిత్రింపబడింది. భారతం, రామాయణం వంటి పురాణ కథల్లో ఉన్న వ్యక్తిత్వం కూడా స్త్రీకి లేకపోయింది.

రాజాస్థానాలకు భిన్నంగా, సంస్కృత సంప్రదాయానికి భిన్నంగా, ప్రజలకు దగ్గరగా వచ్చిన తెలుగు కవిత్వం లేకపోలేదు. పదాలు. పాటలు, తత్వాలు, కీర్తనలు చాటువులు, శతక పద్యాలు మొదలయినవన్నీ ఈ కోవలోకి వస్తాయి. అయితే వీటికి రాజాస్థానంలో చోటులేదు. అందుకే ఈ కవులకు పేరు ప్రతిష్టలు రాలేదు. తెలుగులో వందల సంఖ్యలో శతకాలున్నాయి. ఈ శతకాలన్నీ ప్రజల జీవితాన్ని చిత్రింపాయని కాదు. ఎంతో కొంత ప్రజల జీవితానికి అద్దం పట్టేవి కొంతవరకైనా యివే. ప్రబంధాలు రాజాస్థానానికే పరిమితం అయివుంటే, ప్రజల్లో సజీవంగా ఉన్నది ఈ సాహిత్యమే. రాయలసీమ ప్రాంతంలో అక్షరాస్యులు కాని వాళ్ళకు కూడా వేమన పద్యాలు ఒకటీ రెండూ రాకుండా ఉండవు. రాజులపైనా, రాజాస్థానాలకు పరిమితమైపోయిన కవులపైనా ఆనాడు నిరసన లేకపోలేదు. ఆ నిరసన పద్యాల రూపంలో వ్యక్తం కాకుండానూ పోలేదు. కృష్ణదేవరాయలపైనా, అల్లసాని పెద్దన పైనా తెనాలి రామలింగని పేరుతో ఉన్న పద్యాలు, కథలు ఇలాంటివే. తెనాలి రామలింగానికి అంటగడితే ఆ నిరసన ధ్వనులకు కొంతైనా విలువ ఉంటుందని

వారి అభిప్రాయం అయి వుండాలి, "తోటకూరకైన, దొగ్గలాకునకైన, కవిత చెప్పు గాడ్డె కొడుకులు ఘనులైరి" అని వేమన పద్యాలలో ఉన్నదీ ఇలాంటి నిరసనే. ఈ పద్యాన్ని వేమనే చెప్పి ఉండక పోవచ్చు.

రాజుల నిరాదరణకు గురైన కవులు, రాజుల్ని నిరసించి దూరంగా ఉన్న కవులు పని చేసుకుని బతికేవాళ్ళు. దేవుడిపైన భారం వేసేవాళ్ళు. పాలకవర్గాన్ని నిలదీసి ప్రశ్నించే వాళ్ళకు ఈనాడు ప్రజాశక్తి ఆధారమయితే ఆనాడు దేవుడు ఆధారం. ఏదో ఒకశక్తి అండగా లేకపోతే రాజుల్ని నిరసించడం అంత తేలికైన పని కాదు.

ఆ తర్వాత దశ అయిన దక్షిణాంధ్ర యుగాన్ని క్షీణ యుగం అని అనడం అలవాటైపోయింది. నిజానికి సాహిత్యం బాగా ప్రజల దగ్గరకు వెళ్ళింది ఈ కాలంలో. యక్షగానం అనే ప్రక్రియ బాగా అభివృద్ధి కావడమే గాక, అది దృశ్యం కూడా కావడంతో ప్రజలకు చేరువైంది. యక్షగానాల్ని ప్రదర్శించే వాళ్ళకూడా సంఘంలో సామాన్యులే గనక వారి జీవితం కొంతవరకైనా వాటిలో వ్యక్తం కావడం సహజం.

తెలుగులో ఆధునిక సాహిత్యం బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో 19వ శతాబ్ది చివరి భాగంలో మొదలయింది. సంప్రదాయ సాహిత్య రూపాలనూ, నవలవంటి ఆధునిక రూపాలనూ సంఘ సంస్కరణ భావ ప్రచారానికి బాగా వాడుకున్నది కందుకూరి వీరేశలింగం. రాజకీయాధికారాన్ని కోరకుండా సంఘ సంస్కరణ కార్యకలాపాలు ఎంత ఎక్కువ చేసినా బ్రిటిష్ పాలకులకు అభ్యంతరం లేక పోయింది. మూఢ విశ్వాసాల నిర్మూలన, సాంఘిక దురాచారాల పట్ల నిరసన, స్త్రీ విద్య, వితంతు వివాహాలు మొదలైన సంఘ సంస్కరణలు బ్రిటిష్‌వారికి తక్షణ ప్రమాదాన్ని తీసుకొచ్చేవి కావు. అందుకే వాళ్ళు సంఘ సంస్కరణ కార్యకలాపాల్ని ప్రోత్సహించారు.

తెలుగు సాహిత్యంలో సంప్రదాయ ప్రభావాన్నుంచి పూర్తిగా బయటపడి నిజమయిన ఆధునిక సాహిత్య సృష్టి చేసింది గురజాడ. వస్తువు విషయంలో కందుకూరికీ, గురజాడకూ పెద్ద తేడా లేకపోయినా సాహిత్య రూపాలలో సంప్రదాయం వదిలించుకున్నాడు గురజాడ. కన్యాశుల్కం, ముత్యాలసరాలు దీని కుదాహరణలు.

సాంప్రదాయకంగా అనుసరిస్తూ వస్తున్న నాయికా నాయకుల లక్షణాలు, రసం మొదలయిన విషయాల్లో అలంకార శాస్త్ర నియమాలకు చెంపపెట్టు లాంటి సమాధానం కన్యాశుల్కం.

అయితే గురజాడకు వెంటనే వారసులు లేకపోయారు. రాయప్రోలు సుబ్బారావుతో ప్రారంభమయిన భావకవిత్వ ధోరణి దేవులపల్లితో పరాకాష్ఠకు చేరుకుంది. తమది అమలిన శృంగారం అన్నాడు రాయప్రోలు. ప్రబంధాల్లో ఉన్నది మలిన శృంగారం అని అర్థం. ప్రబంధాల్లో శృంగారం శ్రుతిమించింది. భావకవుల్లో 'పవిత్రమైంది. శరీరంతో సంబంధం లేని స్వచ్ఛమైన ప్రేమగా చెప్పుకున్నారు. ప్రబంధ స్త్రీకి శారీరక సౌందర్యం తప్ప మనస్సు లేదు. భావకవిత్వం లేని స్త్రీకి మనస్సు తప్ప శరీరం లేదు. స్త్రీని ప్రబంధ కవులు ఒక చివరికి తీసుకెళ్ళినా, భావకవులు మరో చివరికి తీసుకెళ్ళారు. మొత్తంమీద రెండు చోట్లా స్త్రీకి స్వతంత్ర వ్యక్తిత్వం లేకుండా పోయింది. ఏమయినా భావకవిత్వంలో ఎన్ని నెగటివ్ అంశాలున్నా, ఒకటి రెండు పాజిటివ్ అంశాలు కూడా లేకపోలేదు. ఒకటి స్త్రీ విలాస వస్తువు కాదని చెప్పడం అయితే, రెండోది జాతీయోద్యమ ప్రేరణతో ఏదో తెలియని స్వేచ్ఛను కోరుకోవడం. ఆ స్వేచ్ఛ రాజకీయమైనదా, సామాజికమైనదా, ఆర్థికమైనదా అనే స్పష్టత లేకపోయినా, నేను ఎవరికీ బానిసను కాను, స్వేచ్ఛాపరుణ్ణి అని చెప్పుకునేంతమేరకైనా అది పాజిటివ్ అంశమే. భావకవుల దృష్టిలో స్త్రీ విలాస వస్తువు కాదు. అయితే పవిత్ర వస్తువు. మొత్తంమీద వస్తువే అయింది. ఆ 'వస్తువు' పైన పురుషుడిదే పెత్తనం అయింది.

భావ కవిత్వంలో ఒక శాఖగా చెప్పబడుతున్న జాతీయోద్యమ కవిత్వం నిజానికి ఉద్యమ కవిత్వం. దీనికీ, భావకవిత్వానికీ స్వరూపంలోనూ, స్వభావంలోనూ చాలా తేడా వుంది. స్వరాజ్య సంపాదన, బ్రిటిష్ పాలకుల పట్ల నిరసన జాతీయోద్యమ కవిత్వంలో విషయాలు. భావకవిత్వంలో కొంత స్వేచ్ఛా ధోరణి కనిపించినా, అది జాతీయోద్యమ కవిత్వానికి భిన్నమైందిగానే కనిపిస్తుంది. కాల్పనికత, మార్మికత భావకవిత్వంలో ప్రధానంగా చోటు చేసుకున్నాయి. జాతీయోద్యమ ప్రభావం అనేకమందిపైన అనేక రకాలుగా ఉంది. ఉప్పుపైన కూడా కొంతమందిచేత పాటలు చెప్పిస్తే, గత వైభవాన్ని తల్చుకునే విధంగా కొందరిచేత కవిత్వం రాయించింది.

శ్రీశ్రీ 'మహాప్రస్థాన' గేయాలు తెలుగు కవిత్వానికి పట్టిన పాత బూజును పూర్తిగా దులిపేశాయి. రష్యా విప్లవం, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాలను కుదిపేసిన ఆర్థిక సంక్షోభం, అంత ఆర్థిక సంక్షోభంలోనూ సోవియట్ యూనియన్ నిలదొక్కుకున్న తీరూ శ్రీశ్రీని ప్రభావితం చేశాయి. ప్రపంచంలోని పీడిత వర్గానికి మార్క్సిజమే శరణ్యం అని భావించాడు. సోవియట్ యూనియన్ తొంగిచూసిన ఆ మరో ప్రపంచం గురించి కలలు కన్నాడు. ఆ ప్రపంచాన్ని చేరుకోడానికి మహాప్రస్థానం ప్రారంభించాడు. తెలుగు కవిత్వాన్ని విప్లవీకరించిన ఘనత శ్రీశ్రీది. ఆ విధంగా శ్రీశ్రీ అభ్యుదయ సాహిత్యోద్యమానికి నాయకుడయ్యాడు. నిజాం పాలనలో భూమి కోసం, భుక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. ఆ ఉత్తేజంతో అభ్యుదయ రచయితల సంఘం కొంతకాలం సజీవంగా పనిచేసింది. అయితే రాను రాను అది పుష్పక విమానంలా తయారయింది. అభ్యుదయం అన్న ప్రతి కవికీ అందులో చోటు దొరికింది. విశ్వనాథ, దేవులపల్లి వంటివారు కూడా ఆరసం వేదిక లెక్కారు. అభ్యుదయ రచయితలకు మార్క్సిజం తప్పనిసరి కాకుండా పోయింది. అప్పటికే రష్యాలో రివిజనిజం ప్రవేశించి అది సోషల్ సామ్రాజ్యవాదంగా మారడానికి సిద్ధంగా వుంది. కృశ్చేవ్ ప్రవేశపెట్టిన శాంతియుత పరివర్తన, శాంతియుత పోటీ, శాంతియుత సహజీవనం అనే వాటిపట్ల భారత కమ్యూనిస్టు పార్టీ కూడా ఆకర్షింపబడింది. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ చీలింది. అప్పటికే నక్సల్బరీ, శ్రీకాకుళాలలో గిరిజనులు భూమిపై హక్కును సాధించడానికి చిన్న చిన్న పోరాటాలు చేస్తున్నారు. 1967 నాటికి అవి బద్దలయ్యాయి. మార్క్సిస్టు పార్టీ అగ్రనాయకత్వం ఈ పోరాటాలకు నాయకత్వం వహించలేదు. బెంగాల్‌లో మార్క్సిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వమే ఆ పోరాటాన్ని దారుణంగా అణిచివెయ్యటానికి కంకణం కట్టుకుంది. ఈ నేపథ్యంలో 1969లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు) ఏర్పడింది.

భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణా పోరాటాన్ని ఆపివెయ్యడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్టయింది. 1956 మధ్యంతర ఎన్నికల్లో ఆంధ్రలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా తలపడ్డాయి. కమ్యూనిస్టు పార్టీ దారుణంగా ఓడిపోయింది. కేరళలో ఏర్పడ్డ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని నెహ్రూ

ప్రభుత్వం రద్దుచేసింది. పార్లమెంటరీ విధానం ఎంత బూటకమో గుర్తించడానికి తగిన నేపథ్యం ఉన్నా కమ్యూనిస్టు పార్టీ ఆ బురదలోనే మరీ కూరుకుపోయింది. పోరాట చేవను కోల్పోయింది. అటు అంతర్జాతీయంగానూ, ఇటు జాతీయంగానూ వచ్చిన ఈ తిరోగమన ధోరణి సాంస్కృతిక రంగంలో అరసాన్నీ, ప్రజానాట్య మండలినీ నిర్వీర్యం చెయ్యనారంభించాయి. చివరకు నిర్వీర్యం చేశాయి. ఈ నేపథ్యంలో రాత్రి కవులు, దిగంబర కవులు, తిరుగబడు కవులు సాహిత్యరంగంలో ఒక సంచలనం సృష్టించారు. సమాజంలో పేరుకుపోయిన అవినీతినీ, కుళ్ళునూ కడిగిపారేశారు. సాహిత్య రంగంలోని గోడమీది పిల్లి వాటాన్ని నిరసించారు. రచయితల నిస్సహాయతనూ, నిర్వీర్యతనూ నిలదీసి ప్రశ్నించారు. దీంతో అందరూ సాహిత్య ప్రయోజనం గురించీ, సాహిత్య సమాజాల అంతస్సంబంధం గురించీ తీవ్రంగా చర్చించారు. అప్పటికే శ్రీకాకుళ గిరిజనుడు రక్తం చిందిస్తున్నాడు. సుబ్బారావు పాణిగ్రాహితో సహా చాలామంది నేలకొరిగారు. 1970 ఫిబ్రవరిలో విశాఖలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి సభలో విశాఖ విద్యార్థులు రచయితలారా మీ రెటువైపని సవాల్ విసిరారు. ఒకవైపు పాణిగ్రాహిలాంటి రచయితలు ప్రాణాలకు తెగించి పోరాడుతుంటే షష్టిపూర్తులూ సన్మానాలు ఏమిటని ప్రశ్నించారు. ఈ సంఘటనల ఫలితమే 1970 జులై 4న విప్లవ రచయితల సంఘం స్థాపన. ఆనాడు విరసం ఏర్పడడం ఒక చారిత్రక అవసరం. విరసం ఏర్పడ్డ ఆరు రోజుల్లోనే శ్రీకాకుళ పోరాట వీరులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలను కసాయి కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. నక్సల్బరీ శ్రీకాకుళ పోరాట నాయకుల్ని జైళ్ళల్లో పెట్టడమో, చంపడమో దాదాపు పూర్తయింది. విప్లవ వీరులు చిందించిన రక్తపు మడుగులోంచి, సుబ్బారావు పాణిగ్రాహి వారసత్వంలోంచి, మార్క్సిజం- లెనినిజం- మావో ఆలోచనా విధానం ప్రాపంచిక దృక్పథంగా విరసం ఏర్పడింది. విరసం ఏర్పడేటప్పటికి ఉద్యమం దాదాపు అణగారిపోయింది. అయినా విరసం ఆ ఉద్యమ స్ఫూర్తిని, పోరాటపు చైతన్యాన్ని, విప్లవ అవసరాన్ని తన రచనల ద్వారా, ప్రసంగాల ద్వారా, పాటలద్వారా, ప్రదర్శనల ద్వారా ప్రచారం చేసింది. సాంస్కృతిక రంగంలో విరసం ఒక ప్రభంజనంలా వీచింది. వందలాది అమరవీరుల త్యాగాలను కొనియాడడమే కాదు, ఆ త్యాగాల ఫలితాల పట్ల ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. త్యాగం వ్యర్థంగా పోదని నిశ్చయంగా, నిర్భయంగా పలికింది. నిజాన్ని

నిర్భయంగా చెప్పినందుకు నిర్బంధాలకు లోనయింది. విప్లవ రచయితలు ప్రజల్లో కలిగించిన ఆశలు చిగురించాయి. జగిత్యాల జైత్రయాత్ర మొదలయింది. మళ్ళీ తెలంగాణా జిల్లాల్లో గిరిజనుడు సాయుధుడయ్యాడు. పటిష్టమయిన నిర్మాణంతో మరింత శక్తిమంతుడయ్యాడు. గిట్టుబాటు ధరలు కల్పించమనీ, సారాయిని నిషేధించమనీ, భూముల్ని పేదలకు పంచమనీ ప్రజా ఉద్యమాలు పెల్లుబుకుతున్నాయి. వాటిని చూసి పాలకవర్గాలు బెంబేలు పడిపోయి కేంద్ర ప్రభుత్వాన్ని దేబిరించి సరిహద్దు భద్రతా దళాన్ని రప్పించుకున్నాయి. ప్రజా పోరాటాల్ని తుదముట్టించాలని పగటి కలలు కంటున్నాయి ఈ నేపథ్యంలో విప్లవ రచయితల పాత్ర మరింత కఠిన తరమైంది. రచయితల కలాలు పదునెక్కవలసింది ఇప్పుడే.

గత 21 సంవత్సరాలుగా విరసం సాంస్కృతిక కృషి పట్ల ఎవరు ఎన్ని అభిప్రాయాలు వెలిబుచ్చినా ఒక్కటిమాత్రం నిజం. ఉజ్వల భవిష్యత్తు కోసం జరిగే వర్తమాన శ్రామికవర్గ పోరాటాల్ని విరసం గానం చేసింది, చేస్తోంది, చేస్తుంది. విప్లవ రచయితలు కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితం కాలేదు. ప్రజా రాజకీయాల బలంతో సాహిత్యాన్ని మరింత శక్తిమంతం చేస్తున్నారు. సమకాలీన ప్రజా ఉద్యమాల ప్రేరణే గొప్ప సాహిత్యాన్ని సృష్టిస్తుందని నిరూపించారు. సాహిత్యాన్ని ఆనందం కోసం రాసిన వాళ్ళున్నారు. సాహిత్యంలో సమాజాన్ని ప్రతిబింబించి సంతృప్తిపడ్డ వాళ్ళున్నారు. సాహిత్యంతో వ్యాపారం చేసుకునే వాళ్ళున్నారు. సాహిత్యాన్ని నగ్నంగా నడివీధుల్లో తిప్పేవాళ్ళూ వున్నారు. కానీ సాహిత్యాన్ని పీడిత ప్రజల చేతిలో ఒక బలమైన ఆయుధంగా మారుస్తున్నవాళ్ళు విప్లవ రచయితలు. ఈ ఆయుధాన్ని మరింత శక్తిమంతంగా తయారుచేసుకోవడానికి ఇంకా ఎంతో శ్రమ పడవలసి వుంది.

— వి. చెంచయ్య

"కాలిన నీలి నేల"

త్రిపురనేని మధుసూధనరావు

దశరథుడు : నెలకు మూడువర్షములూ కురియుచున్నావా మంత్రీ
కురియుచున్నవా?

సుమంత్రుడు : నెలకు మూడువర్షములూ కురియుచున్నవే రాజా
కురియుచున్నవే!

దశరథుడు : చందమామలాగు, రాము దెదుగుచుండెనా మంత్రీ
దెదుగుచుండెనా?

అగు మధుసూదనరావు అగు. చాలా బాగుంది. లాగు, దెదుగుమీద నొక్కటంతో మంచి ఎఫెక్ట్ తెచ్చావయ్యా. అలాగే మంత్రి వైపుకి నడుస్తూ మళ్ళీ పాడు. మళ్ళీ చేశాను. O. K. అన్నారు. ఇది గుడివాడ కాలేజీలో అర్ధరాత్రి అసంపూర్ణరామాయణం అనే హాస్యనాటిక రిహార్సల్స్ సన్నివేశం. దీనికి దర్శకత్వం వహించింది ఆనాడు మాకు ఎంతో ఇష్టమైన మాస్టారు కేతవరపు రామకోటిశాస్త్రిగారు. నేనప్పుడు ఇంటర్ చదువుతున్నాను. అలాగే 'కమల', 'ఒక రూపాయి', 'వాఁసు', నాటికల్లో ఆయన దర్శకత్వంలోనే నటించాను. అన్నిటిలోనూ నాకే ప్రథమ బహుమతులు వచ్చాయి. అభినయంలో జీవం ఉండాలి. పాత్రని పూర్తిగా మనిషిగా మార్చేసి నటిస్తున్నట్టు కాకుండా జీవిస్తున్నట్టు ఉండాలి. ఈ దృష్టినుంచే ఆయన దర్శకత్వం వహించేవారు. వైవిధ్యంతో సంఘర్షణతో, వెలుగునీడల్తోకూడిన జీవితం పట్ల ఆయనకున్న ప్రేమ నన్ను ఎంతో ఆకర్షించింది. జీవించడమే జీవితం కాదు, అది నిరంతర చర్చనీయాంశం అనే అభిప్రాయం నా మనస్సులో నాటుకునే టట్టు చేశారు. ఊళ్ళో ఎవరో పాటల పోటీ పెట్టారు. అప్పటికి ఇంకా నా గొంతులో లాలిత్యం చావలేదు. నాకు ఎవరిచ్చారో గుర్తులేదు కానీ అబ్బూరి రామకృష్ణారావు 'ఈ శ్మశాన భూమిఖండము' అనే గీతం నా చేతుల్లో పడింది. దాన్ని పోటీల్లో పాడతానంటే నా మిత్రులు నవ్వేశారు. అది అసలు పోటీకాదు పొమ్మన్నారు. మాస్టారి ఇంటికి వెళ్ళాను. నాగవరప్పాడు రోడ్డులో ఇల్లు. మొదటి గదిలో ఎలాంటి సామానులూ లేవు. ఆయన ఒక్కరే కూర్చుని చాలా కేంద్రీకరణతో చదువుకుంటున్నారు. కొన్ని క్షణాలు గడిచిన తర్వాత నన్ను చూశారు. ఆయనతో మాట్లాడడానికి ఎలాంటి బెదురూ ఉండేదికాదు. పాట చూపించి పోటీ సంగతి చెప్పాను. పాడమన్నారు. మంద్రంగా పాడాను. దాదాపు 10 సార్లు పాడించారు. 'కాలిన నీలి నేల' కేంద్ర

స్థానంగా పాడి శాంత గంభీర వాతావరణం సాధించాలని ఆయన పట్టుదల. 'అశాంతి నర్తకి' మీద కేంద్రీకరించాలనీ ఆ భావచిత్రంనుంచి సన్నని స్వరంలో పాడాలని నా కోరిక. అంతేకాదు. 'అశాంతి' 'అశాంత నర్తకి' అనే అనదలుచుకున్నానని పట్టుపట్టాను. సరే అలాగే పాడమన్నారు. నిజంగా నేను పాడలేదు. ప్రతి పదచిత్రానికి కంఠస్వరం మారుస్తూ చదివాను. మొదటి బహుమతి కొట్టేశాను. 'అశాంత నర్తకి' నాకు ఎందుకు నచ్చిందో, ఈ నాటికి జీవితాన్ని ఆ పదబంధంతో ఎందుకు అన్వయించుకుంటున్నానో నాకు తెలీదు. కానీ మాష్టారు 'కాలిన నీలి నేల' లో 'జీవుని' అనంత అనివార్య విషాదాన్ని అనుభవించారని నాకు సులభంగానే అర్థం అయింది. ఆయన మాటల వెనక 'అస్తిత్వ వేదన' చివరిదాకా ఉంది. ఆయన రచనల్లోనూ ఉంది. ఆయన విశ్వాసాల్ని అది ఎప్పుడూ ప్రశ్నిస్తూనే ఉంది. వేదనకి విశ్వాసాలకీ సంఘర్షణవల్ల, ఒక మౌన తుఫానువల్ల తాత్త్వికంగానే ఆయనలో ద్వంద్వ ప్రవృత్తి ఉంది.

గుడివాడ కాలేజీలో పనిచేసే టప్పటికే ఆయన విశ్వనాథ సాహిత్యంలోమునిగిపోయి ఉన్నాడు. విశ్వనాథ సంప్రదాయవాది అని నాకు తెలుసుగానీ ఎంతటి సంప్రదాయవాది. అసలు సంప్రదాయం అంటే ఏమిటి? అనే అంశాల్ని గురించి నాకు ఆనాటికి లోతుగా తెలియదు. మా తాత రామస్వామిగారు విశ్వనాథ భావజాలానికి వ్యతిరేకికదా? అందుకని విశ్వనాథ మీద నాకు అభిమానం ఉండేదికాదు. అంతేకాదు. నేను A. I. S.F.లో ఉండే వాడిని. కమ్యూనిస్టుపార్టీ అంటే ఎంతోఅభిమానం. గంటి రామారావు, పాకీ సీతారామయ్య, సత్యమూర్తి నాకు నాయకులు. వీళ్ళెవరూ సిద్ధాంతం గురించి పెద్దగాచెప్పిందేమీ లేదుకానీ కార్యక్రమాలవల్ల కొంత తెలిసేది. ఒకసారి సెక్రటరీగా పోటీచేశాను. స్టూడెంట్ కాంగ్రెసుకీ మాకూ పెద్ద పోటీ. ఆ ఎన్నికలు జరుగుతుంటే ఒక క్లాసులో ఎన్నికల్ని నిర్వహిస్తున్న రామకోటిశాస్త్రిగారు ప్రచారంలో ఉన్న నన్ను పిలిచి నీ వోటు వేసుకోవా? అన్నారు. ఆయన జ్ఞాపకం చెయ్యటంతో నా ఓటు నేను వేసుకున్నాను. ఆ పోటీలో కేవలం రెండు ఓట్లు మెజారిటీతో నేను గెలిచాను. దాన్తో కాంగ్రెసు కుర్రాళ్ళు మాష్టారుతో గొడవ పడ్డారు. ఆయన బెదిరిపోకుండా స్థిరంగా ఉండిపోయారు. నేను వ్యక్తిగతంగా కలిసిన సమయాల్లో కానీ, క్లాసులోకానీ ఆయన ఏనాడూ విశ్వనాథని గురించి కానీ, మతభావజాలంగురించికానీ ఎన్నడూ చెప్పలేదు.

(తరువాయి 116వ పేజీలో)

మధ్యయుగంలో తెలుగు సాహిత్యం

త్రిపురనేని మధుసూదనరావు

సాహిత్యరంగంలోనేకాదు, ఏ రంగంలోనూ శాశ్వత సూత్రాలు ఉండవు. అప్పటికి మనకున్న జ్ఞానాన్నిబట్టి ఏదో ఒక విషయంమీద ఒక సిద్ధాంతం చేస్తాం. ఒక అభిప్రాయం చెపుతాం. ఇక ఆ విషయం మీద ఎంతకాలం గడిచినా ఆ సిద్ధాంతమే ఆ అభిప్రాయమే చెపుతూ పోకూడదు. ఎప్పటికప్పుడు పునర్విమర్శ చేసుకోవాలి. అభివృద్ధి పొందిన జ్ఞానం, నూతన జీవితానుభవాల వెలుగులో అంతకు పూర్వం మనమే చెప్పిన ప్రతివిషయాన్నీ చర్చించుకోవాలి. అవసరమైతే పూర్వాభిప్రాయాల్ని పూర్తిగా వదులుకోవటానికి సిద్ధపడాలి. దేనినీ వ్యవస్థీకరించి నూతన జ్ఞానానికి తలుపులు మూసివేయకూడదు. అలా మూసివేయటంవల్ల జ్ఞానరంగంలో ప్రతిష్టంభన వస్తుంది. అలాగే మనం గతంతో కలిసి ముందుకు పోవాలి కాని వెనక్కి పోకూడదు. ప్రాచ్యదేశాల్లో వెనకచూపు ఎక్కువ. ప్రతి కొత్త విషయాన్నీ ఏదో ఒక రూపంలో పాతకాలంలోనే ఉందని చెప్పటానికి ప్రయత్నించే దురలవాటుకూడా ఎక్కువ. ఈ ధోరణి నుంచీ బయటపడకపోతే పురోగమనం సాధ్యంకాదు. కాబట్టి సాహిత్యం, సామాజిక శాస్త్రాలకి సంబంధించిన రచయితలు శాశ్వత సూత్రాలు ఉండవనీ, చలనసూత్రాలు మాత్రమే ఉంటాయనీ నిరంతర స్పృహలో ఉండటం అవసరం. ఎంతకాలం గడిచినా ఒక అంశాన్ని గురించి చెప్పిందే చెప్పిందే చెపుతూ పోయేవాడు పోయినవాడికిందే జమ. అలాంటివాడు జ్ఞాన, విజ్ఞానాలకు శిరోభారం.

తెలుగుసాహిత్య చరిత్ర రచనకీ, సాహిత్య విమర్శకీ ఒక శతాబ్దం చరిత్ర ఉంది. ఈ శతాబ్దంలో పండితులు చెప్పుకోదగినంత సమాహార సేకరణ చేశారు. కొన్ని సాహిత్య చరిత్రలూ, కవుల చరిత్రలూ సాహిత్య విమర్శ గ్రంథాలూ వచ్చాయి. సంస్కృత అలంకార శాస్త్రాలనుంచీ, ఆంగ్ల సాహిత్య చరిత్ర, సాహిత్య విమర్శనల నుంచీ కొన్ని సిద్ధాంతాల్నీ, భావనల్నీ, చట్టాల్నీ సంగ్రహించి తెలుగు సాహిత్య చరిత్రకీ సాహిత్య విమర్శకీ అన్వయించారు. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాల సమన్వయంపేరుతో ఆ సిద్ధాంతాల దేశకాల పరిమితుల్ని కానీ తాత్త్విక పునాదిని కానీ పట్టించుకోకుండా తలాతోకాలేని సాహిత్య చరిత్రల్నీ,

సాహిత్య విమర్శనీ సమృద్ధిగానే పండించారు. ఏ దేశంలో ఏ కాలంలో సిద్ధాంతాల్ని అయినా ఎవరైనా తీసుకోవచ్చు. కానీ అలా తీసుకోవటానికి ఒక పద్ధతి ఉండాలి. ఒకటో రెండో ఇంగ్లీషు సాహిత్య చరిత్రల్ని చదివి, సాహిత్య చరిత్ర అంటే ఇలా ఉండాలని వాటిద్వారా ఒక చట్టాన్ని రూపొందించుకొని తెలుగు సాహిత్య చరిత్ర రాయకూడదు. అలాగే సంస్కృతి అలంకార శాస్త్ర సిద్ధాంతాల్ని ప్రమాణాలుగా తీసుకొని తెలుగు సాహిత్యంమీద విమర్శ రాయకూడదు. ముందు తెలుగు సమాజ క్రమాన్ని అధ్యయనం చెయ్యాలి. ఆదినుంచీ తెలుగుభాష మాట్లాడిన ప్రాంతాల్లోని రాజ్యాల్నీ, రాజవంశాల్నీ, సాంఘిక జీవితాన్నీ, మతాచారాల్నీ, తాత్త్విక సంప్రదాయాల్నీ, ఆర్థిక పరిస్థితుల్నీ. సాహిత్య కళారంగాల్ని అధ్యయనం చెయ్యాలి. ఏ కాలంలో ఏ ఇతర ప్రాంతాల్తో ఎలాంటి సంబంధాలు కలిగాయో వాటి ఫలితాలు ఏమిటో పరిశీలించాలి. ఈ బహుముఖ నిర్దిష్ట అధ్యయనం నుంచీ తెలుగు సాహిత్య స్వరూప స్వభావాల్ని ఆవిష్కరించాలి. ఆ ఆవిష్కరణల నుంచీ సిద్ధాంతాల్నీ, ప్రమాణాల్నీ, చట్టాల్నీ రూపొందించుకోవాలి. వాటిని ఆధారంగా చేసుకునే తెలుగు సాహిత్యచరిత్రనీ, తెలుగుసాహిత్య విమర్శనీ నిర్మించుకోవాలి. ఈ నిర్దిష్ట సిద్ధాంతాలకీ ప్రమాణాలకీ ఇతరదేశ సిద్ధాంతాలకీ, ప్రమాణాలకీ పోలికలు ఉండవచ్చు. ఆ పోలికలవల్ల అధ్యయనానికి ఏమైనా ప్రయోజనం ఉంటే పొందవచ్చు. సంస్కృతం లోని కావ్య సంప్రదాయ దృక్పథంనుంచీ తెలుగుసాహిత్య చరిత్ర రాయటం, రస సిద్ధాంతం ప్రమాణంగా తెలుగుసాహిత్య విమర్శ రాయటం కంటే నిరర్థకమైన పని మరొకటి ఉంటుందా? ఇంతకంటే హీనమైన పని మమ్మటుడు, విశ్వనాథుడు, జగన్నాథుల కావ్య నిర్వచనాల్ని చెప్పి, వర్డ్సు వర్త్, హాజిలిట్, షెల్లీల కవిత్వ నిర్వచనాల్తో పోల్చి ఒక అసంగత నిర్వచనాన్ని చేసి తెలుగు చదివే విద్యార్థుల ముందు మార్గదర్శకంగా పెట్టటం.

తెలుగు సాహిత్య చరిత్రలో మధ్యయుగం అంటే ఏమిటి? తెలుగు సాహిత్య చరిత్రకారుల్లో యుగవిభజనమీద ఏకాభిప్రాయం లేదు. వాస్తవ తెలుగు సాహిత్య అధ్యయనం ప్రాతిపదికగా తీసుకోకపోవటం ఈ భిన్నాభిప్రాయాలకి కారణం. ముందు యుగ విభజనచేసి దానిని అనుసరించి సాహిత్యచరిత్ర రాయటానికి పూనుకోవటంవల్ల యుగాలదారి యుగాలది, సాహిత్యందారి సాహిత్యానిదిగా తయారయింది. చరిత్రలో యుగవిభజనం కావ్యాల్లో సర్గలూ, స్కంధాలూలాంటి విభజనకాదు. చరిత్ర

అధ్యయనంలో అవగాహనలో అసలు చరిత్రలోనే యుగం అవిభాజ్య భాగం. ఈ యుగవిభజన పద్ధతి అధునిక భూగర్భశాస్త్రం నుంచీ ప్రారంభమైంది. భూగర్భ శాస్త్రంలో 'Formation' అనే భావనమంచీ చరిత్రకారులు యుగం అనే భావనని గ్రహించారు. చరిత్రలోకంటే సాహిత్యచరిత్రలో యుగ విభజన క్లిష్టం. యుగవిభజ నకి శంఖాకార పురోగమన సూత్రం పునాదిగా ఉండాలి. తిరోగమన దృక్పథం చరిత్ర రచనకి పనికిరాదు. ఎందుకనంటే అది చరిత్ర విరుద్ధ దృక్పథం కాబట్టి. చరిత్ర విరుద్ధ దృక్పథంతో చరిత్ర ఎలా రాస్తాడు.? రాసినా అది చరిత్ర ఎలా అవు తుంది? చరిత్రలో సాహిత్యచరిత్రలో విజ్ఞానశాస్త్ర చరిత్రలో పురోగమనం ఒకే విధంగా ఉండదు. చరిత్రలో మొదటియుగాన్ని తర్వాతియుగం అప్రధానం చేస్తుంది. విజ్ఞానశాస్త్రంలో మొదటియుగాన్ని తర్వాతి యుగం దాదాపు అభావం చేస్తుంది. సాహిత్యచరిత్రలో ఒక యుగాన్ని తర్వాతి యుగం అధిగమిస్తుంది. సాహిత్య చరిత్రలో కనీసం తెలుగుసాహిత్య చరిత్రలో కాలక్రమ యుగ విభజన కుదరదు. సూక్ష్మస్థాయిలో (Micro level) యుగవిభజనకి దేశకాలాలు ఉపయోగపడతాయి కానీ స్థూలస్థాయిలో (Macro level) కాలక్రమ విభజన పనికిరాదు. ప్రతి ఉత్తర రచనా పూర్వరచన కంటే ఉత్కృష్ట రచన అని సిద్ధాంతం చేయలేం. ప్రతియుగంలో విశిష్ట, అవిశిష్ట, క్షీణరచనలు ఉంటాయి. అసలు ప్రతి ప్రత్యేక రచనలోకూడా సజీవ క్షీణ అంశాలుంటాయి. మహాకవులుగా ప్రసిద్ధి పొందినవాళ్ళని బట్టి కూడా యుగ సాహిత్యాభివృద్ధిని అంచనా వేయలేం. ప్రజల సాధారణ సాంస్కృతిక స్థాయిలో కని పించే అభివృద్ధినిబట్టి సాహిత్యంలో పురోగమనాన్ని నిర్ణయించాలి. సాహిత్యంలో పురోగమనాన్ని మతబద్ధ రచనలనుంచీ, మతంనుంచీ విముక్తిపొందే క్రమంగా భావించ వచ్చు. బాహ్యవాస్తవికత ప్రతిబింబించటంలో చారిత్రికాభివృద్ధే సాహిత్యచరిత్రలో అభివృద్ధి అంటారు. రాజకీయాలు, కులమతాలు, తత్త్వశాస్త్రం, వర్తక వ్యాపారాలు ఇతరప్రాంతాల్తో సంపర్కం మొదలైనవాటిల్లో అసమానాభివృద్ధి కూడా సాహి త్యంలో పురోగమనాన్ని నిర్ణయిస్తుంది. సాహిత్యచరిత్ర సమంగా సూటిగా పురోగ మించిందని చెప్పటానికి చేసే ప్రయత్నం వక్రీకరణలకి దారితీస్తుంది.

ఇంగ్లీషులో era, Epoch, Period, Age అనే మాటల్లో ఏదో ఒకదానికి సమానార్థకంగా తెలుగుసాహిత్య చరిత్రలో యుగశబ్దాన్ని ఉపయోగించుకోవటంవల్ల ప్రయోజనంలేదు. కాలపరిమితి, సమాన లక్షణాల సందర్భం, నవ్యప్రక్రియ అవి

ర్భావం అనే ఏ అర్థంలోనూ యుగ విభజన తెలుగుసాహిత్య చరిత్ర స్వరూపాన్ని నిరూపించలేదు. చలనశీలమైన ఒకప్రక్రియ ఇతర ప్రక్రియల లక్షణాల్ని సంతరించుకుంటూ వదులుకుంటూ విభిన్న ప్రాంతాల్లో, విభిన్నకాలాల్లో విభిన్నవర్గ రాజకీయ,ఆర్థిక, మత, తాత్త్విక సాంఘిక పాత్రని నిర్వహించిన క్రమాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో యుగం అనవచ్చును. ఈ యుగాల్ని కార్యకారణ సంబంధాల్లో, అన్యోన్య సంబంధాల్లో అధ్యయనం చేయటమే తెలుగుసాహిత్య చరిత్రని అధ్యయనం చేయటం అవుతుంది. ఇది ప్రక్రియల్నిబట్టి చేసిన యుగవిభజన కాదు. తెలుగులో ఏ ప్రక్రియ ఒక కాలపరిమితిలో లేదు. ఏ ప్రక్రియ ఇతర ప్రక్రియలనుంచీ పూర్తిగా విడివడలేదు. ఏ ప్రక్రియ ఒక నిర్దిష్టపాత్రని మాత్రమే నిర్వహించనూ లేదు. కాబట్టి తెలుగు సాహిత్య చరిత్రలో యుగం ఒక సంకీర్ణ ప్రవాహం.

తెలుగు సాహిత్య చరిత్రలో ఈ విలక్షణయుగాల్లో వర్థిల్లిన రాజకీయ, సాంఘిక, మత దార్శనిక శక్తులు ఏమిటి ? వాటికీ ఈ యుగాలకీ అన్యోన్య సంబంధాలు ఏమిటి? ఆంధ్ర ప్రాంతంలో జన సాంద్రత అంతర్భాగంలోకంటే తీర భూముల్లోనే ఎక్కువగా ఉండేది. అంతర్భాగం కొండలమయం కావటంవల్లా, వర్షపాతం తక్కువ కావటంవల్లా, నేలసారవంతం కాకపోవటంవల్లా, వ్యవసాయానికి కావలసిన నీటివసతి లేకపోవటంవల్లా జనం తీరప్రాంతాల్లోనే తక్కువ ఉండేవారు.

"....a period of 'colonization' the harm being used in a good sense and meaning not exploitation of the weak by the strong and developed countries, but development of new virgin lands by men slightly better placed in life, with the help and co-operation of the indigenous people" (H. D. Sankalia : Pre-history of India P. 99)

వలసీకరణయుగం అంటే అభివృద్ధి పొందిన బలమైన దేశాలు బలహీనమైన వెనుకబడిన దేశాల్ని దోపిడీ చేయటం అనే అర్థంలో ఇక్కడ వాడటం లేదు. దేశప్రజల సహాయ సహకారాల్తో ఆ దేశం కంటే, ఆ ప్రజల కంటే కొంత అభివృద్ధి పొందినవాళ్ళు అభివృద్ధిపరచటం అనే అర్థంలోనే స్వీకరించాలి అంటాడు ప్రముఖ పురాతత్త్వ శాస్త్రజ్ఞుడు శంకాలియా. ప్రజల ఇష్టం కాకపోతే రాజుల ఇష్టం

అనుకుందాం. ఈ వలసీకరణ క్రమంగా ఆర్యీకరణగా, సాంస్కృతీకరణగా మారింది. ఆంధ్రప్రాంతంలోని తీర్థస్థలాన్ని ఆర్యులు ఆక్రమించుకోవటంవల్ల లేదా ఆర్యీకరణ చేయటంవల్ల అనేక ఇతర జాతులు కొండభూముల్లోకి వలస పోయారు. దీన్తో తీరదేశంలో ఆర్య సంస్కృతి అభివృద్ధి పొందింది. తీర ప్రాంతాల్లో రాక పోకలు ఉండటంవల్ల వర్తకం అభివృద్ధి పొందింది. దీన్తో అంతర్భాగం, తీర ప్రాంతం రెండుగా ఆంధ్రదేశం విడిపోయింది. అంతర్భాగంలో జీవించే ప్రజల్ని తీరప్రాంతవాసులు దోపిడీ చేసేవారు. దేశ అంతర్భాగంలో ఉత్పత్తిఅయిన సరుకులు తీర దేశంలోని రేవుపట్టణాలకి రావటంతో సంపన్నులూ, వ్యాపారవర్గాలూ ఏర్ప డ్డారు. కృష్ణా, గోదావరి ముఖద్వార ప్రాంతాల్లో ప్రాచీనకాలంలోనే వాణిజ్యసంఘాలు స్థాపించబడ్డాయి. దీన్తో పై వర్గాలమీద ఆర్య సంస్కృతి ప్రభావం తీవ్రతరంగా పడింది. అరణ్యాల్లో, కొండల్లో జీవించే ప్రజల్లో తొలి ఆంధ్ర సంస్కృతి మిగిలి ఉంది.

సముద్రతటం రుజురేఖలా ఉండటంతో అనేక రేవులు ఏర్పడి రేవుపట్టణాలు అభివృద్ధి పొందాయి. గోపాలపురం, కళింగపట్టణం, భీమునిపట్టణం, విశాఖపట్టణం, కృష్ణాపట్టణం, దుగ్గరాజుపట్టణం రేవు పట్టణాలు. ఈ రేవు పట్నాల వల్ల ఎగుమతి, దిగుమతి వ్యాపారంతోపాటు సాంస్కృతిక ప్రసారంకూడా జరిగింది. దీన్తో తీరాం ధ్రులు సాంస్కృతికంగా అభివృద్ధి చెందారు. రాజకీయంగా తీరప్రదేశం అంతర్దేశ వాసులకీ పరిసర రాజ్యాల ప్రజలకీ ఆకర్షణీయ ప్రాంతమైంది. కాబట్టే ఆంధ్ర రాజ వంశాలన్నీ తీరప్రాంతంలోనే ఒకరి తర్వాత ఒకరుగా స్థిరపడ్డారు. తూర్పు కను మలూ, కొండలోయలూ, దక్షిణ, ఉత్తర దిశలనుంచీ వర్తకులూ, శత్రువులూ సులభంగా ప్రవేశించేవారు. అందుచేత తీరాంధ్రదేశం భిన్న సంస్కృతుల సంగమ స్థానమయింది. తూర్పు కనుమల ప్రాంతం అంతా కొండల్తో నిండి రాకపోకలు అసాధ్యం కావటంతో అది ఖండఖండాలుగా ఏర్పడి స్థానిక నాయకుల ఏలుబడిలోకి వచ్చి ఏకరాజ్య స్థాపనని నిరోధించాయి. చాలావరకు మన చరిత్ర చిన్న చిన్న రాజ్యాల చరిత్రే. ఒక్కొక్క కొండకొమ్మున ఒక్కొక్క చిన్నదొర ఒక దుర్గాన్ని నిర్మించుకొని దాని పరిసరప్రాంతాన్ని పరిపాలించేవారు. రాజ్య నిర్మాతలందరూ ఈ దుర్గాధిపతుల్ని జయించే రాజ్య విస్తీర్ణత చేసుకునేవారు. మహమ్మదీయులు వచ్చిన తర్వాత వాళ్ళు చాలామంది ఇలాంటి దుర్గాల్నే నిర్మించుకున్నారు. ఆంధ్రప్రాంతంలో

ప్రఖ్యాత రాజ్యాలన్నీ ఇలాంటి గిరి దుర్గాల ఆశ్రయంవల్ల వర్ధిల్లినవే. శాంతి భద్రతల కోసం, జీవనోపాధి కోసం, ప్రజలు ఈ దుర్గాల్ని సమీపించటంతో వాటి చుట్టూ పట్టణాలు ఏర్పడ్డాయి. హనుమకొండ, విజయనగరం, కొండవీడు, రాచకొండ, గుత్తి, చంద్రగిరి, పెనుగొండ, ఆనెగొంది, రాయచూరు, గండికోట, ఉదయగిరి మొదలైన పట్టణాలు ఇలా ఏర్పడినవే. ఇవి స్థానికంగా స్థిరత్వానికి ఒకే రాజ్యస్థాపనకి నిరోధకంగా తయారయ్యాయి. వీటిని పరిపాలించినవాళ్ళు ఫ్యూడల్ యుద్ధ ప్రభువులు. తెలుగునాట ఫ్యూడల్ రాజ్య స్వభావ ప్రాతిపదిక ఇది. ఫ్యూడల్ వ్యవస్థ ప్రధాన భావనాలమైన మత ప్రేరణ కేంద్రాలుకూడా కొండకోనలమీదే ఉండేవి. తిరుమల, శ్రీశైలం, కుమారగిరి, అహోబిలం, వేదాద్రి, సింహాచలం, యాదగిరి, శ్రీకూర్మం గిరిశృంగాలమీదనే ఉండేవి. ఇవి దుర్గాల మత ప్రతిబింబాలే.

ఆంధ్రదేశంలో ముఖ్యంగా తీర ప్రాంతంలో కాకసాయిట్ ఉప జాతుల్లో ప్రధానమైన మెడిటరేనియన్ ఉపజాతికి చెందినవాళ్ళు ఎక్కువ. అడవుల్లోనూ కొండల్లోనూ నివసించిన ప్రజలు ఆస్ట్రిలాయిడ్ ఉపజాతికి చెందినవాళ్ళు. క్రమంగా ఆంధ్రజాతి మిశ్రమజాతి అయిపోయింది., ఆర్థిక, రాజకీయ . ఫ్యూడలిజానికి అనుగుణ్యంగానే సాంఘిక ఫ్యూడలిజం రూపు దిద్దుకుంది. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు మధ్యయుగంలో ఉన్నారు. హిందువుల్లో కులవ్యవస్థ విస్తృతంగా ఉంది. సాంస్కృతిక రంగంలో ప్రధానపాత్ర నిర్వహించిన బ్రాహ్మణుల్లో అనేక శాఖలూ భేదాలూ ఉన్నాయి. రుగ్వేదులు, యజుర్వేదులు, సామవేదులు, అధర్వణ వేదులు, అద్వైతులు, విశిష్టాద్వైతులు, ద్వైతులు, వైష్ణవులు, శైవులు, మాధ్వులు, స్మార్తులు, వైష్ణవుల్లో తెంగల, వడగల, వైదికులు, నియోగులు, వెలనాడు, కమ్మనాడు, ములికినాడు, తెలగాణ్యులు, నందవరీకులు, ద్రావిడులు, మళ్ళీ వీళ్ళల్లో శాఖలు. ఏ వర్ణాలో తెలియదుకానీ ప్రతి గ్రామంలో అష్టాదశవర్ణాలవారు వుండాలట. శూద్రుల్లో మరొక ముఖ్యమైన భేదం కుడిచేతి కులం, ఎడమచేతి కులం. ఈ విభజన వెయ్యి సంవత్సరాలనుంచీ ఉంది. ఇది కేవలం దక్షిణ దేశానికి సంబంధించింది. ఎడమచేతి వాళ్ళకంటే కుడిచేతివాళ్ళకి సంఘంలో గౌరవం ఎక్కువ. ఈ భేదం వ్యవసాయ జాతివాళ్ళకీ విశ్వబ్రాహ్మలకీ మధ్య ఉండేది. గొల్లలు, కంసాలురు, ముతరాచలు, మాదిగలు ఎడం కులం వాళ్ళు. మాలవాళ్ళు కుడికులంలోకి రావటం విశేషం. మధ్యయుగాంతంలో వీళ్ళమధ్య సంఘర్షణలు కొంత తీవ్రంగానే జరిగాయి. సమష్టి

కుటుంబం ఫ్యూడల్ కుటుంబం. జ్యేష్టుడు యజమాని. అతని భార్య యజమానురాలు. ఏకపత్నీ వ్రతం అనే విలువే ఆచరణలో లేదు. అన్ని కులాల్లోనూ మహారాజులూ, సంస్థానాధిపతులూ, దొరలూ, సంపన్నులూ చివరికి పేదవాళ్ళు కూడా అనేక మంది స్త్రీలను పెళ్ళి చేసుకునేవారు. హిందూరాజులూ మహమ్మదీయ రాజులు పోటీలు పడ్డట్టు పెళ్ళిచేసుకునో చేసుకోకనో వందలాది మంది స్త్రీలను చేపట్టి భోగవిలాసం కోసం, ప్రతిష్ట కోసం అంతఃపురాల్లో ఉంచుకునేవారు. దీనితో బాటు యుద్ధాల్లో ఓడిపోయిన రాజులు విజేతలకు తమ కుమార్తెల్నిచ్చి పెళ్ళి చేసేవారు. రాజ్య విస్తీర్ణత కోసం పెళ్ళిళ్ళు చేసుకునేవారు. రెండవ దేవరాయలకు భార్యలూ, ఉంపుడుకత్తెలూ కలిసి 700 మంది. కృష్ణదేవరాయలకు 12 మంది భార్యలూ, 12000 వేల మంది అంతఃపుర స్త్రీలు, అచ్యుత దేవరాయలకు 500 మంది భార్యలు. విజయ రాఘవ నాయకుడు శ్రీకృష్ణుడే. వాళ్ళల్లో ఎవడు చచ్చినా వందలమంది స్త్రీలు చేస్తే సహగమనం చెయ్యాలి లేకిపోతే రోడ్డున పడాల్సిందే. బాల్యవివాహాలవల్లా, వితంతు పునర్వివాహాలు లేకపోవటం వల్లా భోగకాంతలవల్లా స్వేచ్ఛా కామ విహారం పెరిగిపోయింది. పన్ను కట్టి స్త్రీలు వేశ్యావృత్తి చేసేవారు. రాయలకాలంలో వేశ్యావృత్తి మీద నుంచీ వచ్చే పన్ను 12000 మంది రక్షక భటుల జీతాలకి సరిపోయేదట. నైసర్గిక పరిస్థితుల్నుంచీ వివాహేతర సంబంధాల వరకూ ఈ సమస్త విషయాల్నీ నిరంతరం దృష్టిలో పెట్టుకోకపోతే తెలుగు సాహిత్య చరిత్రని కానీ ప్రాచీన మధ్య యుగాల్లోని ఒక రచనని కానీ అవగాహన చేసుకోలేం. విశ్లేషించలేం. సహేతుకమైన నిర్ధారణలు చేయలేం.

ఆంధ్రదేశ చరిత్రని పూర్వయుగం, మధ్యయుగం, ఆధునిక యుగం అని మూడు యుగాలుగా విభజించారు. క్రీ. పూ. 3 వ శతాబ్దం నుంచీ క్రీ. శ. 11 వ శతాబ్దం దాకా పూర్వయుగం. క్రీ. శ. 11వ శతాబ్దం నుంచీ 18 వ శతాబ్దం దాకా మధ్యయుగం. 19 వ శతాబ్దం నుంచీ ఆధునిక యుగం. మధ్యయుగాన్ని 11-14 శతాబ్దాల మధ్య కాలాన్ని పూర్వ మధ్యయుగం అనీ 14-18 శతాబ్దాల మధ్యకాలాన్ని ఉత్తర మధ్యయుగం అనీ విభజించారు. తెలుగు సాహిత్య చరిత్రని పైన నేను నిర్వచించిన యుగ స్వభావాన్ని అనుసరించి పూర్వ మధ్యయుగాన్ని ప్రస్తావిస్తూ ఉత్తర మధ్యయుగంలో సాహిత్యాన్ని ప్రధానంగా వివరిస్తాను. కాబట్టి ఈ వ్యాసానికి సంబంధించినంత వరకు మధ్యయుగంలో తెలుగు సాహిత్యం అంటే చారిత్రక

ఉత్తర మధ్యయుగంలోని సాహిత్యం అనే అర్థం. ఆంధ్ర చరిత్రలో ఈ ఉత్తర మధ్యయుగం ముసునూరి వంశ చరిత్రతో ప్రారంభం అవుతుంది. ఒకే కాలంలో ఆంధ్ర దేశంలోని విభిన్న ప్రాంతాల్ని విభిన్న రాజవంశాలు పరిపాలించాయి. ఈ రాజ వంశాల ఫ్యూడల్ శైలిలో చిన్న చిన్న భేదాలు ఉన్నాయి. వాటి ప్రభావం సాహిత్యం మీద ఎంతో కొంత కనబడుతుంది. ఆర్యీకరణ ఫలితంగా సాంఘిక ప్రతిష్ఠకి చిహ్నంకాబట్టి, ఉత్తర దేశపు రాజుల్తో సమాన ప్రతిపత్తి పొందటానికి, సంస్కృతంలోని రాజ్య సిద్ధాంతాన్ని అనుకరిస్తూ చాలామంది తెలుగు రాజులు సంస్కృతంలో అనేక గ్రంథాలు రాశారు. సంస్కృత పండితుల్ని పోషించారు. సంస్కృత సంస్కృతి పట్ల గౌరవాన్ని ప్రదర్శించారు. సంస్కృతం నుంచీ అనువాద, అనుసరణ రచనల్ని విపరీతంగా ప్రోత్సహించారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఆర్యీకరణం, సంస్కృతీకరణం చాలా ప్రధాన పాత్ర నిర్వహించాయి. తెలుగు సాహిత్యం తెలుగు ప్రజల జీవితాన్ని కాక తెలుగు రాజుల, సంపన్నుల ఆశలనూ, భ్రమలనూ, స్వప్నాలనూ చిత్రించటానికీ, తెలుగు సాహిత్య చరిత్ర 'అష్టావక్ర' కావటానికీ ఆర్యీకరణమే కారణం. తెలుగు ఫ్యూడల్ వ్యవస్థకి అసహజమైన, అసాధారణమైన బలాన్ని చేకూర్చి పెట్టింది సంస్కృతీకరణమే. దాదాపు రాజుల నుంచీ సంస్థానాధీశుల వరకూ ఫ్యూడల్ ప్రభువులందరూ సంస్కృతానికి మొదటి స్థానం, తెలుగుకి రెండో స్థానం ఇచ్చారు. సంస్కృతం రాని తెలుగు కవుల్ని ఎవరూ పోషించక పోవటం వల్ల అలాంటి కవులు చరిత్రలో కాగడా పట్టుకొని వెతికినా కనపడకుండా పోయారు. తెలుగు ప్రాంతంలో అనేక మంది వ్యాకరణ మతధార్మిక, అలంకార శాస్త్రాల్నీ, కావ్య నాటకాల్నీ సంస్కృతంలో రాశారు. కుమారిలభట్టు, విద్యారణ్యస్వామి తత్త్వశాస్త్ర గ్రంథాలు రాశారు. జగన్నాథుడు అలంకార శాస్త్రం రాశాడు. మల్లినాథుడు కాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యానం రాశాడు. ఆపస్తంబుడు సూత్రాలు రాశాడు. హేమాద్రి పండితుడు చతుర్వర్గచింతామణి రాశాడు. కుమారసింగ భూపాలుడు, కుమారగిరిరెడ్డి, కాటయవేమారెడ్డి, కృష్ణదేవ రాయలు, రఘునాథ రాయలు వంటి ప్రముఖ ఆంధ్ర ప్రభువులు సంస్కృతంలో అలంకార, సంగీత నాట్యశాస్త్రాల్నీ కావ్య నాటకాల్ని రాశారు. విద్వదౌషధంగా పేరుపొందిన శృంగార నైషధాన్ని సంస్కృత పదమయంగా అనువదించినందుకు డిండిమభట్టుని ఓడించినందుకే శ్రీనాథుడ్ని రెడ్డిరాజులు నెత్తిన పెట్టుకున్నారు.

మొత్తంమీద ఫ్యూడల్ ప్రభువులు తమ ఆధిపత్య స్వప్రయోజనాల కోసం తెలుగు దేశం మీద ఆర్యావర్తాన్ని రుద్దారు. దీన్తో తెలుగు సంస్కృతి కింది ప్రజల సంస్కృతిగా మిగిలిపోయింది. అనువాద, అనుసరణ సాహిత్యమే ఉదాత్త సాహిత్యంగా పరిగణించబడింది. మహమ్మదీయ రాజులు పారశీక, ఉర్దూ భాషల్ని ప్రవేశ పెట్టినప్పటికీ సంస్కృత సంస్కృతిని దెబ్బతీయలేదు. ఈ విధంగా మధ్యయుగంలో సంస్కృతం, తెలుగు, కన్నడం, తమిళం ఉర్దూ భాషాసాహిత్యాలు కలిసి ఆంధ్ర ప్రాంతంలో పాలక వర్గాలకు అనుకూలమైన ఒక విలక్షణ ఫ్యూడల్ సంస్కృతిని రూపొందించాయి. తెలుగులో సాహిత్య ప్రక్రియలు అన్నీ వివిధ దశల్లో వివిధ కాలాల్లో ఈ ఫ్యూడల్ సంస్కృతిని అనేక రూపాల్లో పోషించాయి. ఈ సంస్కృతి పరిధిలోనే అయినా ఈ సంస్కృతిని నిరసించిన, ప్రజాజీవితాల్ని ప్రతిబింబించిన, ప్రజాస్వామిక, మానవతా భావాల్ని వ్యక్తం చేసిన కవులు అనేక మంది ఉన్నారు.

ఈ ఉత్తర మధ్యయుగంలోని సాహిత్యంలో అన్ని ప్రక్రియల్నీ చర్చించటం ఇక్కడ సాధ్యంకాదు. ఈ యుగ ప్రత్యేకతని వివరించటానికి పనికి వచ్చే ప్రక్రియల్ని మాత్రమే విశ్లేషించటం జరుగుతుంది. ప్రబంధం, యక్షగానం, వచనం ఈ యుగ ప్రక్రియలు. ప్రబంధాన్ని ఒక కావ్యభేదంగా సంస్కృతంలో కానీ ప్రాచీన, మధ్యయుగ సాహిత్యంలో కానీ పరిగణించినట్టు కనబడదు. పురాణాల్నీ, కావ్యాల్నీ, రూపకాల్నీ చివరికి అలంకార శాస్త్రాల్ని కూడా ప్రబంధం పేరుతో పిలిచారు. ఆధునిక సాహిత్య చరిత్రకారులే ప్రబంధాన్ని ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా తెలుగు కవులు స్వతంత్రంగా సృష్టించిన ప్రక్రియగా భావించి దాని లక్షణాల్నీ, చరిత్రనీ చెప్పటానికి ప్రయత్నించారు. ఆంధ్ర సాహిత్యం ఆది నుంచీ ప్రబంధోన్ముఖంగా నడిచిందని విమర్శకుల అభిప్రాయం. "భారతములో బీజప్రాయముగా, ఎఱ్ఱనలో అంకురప్రాయముగ, సోమన్నలో మొలకగా పొడచూపిన ప్రబంధలత శ్రీనాథునిచేతిలో కొనలు సాగి, చిగిర్చి, మారాకు వేసినది. అది పుష్పఫల సమన్వితమగుట రాయల కాలములో. మనుచరిత్రయే ఆ లతపూచిన తొలిపూవు; పండిన తొలిఫలము." (పింగళి లక్ష్మీకాంతం. తెలుగు సంస్కృతి.608) ఏ ప్రక్రియా హఠాత్తుగా పుట్టదు. కవి సంకల్పం నుంచీ పుట్టదు. ఆర్థిక రాజకీయ మత తాత్త్విక పరిస్థితుల్లో వచ్చే మార్పుల నుంచే నూతన సాహిత్య ప్రక్రియలు ఆవిర్భవిస్తాయి. సాహిత్యానికికానీ మరొక చైతన్య రూపానికి కానీ స్వతంత్ర, సాపేక్ష స్వతంత్ర

ప్రతిపత్తి ఉండదు. స్వతంత్రమైన చరిత్ర కూడా ఉండదు. అలా వుంటే ఏదీ తన ప్రత్యేకమైన పాత్రని నిర్వహించలేదు. వ్యవస్థీకృతమైన ఇతర చైతన్య రూపాల్తో అవిభాజ్యంగా ఉంచేనే, ఉండే ప్రతిదీ తన విలక్షణమైన సామాజిక పాత్రని నిర్వహిస్తుంది. ప్రబంధ ప్రక్రియకు కాలికంగా పరిమాణాత్మక మార్పులు ఉండటమే కాదు రూపంలో కూడా పురాణ, కావ్య, మౌఖిక వాఙ్మయ లక్షణాలు కలిసే ఉంటాయి. పండితులు అభిప్రాయపడినట్టు ఇది తెలుగులో నూతన ప్రక్రియ అన టంలో సందేహం లేదు. కానీ దీనికి వాళ్ళు చెప్పిన లక్షణాలు, చేసిన నిర్వచనం ఏ విధంగానూ సంతృప్తికరంగా లేవు. ప్రకృష్టమైన బంధం కలిగింది ప్రబంధం అనే నిర్వచనంలో తప్పేమీ లేదు కానీ ప్రక్రియాపరంగా దీనికి అతి వ్యాప్తి దోషం ఉంది. ఎక్కాల పుస్తకానికయినా ప్రకృష్టమైన బంధం అవసరమే. నిజానికి ప్రబంధాలుగా ప్రసిద్ధమైన మనుచరిత్రాదుల్లో ప్రకృష్టమైన బంధం లేదు. ఉండాలనే ఉద్దేశంకూడా ఆ కవులకి లేదు. కాబట్టి ఇక్కడ దశద్వారాశ్రిత నిర్వచనం కుదరదు. రాయల కాలం లోని ప్రబంధాల సామాన్య లక్షణాలను క్రోడీకరించి పండిత పరిశోధకులు చెప్పిన ప్రబంధ లక్షణాలు ఇవి :-

"1) ప్రబంధమునకు ఏకనాయకాశ్రయత్వము, దానితోబాటు వస్తైక్యము ప్రధాన ధర్మములు. 2) ప్రబంధము అష్టాదశ వర్ణనాత్మకమై యుండవలెను. 3) అందు శృంగారము ప్రధాన రసము. అవశ్యకతను బట్టి తక్కిన రసములు గౌణములు కావచ్చును. 4) అలంకారికమైన శైలి ప్రబంధమునకు జీవము. 5) ప్రబంధము భాషాంతరీ కరణము కాకూడదు; స్వతంత్ర రచనమై యుండవలెను" (పింగళి లక్ష్మీకాంతం. తెలుగు సంస్కృతి 608) ఈ లక్షణాలన్నీ ఉన్నా లేక పోయినా "స్వతంత్ర రచనలగుట చేతను, అలంకారిక శైలీ శోభితము లగుటచేతను అవన్నియు ప్రబంధములుగానే పరిగణింపబడినవి" (అదే) అని తాను చెప్పిన లక్ష ణాలు సమగ్రం కావేమో అని తనకే అనుమానం వచ్చి కొన్ని లక్షణాలను వదులు కున్నాడు. కేవలం రూపాన్ని మాత్రమే పరిశీలించి సారాన్ని అసలు పట్టించుకోకుండా లక్షణాలు చెప్పటానికి ప్రయత్నించటం వల్లా, సామాజిక దృక్పథం నుంచీ అధ్య యనం చేయకపోవటంవల్లా తర్కానికి కూడా నిలవని శుష్క లక్షణాలు చెప్పటం జరిగింది. అసలు ఈ లక్షణాలు తెలుగు ప్రబంధాల్ని అధ్యయనం చేసి ఆవిష్క రించిన లక్షణాలుగా కూడా కనిపించటం లేదు. ఇవన్నీ అటూ ఇటుగా సంస్కృ

తంలో కావ్య లక్షణాలే. కాకపోతే- ఈ లక్షణాల్ని చెప్పేటప్పుడు మనస్సులో కొన్ని పాశ్చాత్య సాహిత్య విమర్శ భావనలు ఉండి ఉంటాయి. మిగిలిన సాహిత్య చరిత్ర కారులు కూడా ప్రబంధ లక్షణాల్ని గురించి ఇంతకంటే చెప్పిందేమీ లేదు. రాయల కాలంతోనే ప్రబంధాలు ఆగిపోలేదు. దక్షిణాంధ్ర వాఙ్మయంలో కూడా కొనసాగాయి. రాయల యుగంలో మతదార్శనిక విధానంలో ప్రధానమైన మార్పు వచ్చింది. కృష్ణ దేవరాయలు ఆయనకు సమకాలికులైన ప్రబంధ కవులందరూ విశిష్టాద్వైతులు. ఈ విశిష్టాద్వైతమే ప్రబంధాల్లో ప్రధాన వస్తువు. అరణ్యాల్ని ఛేదించి సాగుచెయ్యటం 'కాడువెట్టి' విజయనగర రాజ్యంలో విస్తృతమైంది. వర్తకశ్రేణులు ఎంతో అభివృద్ధి పొందాయి. దేవాలయాల్ని నిర్మించటంలో నూతన శిల్ప పద్ధతులు ఆవిష్కరింప బడ్డాయి. అంతకు పూర్వం ఎన్నడూ లేనంతగా ఎడమకులం వాళ్ళకి ప్రతిష్ఠ పెరిగింది. పల్లెల్లో కుడి వాళ్ళ ఆధిపత్యం ఉన్నప్పటికీ పట్టణాల్లో ప్రాధాన్యం అంతా ఎడమకులం వాళ్ళదే. ఎడమకులం వాళ్ళల్లో స్థపతులకు, కంసాలురకు ప్రాధాన్యం పెరిగింది. రాజులు, సామంతులు, మంత్రులు, సేనా నాయకులు, వర్తకులు మొదలైన సంపన్న వర్గాలకి ఈ యుగం స్వర్ణయుగమే. చేతి వృత్తులు పరిశ్రమల స్థాయికి అభివృద్ధి పొందాయి. చాతుర్వర్ణాల చట్రం ఉన్నప్పటికీ ఆ వర్ణాల మధ్య సంబంధాల్లో ప్రజాస్వామిక స్థాయి పెరిగింది. ఈ మారిన పరిస్థితులనుంచీ, శక్తుల నుంచీ పుట్టిందే ప్రబంధ ప్రక్రియ.

"యతి విటుఁడుగాక పోపుటెట్లస్మదీయ
కావ్య శృంగార వర్ణ నాకర్ణనమున
విటుడు యతిగాక పోరాదు వెనమదీయ
కావ్య వైరాగ్య వర్ణనా కర్ణనమున"

(సంకుసాలనృసింహకవి. కవికర్ణ రసాయనం)

రెండవ విషయం ఎలా ఉన్నా ప్రబంధ విషయంలో మొదటి విషయం సత్యమే. విశిష్టాద్వైతం కేవలం మతం కాదు, కేవలం తత్త్వశాస్త్రం కాదు. అది మత తత్త్వశాస్త్రం. రామానుజుని మార్గం భక్తి. కర్మసన్యాసం కాక వివేకంతో కూడిన కర్మాచరణనీ, సర్వవర్ణాల మోక్షార్హతనీ రామానుజుడు అంగీకరించాడు. భోగమే కర్మ నిర్మూలనకి హేతువన్నాడు. విష్ణునామస్మరణ, విష్ణుతీర్థసేవ,

నారాయణుని అవతార సంకీర్తన, శేషశేషిభావం, విదేహముక్తి, సాయుజ్యమోక్షాలు వైష్ణవమత ప్రధాన లక్షణాలు. విష్ణువే కర్త, భర్త, హర్త. విశిష్టాద్వైతం కవిత్వాన్ని ఆధ్యాత్మికతకీ జీవితానుభవానికీ సేతువుగా భావిస్తుంది. జీవాత్మలోని సౌందర్యాన్ని భువనసుందరంగా, జీవాత్మలోని మన్మధుడ్ని మన్మధ మన్మధునిగా చేసే సాధనం కవిత్వం. విష్ణువుకి స్వరూపం, రూపం, గుణం అనే మూడు అవిభాజ్య లక్షణాలు ఉంటాయి. స్వరూపం అద్వితీయం. ఇది అతీత భావనని కలిగిస్తుంది. గుణం పవిత్ర భావననీ, భక్త్యావేశాన్ని కలిగిస్తుంది. రూపం పరమాత్మ స్వరూపానికీ గుణానికీ సంయోగాన్ని కలిగిస్తుంది. ఈ రూపమే మన్మధ మన్మధ రూపం. భువన సుందర రూపం. మదన మోహన రూపం. శరీరం పాపపంకిలంకాదు. అది బ్రహ్మపురి. ఈ బ్రహ్మపురిలో ప్రేమలీలా నాటకాన్ని ప్రదర్శించే త్రైలోక్యకాంత కవిత్వం. కాబట్టి శృంగార రసరాణి భక్తి రసరాట్టు. ఇది కామాన్ని మానవీయం, దివ్యగుణ శోభితం చేస్తుంది. కేవలం విరహం, వియోగంతో నిలిచిపోకూడదు. విరహాగ్ని సంభోగంతోనే పునీతమవుతుంది. ఇది EJACULATE తత్త్వశాస్త్రం. Orgasm తత్త్వశాస్త్రం. Mind-Body Conflictని సంభోగంద్వారా అధిగమించాలనే తత్త్వశాస్త్రం. పురుషాధిక్యత ఏ మాత్రం తగ్గకపోయినా Female Passivityని చాలావరకు తగ్గించగలిగిన మతం. ఏ పరిమితులూ లేకుండా Reflex art ని వర్ణించటానికి ఆమోదం తెలిపిన మతం. ప్రబంధాల్ని విశిష్టాద్వైత అలంకార శాస్త్రంనుంచీ అధ్యయనం చెయ్యాలి. కానీ అద్వైతాది ఇతర అలంకార శాస్త్రాలనుంచీ చెయ్యకూడదు. శృంగార రసాన్ని గురించి ఇతర శాస్త్రాలు చెప్పినదానికీ శ్రీవైష్ణవుల దృష్టికీ ఎంతో తేడా ఉంది. వైష్ణవులు తీర్థ, దైవత, క్షేత్రమాహాత్మ్యాలకి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. ఇవి సర్వపాప నివారణలు. పైగా రాయల యుగంలో దేవాలయాలు భక్తికీ, రక్తికీ, సంపదకీ కళాసౌందర్యానికీ నిలయాలు. దేవదాసీలు కూడా ఈ దేవాలయాల్లోనే ఎక్కువ ఉండేవారు. అందుకని క్షేత్ర మహాత్మ్య గ్రంథాలుకూడా ప్రబంధాలే. వీటిల్లో కూడా శృంగారం రసరాణిగానే వర్ణింపబడింది. రాజుల, మంత్రుల, సేనాధిపతుల, వైష్ణవ మఠాధిపతుల, విశిష్టాద్వైత బ్రాహ్మణుల సంపన్నుల జీవితాల్ని ప్రబంధాలు ప్రతిబింబించాయి. ఇదే ప్రబంధ వర్గ దృక్పథం. ఈ వర్గాల జీవితాన్ని వాటికి అనుబంధంగా ఉన్న వర్గాల జీవితాన్ని ప్రబంధాలు సజీవంగా వర్ణించాయి. ప్రబంధాలు ఊహాలోక విహారాలు అనే అభిప్రాయం పూర్తిగా

అసమంజసం. ప్రబంధ సమీప పూర్వదశలోనూ, ప్రబంధకాలంలోనూ వచ్చిన భక్తి ధోరణుల్లోనూ కనిపించే ప్రజాస్వామిక భావాన్నీ మానవతాచ్ఛాయల్నీ, అగ్రవర్ణాధిపత్య నిరసననీ ప్రబంధాలు ప్రేరణాత్మకంగా జీర్ణం చేసుకున్నాయి. అదే సమయంలో వాటిని అభావం చెయ్యటానికి ప్రయత్నం చేశాయి. మహాప్రబంధయుగం తర్వాత వచ్చిన విలాస ప్రబంధాలు భక్తి ఉద్యమ ధోరణుల్నీ, మహాప్రబంధ భావజాలాన్ని సమ్మేళనం చేసి ఉన్నత మధ్యతరగతుల కామభోగ జీవితాన్ని వర్ణించాయి. అంటే విలాస ప్రబంధాలు పైవర్గాల జీవితాన్ని కింది వర్గాల స్థాయికి దిగిన శ్రీవైష్ణవ భావజాలంలోనే వర్ణించాయి. కాబట్టి అనుభవవాదమే, సవివేక భోగమే ప్రబంధ వస్తువు. శ్రీవైష్ణవ అనుభవవాదాన్ని, శృంగార జీవితానుభవం నుంచీ పౌరాణిక గాథల్ని ఆశ్రయించి సామాజిక స్పృహతో వర్ణించడాన్ని ప్రబంధం అనవచ్చును. రామానుజుడు వేదోపనిషత్తుల్నేకాక పురాణేతిహాసాల్నీ ఆళ్వారుల దివ్యప్రబంధాల్నీ ప్రమాణాలుగా అంగీకరించాడు. వైదిక కర్మకాండ వైష్ణవుల దృష్టిలో స్వర్గప్రాప్తికి హేతువులు కావచ్చుకానీ మోక్షప్రాప్తికి పనికిరావు. కుటుంబం, దేవాలయం ఈ రెండూ జీవితంలో అత్యంత ప్రధానమైనవిగా ప్రబంధాలు చిత్రించాయి. దాదాపు అన్ని ప్రబంధాల్లోనూ కుటుంబ జీవిత ప్రాధాన్యాన్నీ, దేవాలయ మహాత్మ్యాన్ని చెప్పినవే. వివాహేతర సంబంధాలు, వేశ్యా సంగమం అధికం కావటంతో బహుపత్నీత్వాన్ని ఆమోదించినా కామభోగాన్ని కుటుంబంచేత పరిమితం చేయబడాలనేది ప్రబంధాలు బోధించిన నీతి. కుటుంబం చేత, విష్ణుచైతన్యం లేదా భక్తిచేత పరిమితం చేయబడిన భోగమే సవివేక భోగం. ఇదే విశిష్టాద్వైత భోగ సిద్ధాంతం. ఈ ప్రబంధ మత తాత్త్విక సారాన్ని దాని రాజకీయ, ఆర్థిక స్త్రీ పురుష సంబంధపార్శ్వాన్ని విశ్లేషించిన పండిత పరిశోధకుడు ఒక్కడు లేడు. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ పూర్తిగా చెప్పకపోయినా స్థూలంగా రసికత భావనతో ప్రబంధాల్లోని సాంఘిక జీవితాన్ని సమర్థించే ధోరణిలో రాశారు. జి. వి. కృష్ణారావు ఒక్కరే విశిష్టాద్వైత అలంకారశాస్త్ర ప్రమాణంగా కళాపూర్ణోదయానికి పరిమితంగా అయినా రాశారు. మిగిలిన అసంఖ్యాక పండితుల చర్చ అంతా వృథా ప్రసంగాలే. వాళ్ళు ఎవరూ ప్రబంధ తత్త్వం దగ్గరికి కూడా రాలేదు.

భావజాలపరంగానూ, ప్రక్రియాక్రమంలోనూ చాలా పూర్వరంగం ఉన్నప్పటికీ తొలి ప్రబంధం అయినా కాకపోయినా ప్రసిద్ధ ప్రబంధం మనుచరిత్రం. పెద్దన

రాయలసీమ ప్రాంతంవాడు. నందవరీక స్మార్త బ్రాహ్మణ వంశంలో పుట్టాడు. రుగ్వేదుడు. కృష్ణదేవరాయల ఆశ్రయం కోసం, శఠకోపయతి ద్వారా వైష్ణవం పుచ్చుకున్నాడు. రాయలతో పెద్దనకు సన్నిహిత సాంగత్యం ఉంది. విజయనగరంలో ఉండటమేకాక రాయలతో కలిసి పుణ్యక్షేత్రాలకీ రణక్షేత్రాలకీ సంచారం చేస్తూ ఉండే వాడు. మారన మార్కండేయ పురాణంలోని స్వారోచిష మనుసంభవకథని ఆధారంగా చేసుకొని అదేపేరుతో ప్రబంధం రాశాడు. అదే మనుచరిత్రగా జన వ్యవహారంలో ప్రసిద్ధి పొందింది. విశిష్టాద్వైత మత దృక్పథాన్ని చెప్పటానికి అనుకూలంగా ఉండటంవల్ల పెద్దన ఈ కథని మూలంగా తీసుకున్నాడు. కేవలం ఆధారమేకానీ మార్కండేయ పురాణంలో కథకీ మనుచరిత్రకీ తాత్త్వికంగా ఎలాంటి సంబంధమూ లేదు. మూలంలో అనేకమంది మనువుల్లో ఒక మనువు పుట్టాడు. మనుచరిత్రలో శ్రీ వైష్ణవ మనువు పుట్టాడు. నన్నయ మనుధర్మమనువుకి పెద్దన మనువు పూర్తిగా భిన్నమైనాడు "మార్కండేయ పురాణోక్తప్రకారముగా రచింపనెంచిన పెద్దన సంస్కృతాంధ్ర గ్రంథముల వెంటియందలి యుత్కృష్ట రసభావముల మార్గముననే తానును ననుసరించి యచటచట గొన్ని చిరుమార్పులు చేసి తన ప్రబంధమును సంధానించెను. ఆ చిరుమార్పులు కూడా రసపుష్టి కొరకును, ఔచితీ పరిపోషణము కొరకును చేయబడినవేకాని యన్యముకాదు". (తిమ్మావజ్ఝలకోదండ రామయ్య 1966) పండితులందరూ ఇలాగే రాశారు. కథా మాత్ర అధ్యయనం చేసిన వాళ్ళు ఇంతకంటే ఏమీ చెప్పలేరు. కాశీమజిలీ కథలు చదవటానికి అలవాటు పడినవాళ్ళు ఇంతకంటే ముందుకు పోలేరు. పెద్దన చేసిన మార్పుల్ని అన్నా సరిగా చెపుతారా అంటే అదీ లేదు. మూలంలో లేని దశావతార కీర్తనం పెద్దన ఎందుకు రాశాడు? తాత్త్వికంగా మనుచరిత్రలో ఈ వర్ణన ఎంతో కీలకమైంది. రసం, ఔచిత్యం అలాంటి విషయాలేకావు. మొత్తం కథనే విశిష్టాద్వైత దృక్పథంతో వెలిగించాడు. మూలం కేవలం ఉయ్యాల మంచం. దానిమీద కూర్చున్న మనిషి మనుచరిత్ర. ఆధార ఆధేయ, నియామక నియమ, శేషి శేష సంబంధాలనే విశిష్టాద్వైత అస్తిత్వ శాస్త్రాన్ని ప్రారంభంనుంచీ చిత్రిస్తూ దశావతారవర్ణనతో పెద్దన పూర్తి చేశాడు." .... నీవు గాని వాడనఁగ నెవ్వఁ, డరమఁ గను శేషభూత సమస్తశేషి" (మనుచరిత్ర షష్ఠ - 105) " .... అంగము పులకా, స్వేతం బుగ హర్షాశ్రువు, లే తేరఁగజూచి భక్తి నిట్లని పొగడెన్" (103) ప్రత్యక్షమైన

'లక్ష్మీశ్వరుని' చూసిన స్వరోచిస్థితి ఇది. భక్తికీ శృంగారానికీ అనుభవంలో తేడా ఏమీ లేదు. రెండింటిలోనూ అనుభవ ప్రగాఢత్వం, నిమగ్నత సమానంగానే ఉంటాయి. శ్రీవశృంగారానుభవం నుంచే భక్తి పుట్టి ఉండాలి.

"పరతత్త్వంబగు నీకు మోడ్చుఁ గరముల్; పద్మాక్ష; కీర్తించెదన్
బురుషార్థ స్థితి నొప్పు నిన్నుఁ గరుణాంభోధిన్; భవార్తున్ జడున్
శరణార్థిన్ నసుఁ గావఁగాఁదగుఁ బ్రధాన వ్యక్త కాలాత్మయీ
శ్వర భూతంబులు కీవెకర్తవును బ్రోవన్ భర్తవున్ హర్తవున్" (106)

పరతత్త్వ విషయంలో విశిష్టాద్వైత దృక్పథాన్ని పెద్దన సవివరంగా చెప్పాడు. పురుషార్థ సాధనలో వైదిక మతానికీ శ్రీ వైష్ణవ మతానికీ తేడా వుంది. అందులో పురుషార్థాలకీ వర్ణ ధర్మానికే అవిభాజ్య సంబంధం ఉంది. ఇందులో భక్తి చాలు. పెద్దన పాత అలవాటు మరిచిపోలేకనో, వైదికపురాన్ని వర్ణించాలనే ఉద్దేశంతోనో అరుణాస్పదపుర వర్ణనలో నాలుగు వర్ణాల వాళ్ళనీ వర్ణించాడు కానీ ప్రబంధంలో ప్రవరుడ్ని మినహాయిస్తే ఏ పాత్రలకీ వర్ణ సంబంధాలు లేవు. పైగా లోకాంతర సంబంధాన్ని కల్పించాడు. ఈ పద్యంలో "కరుణాంభోధి" ప్రత్యేకంగా గుర్తించదగింది. 'జడున్' అనేమాట పెద్దన బహుశా ప్రవరుడు లాంటి వాళ్ళని ఉద్దేశించి అని ఉంటాడు. మను చరిత్రలో ప్రవర వరూథినీ సన్నివేశం ప్రధాన ఇతివృత్తం కంటే ప్రసిద్ధమైంది. ఇలా ప్రసిద్ధం కావటానికి పండితులు, పాఠకుల సంస్కార దోషం తప్ప మరే కారణం లేదు. పైగా ఈ సన్నివేశాన్ని ప్రబంధ తాత్త్విక దృక్పథానికి వ్యతిరేకమైన వ్యాఖ్యానాల్తో, సిద్ధాంతాల్తో భ్రష్టు పట్టించారు. 'పెద్దన వ్యక్తిత్వానికి ప్రవరుడు ప్రతినిధి' అని ఒక అభిప్రాయం. పూర్వాశ్రమంలో ఋగ్వేదిగా ఉన్నప్పుడు పెద్దన ప్రవరుడులాటి వాడిని ఇష్టపడే వాడేమోకానీ మను చరిత్ర కవిగా పెద్దన భావజాలానికే ప్రవరుడు పూర్వ పక్షపాత్రే కానీ సిద్ధాంత పాత్ర కాదు. వైదికుల ఆదర్శ కుటుంబం అప్పటికే పోయింది. పెద్దన సవివేక భోగంతో కూడిన శ్రీ వైష్ణవ కుటుంబవాది. బహుపత్నీత్వం తప్పు కాదు. పెద్దన దృష్టిలో ప్రవరుడు బుద్ధి జాడ్యజనితోన్మాదమైన శ్రోత్రియుడే. అతడు వైదిక కర్మకాండ వాది. సంపన్నుడు. ఆ యుగ సంపన్న బ్రాహ్మణ వర్గానికి భిన్నమైన వాడు. వరూథినితో వాదంలో ఓడిపోయాడు. ఈ రెండు పాత్రల విషయంలో పెద్దన 'తాటస్థ్యం' వహించాడనే అభిప్రాయం సహేతుకం కాదు. ప్రవరుని వాద పద్ధతి

పెద్దన వాద పద్ధతికి వ్యతిరేకమయింది. "పుణ్యము లెన్నియేనియున్, జేసినవాని సద్గతియే చేకుఱు భూతదయార్ద్రబుద్ధికో, భూసురవర్య" (ద్వితీయ-72)

"తరుణిన నన్యకాంత నతిదారుణ పుష్పశిలీ ముఖవ్యథా
భర వివశాంగి నంగభవు బారికి నగ్గముసేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని, రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁగషాయదీధితిన్" (తృతీయ 10)

ఈ పద్యం సంప్రదాయిక పండితుల కుంభస్థలాన్ని బద్దలుకొట్టింది. ఇందులో పెద్దన స్పష్టంగా ప్రవరుడి ప్రవర్తనని తీవ్రంగా నిరసించాడు. ప్రవరుడ్ని క్రూరుడు, బ్రాహ్మణాధముడూ అన్నాడు. ఏంచేయాలో తోచక మను చరిత్ర వ్యాఖ్యాత వెంపరాలు సూర్య నారాయణశాస్త్రి ఈ పద్యాన్ని ప్రక్షిప్తం అని భావించి మనుచరిత్ర నుంచీ దీన్ని తొలగించాలన్నాడు. ఇలాంటి వ్యాఖ్యాతల్ని చూసి మనం సిగ్గుపడాలి. మనకి నచ్చని పద్యాలన్నీ ప్రక్షిప్తాలనే అధికారం మనకి లేదు. ఒక పద్యాన్ని ప్రక్షిప్తం నిర్ణయించటానికి కొన్ని పద్ధతులు ఉంటాయని కూడా వ్యాఖ్యాతకు తెలియ వలసిన పనిలేదా ? సూర్య భగవానుడు గంధర్వ పక్షపాతి అని కూడా తెలియదా ? తరుణి, అనన్యకాంత కోరి వచ్చినప్పుడు ఆమె కోరికను తీర్చ వలసిందే అని ఆదిపనువు చెప్పాడు. ప్రవరుని ప్రవర్తనని విశిష్టాద్వైతం అంగీ కరించదు. అహంకారం కాదు ఉండవలసింది కృప, దయ, పర, వ్యూహ, అవతార, అంతర్యామి, అర్చ దివ్య కృపారూపాలని రామానుజుడు చెప్పాడు. బ్రహ్మం కరుణా మయుడని అనేక సందర్భాల్లో వివరించాడు. దైవరూపమైన ఈ భూతదయని ప్రవరుడు ఉల్లంఘించాడు. ఈ పద్యంలో వెంపరాల జుట్టు పీక్కున్నట్టు అవినీతిని ఉపదేశించలేదు. సవివేక భోగాన్నే ఉపదేశించాడు. 'వ్యథాభరవివశాంగిని' అలా వది లేయటం క్రూరత్వమనే పెద్దన స్పష్టమైన అభిప్రాయం.

"ఎందేడెందము కందళించి రహిచే, నేకాగ్రతన్ నిర్వృతిన్
జెందున్, గుంభగత ప్రదీప కళికా శ్రీ దోఁప నెందెందుఁ బో
వెందే నింద్రియముల్ సుఖంబుగను నా యింపే పరబ్రహ్మ 'మా
నందో బ్రహ్మ' యటన్నపాఁ జదువునంతర్బుద్ధి నూహింపుమా (ద్వితీయ-62)

ఏ విషయంలో మనస్సూ, ఇంద్రియాలూ వికాసాన్ని పొంది ఏ మాత్రం

చలనం లేకుండా సుఖానుభవాల్ని పొందుతాయో అలా సర్వేంద్రియాలూ లయించిన
ఆనందమే పరబ్రహ్మ స్వరూపం. వేదాలు కూడా ఆనందమే బ్రహ్మం అని
చెప్పాయి కదా ? ఈ విషయాన్ని నీ అంతరాత్మతో ఆలోచించు అని వరూధిని
ప్రవరుణ్ని సవాలు చేసింది. దీనికి అతడు చెప్పిన సమాధానం ఏమిటి ? నువ్వు వేద
శాస్త్రోపాధ్యాయినివిగా మాట్లాడుతున్నావు. వేద ధర్మాలు పాపం అని రతి పుణ్యం
అనీ తర్కం చేస్తున్నావు. వేదాంత సూత్రాలకి నువ్వు నీ సంప్రదాయం ప్రకారం
అర్థం చెపుతున్నావు. ఆనందో బ్రహ్మం అనే ఉపనిషత్ వాక్యానికి వరూధిని
వ్యాఖ్యానంలో తప్పు ఏమిటి ? పురుషార్థాల్లో కామం ముఖ్యమైందే కదా ! కామం
లేకపోతే జాతి కొనసాగేది ఎలా ? వాత్స్యాయనుడులాంటి ఋషులు కామశాస్త్రం
రాశారు కదా ! ఆనందాన్ని యోగం విషయంలో ఒక స్థాయిలో, రతి విషయంలో
ఒక స్థాయిలో, సాహిత్యం విషయంలో మరొక స్థాయిలో అర్థం చెప్పుకోవలసిందే
కదా ! ఏది గొప్పదనే ప్రశ్న అర్థరహితం కాదా ? నిజానికి యోగంలో పొందే
ఆనంద స్వరూపం ఎలాంటిదో ఎవరూ చెప్పలేరు. చెప్పినా వినేవాడు నమ్మటానికి
ఎలాంటి వస్తుగత ఆధారం లేదు. రతివల్లా కళవల్లా వచ్చే ఆనందం అందరికీ
తెలిసిందే. రత్యానందం తుచ్ఛమని చెప్పటం మతిలేని మాట. అది తుచ్ఛం అయితే
ప్రవరుడు సోమిదేవమ్మతో మాత్రం రత్యానందం పొందటం దేనికి. ప్రతి దేవుడికీ
ఒక పత్ని దేనికి ? శ్రీవైష్ణవం ఈ జీవితంలో పొందే అన్ని ఆనందాలూ క్షణికమనే
చెపుతుంది. యోగి కూడా చచ్చేదాకా ఆనందం పొందుతూనే ఉండడు. బతికి ఉన్న
వాడు నిరంతరం సమాధ్యవస్థలో ఉండడు. కొన్ని క్షణాలు ఉంటాడు మళ్ళీ లోకంలో
పడతాడు కదా ! విషయకామం భాగవత దాస్యంగా, శృంగారరసం బ్రహ్మరసంగా,
బ్రహ్మానందంగా మారుతుందని, పోనీ మార్చుకోవాలని రామానుజుడు స్పష్టంగానే
చెప్పాడు. ఈ ఆనందసామ్యం లేకపోతే మన్మథ మన్మథ సిద్ధాంతం దేనికి ? కాబట్టి
వరూధిని చెప్పిన రతి సమాధ్యవస్థ పెద్దన అంగీకరిస్తున్నదే కానీ ఖండిస్తున్నది
కాదు. ఇంతకీ ప్రవరుడు అన్నట్టు వరూధిని ఎక్కడా వైదిక కర్మలు పాపం అని
అనలేదు. రతి కర్మ కూడా వైదిక కర్మే అన్నది. ప్రవరుడు శాంతరసానికి ప్రతినిధి.
వరూధిని శృంగార రసానికి ప్రతినిధి. ఈ శాంతశృంగారరస సంఘర్షణలో
అంతిమంగా శాంతరసానికి విజయం లభించింది. ఇది చాలాకాలంగా పండితులు
ప్రచారం చేస్తున్న మరొక సిద్ధాంతం. (ఈ సిద్ధాంతం విషయంలో విద్యార్థిగా

ఉన్నప్పుడే నేను మా నరసింహం మాష్టారుతో క్లాసులోనే తగాదా పడ్డాను. ఒక చిన్న యుద్ధమే జరిగింది. ఆయనకి కోపం వచ్చి ఏవో సమాధానం చెప్పారు. నాకు సంతృప్తికరంగా లేదు. ఆయన కోపానికి కారణం తర్వాత తెలిసింది. ఆయన గురువు పింగళి లక్ష్మీకాంతం రాసిన సౌందరనందం మీద శాంత శృంగార విరోధిరస పోషణిని ఖండిస్తూ పొట్లపల్లి సీతారామారావు వ్యాసం రాశాడు.నా మనస్సులో ఆ విషయం ఉందని ఆయన భ్రమపడ్డారు) రససంఘర్షణ రస సిద్ధాంత వ్యతిరేకం. విరోధి రసాల్ని అంగాంగి రసాలుగా కూడా పోషించకూడదు. శాంత శృంగారాలు విరోధి రసాలు. మళ్ళా భక్తి శృంగారాలు విరోధి రసాలు కావు. ఇంతకీ ప్రవరుడులో శాంతరసం ఎక్కడుంది. శాంత రసానికి వైరాగ్యం మొదలైన వాటితో మనస్సు నిర్వికారంగా శమం స్థాయి భావం. ప్రవరుడికి వైరాగ్యమూ లేదు. నిర్వికార చిత్తమూ లేదు. "అనుకూలవతి నాదుమనస్సులో వర్తించు, కులకాంత మదినెంతకుందునొక్కొ" (ద్వితీయ 17) "ప్రజలన్ ననున్ గూర్పుము" (48) "భక్తికిన్, మేళయతిక్రమించె" (53) ఇదేనా ప్రవరుని వైరాగ్య, నిర్వికారచిత్తం. సమయానికి అగ్నిదేవుడు రక్షించకపోతే అన్నం కోసమైనా ప్రవరుడు వరూధుని కాళ్ళు పట్టుకునేవాడు. ఇక్కడ కర్మకాండ వాదానికీ భోగవాదానికీ ఘర్షణకానీ రససంఘర్షణకాదు. ప్రవరుడు సాధించిన విజయం ఏమీలేదు. కానీ కర్మకాండవల్ల మోక్షం రాదు కానీ స్వర్గం వస్తుందని విశిష్టాద్వైతుల వాదం. ప్రవరుడు స్వర్గానికి వెళ్ళి మళ్ళీ వరూధునితో ఇబ్బందిపడక తప్పదేమో ! ఈ వరూధునీ ప్రవరుల సన్నివేశం మీద పండితులు 'బ్రాహ్మణతేజ' వాదం మరొకటి చేశారు.

"నా యుద్దేశము స్వారోచిషుని మనుపదమునకు అర్హమైన ధర్మ నిష్ఠాగరిమ తల్లిదండ్రులనుండి కాక వారి పైతరము నుండి - స్వరోచి తల్లిదండ్రుల నుండి సంక్రమించినది అని. స్వరోచి జననీ జనకులు వరూధినీ మాయా ప్రవరులు గదా. ఈ జంటలో తల్లియొక్క సౌందర్యము ప్రణయ స్వభావము స్వరోచిలో అచ్చుపడి అతనిని తల్లిపోలిక కొడుకుగా పరిణతి నొందించెను. ఇక మాయా ప్రవరుడు ఇతని పుట్టుకకు నిమిత్తమాత్రమే కాని తాత్త్వికమైన జనకత్వ మాతనికిలేదు. అట్టి జనక స్థానమున నున్నవాడు బ్రాహ్మణ ప్రవరుడు. అన్యమనస్కురాలై, తదేక ధ్యానముతో ఆ బ్రాహ్మణ కుమారుని ఆరాధించిన వరూధిని గర్భధారణవేళ తాల్చిన తేజము ఆ బ్రాహ్మణునిది. అతని పవిత్రతయు, అతని యాధ్యాత్మికతయు స్వరోచికి సంక్ర

మింప వలసి ఉండెను. కాని, ఆ గుణ సంపద అతనిని త్రోసిపుచ్చి, అతని కుమారుడైన స్వారోచిషునకు సంక్రమించెను. లోకంలో కొందరు తండ్రుల గుణములతోను, కొందరు తాతల గుణములతోను జనించుచుండుట స్వాభావికమే. ఈ రహస్యము జీవశాస్త్ర న్యాయమునకు సమ్మతమే" (పింగళి లక్ష్మీకాంతం : తెలుగు సంస్కృతి-931). పింగళి లక్ష్మీకాంతం విశ్వనాథ సత్యనారాయణ అవతారం ఎత్తినట్టుంది. తండ్రి, తాతల, మేనమామల శారీరక లక్షణాలు కొడుక్కో, మనవడికో, మేనల్లుడికో వస్తాయి అనుకుందాం. పరిసరాల్ని బట్టి తాతతండ్రుల విద్యా విజ్ఞానాలుకూడా రావచ్చు అని అంగీకరిద్దాం. కానీ రతి సమయంలో తనతో కేళి చేసేవాడిని కాక మనస్సులో ఎవడిని తలచుకుంటుందో వాడి లక్షణాలు కూడా ఆమె కొడుక్కో మనవడికో వస్తాయనే సత్యాన్ని పింగళి కనిపెట్టారు. అలా అయితే స్త్రీ లందరూ సంవర్గ సమయంలో ఐనస్టన్, న్యూటన్‌లాంటి వాళ్ళనో. తను ఎవరిని గొప్పవాళ్ళు అనుకుంటుందో వాళ్ళని తలుచుకుంటూ దేశం అంతటా గొప్పవాళ్ళని కని సమాజాన్ని బాగుచేయవచ్చునే. ఎందుకీ పిచ్చివాగుడు? ఇలాంటి సమయంలో ఎవరి మనసులో ఏ భావాలు ఉంటాయో ఎవరూ చెప్పలేరు. ఏదో ఒక దశలో సమాధ్యవస్థ ఉంటుందనేది స్పష్టం. భావప్రాప్తి సమయంలో పూర్తిగా ప్రపంచాన్ని మరిచిపోవటం జరుగుతుందనేది కూడా అందరి అనుభవలో ఉండేదే. స్త్రీకి వివశత్వం ఎక్కువనీ సులభంగా తన్మయీభావాన్ని పొందుతుందనీ అందుకని ప్రవాహ సమయంలో మగాడు ఏ ఇన్‌కంటాక్స్‌నో, అప్పులబాధనో తలుచుకుంటే శీఘ్ర స్ఖలనాన్ని నివారించవచ్చునని Sett and Human relations అనే గ్రంథంలో (1985) Aalan Fromme చెప్పాడు. పింగళి చెప్పినట్టు కాకుండా మగాడే మరొక స్త్రీనో మగాణ్నో తలుచుకుంటూ ఉంటే ఏం జరుగుతుంది? ప్రవరుడే నిజంగా సంగమిస్తే పింగళి చెప్పినట్టు ఏమైనా జరగొచ్చు. భావనామాత్రంతో జరిగేది ఏమీ ఉండదు. ఈ బ్రాహ్మణ తేజవాదం ఒక వికృత ఊహ. ఇంతకీ ప్రవరుడు తత్త్వం ఏదో స్వారోచిషునిడికి రాలేదు. ప్రవరుడు మందబుద్ధి. యాత్రా స్పెషల్ భక్తుడు. పూర్వమీమాంసుడు. స్వారోచిషుడు విశిష్టాద్వైతి. భక్తివివశుడు. ప్రవర స్వారోచిషులకు ఎలాంటి పోలికలూ లేవు.

పెద్దన తాత్త్విక దృక్పథం నుంచీ పరిశీలించకుండా వరూధినీ గంధర్వ సన్నివేశాన్ని పండితులు ఇంకా దుర్వ్యాఖ్యానం చేశారు. వరూధిని మోసగించబడిందనీ,

గంధర్వుడు వంచకుడనీ పళ్ళు పటపట కొరికారు. ప్రవరుడి కంటే ఈ గంధర్వుడే
మేలనీ, వరూధుని అంటే అతనికి సచ్చే ప్రేమ ఉందనీ పెద్దన దృష్టిలో అతను చేసిన
తప్పు ఏమీలేదని గ్రహించలేక పోయారు. గంధర్వుడే సిద్ధుడు వేషంలోవచ్చి
వరూధిని పొందుకి తన పథకాన్ని సిద్ధం చేసుకున్నాడని అంగీకరించటానికి అభ్యం
తరం లేదు. కానీ ప్రబంధంలో ఆ సూచన లేదు. ఇంతకీ గంధర్వులు అంటే ఎవరు?
వీళ్ళు ఆకాశ నివాసులు. దేవతలకి సోమరసాన్ని తయారుచేసి పెడతారు. వీళ్ళకి
స్త్రీలంటే విపరీతమైన పక్షపాతం ఉంది. స్త్రీలమీద వీళ్ళకి మార్మికశక్తికూడా ఉంది.
స్త్రీ శిశువులు పుట్టగానే వాళ్ళ మానన్ని గంధర్వులు దోచివేస్తారని, వాళ్ళ మానాప
హరణం చెయ్యకముందే నగ్నికలకి వివాహం చెయ్యటం మంచిదని మనువుచెప్పాడు.
వేదాల తర్వాత పురాణాల కాలంలో కూడా గంధర్వులు సోమరసాన్ని ఉత్పత్తి చేసే
వాళ్ళుగా, ఔషధ నిపుణులుగా, నక్షత్రాల్ని క్రమబద్ధం చేసేవాళ్ళుగా, స్త్రీ ఆరాధకు
లుగా చిత్రింపబడ్డారు. వీళ్ళు గాయకులు, సంగీతవాద్య నిపుణులు. గంధర్వుల పుట్టు
కని గురించి అనేక కథలున్నా అగర్భ కళాకారులనే విషయంలో స్త్రీ పక్షపాతులనే
విషయంలో ఏకాభిప్రాయం ఉంది. నాగరాజుల్తో పోరాడి గంధర్వులు వాళ్ళరాజ్యాల్ని
సంపదని కొల్లగొట్టారని ఒక పురాణగాథ. అప్సరసలు గంధర్వుల భార్యలుగా,
ప్రేయసులుగా ఉండేవారు. చారిత్రికంగా పరిశీలిస్తే గిరిజనులు గంధర్వ ఊహకీ, నాగ
స్త్రీలు అప్సరసల ఊహకీ మూలం అని నిర్ధారణ చెయ్యవచ్చు. కళాకారులూ, స్త్రీ
సౌందర్య పిపాసులూ కాబట్టి రామానుజాచార్యులకు గంధర్వులంటే ఇష్టం. విశిష్టా
ద్వైతాన్ని చెప్పటానికి గంధర్వులు బాగా ఉపయోగపడతారు. వరూధిని గంధర్వాం
గనే. మాయతో గంధర్వుడు వరూధినిని పొంది ఆమె కామభారాన్ని తీర్చటం విశిష్టా
ద్వైత దృష్టిలో తప్ప ఏమీలేదు. అద్వైతుల మాయ, భ్రమాసిద్ధాంతాన్ని ఈ సన్ని
వేశంలో పెద్దన ఖండించాడు. విశిష్టాద్వైతులు మాయ, భ్రమలు illusions,
Hallucinations వాస్తవికతలో భాగంగానే భావిస్తారు. అయితే సాధారణంగా
అప్సరసలకి కవులు పిల్లల్ని పుట్టించరు. కానీ ఇక్కడ స్వారోచిష మనువు అవత
రించాలి కాబట్టి వరూధునిచేత కొడుకుని పుట్టించారు. ఈ గంధర్వ తేజం మనవడికి
సంక్రమించింది కానీ ప్రవరతేజం కాదు. కళ్ళు మూసుకునే షరతుల్లాంటివి విశిష్టా
ద్వైత భ్రమా సిద్ధాంతాన్ని చెప్పటానికే కానీ గంధర్వ స్త్రీ పురుషులకు అలాంటి
వికారాల్తో పనిలేదు.

మనుచరిత్రలో ప్రధాన పాత్ర స్వరోచి. ఈ స్వరోచి జీవితాన్నికూడా పెద్దన విశిష్టాద్వైత మత దృక్పథంనుంచే సృష్టించాడు. స్వరోచి విషయంలోకూడా పండిత విమర్శకులు తప్పుడు సిద్ధాంతాలే చేశారు. స్వరోచినుంచీ క్షాత్రతేజం స్వారోచిషుడికి సంక్రమించిందనీ, స్వరోచి శృంగారాన్ని విశృంఖలంగా అనుభవించి చివరకు భోగ విముఖుడయ్యాడనీ, ఆ విముఖత్వంకూడా చక్రవాకి, హంసిల భోగనిందవల్ల వచ్చిందనీ పండితుల అభిప్రాయం. స్వరోచి వీరుడే కావచ్చు. అందువల్లనే ఆయన కొడుకు వీరుడయ్యాడని చెప్పటానికి సాధ్యం కాదు. వీరులకి హంవీరులూ హంవీరులకు వీరులూ పుట్టటం లోకంలో జరుగుతున్నదే. అలాగే స్వరోచికి జీవితంలో భోగంపట్ల చివరివరకూ కూడా విముఖత్వం కలగలేదు. అసలు భోగ విముఖత్వాన్ని బోధించటం పెద్దన ఉద్దేశం కాదు. "హంస హంసినిజూచి చిరకాలము నీతో విహరించితిని. నాకు విషమేచ్చ మరలినది. ముదిసితిని. ఇఁక నైహిక సుఖములను విడుచుచున్నాను" అనెను. హంసి పతిని జూచి "భోగము లెప్పుడు వలయును. భోగాత్మక మిజ్జగంబు - భూదేవవరుల్, భోగార్థముగా దపములు, యాగంబులు సేయుచునికి నాత్మ నెఱుఁగవే" అన్నది. "అనిన రాయంచ యిట్లను విను భోగైక సక్తులు సంతత సంగపరులు నగు వారి మతి పరమార్థ దర్శిని యెన్నఁదగుఁ జెప్పుమా? వారలర్థ బంధు, పుత్ర, మిత్ర, కళత్రములయందు సక్తులై విపుల భవాంబుధి వెడల లేక, బహుళపంక పతిత వనగజములవోలెఁ గదలనేరక వొలియుదురుగాక, సంగ కలిత చిత్తు వంగనా రాగాంధు, నీ స్వరోచిఁ జూచితే శుభాంగి, పుత్రపౌత్ర వృద్ధిఁ బొంది నేఁడును విష, యోపభోగ నిరతినున్నవాడు. కామినీ పరతంత్రుడైన యీ స్వరోచి నాకు సదృశుండు గాఁడు. నేను వివేకంబునంజేసి భోగంబులు పరిహరించితి" నని "హంస తన్ను నిందింప విని యా స్వరోచి యుద్వేగము నొంది భార్యలతో నడవికా క్షణమే యేఁగి ఘోరముగాఁ దప మొనర్చి నిష్కల్మషుండై యమర లోకంబున కరిగె" అని మూలంలో ఉంది. దీనిని పెద్దన విశిష్టాద్వైత దృష్టినుంచీ పూర్తిగా మార్చివేశాడు. పండితులన్నట్టు స్వరోచికి ఆలంబిన స్థితి పోతుందని పెద్దన ఈ మార్పు చెయ్యలేదు. స్వారోచిషుడు పుట్టిన తర్వాత ఆలంబినస్థితి ఎలాగూ పోతుంది గదా! అసలు సంప్రదాయిక రసవాదాన్ని పెద్దన అంగీకరించలేమ. ఈ హంసనింద మనుచరిత్రలో మరీ అద్వైత భయంకరంగా లేకపోయినా స్థూలంగా ఉంది. ఈ నిందవల్ల మనుచరిత్రలో స్వరోచి భోగంపట్ల వివేకాన్ని పొందాడుకానీ ఇనపగోచి

కట్టుకొని అడవులకు పోలేదు. ఇంకా తన భార్యల్తో 2 లక్షల పదహారు సంవత్స రాలు భోగాన్ని అనుభవింపాడు. పశుపక్ష్యాదుల లైంగిక వాంఛ జాతిని కొనసాగించ టానికే రుతు పరిమితంగా ఉంటుంది. సహజాత అనుభవం మాత్రమే. కానీ స్త్రీ పురుషులమధ్య ఒక ఉద్వేగభరిత మానవీయ ఉదాత్త అనుభవంగా ఉంటుంది. ఆలోచన, జ్ఞానం, సాంఘికత ఉంటాయి. మానవ కామానుభవాన్ని, చివరికి మాన భంగం కూడా పశుకామంతో పోల్చకూడదు. పశువుల్లో మానభంగం ఉండదు. సెక్స్ భావాలూ భావనలూ పశువులకు ఉండవు. స్త్రీ పురుషుల మధ్య నిర్బంధ, స్వచ్ఛంద శృంగార సంబంధాలు మాత్రమే ఉంటాయి. నిర్బంధ సంబంధాలు నిరసించ దగినవి. స్త్రీ పురుషుల కామాన్ని Sublimate చేసుకుంటారు. దాన్నే ప్రణయం అనీ, శృంగారం అనీ అంటాం. కాబట్టి మానవీ మానవులమధ్య ఎలాంటి కామ సంబంధాల్నీ పశుశృంగారం, తుచ్ఛకామం అనకూడదు. పెద్దన పశువుల కామ సంబంధాలకీ మానవుల శృంగార భోగానికీ తేడా చెప్పాడు. సంతానం కోసమే వివాహం అనే మనుధర్మాన్ని విశిష్టాద్వైతం అంగీకరించదు. రతిని జీవితం అంతా అనుభవించవలసిన ఆనందరూపంగానే భావిస్తుంది. బహుభార్యత్వం అయినాసరే కుటుంబ పరిమితుల్లో సవివేకభోగంగా అంగీకరిస్తుంది. అవివేక భోగాన్నికూడా నిష్ఠభక్తి ఉంటే నిరసించదు. హంసనింద తర్వాత చాలాకాలం భోగం అనుభవించి స్వరోచి తన పుత్రులకు రాజ్యం ఇచ్చేస్తాడు. అప్పటికీ అతని భోగం ఇంకి పోలేదు. వేటకు పోతాడు. ఆ వేటలో ఒక పందిని బాణంతో కొట్టబోగా ఒక ఆడలేడి అడ్డం వచ్చి ఏ అపకారం చెయ్యని ఆ పందిని చంపటందేనికి? నిర్దయగా నన్ను చంప మంటుంది. స్వరోచి రక్తమాంసల పుష్టమైన శరీరంమీద నీకు రోత ఎందుకు కలిగింది అని అడుగుతాడు. ఇతర స్త్రీలమీద ప్రేమకలవాడిని మోహంతో కోరుకోవ టం కంటే చావటం మేలుకదా అంటుంది. నువ్వు ఎవర్ని ప్రేమించావు చెప్ప మంటే లేడి నిన్నే ప్రేమించాను నా కామోద్రేకాన్ని సంతృప్తిపరచ మంటుంది. జంతువే అని స్వరోచి వదిలిపెట్టడు. "హరిణాంగన నీవు నరుండ నే ముదం బొదవంగ నీకు నాకు మధురోచిత కృత్యములెట్లు చేకుఱున్" (షష్ఠ 94) నువ్వు ఆడు లేడివి. నేను మనిషిని. మన ఇద్దరికి రతి ఎలా సాధ్యం? అన్నాడు. "కృపార్ద్రుఁడు, గావుననా నృపతి హరిణిఁ గౌఁగిటఁ జేర్చెన్." (95) దయామయుడు కాబట్టి ఆ రాజు ఆ లేడిని ఆలింగనం చేసుకున్నాడు. ఈ దయనే వరూధిని ప్రవరుడ్ని కోరితే అతడు

నిరాకరించాడు. పెద్దన ప్రవరుడులో ఉన్నాడా, స్వరోచిలో ఉన్నాడా? సరే. అలా ఆలింగనం చేసుకోగానే హరిణి అతిలోక సుందరిగా మారిపోయింది. నేను వన దేవతని. నీ ద్వారా మనువుని కనమని దేవతలు పంపించారు. కాబట్టి నాకు కొడు కుని కనమని చెప్పింది.

"అట్లు గాకని యయ్యంబుజాయతాక్షి
నేక చిత్తంబుతోడనంగీకరించె
బాలయట్లు సుఖాంబుధిఁ దేలుచుండి
యంతగర్భిణియై శుభంబగు దినమున" (షష్ఠ, 98)

"ఈ పద్యమును జాగ్రత్తగాఁ బరిశీలించినచో స్వరోచిలో, గామభావమేమియు లేనట్లు స్ఫురించును. అతనిలోఁ గామవాంఛ లేదని స్పష్టము చేయుటకే 'బాల సుఖాంబుధి'ని తేలినదని పలికెనే కాని యుభయులును సుఖాంబుధిందేలినట్లు తెలుప లేదు". (తిమ్మావజ్ఝల కోదండరామయ్య 1966) ఈ సందర్భాన్ని ఇలా వ్యాఖ్యానించటం కంటే అజ్ఞానం ఏమైనా ఉంటుందా? అసలు ఈ పద్యం అర్థం చేసుకున్నవాడు ఇలాంటి అబద్ధాలు రాయగలడా? హరిణి నామాన్ని కూడా తృప్తి పరచటానికి సిద్ధమైన స్వరోచి ఔచిత్యం ఈ ప్రతిపదార్థ శుష్క పండితులకి అర్థం కావటం కష్టమే. 'ఏకచిత్తం'తో అంటే ఏమిటి? మరొక విషయాన్ని గురించి ఆలోచించకుండా రతిమీద దృష్టి కేంద్రీకరించటంకాదా? వనదేవత రతికేళితో సుఖ సముద్రంలో మునిగిపోయింది అంటే స్వరోచి రతిసుఖాన్ని అనుభవించకుండా ఆమె అంతసుఖం ఎలా పొందుతుంది. దీనికేమన్నా కామసూత్ర సర్కస్ ఫీట్ ఉందా? ఎందుకీ అవివేకపు రాతలు? పైగా ఇది పెద్దన రచనా శిల్పరహస్యంఅట. మీ చేతుల్లో పెద్దనకి ఏమిగతి పట్టిందండీ? స్వరోచికి భోగం పట్ల తుది వరకు విముఖత్వం కలుగలేదు. తాత్కాలిక విముఖత్వంఎవరికైనా ఏ విషయంలో అయినా వస్తుంది. వివాహం లేకుండా నాకు బిడ్డను కనమనిఅడగటం అధునికులు కూడా చెయ్యలేని పని. ఈ విధంగా పెద్దన మనుచరిత్రలో సవివేక భోగాన్ని శ్రీవైష్ణవ తత్త్వం వెలుగు నుంచీ ప్రతిపాదించాడు.

ప్రబంధ ప్రక్రియ చలనంలో నాలుగు యుగాల్ని గుర్తించవచ్చును. మొదటిది ప్రక్రియ రూపొందిన క్రమం. రెండోది విజయనగర కాలంలోని ప్రబంధాలు.

క్షేత్ర మహాత్మ్య ప్రబంధాలు మూడోయుగం. దక్షిణాంధ్ర యుగంలోని విలాస ప్రబంధాలు నాలుగో యుగం. మనుచరిత్ర, పారిజాతాపహరణం, ఆముక్తమాల్యద, పాండురంగ మహాత్మ్యం, కళాపూర్ణోదయం, వసుచరిత్ర ప్రబంధాల్లో పెద్ద తేడా ఏమీ లేదు. అన్నీ విష్ణు భక్తి శృంగారాలను సంలీనం చేసినవే. ధర్మభూత జ్ఞానాన్ని బోధించినవే. సవివేక భోగాన్ని ఉపదేశించినవే. అవివేక భోగం అంటూ ఏదైనా ఉంటుందని అంగీకరించదలుచుకుంటే భక్తి స్పర్శతో అదికూడా సవివేక భోగం అవుతుందని చెప్పినవే. బ్రాహ్మణుల సాంస్కృతిక జీవన ప్రమాణాల్లో మార్పుని చిత్రించినవే. గుణనిధి వారసుల సంఖ్య బాగా పెరిగిందే కానీ ఏమీ తగ్గలేదు. ప్రౌఢమైన శైలిలో సామాన్య ప్రజల చూపులు కనిపిస్తూనే ఉన్నాయి. మాటలు వినబడుతూనే ఉన్నాయి. అన్నిటిలోనూ భోగకాంతలున్నారు. కళాపూర్ణోదయంలో నాయిక భోగకాంత. కాపు, మాలస్త్రీలు ప్రవేశించారు. విశిష్టాద్వైత మతదర్శనాన్ని ఈ ప్రబంధాలన్నీ బహుముఖంగా చిత్రించాయి. రాజులకీ సంపన్నవర్గాలకీ ప్రబంధ పాత్రలకీ ప్రత్యక్ష పరోక్ష సంబంధాల్ని వర్ణించాయి. ప్రబంధ ప్రక్రియలో ఈ యుగప్రభావం తర్వాత యుగంమీద స్పష్టంగానే ఉంది. తాత్త్వికంగా అసలు భేదమే లేదు. రాయల యుగ ప్రబంధంలో శృంగారం భక్తిలో లీనమయితే తర్వాతి యుగంలో భక్తి శృంగారంలో లీనమైపోయింది. శృంగారం కుటుంబ పరిమితుల్ని దాటిపోవటమేకాక కుటుంబం పట్ల నిరసన వ్యక్తమైంది. వివాహేతర, వేశ్యా శృంగారం ప్రబలమైంది. స్త్రీ పురుష సంబంధాల్ని గురించి బహిరంగ చర్చ జరిగింది. ఇది విలాస ప్రబంధయుగం. రంజన ప్రబంధయుగం. సాంత్వన ప్రబంధ యుగం. పురుష దృక్కోణం నుంచే కావచ్చు. స్త్రీలు శృంగారాన్ని గురించి తమ అభిప్రాయాల్నీ, అనుభవాల్నీ మొహమాటం లేకుండా చెప్పిన యుగం. ఈ విలాస ప్రబంధాల్లో ప్రసిద్ధమైంది చేమకూర వెంకట కవి విజయవిలాసం.

విజయ విలాసంలో తాపీ ధర్మారావు ఎన్నో లోతులు చూపించారు. కానీ ఈ ప్రబంధంలోని సాంఘిక, తాత్త్విక దృక్పథం ఏమిటి ? అనే చర్చ చేయలేదు. విలాసం అంటే శృంగార సంబంధమైన క్రియ లేదా చలనం. కామోద్వేగ స్థితిలో శరీరంలో వచ్చే అనేక విధాలైన మార్పులు. స్త్రీ పురుషులిద్దరికీ ఇలాంటి మార్పులు వస్తాయి. ప్రియ సందర్శనం వల్ల స్త్రీలో వచ్చే శృంగారక్రియా విశేషాల్నే విలాసం అని అలంకార శాస్త్రాల్లో నిర్వచించారు. కానీ కామశాస్త్రాల్లో కామ పరిమళంతో

పురుషుల మనసుల్లో శరీరాల్లో వచ్చే మార్పులా, చేసే సుందర క్రియలా విలాసం వివరించబడి ఉంది. విలాసపు బంధాల్లో స్త్రీ విలాసాన్నే వర్ణించినప్పటికీ పురుష విలాసాల్నికూడా వర్ణించకపోలేదు. శరీరంలో ఒకటి రెండు భాగాల్ని కాకుండా మొత్తం శరీరాన్ని ఒక Sex zone గా వర్ణించటం. ఇందులో మనస్సు ప్రధాన మైందే. విజయవిలాసంలో అర్జునుడు ఉలూపి, చిత్రాంగద, సుభద్రలతో విలాసం చెయ్యటం వస్తువు. అర్జునుడికి అనేక నామాంతరాలుండగా విజయుడని ప్రయోగించటం కేవలం ప్రాసకోసమేనా విశేషార్థం ఏమయినా ఉందా? విలాసం ద్వారా విజయాన్ని సాధించటం అనే అర్థం కూడా చెప్పుకోవచ్చు. సుభద్ర విషయంలో అర్జునుడికి పూర్వానురాగం ఉంది. సుభద్రార్జునుల సమాగమానికి దోహదం చెయ్యటానికి గదుడు అర్జునునితో సుభద్ర సౌందర్యం గురించి చెప్తాడు. "హావ భావ ధీ వయః కనన్మనోజ్ఞరేఖ లెన్నఁగా దరంబె గ్రక్కునన్ (ఆ-1, 97) ఆమె హావ భావాల్నీ యౌవన దీప్తినీ, మనోహరమైన సౌందర్య రేఖల్నీ నలుగు మాటల్లో చెప్పలేమన్నాడు. వీటితోపాటు 'ధీ' బుద్ధికూడా గొప్పదన్నాడు. కళ్ళనీ, ముక్కునీ, పెదవుల్నీ, దంతసంక్తినీ, కంఠాన్ని, కుచాల్ని, బాహుమూలాల్ని, బొడ్డునీ, నుగారునీ నితంబాలనీ, జఘనాలనీ, చివరకి కాలిగోళ్ళనీ అద్భుతంగా వర్ణించాడు. "జగమెఱుంగు దాని జగమెఱుంగు" (ఆ-1, 101) ఆమె ప్రశస్తమైన సౌందర్యాన్ని గురించీ లోకుల కందరికీ తెలుసు అని వివరంగా చెప్పాడు. చేమకూర వర్ణనని నా భాషలో చెప్పి పేలవటం చేయటం అనవసరం. ఇక్కడ చర్చించవలసిన విషయం ఏమంటే ఇలా కన్యాంగ సౌందర్యం పోనీ స్త్రీ సౌందర్య వర్ణనం చెయ్యవచ్చునా? చెయ్యకూడదనీ, అలా చెయ్యటం అసభ్యమనీ, స్త్రీని భోగ్య వస్తువుగా చూడటమే అనీ దాదాపు విమర్శకులందరూ ముక్తకంఠంతో చెప్పారు. కానీ దీన్ని గురించి అందరూ పునరాలోచించవలసిన అవసరం ఉంది. స్త్రీ పురుషులమధ్య Hypnotic Phenomena ఉంటుంది. అంటే పరస్పర వశీకరణ వ్యగంశం. యువతీ యువకుల మధ్య మరీ తీవ్రంగా ఉంటుంది. అందుకే కవులు కన్యాంగ సౌందర్యాన్ని వర్ణించారు. అందానికి జీవితంలో పాత్రని నిరాకరించలేం. భోగ్యవస్తువుగా చూడటానికీ శరీర సౌందర్య వర్ణనకీ సంబంధం ఏమీ లేదు. స్త్రీ సౌందర్యాన్ని ఆరాధించే ప్రతివాడూ ఆమెని భోగ్యపదార్థంగా చూసేవాడే అనుకోవటం నిజంకాదు. పోనీ ప్రబంధాల్లో స్త్రీ శరీర సౌందర్య వర్ణనని వ్యతిరేకిస్తున్న విమర్శకులందరూ స్త్రీని భోగ్య

వస్తువుగా చూడటం లేదా? స్త్రీ శారీరక సౌందర్యాన్ని పూజించటానికి స్త్రీ వ్యక్తిత్వాన్ని గౌరవించటానికి ఏమీ వైరుధ్యం లేదు. అందులోను ప్రబంధ కవులు వివాహిత స్త్రీ సౌందర్యాన్ని వర్ణించలేదు. పురుష సౌందర్యాన్నికూడా వర్ణించారు. ప్రబంధకవులు స్త్రీ మనసుని వర్ణించలేదనటం సత్యం కాదు. దాంపత్యానికి సౌందర్యమే నిర్ణయాత్మకమైన అంశం కానప్పటికీ దాన్ని నిరసించవలసిన అవసరం లేదు. "స్త్రీనామపి మధురం" అన్నవాడిని అసహ్యించుకోవాలా? సరే. ఏకాభిప్రాయం లేని ఈ అంశాన్ని చర్చకి వదిలేసి అసలు విషయానికి వద్దాం. గంగానదీ తీరంలో అర్జునుడ్ని ఉలూపి చూస్తుంది. చూడగానే ఆమెలో వచ్చిన అనుభూతి చలనం -

"గుట్టసియాడ, గబ్బి చనుగుట్టలపైఁ బులకాంకురావళుల్
తెట్టువగట్టఁ గోరికలు దీటలు వెట్టఁగ, వేడుకల్ మదిన్
దొట్టికొనంగ, నచ్చెరువు తొంగలి ఱెప్పల వీఁగ నొత్తఁగాఁ
బెట్టిన దండ దీయక విభీత మృగేక్షణ సూచెనాతనిన్" (ఆ- 1, 126)

ఇది ఒక విలాసం. ఈ పద్యంలో మొదటి పదానికి జూలూరువారు, వేదం వారు చెప్పిన అర్థాన్ని తాపీ ధర్మారావు ఆక్షేపించటంలో అర్థం లేదు. తాపీ చెప్పిన అర్థం ఉలూపి స్వభావానికి విరుద్ధం. తన ప్రేమ రహస్యాన్ని దాచుకున్నదని చెప్పటానికి ఏ ఆధారమూ లేదు. గుట్టు అంటే రహస్యం అయితే ఈ పద్యంలోనే ముందు వెనక లాడవలసిన అవసరంలేదు. పాతాళంలోకి పోయేదాకా తన రహస్యం చెప్పవలసిన అవసరం లేదు. మొదటి అర్థం అనుభవ విరుద్ధం కాదు. అర్జునుని విలాసం గురించి మనస్సులో మెచ్చుకొని ఉలూపి జపంలో ఉన్న అర్జునుడ్ని తన లోకానికి తీసుకుపోయి నీతో సంగమించడం కోసమే ఇక్కడికి తీసుకొచ్చానని తన కోరికని స్పష్టంగా చెప్పింది.

"శయ్యకుఁ దార్పఁగాఁ దుఱుము జాఱె, నదంతటఁ జక్కదిద్దఁబోఁ
బయ్యెద జాఱె, నయ్యదిరిపాటున గ్రక్కున నీవి జాఱె, రా
జయ్యెడ నవ్విలాసిని యొయారముఁ జూచి కపుంగలించె, నా
నెయ్యెడ మేలె చూతురు, గణింపరు జాణలుజాఱు పాటులన్" (ఆ-1, 172)

ఇది పరోక్ష ఉద్విగ్న విలాసం. ఇలాగే ఇంతకంటే లోతుగా చేమకూర అర్జున చిత్రాంగద, సుభద్రల పరంగా విలాస వర్ణన చేశాడు. పూర్వ ప్రబంధాల్లో విలాసం వర్ణించబడినప్పటికీ కథలోనూ, తాత్త్విక దృక్పథంలోనూ లీనమై సందర్భ సుందరంగా ఉంది. విజయవిలాసంలో విలాసమే వస్తువు. తాత్త్విక గాంభీర్యం లేక పోవటంవల్ల కేవలం విలాస వర్ణనమే మిగిలింది. చమత్కారం, భారమైన భాషా పాటవంద్వారా ఒక తరగతి పాఠకుల్ని సంతృప్తిపరచగలదు కానీ విలాసాన్ని తాత్త్వికత, సాంఘిక చర్చా స్థాయికి పరిపక్వం చెయ్యలేకపోయాడు. రఘునాథుడు లాంటి రాజపండిత బృందానికి మాత్రమే విజయవిలాసం ప్రాతినిధ్యం వహిస్తుంది.

"అతి వినోదముగాఁ గరతుల మెప్పించు నీ
పచ్చ కడియాల పద్మగంధి:
చక్కెర మోవిచ్చి చవులఁ దేలించు నీ
ముత్యాలకమ్మల మోహనాంగి
తృణముగాలోఁ జేయునెంతటి వాని నీ
నీలాల ముంగఱ నీలవేణి:
అనుచుఁ దమలోననెరజాణ తనము మీఱ
వారకాంతా మణుల మేలువార్త లెల్ల
దెలుపుచును, వెన్నెల బయళ్ళఁ గలసినగుచు,
విటులు విహరింతురప్పురి వీథులందు". (అ-1, 81)

వెన్నెల రాత్రుల్లో విటులు వేశ్యల వీథుల్లోనూ, బయళ్ళలోనూ విహారం చేస్తూ వేశ్యల్ని గురించి మాట్లాడుకుంటున్నారు. ఇలాంటి వర్ణనలు తర్వాత ప్రబంధాల్లో అనుభవ పూర్వకంగా చేయబడ్డాయి. రఘునాథుడు తర్వాత ఆ మాత్రం స్థాయి ఉన్న రాజులు దక్షిణాంధ్రంలో లేరు. సాహిత్యం మధ్య తరగతి స్థాయికి వచ్చింది. రఘునాథ నాయకుడుతో సహా తంజావూరు, మధుర చెంజి, పుదుక్కోటల్ని పరిపాలించిన వాళ్ళు అమరనాయకులు. విజయనగర రాజులకి తాంబూలాలు అందించిన వాళ్ళు. విజయనగర పతనానంతరం స్వతంత్ర రాజులయ్యారు. తెలుగు సైనికులు, కవిపండిత గాయకులు, ఎడంకులంవాళ్ళు, పురోహితులు, వైశ్యులు, కరణాలు, రెడ్లు, కాపులు, వేశ్యలు వేలాది మంది తంజావూరు మధుర ప్రాంతాలకి వలస వెళ్ళారు.

గ్రామీణ ప్రాంతాలు ఎలా ఉన్నా పట్టణాల్లో మధ్యతరగతి వాళ్ళు కూడా ఆర్థికంగా
బాగానే ఉన్నారు. రాజులు, మంత్రులు, సేనానాయకులు, పురోహితులు, వైష్ణవ
ఆచార్యులూ, వేశ్యలూ రక్తి భక్తి గల ఒక భోగవర్గంగా తయారయ్యారు. రక్తిలో
భక్తి కూరుకుపోయింది. ఈ భోగవర్గ జీవితమే ఆనాటి విలాసం రంజన ప్రబంధాల
మీద బలంగా ప్రభావం చేసింది. కవులు కూడా ఈ వర్గాలకు సంబంధించిన వాళ్ళే
కావటంతో జంకూ గొంకూ లేకుండా శృంగారాన్ని వర్ణించారు. అహల్యా సంక్రం
దనం, శశాంక విజయం, రాధికా సాంత్వనం, కవికర్ణరసాయనం, యువజన హృద
యానందం, రసికజన మనోరంజకం లాంటి అసంఖ్యాక విలాస ప్రబంధాల్లో ఈ
యుగంలో అసాధారణ శృంగారాన్ని వర్ణించారు. పూర్వ ప్రబంధాల్లో కుటుంబ
పరిమితుల్లో బహుభార్యాత్వ శృంగారానుభవాన్ని ఆమోదించి కీర్తించారు. వేశ్యా
సాంగత్యాన్ని నిరసించారు. కుటుంబం విచ్ఛిన్నం కానంతవరకు వేశ్యా సంగమాన్ని
కూడా పట్టించుకోలేదు. సుశీల వంటి పతివ్రతల్ని గౌరవించారు. వావి వరుసలకి
కట్టుబడి ఉన్నారు. పరకీయ సంబంధాల్ని కానీ ఉపనాథ సంబంధాల్ని కానీ అంగీక
రించలేదు. రాజులు ప్రతిష్ఠా చిహ్నంగానే వేలాది మంది స్త్రీలను అంతఃపురాల్లో
ఉంచుకున్నా వాళ్ళని దక్షిణ నాయకులుగా వర్ణించినా విచ్చలవిడి భోగాన్ని బహి
ర్గతం చేయలేదు. రాజుల శృంగారమే తిమ్మనలాంటి వాళ్ళు తమ ప్రబంధాల్లో
వర్ణించినా మత తాత్త్విక భావాల్తో ఉదాత్తం చేశారు. ఈ పరిస్థితి దక్షిణాంధ్ర
ప్రబంధాల్లో పూర్తిగా మారిపోయింది. అయితే ప్రబంధ ప్రక్రియలో వచ్చిన ఈ
మార్పు పరిమాణాత్మక మార్పే కానీ గుణాత్మక మార్పుకాదు. ప్రబంధ యుగం
లోనే విలాస ప్రబంధ మూలాలు ఉన్నాయి. పాలక వర్గాల సాంస్కృతిక స్థాయిలో
వచ్చిన మార్పే ప్రబంధ ప్రక్రియలో వచ్చింది. ప్రబంధాల్లోని ఈ రెండు యుగాలకి
విశిష్టాద్వైతమే తాత్త్విక పునాది.

విజయరాఘవ నాయకుడు వీరవైష్ణవుడు. శ్రీనివాస తాతాచార్యుల శిష్యుడు.
గురువుమాట జవదాటే వాడుకాడు. "పరమతంబులనెల్ల నిరసించి యేయేటి వైష్ణవ
మతము శాశ్వతము జేసె" అని రంగాజమ్మ ప్రస్తుతించింది. విజయరాఘవుడు
శ్రీకృష్ణుని అవతారంగా భావించేవారు. విజయరాఘవుని మీద అనేక మంది శత్రు
వులు దాడి చేశారు. తంజావూరుని కొల్లగొట్టారు. విజయరాఘవుడు శత్రువుల్ని
ప్రతిఘటించ లేకపోయాడు. మధుర సేనలు ఫిరంగులు పెట్టి కోట తలుపులు బద్దలు

కొట్టి లోపలికి వస్తుంటే "ఈ తరుణమందు అచ్యుత విజయరాఘవ నాయనివారు నామతీర్థం కొలువులో వుండి తదేక ధ్యానంతో జపం చేస్తూనే ఉన్నారు. అప్పుడు వారి ఇలాకా మనుష్యులు, ఓ మహారాజా! పగతులు మనకోట హల్లాచేసి లోజొచ్చినారు అని విన్నవించారు. అతడు మహానారాయణ భక్తిగలవాడు కనుక ఆ పూజ విడిచి లేవక రానీ చూచుకుందామని సన్న చేసినారు". (ఆరుద్ర-7, 187) శత్రువులు దాడి చేస్తుంటే రాజ్యాన్ని కూడా పట్టించుకోని ఇంతటి భక్తుడి భోగ జీవితం ఎలా ఉంది? ఇతనికి 700 మంది భార్యలు 3500 మంది ఉంపుడుకత్తెలు ఉండేవారట.

"నములుతున్న తాంబూలాన్ని ఒక పడుచుపిల్ల నోటికి ఇచ్చేవాడు. ఒక శృంగారవతి కేలు జడను లాగేవాడు. పాదాల దగ్గర కూర్చున్న ఒక పిల్లదాని పోక ముడిని బొటనవ్రేలితో సవరించేవాడు. ఇంకో పడుచు రొమ్ముపై గోటితో గిల్లేవాడు. మరో వెలయాలి పెదవిపై ముద్దు పెట్టుకునేవాడు. ఒక వన్నెలాడి వక్షోజాలపై కస్తూరి పులిమేవాడు. మరో పిల్లని గట్టిగా కౌగలించేవాడు. ఇంకో విలాసవతిని తొడపై కూర్చోపెట్టుకునేవాడు" (ఆరుద్ర 7. విప్రనారాయణ చరిత్ర-15) ఇలాంటి భోగ జీవితంతో విజయరాఘవుడు రాజకీయంగా అసమర్థుడైపోవటంలో ఆశ్చర్యం లేదు. విశిష్టాద్వైత తత్త్వంలోనే భక్తినీ అంతకంటే ఎక్కువ రక్తినీ పెంచే శక్తి ఉంది కానీ ప్రతాపాన్నీ, పరాక్రమాన్నీ, రాజకీయ సామర్థ్యాన్నీ పెంచే శక్తి లేదు కదా కృశింపచేస్తే బలహీనత ఉంది. ఏ భోగవాద లక్షణమైనా ఇదే.

"వేశ్యాయాదర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం
శయనే సర్వతీర్థాని సురతం మోక్ష సాధనం"
(పురుషోత్తమ దీక్షితుడు. తంజాపురాన్నదాన మహానాటకం. 214)

ఆనాటి రాజులనుంచీ దిగువ మధ్యతరగతి బ్రాహ్మణుల వరకూ అందరికీ వేశ్యల విషయంలో ఉన్న దృక్పథం ఇదే. ఆనాటి వేశ్యలు కూడా తాము తప్పు చేస్తున్నాం అని కానీ, సమాజంలో ఇతర స్త్రీల కంటే తాము తక్కువ స్థానంలో ఉన్నామని కానీ అనుకోలేదు. పైగా కుటుంబ స్త్రీల గొప్ప ఏమిటని ఆత్మ విశ్వాసంతో ప్రశ్నించారు. పైగా పురుషులు కూడా వేశ్యా సాంగత్యానికి వెర్రిగా తమక ంచూపారు. వేశ్యలు రాజాస్థానాల్లో గౌరవం పొందారు. నాట్య సంగీత కళల్లో నైపుణ్యం

సంపాదించారు. ప్రబంధాలూ నాటకాలూ రాశారు. పురాణాల్లో సంతానభోగం, ప్రబంధాల్లో సవివేకభోగం, విలాస ప్రబంధాల్లో స్వేచ్ఛాభోగం వర్ణించటం జరిగింది. పురాణాల్లో మహాపురుషుల్ని కనే శక్తి స్త్రీలకు లేదని కొంతమంది పురుషులవంటి వాళ్ళను అయోనిజులుగా చెప్పారు. కుటుంబంలో స్త్రీకి పాతివ్రత్యం పురాణకాలంలో బోధిస్తే, ప్రబంధ కాలంలో విలాస ప్రదర్శనని బోధిస్తే విలాస ప్రబంధాల్లో, ఉపనాథునితో క్రీడను బోధించారు. వైశ్యావృత్తి మహాపాపం అని తొలి దశలో, గృహపతి పతన హేతువని మధ్య దశలో, మోక్ష హేతువనీ, సుభగానందదాయిని అని ఉత్తర మధ్యయుగంలో భావించారు.

"ఎందును సంచరింపక ఖిలేంద్రియముల్ సుఖమొందదెందమున్
బొందుగదన్న దామరువబుద్ధిక గోచరమైన యిట్టి యా
నందము బ్రహ్మమందురది నవ్యవయోనన మోహనాంగి యా
చందన గంధికిన్ దొరకు జక్కని మక్కువకాడు జిక్కినన్
(సముఖం వెంకట కృష్ణప్ప. అహల్యాసంక్రందనం 3 - 27)

రతి సమాధిలో యోగి పొందే అనుభూతి వంటిదని వైదిక వాక్యాన్ని వరూధిని వ్యాఖ్యానిస్తే ఈ కవి రత్యానందం బ్రహ్మమే అని నిర్ధారణ చేసేశాడు.

"లోకములోన కొందరబులున్ సతులందనియింపలేక య
స్తోకమనిషనవ్య పురుషుల్ దమ కాంతల నంటకుండ దా
టాకులలోన వ్రాసిరింబరాంగన నంటుట బాపమంచు న
య్యాకుల పాటు జూచి యిపుడాకుల పాటెన యంగ నేటికిన్
(శశాంక విజయం 3 -82)

తార చంద్రుడుతో అన్న మాటలు. పరాంగన అంటే వివాహితలని అర్థం. పరస్త్రీని కన్నెత్తి చూడటం పాపం అనే సకలామోదకరమైన నీతిని తార సవాల్ చేసింది. సరే తర్వాత చంద్రుడుతో లేచిపోవటం, గర్భం రావటం, తనకు చంద్రుని వల్లనే గర్భం వచ్చిందని చెప్పటం ప్రసవం తర్వాత ఆ బిడ్డను చంద్రుడికి ఇప్పించి దేవతలు తారని మళ్ళీ బృహస్పతికి చేర్చటం జరుగుతుందనుకోండి.

"వినవేమొ వావివరుసలు
తనువుల ధర్మంబా ఆత్మ ధర్మమొ తలంపన్"

అని శంకరుడ్ని వర్ణం శరీర ధర్మమా, ఆత్మధర్మమా అని పంచముడు ప్రశ్నించినట్టు ప్రశ్నించటం కూడా జరిగింది. అయితే మరీ అద్వైతుల్లాగా తల్లితోనూ సోదరితోనూ సాంగత్యం పెట్టుకోవచ్చు అనేదాకా పోలేదు. అత్తా మేనల్లుడు, గురుపత్ని శిష్యుడు లాంటి వరసల్నే అధిగమించారు. రంగాజమ్మ కులకాంతల్ని నిరసించింది. "కులకాంతలేయూరు వలపులేయూరు" (ఉ.ప. 76) కులకాంతలకు వలపు చేష్టలు తెలియవని వాళ్ళు విలాసినులు కారని చెప్పింది. అంతేకాదు విజయరాఘవుని భార్యల్లో ఏ ఒక భార్యో రంగాజమ్మ పెత్తనాన్ని మందలించిందేమో దానికి రంగాజమ్మ ఇలా సమాధానం చెప్పింది—

"ఏ వనితల్ మముందలపనేమిపనో ? తమ రాడు వారు గా
రో। వలపించు నేర్పెరుగరో ! తమ కౌగిటిలోన నుండగా
రావది యేమిరా విజయరాఘవ మంచిలు దూరి బల్మిచే
దేవరకత్తెనై పెనగి తీసుకువచ్చితి నాతలోదరీ !

(చాటుపద్య మణిమంజరి 1 - 64)

భార్యలు వేశ్యా సంగమం చేసే తమ భర్తల్ని తిట్టలేక వేశ్యల్ని తిట్టటం వేశ్యలు వాళ్ళకి ఇలాంటి సమాధానం చెప్పటం సహజమే. కవయిత్రిగా ఉండి, రాజాస్థానంలో గౌరవాన్ని పొందిన రంగాజమ్మ రాణిని ప్రశ్నించటం విశేషం. భార్యకి పరపురుష వ్యామోహం కలగటానికి భర్తలే కారణం—

"కేరగరాదు నవ్వి గిలిగింతలు పెట్టగరాదు చెక్కులం
జేరగరాదు గుబ్బలు ఖచిక్కనగ్రమ్మగరాదు కేళిలో
మీరగరాదు పైకొని రమింపగరాదు గళారవంబు లిం
పారగ సల్పరాదు మదిరాక్షుల భర్తల గూడు వేళలన్"

(హంస. వి. 1 - 194)

తన భార్య కళ్ళలో కోరిక మెరిస్తేనే నువ్వేమన్నా భోగందానివా అనే భర్తలు ఇప్పటికీ ఉన్నారు.

"మగని ప్రక్కనెయుండి తగజేరి జోకొట్టి మోసపుచ్చనిదేటి ముద్దరాలు
పసులగోడలనైన వసుధ నిచ్చెన లేకయెక్కనేరనిదేటి యెమ్మెలాడి

తలవరుల్ గనుకొన్న దప్పునొప్ప ఘటించి బొంకనేరనిదేటి పువ్వుబోణి
దొరలు గద్దింప గల్లలి వార్త నిజముగా నిర్వహింపనిదేటి నీటుకత్తె
యత్తమామల గృహ కర్తలగుచు మెలగునట్టి ధూర్తులనెల్ల నోరదిమిగదిమి
పొంచి యుపనాథుతోడ గ్రీడించి మించి చక్కటికి దిద్దుకొననిదే సరసురాలు"
(షక. 1 - 139)

అంటూ ఉపనాథరతిని ప్రోత్సహించారు. ఈ ఉపనాథుడు వివాహితుడు కావచ్చును. అవివాహితుడు కావచ్చును. ఇలాంటి పరంగనా, ఉపనాథ సంబంధాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ కారణాల వల్ల హత్యలు కూడా జరుగుతున్నాయి. దక్షిణాంధ్ర యుగంలో వీటిని సమర్థిస్తూ స్త్రీలూ పురుషులూ కూడా కావ్యాలు రాయటం గమనించదగింది. వేశ్యా ప్రాబల్యం, కులసతిని నిరసించటం, పరదారా, పర పురుషసంగమాన్ని ఒక విలువగా భావించటం, స్వేచ్ఛాభోగాన్ని సమర్థించటం "కటా కటా ఈ రాజకందర్పుని నా కన్నులు చూసినప్పుడైనా, బటువు గుబ్బలుబ్బి పట్టురవికె కీలు పటుక్కున వీడెగాదె" (కామరసు కవి. చంద్రికావిహారం) అంటూ విలాసోల్బణ స్త్రీని కీర్తించటం, ప్రణయకేళీ సౌఖ్య విధానాల్ని గురించి ఎంతో సూక్ష్మంగా ముద్దుపళని వంటి స్త్రీలే రాయటం పూర్వయుగాల కంటే పురోగమన స్థితిగానే గ్రహించాలి. కానీ విమర్శకులు ఎవరూ దీనిని పురోగమన స్థితిగా అంగీకరించలేదు. నీచ శృంగారం, పసు శృంగారం, పచ్చి కాముకత, మానసిక వ్యభిచారం, సిగ్గూ లజ్జా లేని జఘన్య శృంగారం వంటి మాటలతో ఈసడించారు. ఈ స్వేచ్ఛా భోగానికి వైష్ణవ మతం, తర తరాలుగా అణిచివేయబడిన ప్రణయ స్వేచ్ఛ కారణాలుగా చెప్పవచ్చును. మధ్య వలసవాదులు వచ్చి మొత్తం సామాజిక వ్యవస్థల్ని కంపింప చేయకపోతే స్వేచ్ఛా భోగ ఉద్యమం స్త్రీ విముక్తి ఉద్యమంగా పరిణమించేది. ఎన్నో సహజమైన మార్పులు వచ్చేవి. అయినా కందుకూరి, గురజాడల సంఘ సంస్కరణోద్యమంలో బాల్య వివాహ వ్యతిరేకత, వితంతు పునర్వివాహం వేశ్యా వ్యతిరేక ధోరణులు వచ్చాయి. గురజాడ వివాహ వ్యవస్థని కూడా ప్రశ్నించాడు. ప్రేమ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ప్రత్యామ్నాయం లేకుండా వేశ్యల్ని వ్యతిరేకించే విషయంలో గురజాడకు పరిమితులున్నాయి. మధురవాణికి స్వేచ్ఛా భోగకాలంలోని మూలాలు కూడా లేకపోలేదు. నాయకరాజుల యుగానికీ ఆధునిక యుగానికీ విచ్ఛిన్నత, అవిచ్ఛిన్నతలు ఉన్నాయి.

ఉత్తర మధ్యయుగంలో చర్చకి తీసుకోదగిన మరొక ప్రక్రియ వచనం. శాసనాల కాలం, చంపూరచనల్లో గద్యం, గానయోగ్యమైన వచనాలు, ఛందోవాసన లేని పాఠకులు కూర్చిన శుద్ధ వచనం వచన ప్రక్రియలో యుగాలు. ఆధునిక కాలంలో ఇంకా ఎన్నో యుగాలు ఉన్నాయి. పద్యం చదవటానికి పాండిత్యం, శిక్షణా కావాలి. ప్రబంధాల్ని ఆ కాలంలో పండితులా, కవులా మాత్రమే చదివే అవకాశం ఉంది. కొద్ది తాళపత్ర ప్రతుల్లో ఉండటం వల్ల కూడా వాటి వ్యాప్తికి నిరోధకమయింది. భారత, రామాయణాల వంటి పురాణాల్ని పౌరాణికులు చెప్పటంవల్ల ప్రజల్లో ప్రచారం అయ్యాయి. అందువల్ల ప్రజల మౌఖిక సాహిత్యం మీద భారత, రామాయణ కథల ప్రభావం ఉంది. సాధారణ ప్రజలకు ఏదో చెప్పాలనుకున్నప్పుడే, పాలక పాలిత వర్గాలకి సాంస్కృతిక సంబంధాలు అవసరమైనప్పుడే వచనప్రక్రియ అభివృద్ధి పొందుతుంది. సాధారణంగా వచనం ప్రజలు మాట్లాడే భాష నుంచే పుడుతుంది. ప్రజలు మాట్లాడే భాషలో వైవిధ్యం ఉంటుంది. ఆ వైవిధ్యం వచనంలోనూ ఉంటుంది. చారిత్రిక ఉత్తర మధ్యయుగంలో వచన రచన విస్తారంగానే జరిగింది. కొన్ని ఆనాటి వ్యవహారిక భాషలో ఉన్నాయి. కొన్ని గ్రాంథిక భాషలో ఉన్నాయి. వ్యవహార భాషలో రాయబడిన వచనంలో మొదటిది రాయ వాచకం. ఇది కృష్ణదేవ రాయల చరిత్ర. దీన్ని 16వ శతాబ్దంలో రాసి ఉండవచ్చు. "వీర నృసింహ రాయల వారు....పేరోలగంబై కూర్చుండగాను నూట యెనిమిది తిరుపతుల నుంచిన్ని తీర్థ ప్రసాదములున్ను డబ్భైరెండు దేవ స్థలాల నుంచి విభూతి గంధ ప్రసాదములున్ను రాగా యెదురుకొని ప్రత్యుత్థానము జేసి అంజలిచే నందుకొని శిరసావహించి స్థలాంతరాల నుంచిన్ని వచ్చిన అయ్యంగార్లనున్ను ఆరాధ్యపీఠం వారలనున్ను ఉచితాసనములయందు కూర్చుండ నియమించి" ఆ రోజుల్లో విరామ చిహ్నాలు పెట్టే అలవాటు లేదు కాబట్టి పంక్తులు పంక్తులుగా వచనం నడిచిపోతుంది. రాయవాచకం తర్వాత వచ్చిన వచన గ్రంథం మధుర మంగా పుంశ్చలీ విలాసం. 1689 నుంచీ 1706 వరకూ మధుర నాయక రాజ్యాన్ని పరిపాలించిన మహారాణి మంగమ్మ. ఈమె రాణిగా బాగానే పరిపాలించింది. స్త్రీ మీద కసి తీర్చుకోవాలంటే ఆమె శీలం మీద దుష్ప్రచారం చెయ్యటం మగాడికి ఎప్పుడూ ఉన్న అలవాటే. కారణం అయితే తెలియదు కానీ ఆమె ఆగ్రహాన్ని పొందిన ఎవడో ఈ వచనంలో మంగమ్మ అతి రతి క్రీడా విలాసాల్ని బూతు పదాల్లో రాశాడు. ఇది వ్యావహారిక భాషలోనే ఉంది. ఆనాటి చారి

గ్రిక విషయాలు ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. ఇది మధుర ప్రజల వాడుక భాషలో రాయటంవల్ల అనేక తమిళ పదాలు ఉన్నాయి. భాషలో తీక్ష్ణత ఉంది. మాఘమాహాత్మ్యం, శ్రీరంగమాహాత్మ్యం, తంజావూరాంధ్ర రాజుల చరిత్ర ఇతర వచన రచనలు. "పారిపోయిన చెంగమలదాసు కొడుకు విజయరాఘవ నాయకుడు, అతని కొడుకు విజయమన్నారప్పనాయుడు, అతడు చొక్కనాథనాయని మనుమడు విజయరంగ చొక్కనాథ నాయనివారికి తన చెల్లెలినిచ్చి వివాహము చేసి వారిచ్చిన జాగీరు అనుభవిస్తూ నుండెను". ఇది తంజావూరాంధ్ర రాజుల చరిత్రలో భాష. ఇందులో చరిత్ర విరుద్ధమైన అంశాలు ఉన్నప్పటికి భాష వ్యవహారికంలో ఉంది. 17వ శతాబ్దం ఉత్తరార్థంలో గ్రాంథిక వచన రచనలు అనేకం రాశారు. బహుశా ఆ రచయితలు గ్రంథాల్లో భాషకి దగ్గరగా ఉండే భాష మాట్లాడుకుంటూ ఉండేవారేమో. ఇప్పుడుకూడా చాలామంది తెలుగు మాష్టర్లు క్లాసురూముల్లోనూ, సాహిత్య సభల్లోనూ గ్రాంథికం అనబడేదానికి దగ్గరగా ఉండే భాషలో ప్రసంగాలు చేస్తున్నారు. ఈ గ్రాంథిక వచన రచయితలు ఎక్కువగా పురాణాల్ని రాశారు. పురాణ కథల్ని ప్రజల్లో పద్యాలు చదవలేని విద్యావంతుల్లో ప్రచారం చెయ్యటం వీళ్ళ ఉద్దేశం కావచ్చు. మధుర నాయకుల దగ్గర దళవాయిగా ఉండిన తుపాకుల అనంత భూపాలుడు విష్ణు పురాణం, భారతం, రామాయణం (అసమగ్రం) వచనంలో రాశాడు. సముఖము వెంకట కృష్ణప్ప జైమిని భారతం, సారంగధర చరిత్రల్ని రాశాడు. ఉత్తరాంధ్రంలో వచన రచనలు వ్యవహారిక భాషకి సమీపంగా వచ్చాయి. తత్త్వ శాస్త్ర గ్రంథాలు, చాల్ దర్వీష్ కథలు వ్యవహారికంలో రాయటమే కాక తాము వ్యవహారిక భాషలో రాస్తున్నాం అని చెప్పుకున్నారు. ఈ విధంగా మధ్యయుగ ఉత్తర భాగంలో వచన రచనలు పండితుల్నీ, తాత్వికుల్నీ అక్షరాస్యులైన ప్రజల్తో సంబంధాల్ని కలిగించాయి. పూర్వయుగాల కంటే ఈ యుగం సాంస్కృతికంగా అభివృద్ధి పొంది ఉందని చెప్పటానికి ఇది కూడా ఒక నిదర్శనమే.

మధ్యయుగంలో అసాధారణమైన, విలక్షణమైన ప్రక్రియ యక్షగానం. ఈ ప్రక్రియా వికాసంలో కూడా యుగాలు ఉన్నాయి. అజ్ఞాతయుగం, మార్గయుగం, దేశి యుగంగా యక్షగానాన్ని పరిశీలించవచ్చును. శ్రీనాథుడు యక్షగాన ప్రక్రియ పేరు చెప్పటం వరకూ అజ్ఞాతయుగం. కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయ యక్షగానం నుంచీ నాయకరాజులదాకా మరొకయుగం. ఉత్తర మధ్యయుగంలో ముఖ్యంగా

తంజావూరు, మధురలో యక్షగానం ప్రబల ప్రక్రియగా ఉంది. యక్షగాన నిర్మాణం
లోనూ వస్తుచిత్రణలో కూడా కాలగమనంలో మార్పులు వచ్చాయి. సాంస్కృతికంగా
ఈ ప్రక్రియ నిర్వహించిన పాత్రవల్లనే ఈ మార్పులు వచ్చాయి. ఈ ప్రక్రియ
సంకీర్ణ చలన నిర్మాణం గల ప్రదర్శన కళారూపం. ప్రజాకళారూపాల నుంచీ
రూపొంది జాతరల్లోనూ, తిరునాళ్ళలోనూ ప్రదర్శింపబడి ప్రచురమైంది. ప్రదర్శన
కళారూపాల్ని సాధారణంగా ఒక కులంవాళ్ళో, జాతివాళ్ళో చేపట్టి వృత్తిగా కొనసా
గించటం చరిత్రలో ఉంది కాబట్టి జక్కుల జాతికీ యక్షగానానికీ సంబంధం ఉండే
ఉంటుంది. తర్వాత కొరవంజివాళ్ళు కూడా బొమ్మలాటలతోబాటు ప్రదర్శించి
ఉంటారు. ఇది బహుశా రాయలసీమలో రూపొంది తమిళ, కన్నడ ప్రాంతాలకి
వ్యాపించి ఉంటుంది. యక్షగానంలో ప్రధాన రచనాంగాలు రగడ వికారం, తాళ
ప్రధానమైన రేకు, ద్విపద, ఏలలు, అర్ధ చంద్రికలు, ధవళ శోభనాలు అల్లోనేరేళ్ళ
మొదలైన పదాలు. పరిణామక్రమంలో పద్యాలూ, శ్లోకాలూ కూడా చేరాయి. అన్నిటి
కంటే పెద్దమార్పు వచనంలో నాటకీయ సంభాషణలు రాయటం. ఒక దశలో
సంస్కృత నాటక లక్షణాల ప్రభావం కూడా స్వల్పంగానే అయినా పడింది. యక్ష
గానాల్లో ఎక్కువ పౌరాణిక వస్తువే ఉన్నప్పటికీ సమకాలిక రాజకీయ సాంఘిక విష
యాల్ని ఇతివృత్తంగా తీసుకున్నవి కూడా ఉన్నాయి. తంజావూరిలో యక్షగానాన్ని
రాజులు కూడా రాశారు. రఘునాథ నాయకుడు రాసినవి దొరకలేదు కానీ విజయరాఘవ
నాయకుడు ఎన్నో యక్షగానాలు రాశాడు. నట్టువ మేళాలు ప్రదర్శించారు. తంజా
వూరుని పాలించిన మహారాష్ట్రుడు శహాజీ 20 యక్షగానాలు రాశాడని పరిశోధకులు
చెపుతున్నారు. యక్షగానాల్లో పాత్రోచిత భాష విచిత్రంగా ఉంటుంది. ఆయా
పాత్రలు మాతృభాషలో మాట్లాడతాయి. తెలుగు, తమిళం, కన్నడం, మరాఠీ,
సంస్కృత భాషల్లో పాత్రలు మాట్లాడటం అసాధారణం. వస్తువు ఏదైనా అందులో
పాత్రలు పురాణపాత్రలైనా మధ్యతరగతి సంస్కృతి పరిధి కనిపిస్తుంది. 'తంజా
వూరన్నదాన మహానాటకం' అనే యక్షగానాన్ని పురుషోత్తమ దీక్షితులు రాశాడు.
ఇతడు విజయరాఘవుడి ఆస్థానకవి. ఈ యక్షగానం ప్రహసన స్వభావం కలదీ.
ఇందులో ఆనాటి బ్రాహ్మణుల వెకిలిచేష్టల్ని, వాళ్ళ సంస్కార స్థాయిని కవి బహి
ర్గతం చేశాడు. ఇందులో కథ అన్నదాన సత్రంలో నడుస్తుంది. పప్పు తిప్పాశాస్త్రి,
అతని కొడుకు, సత్రం అధికారి నెల్లూరి యల్లమరాజు, వెంగసాని, అప్పం పాత్యారి

అనే అరవ బ్రాహ్మణుడు ప్రధాన పాత్రలు. ఇద్దరు బ్రాహ్మణులు వెకిలివాళ్ళే. సదా భోజనప్రియులు. ఇద్దరూ సానుల్ని చూసి మోహపడతారు. అధికారి కోరికమీద సానులు ఆ బ్రాహ్మల కోరికల్ని తీరుస్తారు. తిప్పాభట్లు మన్మథరూపాన్ని పొంది సానుల్తో భోగం అనుభవిస్తాడు. ఇది ఆనాటి బ్రాహ్మణుల మీదా, సానులమీద అన్న సత్రాల్లో జరిగే సంఘటనల మీదా కవి విమర్శ. ముందు విజయరాఘవుడి మీద కైవారం ఉంది. కైవారం అంటే స్తోత్రం. ఇది ప్రస్తావనలాంటిది. రాగ, తాళాల్లో దరువులున్నాయి.

"గంటమోరగాఁగట్టి - కవిలెకట్ట చేపట్టి
కుంటుకొంచు కణక్కపిళ్ళె - గొబ్బునవచ్చె" (192)

పాత్ర ప్రవేశాన్ని చాలా సహజంగా ప్రదర్శించాడు. అధికారి తమిళంలో, తెలుగులో మాట్లాడతాడు. సంభాషణల్లో మొరటు హాస్యం కనిపిస్తుంది. సంభాషణల్లో ఎవరి భాషలో వాళ్ళే మాట్లాడటం విశేషం. అక్కడ ప్రజలు తమిళులు కాబట్టి ఇది ప్రదర్శనలో రక్తికట్టే ఉంటాలి. చివర భరతవాక్యంకూడా ఉంది. దృశ్య నిర్మాణంలో సంభాషణల్లో, పాత్రల హావభావాల్లో, సత్రం భోజనాలకి ఎగబడే బ్రాహ్మలమీద విమర్శలో ఈ యక్షగానం సజీవ ప్రదర్శన కళారూపంగా ఉంది. ఈ చారిత్రికయుగ జీవితాన్ని యక్షగానం సూక్ష్మంగా ప్రతిబింబించింది.

ఉత్తర మధ్య యుగంలో సాహిత్యం రాజుల, రాజపరివార, సంపన్న జీవితాన్ని బహుముఖంగా చిత్రించింది. సాధారణ ప్రజల జీవితాన్ని కూడా పాలక వర్గాలకు విధేయంగానే వర్ణించింది. ఈ యుగ సాహిత్యంలో పాలక వర్గాల ఆధిపత్యలో అన్నివర్గాల జీవితం ఉంది. ప్రధానమతం శ్రీవైష్ణవం రాయలకాలంలో విశిష్టాద్వైతం తాత్త్వికస్థాయిలో ఉండగా నాయకరాజుల కాలంలో మత స్థాయిలో భోగవాదంగా మారిపోయింది. కులసంబంధాల్లో దూరం తగ్గిపోయింది. స్త్రీ పురుష సంబంధాల్లో కొంత స్వేచ్ఛ, శృంగార సమస్యల బహిరంగ చర్చ కనిపిస్తుంది. ఆర్థికంగా శ్రమజీవులు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు. సంపన్నులు భోగాల్లో మునిగితేలారు. కవులు రాజాస్థానాల్తో మమేకం అయిపోయారు. మొత్తం సాహిత్యం మీద మౌఖిక సాహిత్య ప్రభావం బలంగానే ఉంది. శతక ప్రక్రియ చరిత్రలో వేమన ఒక యుగం. ఆ కాలంలోని పెడ ధోరణులన్నిటినీ తీవ్రంగా ఖండించాడు. ఈ యుగ

జాతీయోద్యమ కవిత్వం - వర్గీకరణ

పాపినేని శివశంకర్

గురజాడ అనంతరం తెలుగు సాహిత్యంలో కొన్ని ప్రత్యేక శాఖలు కన్పిస్తాయి. సాధారణంగా వీటినన్నిటినీ కలిపి కాల్పనిక కవిత్వమనో, భావ కవిత్వ మనో వ్యవహరించడం జరుగుతుంది. సి. నారాయణరెడ్డిగారు జాతీయవాద ఫలితంగా వెలువడ్డ దేశభక్తి కవిత్వాన్ని భావకవిత్వంలో అంతర్భాగంగా చూశారు. అలాగే ప్రణయ కవిత్వమూ, ప్రకృతి కవిత్వమూ, సంఘ సంస్కరణ కవిత్వమూ, భక్తి కవిత్వమూ అందులోనే అంతర్భవించాయి.

మరికొంత మంది విమర్శకులు జాతీయవాద కవిత్వంలోనే భావకవిత్వాన్ని అంతర్భాగంగా చూడదలచుకుంటున్నారు. భావకవిత్వానికి జాతీయవాదంతో గల సంబంధం గురించి ఇంకా చర్చలు జరుగుతూనే వున్నాయి.

జాతీయవాద కవిత్వానికీ భావకవిత్వానికీ పునాది ఒకటే అయితే ఆ రెండింటినీ ఒకే విభాగంలోనికి తీసుకురావచ్చు. కాని పక్షంలో వాటిని వేర్వేరు విభాగాలుగానే చూడటం మంచిది. అందుకు ముందుగా ఈ కవిత్వాలను నిర్వచించుకోవటం అవసరం.

బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జాతీయతనీ, దేశభక్తినీ, స్వరాజ్య సాధననీ ప్రేరేపించిన కవిత్వం జాతీయోద్యమ కవిత్వం. అంతర్గత అనుభూతి

సాహిత్యం ఏకస్రవంతి కాదు. విజయనగరం, తంజావూరు, మధురవంటి సాంస్కృతిక కేంద్రాల్లోని సాహిత్యాన్ని విడివిడిగా అధ్యయనం చెయ్యాలి. పూర్వ యుగాల్లో కంటే ఈ యుగంలో ప్రజల సామాన్య సాంస్కృతిక స్థాయి పెరిగింది. జీవిత వాస్తవిక చిత్రణ పెరిగింది. ఇది పూర్వ యుగాల కంటే పురోగమించిన యుగమే. క్షీణయుగం కాదు.

(ఆయన నాకు మూడు దశాబ్దాలు నిరంతర ఉపాధ్యాయుడు. నేను ఆయనకు అచంచల విద్యార్థిని. అందుకే ఈ వ్యాసం కేతవరపు రామకోటి శాస్త్రి గారికి అంకితం.)

ప్రధానంగా సాగిన కవిత్వం భావకవిత్వం. (నిజానికి భావకవిత్వానికి ఈనాటికీ స్పష్టమైన నిర్వచనం లభించలేదని గమనించాలి. ఇందుకు భావకవులలోని వైవిధ్యం కారణమై వుండవచ్చు).

జాతీయోద్యమ కవిత్వానికీ, భావకవిత్వానికీ వర్గ ప్రాతిపదిక ఒక్కటే. సమాజంలో అంతో ఇంతో ఆర్థిక సాంఘిక సుస్థిరత, విద్యా వాసన, నూతన ఆలోచనాధోరణి గల దిగువ, ఎగువ మధ్యతరగతి వర్గం నుంచే ఈ రెండు రకాల కవిత్వమూ పుట్టింది. అంటే ఈ రెండు రకాల కవిత్వాలూ సమాజం అట్టడుగు పొరల్లోంచి పుట్టుకురాలేదు.

ఆంధ్రదేశంలో జాతీయోద్యమం 1905 తర్వాత మెల్లమెల్లగా వ్యాపించింది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా చెలరేగిన ఉద్యమం సందర్భంగా బిపిన్ చంద్ర పాల్ 1907లో ఆంధ్రదేశం పర్యటించాడు. రాజమహేంద్రవరంలో అతని ఉపన్యాసం విని ఉత్తేజం పొందిన చిలకమర్తి లక్ష్మీనరసింహం

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

అనే పద్యం చెప్పారు. జాతీయోద్యమ కవిత్వానికి ఇదే నాందిగా భావించబడుతోంది. అప్పటి నుంచి మంగిపూడి వెంకటశర్మ (భారత జననీ, జయ జయ భారత, గాంధీశతకము), చెన్నాప్రగడ భానుమూర్తి (మాతృవిలాపము), గరిమెళ్ళ, చెఱుకువాడ లక్ష్మీనరసింహం, కొండపల్లి జగన్నాథదాసు, దామరాజు పుండరీకాక్షుడు, తుమ్మల, దువ్వూరి లాంటి ఎందరెందరో కవులు జాతీయోద్యమ కవిత్వానికి లోతూ, విరివీ కలిగించారు. వీరిరచనలన్నిటా కన్పించే ప్రధాన లక్షణం దేశభక్తి.

"దండాలు దండాలు-భారతమాత
అవి అందుకొని దీవించు-భారతమాత
గాంధీ మహాత్ముండు-భారతమాత
నీ ముద్దు కొడుకుండంగ-భారతమాత
మాకేమియును భయములేదు-భారతమాత"

(సం॥ గురజాడ రాఘవశర్మ-జాతీయగీతాలు)

ఈ దేశభక్తి ఒక ఉద్యమ లక్షణాన్ని సంతరించుకుంది. జాతీయోద్యమంలోని ప్రతి ప్రత్యేక ఘట్టంలోనూ జాతీయోద్యమ కవిత్వంలో ప్రత్యేక తరంగాలు ఉవ్వెత్తున లేచాయి (ఈ దేశభక్తిలో భాగంగానే పునరుద్ధరణ తత్వం కూడా ప్రవేశించింది).

భావకవుల్లోనూ చాలామంది దేశభక్తి కవిత్వాన్ని రాశారు. 'ఏ దేశ మేగినా ఎందుకాలిడినా' అని దేశభక్తిని ప్రబోధించిన రాయప్రోలు మొదలుకొని కృష్ణశాస్త్రి, వేదుల, బసవరాజు అప్పారావు, కవికొండల మొదలైన కవులందరూ అంతో ఇంతో దేశభక్తి కవిత్వాన్ని రాసినవాళ్ళే. అయితే ఈ కవిత్వంలో ఉద్యమావేశ లక్షణం ప్రధానంగా కన్పించదు. జాతీయోద్యమంలో ఏర్పడుతూ వచ్చిన ప్రత్యేక పరిస్థితులకు ఎప్పటికప్పుడు తీవ్రంగా స్పందిస్తూ భావకవులు కవిత్వం రాసినట్టు లేదు. జాతీయోద్యమంలోని ప్రత్యేక లక్షణం కంటే (Particularity) సామాన్య లక్షణమే (Generality) భావ కవిత్వంలో ప్రతిఫలించింది.

జాతీయోద్యమ కవిత్వం యొక్క ఏకైక ధ్యేయం స్వరాజ్య సాధన. కాబట్టి ఆ కవిత్వంలోని ప్రతి వాక్యమూ ఆంగ్లేయ పరిపాలనకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిందే. 'మాకొద్దీ తెల్లదొరతనమూ' అనే గరిమెళ్ళ గేయం ఆనాటి జాతీయోద్యమ కవులందరి హృదయంలోనిదే.

మరి, భావకవిత్వం కోరింది సాంఘిక సంబంధాల్లో స్వేచ్ఛాయుతమైన మార్పు.

"ఏను స్వేచ్ఛా కుమారుడ నేను గగన
పథ విహార విహంగ మపతిని నేను
మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝంఝూ ప్రభంజన స్వామినేను"

(దేవులపల్లి కృష్ణశాస్త్రి)

అన్నాడు భావకవి. ఆ స్వేచ్ఛ స్వరాజ్య సాధనవల్ల లభించగల స్వేచ్ఛకాదు. స్త్రీ పురుష సంబంధాలు మొదలైనవాటిల్లో మార్పులకు సంబంధించిన స్వేచ్ఛ అది.

జాతీయోద్యమ కవిత్వంలో స్పష్టంగా ఒక సామాజిక లక్షణం (Social element) వుంది. అది బాహ్యాత్మకమైంది (Objective).

"భారతదేశము నాదేరా!
భారతీయుడను నేనేరా!

(మంగిపూడి పురుషోత్తమశర్మ)

అని జాతీయ కవి 'పాంచజన్యం' పూరింపాడంటే అది భారతీయ సమూహంలో ఒకడుగానే, భారతీయ సమూహం కోసమే.

దీనికి భిన్నంగా భావకవిత్వంలో స్పష్టంగా ఒక వైయక్తిక లక్షణం (Individual element) వుంది. అది ఆత్మాశ్రయ కవిత్వం (Subjective Poetry).

"గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ
కూకుండ నీదురా కూసింతసేపు"

(నండూరి వెంకట సుబ్బారావు)

—అంటూ భావకవి వైయక్తిక గానమే చేస్తున్నాడు.

జాతీయోద్యమ కవిత్వంలో ప్రచార లక్షణం ఎంతైనా కన్పిస్తుంది. పద్య రచనలోనూ ఈ ప్రచారం కొనసాగింది. పోతే ఆ కవిత్వం స్వీకరించిన జానపద బాణీలకు లెక్కేలేదు. గరిమెళ్ళ పాటల విస్తృత ప్రచారానికి అవి అత్యద్భుత జానపద బాణీల్లో వుండటం ఎంతైనా కారణం. 'దండాలండోయ్ - మేముండ లేమండోయ్! బాబు! (గరిమెళ్ళ) 'పొలిపోలీ బలిబలీ' (మంగిపూడి) 'జయమంగళమ్ నిత్య శుభమంగళమ్' (కొండపల్లి జగన్నాథదాసు) మొదలైన పాటలెన్నిటినైనా ప్రచార లక్షణానికి ఉదాహరణలుగా చూపవచ్చు.

ఇలాంటి ప్రచార లక్షణం భావకవిత్వంలో లేదు. 'ఎంకిపాటలు' లాంటివైనా గొప్ప జానపదబాణీలు కావు. భావకవిత్వంలో మంచి గీతి లక్షణం వుంది. ఆ కవిత్వం వ్యాప్తి చెందడానికి బాహ్య ప్రచారం దోహదం చేసినంతగా అంతర్గత ప్రచార లక్షణం దోహదం చెయ్యలేదు.

స్పష్టమైన స్వరాజ్య సాధనా లక్ష్యం, అందుకవసరమైన పోరాటమార్గం గల జాతీయోద్యమ కవిత్వంలో కాల్పనికత్వం ఉండే అవకాశం లేదు. ఈ కవిత్వానికి ఈ నేలమీదనే గట్టిపునాదులున్నాయి.

కానీ భావకవులెంతోమంది స్వరాజ్య పోరాటమార్గంతో కొంత ఎడంగానే సంబంధం పెట్టుకున్నారు. బహుశా అదివారి తక్షణ జీవితావసరం కాకపోయి వుంటుంది. ఇందువల్లనే ఎక్కువమంది భావకవుల కవిత్వంలోని జాతీయతా ప్రకాశం బాహ్య ప్రతిఫలనం నుంచి వచ్చినంతగా అంతర్జ్వలనం నుంచి రాలేదనీ, వారిలో కన్పించే ఆ జాతీయావేశం గమనావేశమే (Passing emotion) ననీ అన్పిస్తుంది. ఇందువల్లనే ఆ ఆవేశంలో ఎక్కువగా కాల్పనిక లక్షణమే (romanticism) కన్పిస్తుంది.

"ఉప్పు కొనండయ్యా! స్వరాజ్యపు - ఉప్పు కొనండయ్యా
ఉప్పు చట్టమును ధిక్కరించితే
తప్పకమనకు స్వరాజ్యము వచ్చు ॥ఉప్పు॥
....
శాంతి సైన్యములు చేసిన ఉప్పిది
శాంతి శుభమ్ములు జగతికిచ్చునది
గాంధి మహాత్ముడు కనిపెట్టినదిది
బంధనంబులను బారదోలునిది"

మంగిపూడి పురుషోత్తమశర్మ రాసిన ఉప్పుపాట ఇది. దీనిని బసవరాజు అప్పారావు రాసిన 'స్వరాజ్యలక్ష్మి పెండ్లి' పాటతో పోల్చి చూడవచ్చు.

"పోదాము స్వరాజ్యలక్ష్మి పెండ్లి జూడ
రారే రమణులారా !
....
సంద్రమె పెళ్ళిల్లంట, సదస్యులు దేవతలంట
ఉప్పే తలంబ్రాలటా, మనలక్ష్మి పెండ్లికి ॥పోదాము॥
గాంధీ వశిష్ఠుంట, కస్తురమ్మ ముత్తైదంట
పరమాత్ముడే సాక్షిటా మనలక్ష్మి పెండ్లికి ॥పోదాము॥

చట్టాన్ని ధిక్కరించి ఉప్పు తయారు చెయ్యటం స్వరాజ్యలక్ష్మి పెండ్లి అయింది. ఉప్పు తలంబ్రాలయింది. గాంధీ వశిష్ఠ పురోహితుడయ్యాడు. భావ కవిత్వంలోని కాల్పనిక లక్షణమే ఇలాంటి వర్ణనకు దారితీసి వుంటుంది.

ఈ విధమైన పరిశీలన వలన జాతీయోద్యమ కవిత్వాన్నీ భావ కవిత్వాన్నీ వేర్వేరు శాఖలుగా నిర్ధారించుకోవటం మంచిదనిపిస్తుంది. కవులను బట్టి చూసినప్పుడు ఒకే కవి అటు జాతీయోద్యమాన్ని సమర్థిస్తూ, మరోవైపు కాల్పనిక లక్షణాలను ప్రతిపాదిస్తూ కవిత్వం రాసివుండటం కనిపిస్తుంది. అందువల్లనే వాటిని తేలిగ్గా వేరు చెయ్యలేక తికమక పడవచ్చు. అలాకాక కవితా లక్షణాల ప్రాతిపదిక మీద విభాగం చేసుకుంటే సుకరంగా వుంటుంది. ఆ విభాగం ఇలా చేసుకోవచ్చు.

1. జాతీయోద్యమ కవిత్వం :

1) దేశభక్తి, 2) స్వాతంత్ర్య ప్రబోధం, 3) గాంధీ ప్రశస్తి, 4) గతవైభవ పునరుద్ధరణ, 5) సంఘసంస్కరణ.

జాతీయోద్యమ కవిత్వానికి అనుబంధంగానే ఆంధ్రోద్యమ కవిత్వాన్ని పరిగణించవచ్చు.

2. భావ (కాల్పనిక) కవిత్వం :

1) ప్రణయ కవిత్వం, 2) ప్రకృతి కవిత, 3) మార్మిక కవిత్వం, 4) స్మృతి కవిత్వం.

2

కవిత్వగతిలో కొన్ని ఉద్యమాలూ (movements), ధోరణులూ (trends) ఉంటాయి.

నిర్దిష్ట భౌతికాశయంతో ఒక సమూహం చేసే సమష్టి ప్రయత్నాల, చర్చల పరంపర ఉద్యమం.

సాహిత్యోద్యమం సామాజిక వస్తువుతో గతి తార్కిక సంబంధం కలిగి వుంటుంది. సాహిత్యోద్యమానికి సామాజిక మౌలికాంశాలతో (ఆర్థికం, రాజకీయం) ప్రధాన ప్రమేయం ఉంటుంది. ఆ మౌలికాంశాలను ప్రభావితం చేసే శక్తి ఉంటుంది. ఇతర ఉపరితలాంశాలతో సాహిత్యోద్యమానికి అప్రధాన ప్రమేయం ఉంటుంది.

సామాజికోద్యమం లేకుండా సాహిత్యోద్యమం ఉండదు.

సాహిత్యోద్యమంలో సామాజిక పరిణామాల ప్రత్యేకత (Particularity) ప్రతిఫలిస్తుంది.

ఉద్యమ సాహిత్యానికి సామూహిక వినియోగ సంబంధాలుంటాయి.

నిర్దిష్ట భావాత్మకాశయంతో కొందరు వ్యక్తులు ఉమ్మడి మార్గంలో చేసే వైయక్తిక ప్రయత్నాల, చర్యల పరంపర ధోరణి.

సాహిత్యధోరణికి సామాజిక రూపంతో (నీతి, మతం, సంస్కృతి, కళ వగైరా) ప్రధాన ప్రమేయం ఉంటుంది. కాబట్టి సాహిత్య ధోరణికి సామాజిక మౌలి కాంశాలను ప్రభావితం చేసే శక్తి ఉండదు.

సాహిత్యధోరణికి సామాజికోద్యమాలతో ప్రమేయం ఉండనవసరం లేదు.

సాహిత్య ధోరణుల్లో సామాజిక పరిణామాల సామాన్య లక్షణం ప్రతి ఫలిస్తుంది.

ధోరణి సాహిత్యానికి సామూహిక వినియోగ సంబంధాలుండవు.

పై నిర్వచనాన్నిబట్టి జాతీయోద్యమ, భావకవిత్వాల్ని వర్గీకరించవచ్చు.

జాతీయోద్యమ కవిత్వం స్వరాజ్యసాధన అనే స్పష్టమైన భౌతికాశయంతో కొనసాగింది. దానికి ఆర్థిక రాజకీయ రంగాలతో స్పష్టమైన, సూటి సంబంధం ఉంది. ఆ సంబంధం భావకవిత్వానికి లేదు. ఆర్థిక, రాజకీయ శక్తులు లేదా పరిణామాలు భావకవిత్వాన్ని నడిపించలేదు. అంతేగాక అప్పటి రాజకీయార్థిక రంగాల్లో మౌలికమైన మార్పు రావాలని భావకవిత్వం ఎక్కడా కోరలేదు. సామాజిక ఉపరితలంలో భాగాలైన (బూర్జువా) స్వేచ్ఛ, స్త్రీ పురుష సంబంధాల్లో నూతన దృష్టి, సౌందర్యకాంక్ష, ఆదర్శవాదం మొదలైన అంశాలే భావకవిత్వాన్ని నడిపించాయి. అంటే భావకవిత్వం కోరిన మార్పు సంస్కృతిపరమైంది. దానిది భావాత్మకాశయమే.

ఇరవయ్యవ శతాబ్ది మొదటిభాగంలో జాతీయోద్యమమే సామాజికోద్యమం. జాతీయోద్యమ కవిత్వానికి ఆ ఉద్యమంతో కచ్చితమైన సంబంధం ఉంది. ఈ సంబంధం భావ కవిత్వానికి సంబంధించి సామాజిక రంగంలో ఏ ఉద్యమమూ లేదు. సామాజికోద్యమంనుంచి గాక ఒక ఆదర్శవాద క్షేత్రంనుంచే భావకవిత్వం పుట్టుకొచ్చింది.

సామాజిక పరిణామాలకు సంబంధించి సాహిత్యోద్యమానికుండే నిరంతర పారస్పర్యం, చలన తీవ్రత జాతీయోద్యమ కవిత్వంలో ఉన్నాయి. సామాజిక

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట నేపథ్యంలో తెలుగు సాహిత్యం

మానేపల్లి

భారతదేశపు రైతాంగ పోరాటాల చరిత్రలో నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు ఒక మలుపు తీసుకొచ్చాయి.

మావో ఆలోచనా విధానం ప్రభావంతో నక్సల్బరీ పోరాటం వర్గ శత్రు నిర్మూలనా కార్యక్రమాన్ని ప్రారంభిస్తే, శ్రీకాకుళ పోరాటం దాన్ని మరింత ముందుకు తీసుకుపోయింది.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రపు ఉత్తర కొసనున్న డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీలో

మూలంతో నిరంతరం సంఘర్షిస్తూ దానిపై ప్రభావం చూపుతూ, తిరిగి దానిచేత ప్రభావితమవుతూ ఉద్యమం కొనసాగుతుంది. జాతీయోద్యమ కవిత్వం ఆ ఉద్యమంలోని వివిధ దశలకు చెందిన ప్రత్యేక పరిణామాలను (సహాయ నిరాకరణం, హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధం మొ॥) చిత్రించగలిగింది. ఈ లక్షణం భావ కవిత్వానికి లేదు. భావకవిత్వానికి వర్తమాన సమాజంతో మౌలిక సంఘర్షణ లేదు. మధ్య తరగతి విద్యావంతుల్లో దాని వ్యాప్తికి అందలి నవ్యత, ఆదర్శవాదం, గొప్ప ప్రచారం ముఖ్యకారణాలు. అది మధ్యతరగతి జీవుల భావలోకంలో వ్యాప్తి అయినంతగా ఒక భౌతిక శక్తిగా మారలేదు.

భావకవిత్వం ఉమ్మడిగా కన్పించే వ్యష్టి కవిత్వం. భావ కవితాదశలో ఎందరో కవులు కలిసిమెలిసి మహోత్సాహంతో కవిత్వం రాసినా అది వైయక్తిక కవిత్వమే. అందేదానికి సమష్టి ప్రయోజనం లేదు. ఆ కవిత్వానికి వ్యష్టి పాఠకుడితోనే తప్ప 'సమష్టి పాఠకుడితో' సంబంధం లేదు. ఆ కవిత్వంలో వ్యక్తిగతాంశ ప్రధానం కాబట్టి దాని ఆస్వాదన వ్యక్తిగతంగానే వుంటుంది. ఇక జాతీయోద్యమ కవిత్వం సామూహిక కవిత్వం. ఆ కవిత్వంలో ఉమ్మడి ప్రయోజనం ఇమిడి వుంది.

ఈ పరిశీలన వల్ల జాతీయోద్యమ కవిత్వాన్ని కవితోద్యమంగా భావ కవిత్వాన్ని కవితా ధోరణిగా భావించటం సుకరంగా ఉంటుంది.

రైతులు జోతేదార్లకు వ్యతిరేకంగా 1967-68 లల్లో సాయుధంగా తిరుగుబాటు తీశారు సుమారు ఆరునెలలపాటు జరిగిన పోరాటాన్ని పశ్చిమ బెంగాల్ మార్క్సిస్టు ఐక్య సంఘటన ప్రభుత్వం అణచివేసింది. సి.పి.ఐ. నుంచి మార్క్సిస్టు భావాలతో విడి వడి కొత్త పార్టీగా ఏర్పడిన సి.పి.ఐ. (మార్క్సిస్టు) - రైతాంగ పోరాటాన్ని, వారి సమస్యల్నీ పరిష్కరించవలసిందిపోయి తుపాకులతో అణగద్రొక్కింది. నక్సల్బరీ పోరాటానికి చారుమజుందార్, కానూసన్యాల్ వంటి నాయకులు కారకులు కాగా విశ్వకర్మార్కర్ వంటి యువకులు ప్రాణాలు బలియిచ్చారు.

1951లో తెలంగాణాలో పోరాట విరమణ తరవాత కమ్యూనిస్టు కార్యకర్తలు సుదూరంగా వున్న శ్రీకాకుళం జిల్లాకు వచ్చి రహస్య జీవితాలు గడిపారు. అప్పటికే 1940లో మందసలో రైతాంగ పోరాటపు చరిత్ర జిల్లాకున్నది. గున్నమ్మ వీర మరణపు స్ఫూర్తి ఉన్నది. మార్పు పద్మనాభం వంటి నాయకులున్నారు. తొలి యాభైలలో జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం ప్రారంభమయింది. అప్పట్లో శ్రీకాకుళం జిల్లా సువిశాలంగా అటు పార్వతీపురం మొదలు పాలకొండ, పాత పట్నం నుండి ఇచ్ఛాపురం వరకూ విస్తరించి వుండేది. (1979లో పార్వతీపురం ప్రాంతాలు కొత్తగా ఏర్పడిన విజయనగరం జిల్లాలోకి వెళ్ళిపోయాయి.) గంటి రాజేశ్వరరావు, దారపు గోవిందరాజులు, త్రిపురనేని వెంకటేశ్వరరావు వంటి వారు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషిచేశారు. తరవాత వసంతాడ రామ లింగావారి జిల్లా కార్యదర్శి అయ్యారు.

పాలకొండ తాలూకాలో పల్లిరాములు మేస్టారు చింతచెట్ల ఉద్యమం ప్రారంభించారు. ఏజన్సీలో చింతచెట్లపై గిరిజనులదే హక్కనీ, ఏజన్సీ ఉత్పత్తులు ఏజన్సీ దాటి వెళ్ళరాదనీ గిరిజనులకు బోధించి ఉద్యమం లేవదీశారు. భూస్వాములు, వడ్డీ వ్యాపారులూ, కాంగ్రెసు పెద్దలు ఏకమై - పల్లిరాములు మేస్టార్ని జిల్లా అవతలి కొసనున్న పార్వతీపురం ఏజన్సీలో మొండెంఖల్లు బదిలీచేశారు. అప్పటికే పార్వతీ పురం పట్టణంలో కమ్యూనిస్టు పార్టీశాఖ పనిచేస్తున్నది. ఆ ప్రాంతాల్లో వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం అనే సమవయస్కులైన యువకులు పార్టీవైపు ఆకర్షితులయ్యారు. పల్లిరాములు మేస్టారు తోడయ్యారు. క్రమంగా పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘాల నిర్మాణం ప్రారంభమయ్యింది. మరొక పక్క ఆంధ్రప్రదేశ్

టీచర్స్ ఫెడరేషన్ పనిచెయ్య నారంభించింది. ఈ ముగ్గురు టీచర్లే కాదు వావిలపల్లి సత్యనారాయణ, మేడవరపు రమణమూర్తి, రౌతు చిన్నంనాయుడు ఈ మొదలైన వారంతా అందులో సభ్యులే. క్రమంగా వీరూ గిరిజన పోరాటంలోకి వచ్చారు. వెట్టివాకిరీ నిర్మూలన, కూలీరేట్ల పెంపు మొదలైన కార్యక్రమాల్తో ప్రారంభమైంది ఉద్యమం. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన షావుకార్లు అమాయకులయిన గిరిజనులకు అప్పులిచ్చి మోసాలుచేసి భూములాక్రమించుకున్నారు. అలా ఆక్రమించుకున్న భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకోనారంభించారు గిరిజనులు. ఆ భూముల్లో పంటలు స్వాధీనం చేసుకోనారంభించారు. భూస్వాములూ, షావుకార్లూ పోలీసుల్ని ఏజన్సీలోకి దించారు. గిరిజనులు మరింత సంఘటితమయ్యారు. 1967 అక్టోబరు 31 వ తేదీన మొండెంఖల్లులో గిరిజన మహాసభకు ఏర్పాట్లు జరుగుతుంటే భూస్వాములు దానిని జరగనివ్వకుండా కుట్రపన్నారు. అక్టోబరు 31 నాడు-మొండెంఖల్లు దారిలో పేలిడి సెంటర్లో స్త్రీలను అవమానపరిచారు. తుపాకుల్తో కోరన్న, మంగన్నల ప్రాణాలు బలి తీసుకున్నారు. నాయకత్వం ఈ విషయాన్ని తీవ్రంగా ఆలోచించింది. పోరాటం సాయుధం కావాలని జిల్లా నాయకత్వం అంటే—రాష్ట్ర నాయకత్వం దానికి ఆమోదం యివ్వలేదు. ఈ సమయంలో నక్సల్బరీ పోరాట జ్వాలలో రేగిన రవ్వ శ్రీకాకుళంలో పడింది. జిల్లా నాయకత్వం రాష్ట్ర నాయకత్వంతో తెగతెంపులు చేసుకుంది. సాయుధ పోరాటం ప్రారంభమైంది 1968 నవంబర్ 25. ఈసరికి గ్రామ కమిటీల నిర్మాణం, గెరిల్లా దళాల నిర్మాణం కూడా జరిగింది. పార్వతీపురం ఏజన్సీలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం నాయకత్వంలో భూస్వాములపై దాడి ప్రారంభమైంది. వర్గశత్రు నిర్మూలనం ప్రారంభమయింది. అటు ఉద్దానంలో పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రహి, కామాడ గణపతి మొదలైనవారు నాయకులు. 1960లో పోరాట స్ఫూర్తికోసం తెలంగాణా పోరాట గీతాలాలపించేవారు. ముక్కామల నాగభూషణం రచించిన 'అరుణపతాకకు జై' అనేపాట కొండల్లో మారుమ్రోగింది. 1966,68 వచ్చేసరికి వెంపటాపు సత్యనారాయణ పోరాట అవసరానికి అనుగుణంగా పాటలు కట్టాడు. అక్కడ ఉద్దానంలో సుబ్బారావు పాణిగ్రాహి పాటల్నే ఆయుధాల్ని చేసి ప్రజల్ని మేల్కొలుపుతున్నాడు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి. జలగం వెంగళరావు హోమ్‌మంత్రి. వల్లూరి బసవరాజు రెవిన్యూ మంత్రి. వీరు జిల్లా అంతా పర్యటించి భారీగా పోలీసుల్ని

దించారు. వారు చాలక ప్రత్యేక పోలీసు దళాల్ని దించారు. వారూ చాలక-చివరికి పారా మిలటరీ దళాల్ని దించారు. 1968-70లలో పోరాటం ఉచ్ఛాదశ చేరుకున్నది. ఈ సమయంలో సుమారు 300 గ్రామాల్లో ఎర్రరాజ్యం ఏర్పడింది. జలగం వెంగళ రావు ప్రత్యేక ఆదేశాల్తో పోరాట వీరులపై పోలీసువేట సాగింది. పంచాది కృష్ణ-మూర్తి, సుబ్బారావు పాణిగ్రాహి, పంచాది నిర్మల, తామాడ గణపతి-చివరికి 1970 జూలై 10న వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం పోరాటంలో నేల కొరి గారు. పోరాటం తాత్కాలికంగా సద్దుమణిగింది.

కేవలం రేఖా మాత్రంగా చెప్పిన పోరాట చరిత్ర ఇది.

చలసాని ప్రసాద్‌గారు ఒక సందర్భంలో అన్నట్టు దాదాపు ఒకేకాలంలో బయ ల్దేరిన జై ఆంధ్ర ఉద్యమం, ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమం, శ్రీకాకుళ ఉద్యమం-ఈ మూడింటిలో మొదటి రెండూ బూర్జువా ఉద్యమాలు. శ్రీకాకుళ ఉద్యమం మాత్రమే ప్రజా ఉద్యమం. రైతాంగ పోరాటం. కనుకనే రాజకీయంగా దానికొక ప్రాముఖ్యత వున్నది. అపూర్వమైన సాహిత్య సృష్టికి దోహదం చేసింది.

ఆదిలో చిల్లర వ్యాపారాలు, అనంతరం ఉపాధ్యాయ వృత్తి చేసిన వెంపటాపు సత్యం 1956 ప్రాంతాలనాటికే రెండూ వదిలేసి ఉద్యమంలో తలమునకలయ్యారు. గిరిజనుల్ని చైతన్యవంతుల్ని చెయ్యడం కోసం బొబ్బిలియుద్ధం, నర్తనశాల, అల్లూరి సీతారామరాజు మొదలైన బుర్రకథలు చెప్పేవాడు. వాటినిండా సమకాలిక రాజకీయాలే వుండేవి. క్రమంగా పోరు పెరగడంతో 1960 తరువాత కాలంలో స్వంతంగానే పాటలు కట్టడం ప్రారంభించారు.

"కండ బిగువు కలిగినట్టి
కొండజాతి పేదవాడా
ఉప్పెనవలె ఒక్కసారి
లేచి ముందు కురకరా"
అని పిలుపిచ్చాడు

ఆ సమయంలో — దిగంబరులు సమాజానికి శస్త్రచికిత్స చేస్తామని బయల్దే రారు. సి.వి. సమాజాన్ని కదిలించే రచనలు చెయ్యనారంభించాడు. మహాకవి శ్రీశ్రీకి బహిరంగ లేఖ రాశాడు. 'కారు చీకటిలో కాంతిరేఖ'లు వెలిగించనారంభించాడు.

సుబ్బారావు పాణిగ్రాహి వచన కవితలు గేయాలు రాయడం ప్రారంభించాడు. 'విప్లవ కవిత్వం' అనే పదానికి గల పూర్తి అర్థంలో విప్లవ కవిత్వం రాసిన తొలి కవి వెంపటాపు సత్యనారాయణే.

మార్క్సిస్టు భావ జాలాన్నీ, మావో ఆలోచన విధానాన్నీ స్థానిక పరిస్థితులకు అన్వయించి కవిత్వాన్ని విప్లవీకరించిన తొలి కవి వెంపటాపు సత్యనారాయణే. సమగ్రమైన చారిత్రక దృక్పథంతో కవిత్వంలో గిరిజన రైతాంగాన్ని మేల్కొలి పాడు-

అదిగదిగో నీజాతి
అల్లదుగో ఉత్తరాన
నాగాలా మీజోలా
వారంతా మనవారే
నరహంతకులను బట్టి
నుగ్గునుగ్గు చేస్తున్నారు
ఒక్కటోపీలు పెట్టి
వచ్చినట్టి మిలటరీని
తరిమి తరిమి కొట్టారోయ్
డార్జిలింగు జిల్లాలో
నక్సల్బరి ప్రాంతంలో
కొండజాతి వీరులంత
ఒక్కుమ్మడిగా లేచి
జుత్తుపట్టి భూస్వాముల
నెత్తి పగుల దన్నారోయ్
విల్లంబులు చేతబట్టి
తెల్లదొరల పీకబట్టి
కల్లోలము సృష్టించిన
వారంతా మనవారే
తాంట్రాజు పితూరిలో
పెరుగాంచె మనవారు
టుబ్బులతో తెల్లదొరల
దద్దరిల్ల గొట్టారోయ్

సాలూరు కొండల్లో
సాహసించె మనజాతి
బస్తరు కొండలలోన
బాదినారు శత్రువుల్ని
ఉత్తర ప్రదేశ్‌లోన
ఉరిమె నదిగో తెరైలోన

1968 నవంబర్ 25న సాయుధ పోరాటం ప్రారంభమై వర్గశత్రు నిర్మూలనం ప్రారంభించాక, ఆ రకం సంఘటనలను వివరిస్తూ వెంపటాపు సత్యం కొన్ని పాటలు రాశాడు—

చిక్లేరు కొండలలోన
విల్లులతో పోరాడిరి
ఆవిరి కొండలలో వీరులు
ఘన విజయం సాధించిరి
పోరాట ప్రారంభమే
మొట్టమొదట ఈ కొండల్లో
....
ప్రజా సైనిక వీరులు
పౌరుషము విరజిమ్ముతు
ప్రజా కంటకులను చంప
ప్రతిన బూనియున్నారు

ప్రజల్ని పోరాటానికి సన్నద్ధుల్ని చెయ్యటం కవిత్వానికి ప్రధాన లక్ష్యం. పోరాటంలో ప్రజావీరులు సాధించిన విజయాల్ని గానంచేసి వారిని, ఉత్తేజపరిచేవాడు. పోరాట సంఘటనలను, వర్గశత్రు నిర్మూలనను వివరించే సంఘటనలను పాటలో కట్టేవాడు. ఇటువంటి పాటలు బహుశా అప్పుడప్పుడు కూర్చి చివరికొక పెద్దపాట కూర్చేవాడు గెరిల్లా దళాల విజయాలతో దండగుచ్చిన ఈ పాట చూడండి.

ఆవిరి కొండలలో మనసోదరులంతా
అర్జునులై విల్లంబులు పట్టి
శత్రువు గుండెలు చీల్చగ కొండలలో
నెత్తురు కార్చెను....భళీ....భళీ....
గిరిజన గెరిల్లా వీరులైదుగురు

సింగములరీతిన చెంగున దూకి
దక్షిణనున్న శత్రు క్యాంపుపై
ధనధన పేల్చిరి నాటు తుపాకులు
రక్తము కక్కుచు శత్రువులార్గురు
మూకుమ్మడిగా చచ్చారా....హై....హై....

సంతసంబుగా సంతోషపురము
గడ్డలోన మన వీరులు గాంచి
చక్కగను గురిచూచి కొట్టిరి
శత్రువు గుండెలు చీల్చకపాయె
అయ్యో యనుచు శత్రువు లైదుగురు
అచ్చటనే మరణించారు .... హై....హై....

వీరుడైన వీరన్న దళంబు
విల్లంబులతో మాటుగాసిరి
రక్కసి మూకలు త్రోవనబోవ
డొక్కలోన గురిచూసి కొట్టిరి
అమ్మాయనుచు శత్రువురివురు
అచ్చటనే మరి చచ్చారై .... హై.... హై....

శత్రువు గుండెలు రక్తముకారెను
కొండచూచి వాడి గుండె జారెను
భూస్వాముల ఏజంటుగ తిరిగిన
ఖిడ్డిక సంగడి వద్దకు పోయి
గుండెమీద మన వీరులు పొడిచి
గుమ్మితీసి పాతేశారై .... హై .... హై....

ప్రజల ఇండ్లకు నిప్పుపెట్టిన
పరమ కిరాతకుని పడగొట్టాలని
లోవమడకు మనవీరులు వెళ్ళి
ఘాదుక రామయ్య నురిలీశారై .... హై .... హై....

కొండకోడివాగు పేశిన గోపయ్య
కొండల మధ్యను దున్నుచునుండగ
గండర గండడు గంగన్నదొర వలస
మొయిలయ్యేరూ మెడ విరిచి చంపెనోయ్

ఈతమాను గూడ జమ్మినాయుని
ఇంటికే మనవీరులు వెళ్ళగా
ఏడుగురు భార్యలతోడ
క్రీడలాడుచు నుండెనువాడు....
గడగడలాడుచు గోతులు త్రవ్వుచు
భీతితోడ మరి బతుకుతు ఉండె

కొండలలో భూస్వాము లెవ్వరు
ఉండకూడదని వీరులు తలచి
మొండెంఖల్లు గ్రామమునందు
మదం బలిసిన ఓళ్ళ త్రినాథుని
చిత్తు చిత్తుగా ముక్కలు చేసి
ధరణిపైన బరిచారా హై .... హై ....

బొక్కరినున్న సృష్టికరణమును
ముక్కలు చేసిరి మన వీరులుగా
ఎక్కడినున్న శత్రువులైనను
వెదికి వెదికి చంపాలని తిరిగిరి

సివదనుండి సింహాద్రినాయుడు
తగవు తీర్చుటకు చర చర వచ్చె
వచ్చినవాడిని గొడ్డలి టిప్పతో
ఒక్కదెబ్బకే నరికిరి హై .... హై ....
పట్టపగలు వాడి జుట్టుపట్టుకుని
పందివలె పడదోసి చంపిరి

పేదరైతులను పీల్చుకుతిన్న
పరమ కిరాతకుని పడగూల్చాలని

వందలాది ప్రజ తుంబలి వెళ్ళి
గుడ్ల సిద్ధాంతిని గొడ్డలి టిప్పతో
ఒక్క దెబ్బతో నరికియు వాడి
యావదాస్తులు మోసుకొచ్చిరి

వందమంది మన వీరుల దెబ్బకు
వణుకుచుండిరి మన శత్రువులంతా
ఇంటింటను ఒక వీరుడు లేచి
కంచుకోట నిర్మించుర కొండలు....

ఈ పాటను దాదాపు పూర్తిగా ఉదహరించడానికి కారణం 1969లో పోరాట విజయాలు ఎక్కువభాగం ఈ పాటలో వుండటమే. అవిరి కొండలలోనూ దక్షిణ కొండలలోనూ పోలీసు క్యాంపులపై దాడి, సంతోషపురంలో శత్రువులపై దాడిచేసి అయిదుగురు పోలీసుల్ని చంపడం; బిడ్డిక గంగడు, పూయిక రామయ్య, పేసిన గోపయ్య, ఈతమానుగూడ జమ్మినాయుడు, మొండెంఖల్లులో ఓళ్ళ త్రినాధు, పొక్కిరి శిష్టికరణం, సివడ సింహాద్రినాయుడు, తుంబలి గుడ్ల సిద్ధాంతి మొదలైన వర్గశత్రువుల్ని చంపడం - ఈ సంఘటనలన్నీ ఇందులో వున్నాయి. ఇందులో పోలీసుల్ని చంపడం, పోలీసు ఏజంటుల్ని చంపటం, వర్గశత్రువుల్ని చంపడం - అనే రకాల ఘటనలున్నాయి.

కేవలం పోరాటం సాగించడమేకాక, మావో రచనలు కూడా అధ్యయనం చేసేవారు. గెరిల్లా దళాల కోసం, నిరక్షరాస్యులైన గిరిజనుల కోసం వెంపటాపు సత్యం - మావో సూక్తుల్ని, ఆ రోజుల్లో బాగా ప్రచారంలో వున్న సినిమాపాట "అన్నా అన్నా విన్నావా అన్న కృష్ణుని లీలలనూ, అల్లరికృష్ణుని లీలలనూ-" అనే వరసలో కూర్చాడు. పాట సుదీర్ఘమైనది. గనక ముఖ్యమైన చరణాలు ఉదహరిస్తున్నాను.

అన్నా అన్నా విన్నావా
మొన్నడైనా విన్నావా
పీడిత జాతికి విముక్తి చూపే
మావో సూక్తుల విన్నావా

అధికారం మన చేతికిరానిదె
అంధకారమట మన బ్రతుకు
తుపాకి గొట్టం ద్వారా రాజ్యం
తప్పక వచ్చని చెప్పాడు

ప్రజల కోసమై మరణించుట
మహాపర్వతము కన్న బరువటరా
దోపిడి మూకల కొరకు చచ్చుట
యీక కన్న మరితేలికటా

అభివృద్ధి నిరోధకులందరు
కాగితపు పులులని చెప్పాడోయ్
అందుకె ఒక భూస్వామి ఖతమైతె
అందరు పరుగెడుతున్నారోయ్

ప్రజాసైన్యము లేనిది ప్రజలకు
మిగిలేదేమియు లేదటరా
ప్రజాసైన్యములో చేరి శత్రువును
పరిమార్చమన్నాడటరా

ఉత్పత్తిలో మన ప్రజాసైన్యము
తప్పక పాల్గొనునట్లు చేయవోయ్
లోతుగ ప్రజలతో సంబంధం
ప్రతీవారికీ ఉండాలటోయ్.

వ్యూహం రీత్యా శత్రువునేమొ
తేలికగా చూడాలటనోయ్
ఎత్తుగడలలో శత్రువును మరి
సరిగా అంచనా వేయాలోయ్

గిన్నెలో అన్నము ఒకొక్క ముద్ద
తినటము తేలిక నిజముకదా
అట్లాగే అభివృద్ధి నిరోధకులను
అంతం చేయుట మన విధటోయ్

దీర్ఘకాలము పోరాటానికి
అందరు సిద్ధముగుండాలోయ్
శత్రునాశనం అయ్యేవరకూ
చేయాలటనోయ్ పోరాటం

పోరాట అవసరంగా తయారయ్యే ప్రజా సాహిత్యం ఎంత నిరాడంబరంగా, సహజంగా, శక్తివంతంగా వుంటుందో చెప్పటానికి ఈ పాట మంచి ఉదాహరణ.

కేవలం పాటలేగాక వెంపటాపు సత్యం ఒక బుర్రకథను కూడా రాశాడు. 1967 అక్టోబర్ 31 లేవిడి సంఘటన వరకూ గల ఉద్యమ చరిత్రను ఒక అన్న బుర్రకథగా రాశాడు. వెంపటాపు సత్యం సాంస్కృతిక దళంలో గోవిందు సింహాచలం, దుప్పల గోవిందరావు, హరిపురం సవరరాజు, ఆరికసోములు, పత్తిక సుంచులు, పైల భీముడు, తాడంగి ఆదినారాయణ మొదలైనవారు ఉండేవారు. మొదటి యిద్దరు తప్ప మిగతావారంతా గిరిజనులే. ఈ దళం శ్రీశ్రీ పాటలు, గురజాడ దేశభక్తి గీతం మొదలైనవి పాడేవారు.

వెంపటాపు సత్యం పాటలు, చిన్న బుర్రకథ కలిపి "శ్రీకాకుళ సత్యం" పేర చిన్న పుస్తకంగా వచ్చింది. (విరసం ప్రచురణ, మార్చి 1973). ఈయన రాసినదే "శ్రీకాకుళ గిరిజనోద్యమ సంక్షిప్త చరిత్ర" అనే పుస్తకం (1973) కూడ విరసం ప్రచురించింది. ఈ రెండూ నేటికి పునర్ముద్రణ కాలేదు.

ఆరికె సోములు గిరిజనుడు. ఉద్యమ ప్రభావంతో చదవడం రాయడం నేర్చుకున్నాడు. అపుడుగా పాటలు కట్టేవాడు. ఆయన రచనగా ఒక్క పాట మాత్రం నేడు లభిస్తుంది (అది పోరపాటున వెంపటాపు సత్యం పాటల పుస్తకంలో చేరింది). ఒక్కగానొక్క పాట కనుక దాన్ని పూర్తిగా ఉదహరిస్తున్నాను.

అన్నలారా వినండి - గిరిజన కామ్రేడ్స్
మాయమర్మములేని - మగువలారా గనుడి
మన సంఘము పోతే - మన ఐక్యతే పోతె
సంఘము లేనపుడు - పొందిన బాధలను
పడుట తప్పదు తల్లి - మరవబోకండమ్మ
మన సంఘ బలముచే - సాధించు విజయము

మరువక మనమంత - ఐక్యముగా నిలిచి
భూస్వాములందరిని - త్రోవ పట్టించాలి
సాయుధ మూకలను - తరిమి కొట్టాలన్న
మన భూములన్నియును - మనకు రావలయునన్న
కొండలలో దోపిడీ - ఉండకూడదురన్న

మన కష్టాలు - లెక్క వేయకుమన్న
కష్టాలు తెచ్చినా — కారకులనూబట్టి
పొంగించి రక్తమూ - త్రాగపరుగునరారా

మనచిట్టితమ్ములూ - కోరన్న మంగన్న
గెరిల్లా యోధులూ - గోదారీ కర్రెన్న
మన వీరయోధులూ - భీమన్న రెంజింరో
భూస్వామ్య గూండాల - పోలీసు మూకల
తూపాకికి గుండ్లాకు - నేల కొరిగినారు

తమ్ముల రక్తముతో - ధరణి తడిసెరన్న
జబ్బ సత్తువయున్న - గిరిజన పెద్దన్న
దెబ్బకు దెబ్బమె - తీయాలి వోరన్న

తల్లులు, భార్యలు - మన అక్క చెల్లెలను
అవమానపర్చినా - హంతకులనూ బట్టి
పొడిచి రక్తము త్రాగ - పరుగు పరుగున రారా
వీరులారా రండి - ఈల వేసుకొంటూ

వనితలారా రండి - మీ శక్తి చూపంగ
భయము చెందేమంటె - బాధలూ తప్పవుర
సంఘమున్నది మనకు - నడుము బిగియిద్దాము
భయము లేకను నిలద - జయము మనదేనన్న

ఈ అరికె సోములును పోరాటం ఆగిపోలేదు మళ్ళీ ప్రజ్వరిల్లుతుందేమోననే దశలో 4-9-1973 న ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపేశారు పోలీసులు.

సుబ్బారావు పాణిగ్రాహి కార్యరంగం ప్రధానంగా సోంపేట పరిసరాల్లోని ఉద్దానం ప్రాంతం. ఆ ప్రాంతం కొబ్బరి తోటలతో, పచ్చని పంటలతో ఉద్యాన వనంలా వుంటుంది. అందుకే దానికా పేరొచ్చింది. పాణిగ్రాహి ఒరియా బ్రాహ్మణ పూజారి కుటుంబంలో పుట్టాడు.

మాతృభాష ఒరియా. కాని తెలుగు, హిందీ బాగా వచ్చును. బెంగాలీకూడా కొంతవరకు వచ్చును. హైస్కూల్లో చదువుకునే రోజుల్లోనే కమ్యూనిస్టుపార్టీ వైపు ఆకర్షితుడయ్యాడు. 1956 గోదావరి వరదల సమయంలో —

"వినండి బాబూ విషాదగాథ
గోదావరినది వరదలబాధ"

అని పాటకట్టి విరాళాలు సేకరించి బాధితులకు అందించాడు నాటకాలు రాసేవాడు. వాటిలో తానే నటించేవాడు. 1957లో "ఏది సత్యం?" అనే నాటకంలో అతను ధరించిన పాత్రకు ఖరగపూర్ "కళాసమితి" వారు బహుమతి యిచ్చారు. 1965 నాటికి వచన కవితలు, గేయాలు చురుగ్గా రాయడం ప్రారంభించాడు. జనశక్తి ఉపాధ్యాయ మొదలైన పత్రికల్లో పాణిగ్రాహి రచనలు అచ్చవుతుండేవి. శ్రీశ్రీ, సి. వి.రచనల ప్రభావం మొదటి రోజుల్లో పాణిగ్రాహిపై ఎక్కువగా వుండేది. 1967 నాటికి పోరాటంలోకి వచ్చాడు. పాటలు రాయటం, పాడి ప్రచారం చెయ్యడం ప్రారంభించాడు.

కమ్యూనిస్టులం మేము కష్టజీవులం
ఔనన్నా కాదన్నా అదే యిష్టులం
అన్యాయాన్నెదిరిస్తాం
న్యాయాన్నే పూజిస్తాం
అడ్డంకులు దాటేస్తాం
మా కార్యం సాధిస్తాం
....
అరెస్టులను సాగించి
ప్రజాశక్తి నడ్డలేరు
అరచేతిని అడ్డుపెట్టి
సూర్యకాంతి నాపలేరు

ఈ ప్రసిద్ధమైన పాట 1966 కు ముందే రాశాడు. ఇవ్వాళ దీని ప్రఖ్యాతి ఎంతటిదో ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. పాటలలోని కొన్ని చరణాలు సూక్తులుగా పదనెక్కి గోడలెక్కి పాలకవర్గాన్ని గడగడ లాడిస్తున్నాయి. నేటికీ —

దిక్కు మొక్కు లేని జనం
ఒక్కొక్కరు అగ్నికణం
సింహ కంఠనాదంతో
వస్తారిక కాచుకోండి
కోట్లగొంతు లొక్కసారి
గర్జిస్తాయి గర్జిస్తాయి
సీట్లమీద కూర్చున్న
మంత్రులార ఖబడ్దార్

నిత్య వ్యవహారానికి చేరువైన చిన్న చిన్న పదాలుండటం, పోరాటంచేత ప్రతిబింబించటం మొదలైన కారణాలవల్ల పాణిగ్రాహి కవితలో సూక్తులవంటి వాక్యాలు కొల్లలుగా కనిపిస్తాయి.

ఎడమచేత పట్టబోయి ఎర్రనిజెండా
పిడికిలి బిగియించబోయి మరొక చేతా
....
అదుగదుగో ఆకసాన అరుణపతాకం
రా రమ్మని సైగ జేసె
పిలుపు నందుకోవోయ్

అలాగే - ఏడుపు గురించి రాసిన పాటలో ఈ చరణాలు బాగా ప్రసిద్ధమయ్యాయి.

ఎరుపంటే కొంపలకే భయం భయం
పసిపిల్లలు వారికన్నే నయం నయం
....
ఏడుపులోనె మెరుపుంది పోరాడే శక్తుంది
శ్రమ జీవుల హక్కులకై ఎలుగెత్తే అరుపుంది

గిరిజన పోరాట చరిత్రను లేవిడి సంఘటన (1967 అక్టోబరు 31) వరకూ జముకుల కథగా రాశాడు. వెంపటపు సత్యం బుర్రకథ పాణిగ్రాహి వినివుంటాడు. ఒకటిరెండు చోట్ల చరణాలకు చరణాలకు వచ్చి తన కథలో చేరిపోయాయి. పాటల కంటె కూడా బాగా జముకులకథ జనాదరణ పొందింది. ఈ జముకుల కథ —

"జై భారతజననీ
నమో పతిత పావనీ"

అనే ప్రార్థనతో ప్రారంభమౌతుంది. ఈ కథలో తామడ చినబాబు అనే 15 ఏళ్ళ కుర్రవాడు వేసే 'ఆంధ్ర వనిత' వేషం ప్రత్యేకాకర్షణ. చూడ ముద్దొచ్చే వాడట. అతి కమ్మని కంఠంట. (పోలీసులు ఈ బాలుడ్ని కాల్చేశారు.) ప్రధానమైన పాటంతా చినబాబే పాడేవాడట. రెండు గంటలపాటు సాగే ఈ జముకుల కథ నాటికీ నేటికీ పోరాట చరిత్రను వాస్తవానికి దగ్గరగా వివరించే ఏకైక కళారూపం.

పాణిగ్రాహి పాటలు పాణిగ్రాహి జీవితకాలంలో అరుణకిరణాలు (1966), అగ్నికణాలు (1968), అనే పేర చిన్న పుస్తకాలుగా వచ్చాయి. మరణానంతరం ఈ రెండూ కలిసి 'ఎరుపు' అనే పేర విరసం ప్రచురించింది (జనవరి 1972). జముకులకథ విరసం (1973 మే) ప్రచురించగా, జనసాహితి (1985 జూన్) పునర్ముద్రించింది. పాణిగ్రాహి పాటలు, విపులమైన వ్యాసాల పీఠికతో ఏ. రాంబాబు సంకలనం చేయగా విరసం, విజయనగరం యూనిట్ ప్రచురించింది (1982 డిసెంబర్). ఈ పుస్తకాలేవీ ఈనాడు అందుబాటులో లేవు. పునర్ముద్రణ కాలేదు.

సమకాలిక కవులందరికన్నా శ్రీకాకుళ పోరాటప్రభావం శివసాగర్‌పై ఎక్కువగా పడింది. 1969 చివర్లో రాసిన 'నరుడో భాస్కరుడా' పాట విప్లవ కవిత్వంలోనే ఒక మైలురాయిగా నిలిచింది, తెలంగాణా ప్రాంతంలో ప్రజలు పాడుకునే ఒకపాట ఈ పాటకు ప్రాణాన్నిచ్చిందని కవే స్వయంగా చెప్పుకున్నాడు. ఇది గుంటూరు జిల్లానుంచి వచ్చి శ్రీకాకుళ పోరాటంలో పోలీసు కాల్పులకు మరణించిన డా॥ చాగంటి భాస్కరరావు గురించి రాసిన పాట —

నర్రెంగ సెట్టుమీద నరుడో! భాస్కరుడా!
కన్నెర్ర సేస్తివయ్య నరుడో! భాస్కరుడా!
కన్నెర్ర జేసినీవు నరుడో! భాస్కరుడా!
కదనాన దూకితివా నరుడో! భాస్కరుడా!
బర్రెంక సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
బందూకు పట్టివయ్య నరుడో! భాస్కరుడా!
బందూకు సేతబట్టి నరుడో! భాస్కరుడా!
బంధాలు తెంచ్తివయ్య నరుడో! భాస్కరుడా!

ఈ పాటలో ప్రతిచరణంలోనూ ఒక చెట్టు పేరుంటుంది. ఇలా పాటనిండా

చెట్లు కనపడటం అవన్నీ, అక్కడి అన్నల్ని గుర్తుతెస్తాయి. రెండో వాక్యమే కొద్ది మార్పుతో మూడో వాక్యంగా సాక్షాత్కరిస్తుంది. ఇలా దాదాపు అన్ని చరణాల్లోనూ జరుగుతుంది. ఈ పద్ధతి పాటకు ఎక్కడలేని శక్తిని యిస్తుంది.

నీదు శౌర్యం సూసి నరుడో! భాస్కరుడా!
కళ్ళల్లో జిల్లేళ్ళు నరుడో! భాస్కరుడా!
కళ్ళల్లో జిల్లేళ్ళతో నరుడో! భాస్కరుడా!
నీ శిరసు తీస్తిరయ్య నరుడో! భాస్కరుడా!

భాస్కరుణ్ణి చంపారు శత్రువులు. కాని భాస్కరుడు చూపినబాటలో వేలాది సూర్యులు ఉదయిస్తున్నారు.

నీవు సూపిన బాట నరుడో! భాస్కరుడా!
మా వొద్ద బాటయ్య నరుడో! భాస్కరుడా!
నీ బాటనె మేము నరుడో! భాస్కరుడా!
బందూకు పట్టాము నరుడో! భాస్కరుడా!

శివసాగర్ కవిత్వం మొత్తం శ్రీకాకుళ పోరాట ప్రభావానికి ఉదాహరణగా చూపవచ్చు.

అసలు నక్సల్బరీలో పోరాటం రగుల్తున్నపుడు దాన్ని శివసాగర్ ఆహ్వానించాడు.

తూర్పు పవనం వీచెనోయ్
తూర్పు దిక్కెరుపెక్కెనోయ్
భరతభూమి కనులు తెరచి
వెలుగు రవ్వలు కురిసెనోయ్
వీపు పైన చద్దిమూట
చేతిలోన గండ్ర గొడ్డలి
మనసులోన మావొసి.టూంగు
గుండెలోన ఎర్రజెండా
రైతుబిడ్డడు లేచెనోయ్
రైతుబిడ్డడు గెరిల్లాగా
సింహగర్జన చేసెనోయ్

ఈ పాట రచనాకాలం నాటికి (1968) శ్రీకాకుళ పోరాటం సాయుధ

మాటున్నది. 'జేగంటలు' ప్రయోగించి ప్రజావిముక్తి సమరంలో చేరమని పిలుపిచ్చాడు (1969).

రండోయ్! రండోయ్
ప్రజావిముక్తి సమరంలో
చేరగ వేగమె రండోయ్
రండోయ్! రండోయ్!

1969 అక్టోబర్ 8వ తేదీ రాత్రి ఆదిభట్ల కైలాసం, నాగభూషణం పట్నాయక్ మొదలైన పదకొండుమంది విప్లవకారులు విశాఖ సెంట్రల్‌జైలు నుండి తప్పించుకున్నప్పుడు శివసాగర్ 'మాతృఘోష' వినిపించాడు.

బానిసత్వం జైళ్ళనుండి పరారీ అయిన వాళ్ళారా!
రండి నా కుటీరానికి
దాటలేని గోడల గూఢచారాన్ని దాటిన వాళ్ళారా !
నా కుటీరానికే రండి

'చెల్లీ చెంద్రమ్మా' పాటలో వర్గశత్రు నిర్మూలనం స్పష్టంగా ఉన్నది. సంప్రదాయ జానపదరీతుల్ని విప్లవభావ ప్రచారానికి శివసాగర్ ప్రతిభావంతంగా వినియోగించుకున్నారు.

చౌదరి తేజేశ్వరరావు మొదలు శివసాగర్, కానూసన్యాల్ వరకూ 140 మంది మీద - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (హోంమంత్రి జలగం ఆదేశాల్తో) కుట్రకేసు బనాయించినప్పుడు శివసాగర్ 'కుట్రదారు వాంఙ్మూలం' ఇలా ఇచ్చాడు.

న్యాయమూర్తులంగారూ !
సూర్యోదయం కుట్రకాదు
సూర్యుడు కుట్రదారుడు కాడు
నిండుచూలాలి ప్రసవవేదన కుట్రేనంటారా ?
....
భూమిని చాపచుట్టగా చుట్టి
చంకన పెట్టుకున్న రాక్షస భూస్వామ్యం కుట్ర

నా దేశాన్ని విదేశాలకు తెగనమ్మే
దగాకోరతనం కుట్ర
....
భారత స్వాతంత్ర్యం కుట్ర
బ్యాలెట్ బాక్సు కుట్ర

శ్రీకాకుళ పోరాటం పూర్తిగా సమసిపోలేదని, దానికి తగిలిన దెబ్బ తొడకే గాని గుండెకు కాదనీ - 'ఓ! విలుకాడ' అనే పాట రాశాడు. 'ఉద్యమం నెల బాలుడు'లో ఉన్నది మొత్తంగా శ్రీకాకుళ ఉద్యమ నెలబాలుడే.

వెంపటాపు సత్యం పోలీసు తూటాలకు గురయిన వార్త విన్న విశాఖ సెంట్రల్ జైలులోని శ్రీకాకుళం విప్లవకారులు సామూహికంగా తమ స్మృతుల్ని బాధల్ని మనసం చేసుకొని ఉత్తేజం పొంది ఈ పాట రాశారు. ఇది శ్రీకాకుళ పోరాట గీతాల్లోని అయిదారు ఉత్తమ గేయాల్లో ఒకటి.

ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే
శ్రీకాకుళమువైపు చూడమని చెప్పాలి
వెంపటాపు సత్యమెవ్వరని అడిగినా
గిరిజనులె సత్యమని గొప్పగా చెప్పాలి
సత్యములో శక్తిసాధనము అడిగితే
మావో మహాశయుని మార్గమని చెప్పాలి
సత్యము మేష్టారు స్థానమెచటని యడుగ
గిరిజనుల హృదయాలు గురుతుగా చూపాలి
....
ఈ మహోజ్వల వీర శ్రీకాకుళము పేర
లిఖియించు చరితకు నిర్మాత ఎవరన్న
నేటి విప్లవకవుల కావ్యాలు వినిపించి
సత్యమును పూర్తిగా తెలుసుకోనివ్వాలి
సత్యమే విప్లవము విప్లవమే సత్యమని
విప్లవము సత్యమూ ఒకటనీ చెప్పాలి
ఎర్రజెండా ఇంత ఎరుపేమిటని యడుగ
సత్యము రక్తముతో తడిసెనని చెప్పాలి

వెంపటాపు సత్యం పేరుచెబితే - ఇరవైయేళ్ళ తరవాత ఈనాటికీ కూడా శ్రీకాకుళం గిరిజనుడి గుండె ఉద్వేగంతో ఉప్పొంగుతుంది. వెంపటాపు సత్యం నిస్సందేహంగా శ్రీకాకుళం మావో. ఇది అతిశయోక్తులులేని సత్యం. చరిత్ర చెప్పిన సత్యం. పోరాటం ఉచ్ఛదశలో ఉన్న సమయంలో వెంపటాపు సత్యం, చారు మజుందార్ కలిశారు. చారుమజుందార్ ఆ పర్యటన తర్వాతే "శ్రీకాకుళం భారత దేశపు యేనాన ?" అన్నాడు. నక్సల్బరీ పోరాటంపైనా, చారుమజుందార్‌పైనా విప్లవ కారులు పాటలు కట్టారు.

నక్సల్‌బరి నిర్మాత
నవసమాజ నిర్నేత
....
నీ రూపే నక్సల్‌బరి
నీ సృష్టే అగ్నికణం
నీ వాంఛే శత్రుఖతం
నీ లక్ష్యమె సోషలిజం

నీ పిలుపే విప్లవము
నీ త్యాగమె క్రాంతిపథం
నీ ఊపిరి పెనుతుఫాను
నీ చలనమే భూకంపం

మావో ఆలోచనయే
మనకు మార్గమని చెప్పి
మనదేశ పరిస్థితులకు
అన్వయింపజేశావు

నక్సల్బరి పుద్యమంలో
అగ్రగామిగా నిన్ను
భారత విప్లవ జ్యోతని
ప్రకటించెను జనచైనా

శ్రీకాకుళ గిరులలోన
చెలరేగిన సింహాలు
నిర్మించిన చరితలోన
నిలిచింతిలె నీపేరు

ఆదివాసీ జీవితంలో కళారూపాలు

సాధన

నేటికీ ఆదివాసీ జీవితం మారుమూల కొండల్లో ప్రధానంగా ప్రకృతిపై ఆధారపడే సాగుతుంది. వారి జీవిత విధానం నుండే వారికి 'గిరి'జనులు అని కానీయండి, 'ఆది'వాసులు అని కానీయండి పేర్లు దోపిడి వర్గాలచే సుస్థిరం చేయబడినాయి. వీరిలో నేటికీ పోడు వ్యవసాయమే ప్రధానంగా కొనసాగిస్తున్నవారు ఉన్నారు. వీరు మార్చి/ఏప్రిల్ మాసాల్లో అడవి నరుక్కుంటారు. కొద్దిరోజుల అనంతరం కాలుస్తారు. మే మాసం చివరినాటికి మొదటిసారిగా కాల్చగా మిగిలిన దుంగలన్నీ రెండవ దఫా తగలవెడతారు. జూన్ నెలలో కురిసే తొలకరి వర్షాలతో కాల్చిన వేడికి ఆ దుంగల బూడిదతో ఆ భూమి పొంగుతుంది. జూలై మాసం నాటికి అందులో కోల, కోసిరిలాంటి అతి పురాతన ఆటవిక రకాలైన పంట (వరి) అలుకుతారు. దున్నడం లాంటి ప్రక్రియలు ఇంకా ఇక్కడ పుట్టలేదు. ఇక్ష్వాకులకన్నా పురాతన పద్ధతుల్లోనే పోడు వ్యవసాయం నడుస్తుంది. వరితోపాటు మినుములు కూడ జత కలిపి అలుకుతారు. విత్తనాల తీరును బట్టి సెప్టెంబర్-అక్టోబర్ నాటికి గానీ వరిపంట చేతికిరాదు.

శ్రీకాకుళంలో ప్రాణాలు చిందించిన అమరవీరులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, పంచాది నిర్మల, సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ గణపతి మొదలైనవారిపై లెక్కకు మిక్కిలిగా స్మృతి గీతాలున్నాయి.

పోరాట విజయాన్ని వివరించే పాటలు, పోరాట వీరులపై స్మృతి గీతాలు మాత్రమే కాక - రివిజనిజంపైన చేసిన సైద్ధాంతిక పోరాటాన్ని వివరించే పాటలు కూడా వున్నాయి.

ఉద్యమాల్లో పుట్టే సాహిత్యం ఇతర కాలాల్లోని సాహిత్యం కంటె ఎంతో సజీవంగా వుంటుంది. ఉద్యమం సాహిత్యానికి రక్తశుద్ధి చేస్తుంది. శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటం — తెలుగు సాహిత్యంలోని అన్ని రంగాల్నీ — కవిత్వం, కథ, నవల, విమర్శ, పత్రికారచన — అన్నిరంగాల్నీ ప్రభావితం చేసింది. శ్రీకాకుళం ఇచ్చిన ఉత్తేజంతో ఆవిర్భవించిన విప్లవ రచయితల సంఘం ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యంలో కీలకమయిన మలుపు తీసుకొచ్చింది. సాహిత్యాన్ని ప్రజలపరం చేసింది.

బయటి ప్రపంచముతో నామమాత్ర సంబంధాలు కలిగియున్నవారు కేవలం ఉప్పుకోసం, పూసాల పేర్లకోసం వారం వారం జరిగే అంగడికి పోతారు వీరు. అబూజ్‌మహాడ్ గుట్టలపై గల దాదాపు 250 గ్రామాల్లో (100గ 80) నేటికీ వీరి జీవనం ఇలాగే ఉంది.

మరోవైపు గుట్టలపై నుండి బలవంతంగా మైదాన ప్రాంత అడవిలోనికి దింపి వేయబడిన ఆదివాసీల జీవితం కూడ బహు దుర్భరంగానే కొనసాగుతుంది. అబూజ్ మహాడ్ గుట్టలను ఆనుకొని గడ్చిరోలి జిల్లాలోని భామ్రాఘడ్ రేంజి ఉంటుంది. ఈ రేంజిలో కల అరవై నాలుగు గ్రామాల్లో గుట్టలపై నుండి దింపివేయబడినవారు మనకు ఎక్కడో ఓ దగ్గర ప్రతి గ్రామంలో తారసపడుతుంటారు. గుట్టలపై నున్న వారు పోడు వ్యవసాయంతో పాటు గడుపుతుంటే కిందకు నెట్టివేయబడినవారు స్థిర వ్యవసాయానికి తగిన భూవసతి, నీటివసతి లేక కూటికి కరువై కూలో నాలో చేస్తూ వున్న దాంట్లోనే వెళ్ళదీసుకుంటున్నారు. ఇలాంటివారి జీవితంలో వినోదానికి చాలా ఉపయోగపడుతున్న ప్రక్రియ పాట-ఆట. మనిషి జీవితానికి వినోదం, ఉల్లాసం తప్పనిసరి తనకు దొరికిన అతి తక్కువ సమయంలోనే తన వద్ద నున్న వస్తువు తోనే (ఆట-పాట) కాలక్షేపం చేస్తుంటాడు. ఆదివాసుల జీవితంలో సాంస్కృతిక కళారూపాలంటే ప్రధానంగా ఇవి రెండే అని చెప్పవచ్చును. మనం అబూజ్‌మహాడ్ భామ్రాఘడ్ అనేకాకుండా గడ్చిరోలి జిల్లాలోని మిగిలిన సిరోంచ, అహేరి, ఏటపల్లి, ధనోరా మొదలైన తాలూకాల్లోని ప్రజలకు కూడా ఇది వర్తిస్తుందని చెప్ప వచ్చు. ఆదివాసి బతుకుల్లో ఆట-పాట ప్రభావం ఎంతగానో ఉంటుంది. ఆదివాసుల్లో రాజగోండు, మాడియగోండు, అల్వి, పరదాన్, గోవారి, వతన్ కారి, కోహా, బిరుదు, మన్నెకోయ (కోలామి) మొదలైన తెగలు ఇక్కడ ఉన్నాయి. అన్నింటిలోకి మాడియగోండులే అధికశాతం. వారి తరువాత రాజగోండులు. మిగిలినవన్ని నామ మాత్రం అనుకోవచ్చు. వీరందరు ఆదివాసిల క్రిందనే జమ. వీరందరి జీవిత ఆర్థిక విధానం ఇంచుమించు కొద్ది తేడాలతో ఒకే విధంగా వుంటుంది. కాకపోతే తాలూకా సెంటర్‌కు, రోడ్డు సైడుకు దగ్గరగా వున్న గ్రామాల్లో కల్చర్‌లో మరింత తేడా కని పించవచ్చు. అలాగే తెగల మధ్య సంప్రదాయాలు, కట్టుబాట్ల విషయంలో కొంత తేడా లేకపోలేదు. ఏమైనా అవన్ని వీరి జీవిత విధానంలో కానియ్యండి, ఆర్థిక విధా నంలో కానియ్యండి పోల్చలేనంత మార్పును తీసుకవచ్చే తేడాలు మాత్రం కావ

న్నది స్పష్టం. ఇలాంటివారి అందరి జీవితాల్లో సేటికి ఆట - పాట ప్రధానమైన సాంస్కృతిక కళారూపం. ఈ ఆట-పాటల్లో కూడా తెగల మధ్య తేడా వుంటుంది. ఈ ఆట-పాట వీరి జీవిత విధానంలోని వ్యవసాయ పని పద్ధతులతో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తగిన స్థాయిలోనే ఉంది.

ప్రకృతి ఆధారపడిన వీరి జీవితాలలో ప్రకృతి ఆరాధించే పాటలు మనకు చాలా అగుపడుతుంటాయ్. సాధారణంగానే మాడియ పాటలన్నీ చాలా పొడవైనవి. పల్లవి దీర్ఘంగా వుంటుంది. తరుచుగా పల్లవి పదే పదే అనాల్సి ఉంటుంది. పాట పాడే వారితో చూస్తే కోరస్ ఇచ్చేవారు ఎక్కువ సమయం తీసుకొనే విధంగా కోరస్ రూపొందించబడుతుంది. దీనికి కారణం ఆ కవిత్వంలోనే ఉంటుంది. మనిషి తనలో ఉత్పన్నమైన భావాలకు రూపకల్పన చేయడానికి కొంత సమయం అవసరం. ఆ సమయం కోరస్‌లో తీసుకొంటాడు. అందుకే పాటలు పొడవుగా ఉండడం, పల్లవి దీర్ఘంగా ఉండడం, కోరస్ పదే పదే యివ్వడం ఇవి తప్పనిసరి అవుతుంది. రాకెట్ యుగంలో ఉన్నవారికి బోర్‌గానే ఉండవచ్చుగానీ, ట్రైబల్ ఆర్థిక విధానం నుండీ దాన్ని అర్థం చేసుకోవలసివుంటుంది.

ఆదివాసీలు ప్రతి పనిలో పాటను మేళవిస్తారు. కష్టజీవులందరికీ ఇది వర్తిస్తుంది. ప్రకృతి శక్తులపైనే ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులు, ప్రకృతిని ఆరాధించడం కూడా మెండుగానే ఉంటుంది. ప్రకృతిని ఆరాధించే వాటిలో కొన్ని పాటలు

ఉదాహరణ 1) కోట్‌మావో పెల్లో కొరిసో చిత్రల్‌కోటి; చిట్టిం పాసురే జలియత్ మల్లు పెల్లో జల్లింగ్ ఏత్సేరీ; కొడకపిట్టే లోన్ గొడుగోడే.

ప్రకృతిలోనే అనేక జంతువులతో వన్యమృగాలతో కలసిమెలసి సహజీవనం చేసే ఆదివాసీలు వాటి బారినుండి రక్షింపబడడం ఒకనాడు అగ్నిపరీక్ష లాంటిది. మేఘం, నెమలి, పిట్టలు ఎలా ఆడుకొంటాయో వర్ణించేదే పాట.

2) "వికోవకోనాదో బేకేదాయినన్ నారో (తెలుగులో పాపర చేప)
నన్నదాయినన్ బెరకె, బెరకె మందల జాగదోరుకో
నారో మల్చివాస్త, బొడ్డితె మందల జాబురు
జాబురు తింజి విసికన్"

బతుకు పోరులో చేపపిల్ల (పాపర) పడే అవస్థను తెలుపుతుంది పై పాట.

3) "ఇలా ఇలా లేదురి - పాల విదురి"
"ఓ మాయో వయ్యోవయి"
వెదురులోని రకాలను వర్ణిస్తున్నాయి పై చరణాలు

4) "రయితరో రైరంభ, రయితరో రైరంభ
రంజి తిందల రంభ, రయితరో రైరంభ

పంట కావలి ఉన్నప్పుడు వరిపంటను తినడానికి ఎగిరివచ్చే రామచిలుకను వర్ణించేవి పై చరణాలు.

5) మానాటె వావేని మానాటె వావేని
బారికియాల సంఘో
మానాటె వాటేని బారికేయాల
మానాటె వావేని మానెటె వావేని
వంజి ఓర్సాలా సంఘి
మానాటె వాలేని వంజి ఐర్సాలా
వంజి మొదలు జిపో జపో-రైక జపోట

పై పాట పంటకాలంలో ఒకరినొకరు పని చేసుకోవడానికి పిలుస్తున్నప్పుడు వరుసైన వారిమధ్య సాగే సంవివాదానికి చెందినది.

ఇలా రాస్తూపోతే అనేక పాటలు ఉన్నాయి. ప్రతి పాటలో వారి పని తీరు, భద్రతలేని జీవితాలు, పంటలు మనకు అర్థమౌతాయి. ఇంకా నేటికి అబూజ్‌మహడ్ గుట్టలపై మనిషికి మాటలు రానినాడు, భాష లేనినాడు తన భావాలను అరుపులు, సంజ్ఞలు ద్వారా తెలిపి ఉన్నారనడానికి నిదర్శనంగా వాయిద్యాల మధ్య సంజ్ఞలతో కూడిన అరుపులు "చలో-రే" అంటూ చేస్తుంటారు పురుషులు. అలాగే మరో రక మైన పాటలకొస్తే ఉల్లాసానికి యువతీ యువకుల మధ్య సంవివాదం రూపంలో సాగే శృంగార పాటలు మరిన్ని.

ఉదా : 1) మావ గూడిం వాయి మా సంఘో
మాకున్ పోల్లో‹ తర్ మాహో-రేరేల
డోలె గూడెం హోప్ మాసంఘో
డోలె లెయ్యోర్ మంతోర్ హో-రేరేల

వరుసైన (మరదలు) ఆడపిల్లను సంబోధిస్తూ చెడుతిరుగుళ్ళు తిరగరాదంటూ హెచ్చరించడం పై పాటలోని అర్థం.

2) బాతాతే వాయికిన్ సంఘో గల్లర గల్ల
బాతాతే వాయికిన్ సంఘో
మోటార్ తే వాయికిన్ సంఘి గల్లర గల్ల
మోటార్ తే వాయికిన్ సంఘి

పెళ్ళిళ్ళ సందర్భంలో పిల్లా-పిల్లాడి తరఫున వారి మధ్య ఒకరి కొకరు ఎత్తిపొడుపులతో ఉత్సాహంగా పాడుకునేది పై పాట.

3) సాడి తత్తందే సంఘో వాయన
సాడి తత్తందే సంఘో వాయన
జోం కరిసే డాకవాటనా నిమ్మె వాయన
బాబల్ హూద్తైకి నాకున్ రాంగనోర్
బాబల్ హూద్తైకి నాకున్ రాంగనోర్
జోం కలిసే డాక వాటనా నిమ్మె వామన

అంటూ బావా మరదళ్ళ మధ్య చీరే, రవిక ఇతర ఆభరణాలపై సాగుతున్న సంవాదం.

4) సాడి లేనెవాత్త, సాడి లేనె వాత్త
బాయినా ములమా బిజోరి జమ్ కేమ్ మాతా
జాంపర్ లేనె వాత్తా, జాంపర్ లేనె వాత్తా
బాయినా ములమా బిజోరి జమ్ కేమ్ మాతా

అంటూ మరో పాటలో స్త్రీని, స్త్రీ అలంకార సామాగ్రిని వర్ణిస్తున్నారు.

అలాగే శుభం, అశుభం కార్యకలాపాల్లో కూడా పాటలు తప్పనిసరిగా చోటుచేసుకుంటాయి. ఏ ఇంట్లోనైనా వృద్ధులు చనిపోతే వారిని ప్రశంసిస్తూ కొన్ని పాటలు పాడుతారు. ఇందులో స్త్రీలు పాడే పాటలు పురుషులు పాడే పాటలు విడి గానే వుంటాయి. వీటిని ప్రత్యేకించి "కర్సడ్" పాటలు అంటారు. "పేన్ కర్సడ్" (దేవుడి మొక్కు) పాటలు విడిగా ఉంటాయని పాఠకులు దృష్టిలో వుంచుకోవాలి. ఇక్కడ కేవలం చావుకు సంబంధించిన (కర్సడ్) పాటలు పేర్కొనడం జరుగుతుంది.

ఉదా :- 1) బాయోలె బాయో కోర్ కోర్ బాయోలె బాయో
మూలతే కల్లు మంత కోర్ కోర్
ఇంజిరే మామల్ లెహందోర్ కోర్ కోర్
హీమ్‌ట్ ఇంజిరే హావుల్ లెహాండుర్ కోర్ కోర్

ఇది చనిపోయిన వారి ఇంటికి చెందిన అల్లుడు తన మామ గతంలో దాచి పెట్టిన కల్లు (సారా) తన మరణాంతరం వచ్చిన అతిధులకు ఇమ్మంటూ గుర్తు చేస్తూ పాడేపాట.

2) టిర్ ఇచ్చున్ భయోనో ఉస్కల్ ఇచ్చున్ బాయోన
రేఖ దోరే కన్నీరిశే బాయోన
రూపికన్నీరు పేసోశే బాయో

ఇది చనిపోయిన కుటుంబానికి చెందిన వారి బిడ్డలను ఉద్దేశించి పడుసులు పాడే పాట.

(నోట్ :- ప్రతి పాటకు రేలా ఉండాలి).

తర్వాత చెప్పుకోవాల్సివస్తే వచ్చేది "ఒదుల్" పాట దీన్నే గోటుల్ పాట, ఉర్సపాట అని కూడా వ్యవహరించవచ్చు. ఇది కథ రూపంలో చెబుతారు. పాట రూపంలో కూడా పాడుతుంటారు. కథా రూపంలో చెప్పేప్పుడు శ్రోతల్లోనుండి ఎవరో ఒకరు చెప్పేవారికి జవాబుగా "యింగో" అంటారు. పాట రూపంలో పాడేప్పుడైతే నాలుగురైదుగురు చిటుకోరా (చిరుతలు) కొడుతూ కోరస్ ఇస్తుంటారు. పాటపాడేవారిని "పాటగురు" అంటారు. ఈ వృత్తి వారసత్వంగా వస్తుంది. ఇది హరికథా కాలక్షేపం లాంటిది అని మనం అనుకోవచ్చు. రోజుల తరబడిగా ఇది నడుస్తూ ఉంటుంది. "పాటగురు"కు దక్షిణంగా కల్లు, భోజనం సమకూరుస్తారు. జీవి పుట్టుక మొదలు యివ్వాల్టి వరకు ఆ పాటలో లేదా ఆ కథలో వాకచక్యంగా యిమిడ్చి వర్ణిస్తు ఉంటారు. "లెన్నార్ పట్టి"లో 80 గ్రామాలుంటే పాటగురు ఒకరే వున్నారు. (మాడియ డిక్షనరీలో నేటి తాలూకాలో బ్లాకులో పుట్టనినాడు వ్యావహారికానికి ప్రాంతాలను పట్టిలుగా పిలుచుకొనేవారు. నేటికి అదే స్థిరపడివుంది).

జీవితాన్ని అందులో ఆట-పాటలను మేళవిస్తూ ప్రశాంతంగా కొనసాగిస్తున్న వారి జీవితంలో పెట్టబడిదారుల వేట ప్రారంభమైంది. అడవి పరభోక్తమైంది. అది

వాసీల ఆట-పాటలకు జీవిత విధానానికి ప్రమాదం ఎదురైంది. కసాయివాడి కత్తి వేటుకు నోరులేని అమాయకపు జీవితాలు బలి పడసాగాయి. అడవి వారి చేతుల్లో మంచి వనరుగా మారింది. ప్రకృతి తల్లి ఒడిలోనుండి ప్రతీది వారికి ముడి సరుకుగా ఉపయోగపడసాగింది. ఆటవిక ఉత్పత్తులన్ని అతి చవుకగా దోపిడికి గురికాసాగాయి. కో-ఆపరేటివ్ సంస్థల పేరుతో అనేక సంస్కరణల రూపంలో ఎన్నెన్నో చిటుకులతో అడివి అంతా "మాయసభ"గా మారింది. సర్వసంపదకు నిలయమైన అడవి రణ, గొణ ధ్వనులతో రవాణా సౌకర్యాలతో మెట్టు మెట్టుగానే పెట్టుబడిదారులు ప్రతీది కలుషితం చేశారు. మాడియాలకు "మామ" అని పేరు తగిలించారు. 'కామ్ పూర్తమామ'లైయ్యారు. వారి అమ్మాయిలను వలలో వేసుకొని వారి సంస్కృతిని, వారి సంప్రదాయాలను కల్తీ చేశారు. 'భైలాదిల్లా అడవుల్లో దగాపడ్డ చెల్లెలు' పుస్తకంలో వస్తువు అక్కడికే సంబంధించినది కావచ్చు. కానీ సర్వత్రా ఆదివాసుల అమాయక చూపులు, కన్నీళ్ళ గాథలు, వెలుగులోనికి రానివి మనం ఎన్నెన్నో ఈ అడవిలో విన్నాం, కన్నాం. బల్లార్ష నుండి సిరోంచ వరకు బల్లార్షనుండి బామ్రాఘడ్‌కు చెందిన చివరి పయింట్ వరకు కువ్వా, కోడి, బీనా, గొండల వరకు ఏ ఆటంకాలు లేని రోడ్లు వేలసాయి. ఏటా లక్ష యాభై వేల టన్నుల వెదురు కాగితంగా మారుతుంది. ఏడాదిలో ఆరు మాసాలు వెదురునే తిని బతికే ఆదివాసీల నోటి ముద్ద యంత్రపు కోరల్లా కుక్కబడుతుంది. వ్యక్తి అవసరాల కోసం అడవిలో ప్రవేశించడం పై నిషేధం మొదలైంది. ఆకు తెంపిన, కాయకోసిన అడివి చట్టాలు ప్రత్యక్షమైనాయి. అమెరికా, రష్యా సామ్రాజ్యవాదులు మొదలు ఢిల్లీ, బొంబాయి, కలకత్తా దళారీ పెట్టుబడుల ఆర్థిక దోపిడికి వారి మార్కెటు అవసరాలకు గిరిజనుల బ్రతుకు నాశనమైంది. మరో వైపున చోటా మోటా షావుకార్లు, పైరవీకారులు, గైరాదీవాసులు (గిరిజనేతరులు) ప్రత్యక్షంగా ఆదివాసీ గూడాల్లోకి మకాం మార్చారు. వావీ, వరుస కలిపారు. భాషనేర్చారు. నెత్తిన తట్టలలో వచ్చినవారు వేలాది రూపాయలు విలువచేసే దుకాణాలకు యజమానులైనారు. బామ్రాఘడ్‌లో రహమద్‌తుల్లా, ఖురేషిలు ఇవ్వాల లక్షకు తగ్గని సరుకులతో దుకాణాలు నడిపిస్తున్నారు. దామరంచ, కోందవాయి, కొటిమి, జిమ్మలఘట్ట, కమలాపూర్, ఫెరిమిలి, తాడిగామ్, ఘట్ట, కసంసూర్, జారవండి వంటి ఓ మోస్తరు గ్రామాల్లోని ఏ షావుకారి దుకాణం చూచిన 50 వేలకు తగ్గని సరుకులు ఉంటాయి. 1988 అక్టోబర్ నవంబర్ మాసాల్లో 80 రూ॥లకు కిలో

ఎండు మిరపకాయలు కుంచెడు వండ్లకు (12 కిలోలు) ఒక కిలో చక్కెర అమ్మారంటే ఏ ఆదివాసి ఇంతటి నగ్న దోపిడిలో సుఖంగా బ్రతగ్గలడు? కాళీపట్నం రామారావ్, రావిశాస్త్రీ, అప్పల్నాయుడుగార్ల కథల్లో వారి దోపిడి ప్రత్యక్షంగా కళ్ళకు కట్టినట్టు ఉంటుంది. మరో తాజా ఉదాహరణ ఏమిటంటే ఈ మధ్య యేడాది కాలములో అదర్శజిల్లా (ఆదిలాబాదు-ఆం. ప్ర)లో కరువు వాతపడిన వందలాది స్త్రీ, పురుషులు అధిక ధరలకు, ఆకలి బాధలకు తట్టుకోలేక 136 దుకాణాలపై, భూస్వాముల ఇళ్ళపై దాడులు చేసి దాదాపు 70 లక్షల వరకు (పత్రికా ప్రకటనలే ఆధారం) జప్తు చేసుకోగలిగారంటే ఆదివాసీలను దోచుకోని ఎవరెవరు ఎంత బలిసిపోయారో మనకు అర్థం అవుతుంది. ఒక్క పెంబిలోనే 14 మంది షాహుకార్లనుండి 10 లక్షల వరకు చరాస్తులు దొరికాయంటే ఇదంతా ఎవడి సొమ్ము అనుకోవాలి?

ఈ దోపిడి పద్ధతులు స్థిరపడిన కొలది ఆదివాసీ సాహిత్యంలో కూడ మార్పు క్రమంగా వచ్చింది. అలాగే రోజు రోజుకు పకడ్బందీగా చట్టాల దిగ్బంధనంలో చుట్టి వేయబడుతున్న ఆదివాసీ ఆ బాధనంతా పాట రూపంలో వెళ్ళగక్కాడు. తన భావానికి సాహిత్యంతో ప్రాణం పోశాడు. పరిష్కారం ఆనాటికి తెలియని ఆదివాసీ తన గళంతో అడవి అడవంతా దద్దరిల్లేలా 'రిలో' అంటే 'రేలా' అంటూ పాటలతో ఆ పాటకు సరిపడే దొకాలను (Steps) కూడ నేర్పాడు.

ఉదా ॥ 1.

ఇత్తమర్రతే ఇత్తమర్రతే బాతల్ దుకాణ్ తత్తోర్ మామల్ ఇత్తమర్రతే
ఇత్తమర్రతే ఇత్తమర్రతే గెత్తిన దుకాన్ తత్తోర్ మామల్ ఇత్తమర్రతే
ఇత్తమర్రతే ఇత్తమర్రతే దీనా భీమత్ పెహమామ ఇత్తేమర్రతే

చింతచెట్టు క్రింద నెత్తిమూటలో బట్టలు తెచ్చిన 'మామ' ను సంబోదిస్తూ, ఆ బట్టను ధర అడుగుతూ సాగుతుంది ఆ పాట.

(మామ-ఆదివాసీలను బయటివారు ఈ పేరుతోనే వ్యవహరిస్తుంటారు).

2 చిల్లోరో చలోరోమ్ రెరెలోయో రెలరెల చిల్లోరో చల్లోరోమ్.

బాతాతా మాఫిహిల్లే - ఏదీ మాఫీ లేదు
మర్ర గుట్ట మాఫి హిల్లే - చెట్టుగూడ మాఫిలేదు
జాడి కప్దా మాఫిహిల్లే - గడ్డి, గుడ్డ ఏదీ మాఫీలేదు

రాజానా రాజ హిల్లే - రాజుల కాలంకాదిది
బదరంత జనత పిస్సర - ప్రజలు బ్రతుకుటెట్లు
నూక కుసిరి మాగర్తు - బువ్వ కూర కరువైంది
గెత్తి పంగురు మాగర్తు - బట్టబాత లేదాయె
దీనియె సౌకన్ కీమ్ - ఒకసారి ఇదంతా చూడు
జనతా బాయి హంత - అడ మగ జనులు చస్తున్నారు
వాయిద వసూలు కీంత - పన్నుల వసూలు తప్పడంలేదు
ఖైదె మర్సు పోయిత్తికి - చేత గొడ్డలందుకుంటెవాలు
దాక దమిడిన్ కీంత - గుంజి దండుగంటుంది
కోయతూర్‌ను కీంత - మగవాణ్ణి ఇబ్బంది చేస్తుంది
కోంద్ర పోయిసి హత్తికి - గంప పట్టుకోని పోతే
ఓందాంచడ్ హత్రికి - ఒక్క అడది పోతే చాలు
జాడి జబ్బ కిచ్చుతేకి - ఆకు అలం తెంపితే
దర్రి మర్రి కింత - అంగడంగడి చేస్తారు
ఓంది వహాక్క హుర్తెకి - ఒక కర్ర విరిస్తే చాలు
సెయ్యుం రూప్‌మా ఏతంతోర్ - 5 రూపాయలు దండుగేస్తరు
సౌ వెదురు నడికితేకి - 100 వెదుర్లు నరికితే
సౌ రూప్‌యా ఏతాంతోర్ - 100 రూపాయలు కట్టుడాయె
లోన్ - పంట వెనె ఏతాంతోర్ - ఇల్లు - పంట ఏదీ విడువరు
జినిగి కియ్యు పరోం దేవా - బ్రతుకలేం మేం భగవాన్

ప్రభుత్వ క్రూర నిర్బంధాన్ని, వారి దారిద్ర్య బ్రతుకులను హృదయం కరిగేలా వర్ణిస్తూ శ్రావ్యంగా పాడగలరు స్త్రీలు.

ఆదివాసీ ప్రజల్లో సాహిత్యం విరివిగా ఉంది. లిపిలేని భాషలో రికార్డయిన సాహిత్యం పిడిపిడీలుగా వారి గుండెల్లో గూడుకట్టుకున్న బాధల్లోని భావాల వ్యక్తీకరణను పిండగలిగినప్పుడే మనకు అర్థం అవుతుంది. ఇదో గొప్ప ప్రజాకళ. గమనిస్తున్న విషయాన్ని ఒకపాట రూపంలో పొందుపర్చడం ఒక గొప్పకళ. అందుకే ప్రతిపాట వెనుక ఒక కథ ఉంటుంది అంటాడు ప్రముఖ కవి, గాయకుడు గద్దర్.

ఈ కళ అందరికీ సాధ్యంగాదు. పాటల రూపములో వారి జీవితములోని చేదు అనుభవాలను, సుఖ అనుభూతులను వెంటవెంటనే ప్రదర్శిస్తుంటారు. మరో విషయం ఏంటంటే స్త్రీలు పాడే ఏ పాట అయినా 'రిలో' తోనే మొదలవుతుంది. ధనోరా తాలుకాలోని ధరాచి ప్రాంతములో ఇక్కడి స్త్రీల రిలో పాట 'చోలి' అనే శబ్దంతో మొదలవుతుంది. స్త్రీల పాట రిలోతో మొదలయినట్టే పురుషుల పాటలన్నీ 'రేలో'తో మొదలవుతాయి. ఇది తెలిసినవారు ఎంత దూరంలో నుండి అయినా ఆ ట్యూన్‌బట్టి చెప్పగలరు. మరో విషయం ఏంటంటే ఏ తెగలో కూడ రాగం - తాళం కూడిలేదు. తాళం నడుస్తుంటే దానికి తగిన థాక నడుస్తుంది. రాగం పట్టి కూడ థాక నడుస్తుంది. అంతేగానీ భావయుక్తంగా పాడుతుంటే దానికి తగిన విధంగా తాళం నడుస్తుంటే ఎగిరే పద్ధతి ఇంకా డెవలప్ గాలేదు. అంటే ఆట – పాట - తాళం మూడింటి కాంబినేషన్ రాలేదన్నమాట. ఇది వెనుకపాటుతనానికి మరో లక్షణం. వాయిద్య పరికరాలపై సంగీతం సృష్టిస్తుంటే పాడుతూ నాట్యం చేయడం లేదు. సంగీతం పట్టి ఆట నడుస్తుంది. పెదవి విప్పి పాడుతుంటే సంగీతం మూగపోతుంది. కాలు మాత్రం థాక విరగకుండా ఆడుతుంది. ఇవ్వాల సంగీతం ఇస్తున్న దాన్నిబట్టి (నొటేషన్) దానికి తగినట్టుగా పాట రూపొందించి తెగ సాంప్రదాయంలోనే గొప్ప మార్పు తేవలసిన బాధ్యత విప్లవకారులపై ఉంది.

ఆదివాసుల్లోకి ఎంటర్ అవుతున్న నియో మాడ్రన్ కల్చర్

అడవిని పెట్టుబడిదారులు వారి వ్యాపార అవసరాల కోసం, ముడి సరకుల కోసం మార్చుకుంటూనే వాడి నియో మాడ్రన్ కల్చర్‌ను కూడ లోతట్టు అడవి ప్రాంతములోనికి చొప్పించుకతేవడానికి తంటాలు పడుతున్నాడు. క్రమంగా ఈ ప్రభావం నేటి యువతరంపై పడుతుంది. భామ్రాఘడ్, జిమ్మలఘట్టల్లో వీడియో ప్రదర్శనలకు గిరాకి పెరుగుతుంది. ఇది నేటి సినిమా కల్చర్‌ను యువకులపై ప్రభావం పెద్దగా వేయడానికి ముందుకువస్తుంది. ఇది ఇలా గిరిజన సంస్కృతిని క్రమంగా మింగేయడానికి ఎన్నో కుట్రలు చేస్తుంది.

ఉదా॥ హే మాడియదాద - హేమాడియదాదా
హే మాడియాదాద - హే మాడియదాదా.

అనే బాణిలో బడిపిల్లలచే 'జంగల్ బచావ్ - మానవ్ బచేగా' అనే సంస్థ పేరుతో ఉన్న 'సోశాల్ట్' అడవి సంరక్షకులు అడవి నరకకూడదనే పాటలు అల్లి పాడిస్తున్నారు. మరో వైపు బెంగాలీలు సరదా నవరాత్రులు, హిందూవులు గణపతి నవరాత్రులు నడిపిస్తూ బడి పిల్లలపై వారి బయటి సంస్కృతిని రుద్దడం జరుగుతోంది. ఈ పాఠశాలల్లో వున్న గోండు పిల్లలు తరతరాలుగా తమ తెగ సంస్కృతిలో వీటిని పోల్చుకుంటూ గురూజీల ప్రోద్బలంతో నేర్చుకోక తప్పలేదు. నేటి పాఠశాలలో విద్యా విధానం వెర్రి తలలు వేస్తూ చిన్నారి హృదయాల్లో విషబీజాలు నాటుతోంది.

ఈ క్రమంలో ఒక వైపు సామ్రాజ్యవాదుల విష సంస్కృతిని చూస్తూ మరో వైపు తమ సమాజంలో అనాదిగా వున్న తమ పెద్దల కాలం నాటి కళారూపాలను పోషిస్తూనే ప్రస్తుత మరిన్ని ఇతర కళారూపాలను యువతరం విభిన్న సంస్కృతుల నుండి దిగుమతి చేసుకోవడం కూడా జరుగుతుంది. ఆదివాసీల కళారూపాలు క్రమ క్రమంగా జీవన్మరణ పోరాటానికి నెట్టబడుతూ తమ ఉనికిని కాపాడుకోవడానికి బ్రతుకు పోరాటం సాగిస్తున్నాడు. గడ్చిరోలీ జిల్లా - హెడ్‌క్వార్టర్స్ చుట్టు ప్రక్కల పల్లెల్లో ఈ పద్ధతి అప్పుడే ప్రారంభమైంది.

ఆదివాసీ ప్రజలకున్నా కళారూపాలు చాలా తక్కువ ఆదివాసీ సమాజం గిరిజన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిధిల నుండి మెల్ల మెల్లగా బయటపడడానికి కృషి చేస్తున్న క్రమంలో వుంది. ఈ క్రమంలో విభిన్న రాజకీయాల సామ్రాజ్య వాదుల విష సంస్కృతి మొదటి మైదాన ప్రాంతాలలోని పల్లె పట్టుల్లో మిగిలిపోయిన భూస్వామ్య సమాజ అవశేషాల సంస్కృతి, కళలు, కళారూపాలు అడవి ప్రాంతంలో ఆదరించ బడుతున్నాయి. వీటితోపాటు గత దశాబ్ది కాలం నుండి అన్నింటిని తట్టుకొని నిలబడడానికి విప్లవ సంస్కృతి పోటీపడుతున్నది. ఒకనాడు తెలంగాణా పల్లెలల్లో విస్తారంగా ప్రాచుర్యం పొంది వెలుగొందిన చిరుతల రామాయణం, బాగోతం లాంటి కళారూపాలకు యివ్వాల ఆదరణ అడుగంటి పోతున్నందున పక్కనే అనుకొని వున్న అడవి ప్రాంతంలోనికి (సిరోంచ, అహిరి)

చొచ్చుక వచ్చి తన అస్తిత్వం నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తుంది. దీనికి ప్రతిబింబంగానే సిరోంచ, అహిరి తాలూకాలోని పల్లెల్లోకి విప్లవ కార్యక్రమాల జోరు విస్తరించక పూర్వం వీటి జోరు సాగేది. గ్రామాల్లోని యువకులందరు ప్రత్యేకంగా మాష్టారు (నేర్పే గురువు)ను పిలుపించుకొని అతనికి తమ గురుదక్షిణ చెల్లిస్తూ రోజుల తరబడి ప్రాక్టీసు చేస్తూ చివరకు పట్టాభిషేకం జరిపించుకొని సదర్ మాష్టారు నుండి సర్టిఫికెట్ పొంది ఇకపై తాము ప్రదర్శనకు అర్హులైనందుకు సంతోషపడేవారు. ఇంకను పొట్టకూటికై 'కళా పిపాసకులు' ఈ రూపాన్ని వినియోగించుకుంటూ శతాబ్దాల పూర్వపు బాల నాగమ్మలకు, సతిసావిత్రులకు జీవగంజి పోస్తున్నారు. ఈ కళారూపాలను తమలో యిముడ్చుకోడానికి ఈ అడవిలో అనుకరించినవారు ఆదివాసీల గైరాదీ వాసీలే ఎక్కువ. యికపోతే కొంత అభివృద్ధి చెందిన దనోరా, కురికేడ తాలూకాల్లో చదువుకున్న యువకులు తమపై సాగుతున్న ఫారెస్టు వారి దోపిడిని బయటపెట్టడానికి నాటక రూపాన్ని స్వీకరించడం కనపడుతుంది.

ఇదే సందర్భంలో విప్లవ సాంస్కృతిక కళారూపాలు గ్రామగ్రామాన యువతి యువకులకు నేర్పించబడుతూ గతంలో వారు నేర్చుకొనిపున్న కళారూపాలు ఏ సమాజానికి చెందిన వైనప్పటికి వాటిలోని చెడును తొలగిస్తూ మంచిని స్వీకరిస్తూ తొందరగా ప్రజల్లోకి వెళ్ళి నిలబడడానికి ఎంతో కృషి సాగుతుంది. ఇవ్వాల స్థానిక ఆదివాసీల మధ్య కోమ నృత్యాలు మొదలు విడియో క్యాసెట్ల వరకు విప్లవకారులు వినియోగించుకోగలుగుతున్నారు.

దండోరా, బ్యాలే, ఒగ్గుకథ, బుర్రకథ, వీధిభాగోతం, జముకులకథ, ఓపెర, కథక్, ఇతర నాటిక, నాటకాలు, కథారూపాలు, నృత్యరూపాలు ఏవైనా గానియ్యండి యిక్కడ మాత్రం పిడిల్ పిడిల్‌గా కొనసాగుతున్న ఆదివాసీ కళారూపాల్లో లేవన్నవి పై విషయాల ద్వారా అర్థమౌతున్నది. కానీ ఇవన్ని ఇక్కడ నేడు ప్రదర్శింపబడడానికి భౌతిక పునాది వుంది. వీటి ఆదరణ తగ్గిందంటూ గగ్గోలు పెడుతున్న 'కొందరు పెద్దలు' విప్లవకారుల చేతుల్లో ఇవి సాంస్కృతిక ఆయుధాలుగా వినియోగింపబడుతున్నాయన్న వాస్తవాన్ని చూడడానికి దృతరాష్ట్రులౌతున్నారు. సుబ్బారావు పాణిగ్రాహి జముకులకథ, గద్దర్ ఒగ్గు కథ, బ్యాలే విప్లవ ప్రజానీకంలో సజీవంగా వర్ధిల్లుతున్నాయి. కాలికి గజ్జె కట్టి, తలకు పాగా చుట్టి, చేతిలో ఎర్రజండా పట్టి

భుజంపై గొంగడివేసి, ముఖానికి గడ్డం పెంచి, డోలు, డప్పులతో 'విప్లవమా నీకు లాల్‌సలామ్, మృత్యువుతోనే పాట పాడుతాం విప్లవమా నీకు లాల్‌సలామ్' అంటూ వాస్తవ ప్రపంచాన్ని కళ్ళ ముందుంచేసరికి గుండె తరుక్కుపోతుంది. అడవిలోని ఆదివాసీలు కూడా గద్దర్ ప్రావీణ్యానికి మురిసిపోతూ, అనుకరించడానికి క్యాసెట్లతో పోటీపడుతున్నారు.

ఇక్కడ ఎగరడం (పంద్‌ముడ్) మినహా మరొకటి లేదని తెలుసుకున్నాం. ఈ ఎగరడం కోసం యువతీ యువకులు వారి వారి కాలిగజ్జెలు ఇతర వాయిద్య పరికరాలు వెంట తీసుకొని మైళ్ళ కొలది దూరం పోయి వినోద కార్యక్రమంలో పాల్గొంటుంటారు. ప్రత్యేకించి పెళ్ళి, కర్సడ్ సందర్భాలలో నిర్వాహకులు అనేక గ్రామాలకు ఆహ్వానాలు పంపి వచ్చిన యువతీ యువకులకు కల్లు, భోజనాలు ఏర్పాటు చేస్తూ వారి స్థాయికి తగినట్టుగా ఈ ఎగిరే కార్యక్రమాన్ని కొనసాగిస్తుంటారు. అన్ని సందర్భాల్లో ఎగరడమే వారి వినోద కార్యక్రమమైతే ఈ ఎగరడంలో కూడా తేడా స్పష్టంగా వుంటుందని తెలుసుకున్నాం కదా! రకరకాల వాయిద్యాలపై వాయిస్తుంటే విభిన్న ఢాకలు వేస్తూ ఎగురుతుంటే చూడముచ్చటగా వుంటుంది. ప్రతి స్టెప్‌లో (ఢాక) వారి జీవితంలో పుట్టుకతోనే రంగరించి జీర్ణించుకున్న కళా ప్రతిభను చూడ గలిగే ఆదివాసీలను అనుకరించడం చాలా కష్టం. నడక నేర్పుతున్న చిన్నారి నుండి కర్రపూతంతో నడిచే వృద్ధుని వరకు ఆ డోల్ల చప్పుళ్ళకు, పర్రై, కుండుడు మోతకు సొన్నాయి రాగాలకు తన్మయులై తమకు తాముగా తమ వొంటిలోని అవయవాల నన్నింటిని ఆడిస్తుంటారు. ఆనందిస్తుంటారు ఆదివాసీలు. ఈ ఎగరడమే తమ ప్రత్యేక కళగా బొంబాయి మొదలు రాజధాని ఢిల్లీ వరకు ముఖ్యమంత్రి మొదలు ప్రధాని మంత్రి ముందు ప్రదర్శనలిచ్చి తమ కళా విలువలను చాటుకుంటున్నారు గోసిగుడ్డల ఆదివాసీలు. ఇవన్నీ విప్లవీకరించాల్సిన అవసరం ఎంతో వుంది. ఈ ఎగరడం లోతుగా తెలుసుకుందాం.

సాధారణంగా ఎగిరే సందర్భంలో యువతీ యువకులు కలిసే ఎగురుతుం టారు. అది రాత్రులందే ఈ నృత్యం నడుస్తుంది. చలికాలంలో మరీను. దీని వెనక వారి అవసరాలు కారణాలుగా ఏమైనా కావచ్చు. విసుగు విరామం ఎరుగకుండా ఎడ తెగని చలికాలం రాత్రులందు నెగడు మధ్యన యువతరం హుషారుగా ఎగురుతుంది. శుభ అశుభ కార్యాల్లో తెల్లవార్లు ఎగురుతుంటారు. సందర్భాన్ని బట్టి వాయిద్యంలో

ఢాకలో తేడా తప్పక వుంటుంది. ఈ ఎగిరే వేళల్లో కాస్త సురాపానం వుంటే వొంటికి మరింత జోషు వచ్చి కాలికి బలం పెరిగి మువ్వల చప్పుడు స్థాయి పెరుగుతుంది. అందుకే ఆడ మగ తేడా లేకుండా ఎంతో కొంత పుచ్చుకొనే ఎగురుతుంటారు. ఈ ఎగరడంలో తెగలవారిగా తేడా వుంటుంది. తెగల గూర్చి పరిజ్ఞానం వున్నవారు ఎగరడాన్ని బట్టి తెగను తేల్చి చెప్పగలరు. రాజగోండు, మాడియ గోండుల్లో కూడా ఈ తేడా వుంది. వాయిద్య పరికరాల్లో, తేడా వుంది. రాజగోండులకు పరధాను తెగవారు ప్రత్యేకంగా శుభ అశుభ కార్యాల్లో ఎగిరే సందర్భాల్లో తప్పక డోలు సన్నాయిలతో రావాలి. ఇది వారి సాంప్రదాయం. అందులో కొన్ని నియమాలు పాటిస్తారు. పాడీల వారిగా (గోత్రం) ఈ పరధానులు రాజ గోండులకు పంపకం చేయబడుతారు. ఈ పరధాను తెగ వారిని 'డోలోల్లు' అని వారి వృత్తిని బట్టి కూడా వ్యవహరించడం జరుగుతుంది. పంట కాలంలో వీరికి ఆనవాయితీగా మామూల్లు ముట్టజెప్పుతారు. ఈ తంతు, పద్ధతి మాడియ గోండుల్లో లేదు. ఎగరడంలో రాజగోండులు పిర్రలు వెనక్కినెట్టి వెన్నుపై భాగం నుండి చాతి వరకు ముందుకు తెచ్చి పురుషులు ఎగురుతుంటే స్త్రీలు సాధారణంగా ఎగురుతారు. తిరిగి పతన్‌కారి, గోవారిల ఎగరడం ఒకరి నడుములు ఒకరు పట్టుకొని ఎగురుతుంటారు. ఎగిరే సందర్భాల్లో గుండ్రంగా నిలబడడం అందరికి వర్తిస్తుంది. కాని కర్సడ్‌లో కొంత మినహాయింపు వుంది. కర్సడ్ సందర్భంగా యువతులు ఎదురెదురుగా నిలబడి పాటలు పాడుతూ ఎగిరే సాంప్రదాయం వుంది. ఎగిరేటప్పుడు అందర్ని గైడ్ చేయడానికి ఎగరడంలో చాలా శ్రద్ధ వున్నవారు ఒకరు చేతిలో దస్తి గుడ్డతో కాషన్స్ యిస్తూ ఢాక చూయిస్తుంటారు. ఎగిరే సందర్భాల్లో కాలికి గజ్జెలు కట్టుకోవడం చాలా సరదాగా వుంటుంది. గోండి భాషలో గజ్జెలను 'మువ్య' అంటారు. బహుశా : మువ్వలనే పదం 'మువ్య' నుండే వచ్చిందేమో. రాజగోండుల్లో 'పుగిడి' అనే నాట్యం మువ్యలు కట్టుకొని చేస్తుంటే చాలా బాగుంటుంది. ఇది కూర్చోని చేసే నాట్యం. ఇది మాడియ గోండుల్లో లేదు. ఇలా లేకపోవడానికి భిన్నమైన సాంప్రదాయాలే కారణమై వుండాలి. ఇది రాజ గోండుల్లో స్త్రీలే చేస్తారు. మాడియ మహిళ కేవలం 'టవల్' చుట్టుకోవడం వరకే పరిమితమైనందున చీరతో నృత్యం చేసే రాజగోండు మహిళ యొక్క 'పుగిడి' టవల్‌లో వున్న అసౌకర్యం వల్ల ఈవిడకు రాలేదు. అలాగే ఈ మధ్య మాడియ

గోండుల్లోకి గత రెండు దశాబ్దాల నుండి 'దేశిథాక' 'ముక్స'పాట లాంటి నూతన స్టెప్స్ దిగుమతి అయినట్లుగా యువకులు చెప్తారు. అలాగే పెళ్ళిళ్ళ సందర్భాలలో మాడియ స్త్రీలు చేసే ప్రత్యేక నృత్య రూపం 'వేడుకమలియింత' రాజగోండులో లేదు.

స్థానిక ఆదివాసుల్లో విరుదు తెగ ఒకటుంది. వారు గతించిన రాజుల చరిత్రను ప్రశంశిస్తూ వూరూరూ తిరుగుతు పొట్ట పోసుకుంటారు. కరీంనగర్ జిల్లాలోని బ్రహ్మణ సంస్కృతి గల గ్రామాల్లోకి బస్తీల్లోకి 70 దశకంలో కోస్తా ఆంధ్రలో సినిమా కల్చర్ విస్తృతమై మ్యాక ప్రాచుర్యం తగ్గిన కూచిపూడి వారు పొట్ట పోసుకోవడం కోసం ఎగబడినట్టుగా ఇక్కడి విరుదు వారిని చూస్తుంటే గుర్తుకొస్తుంటుంది.

నేరు ఎగరడం సొంతం చేసుకోవడానికి విప్లవకారులు చాలా కృషి చేస్తున్నారు. వారి భాష నేర్చుకుంటూ ఆ భాషలో విప్లవ పాటలు కలుపుతున్నారు. జీవితంలోని బాధలన్నీ కన్నీటి గాథలన్నిటికి ఆట పాటల చాటున దాచుకునే గోండులతో జీవిత సత్యాలను విప్లవ పాటల్లో సమకూరుస్తు తగిన పరిష్కారాలతో వారితో కలగలసి పోతున్నారు.

సంగీత పరికరాలు వాటి వుపయోగాలు :

1) పర్రై : మాడియల్లో పర్రై అనేది ఒక డోలు లాంటి పరికరం. ఇదీ మట్టితో కుమ్మరి తయారు చేస్తాడు. దీని ధర 10 నుండి 25 మధ్యన సైజ్‌ను బట్టి వుంటుంది. గొడ్డు తోలుతో రెండు వైపుల కప్పుతారు. అన్నం మెతుకులు మెత్తగా పిసికి దీనికి మెత్తి కొట్టుతుంటారు. మంచి శబ్దం వస్తుంది. ఇది నడుముకు కట్టుకొని గుండ్రంగా నిలబడి ఎగురుతుంటారు. సాధారణంగా శుభకార్యాలలోనే (పెళ్ళి) దీన్ని ఎక్కువగా వాడుతారు. స్త్రీలు ఈ పరికరం బరువు రీత్యా వేసుకోలేక పోతారంటారు పెద్దలు.

2) డోలు : ఇది బయటి డోలు లాంటి పనే చేసిన తయారీలో తేడా వుంటుంది. ఎక్కువగా 'కుర్సి' కర్ర దీని తయారీకి వాడుతారు. దీనికి కూడా గొడ్డు తోలే వాడుతారు. ఇది హోంమేడ్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే దీనిని ఎవరికి వారే తయారు చేసుకుంటారు. బయటి డోల్లకన్నా పెద్ద సైజుతో వుంటుంది. ఇది

జబ్బలకు వేలాడదీసుకొని రెండు చేతులా రెండు కర్రలు తీసుకొని కుడిచేతి కర్ర తోను ఎక్కువగా వాయిస్తుంటారు. స్త్రీలు దీనిని వాడడం కనిపించదు. బరువురీత్యానే వేసుకోరంటారు. ఈ డోలు సాధారణంగా కర్సడ్ (చావు) సందర్భాల్లోనే వాయిస్తు తెల్లవార్లు ఎగురుతుంటారు.

3) కుండుడు : ఇది బయటి 'తాసెల్'ను పోలి వుంటుంది. చాలా చిన్నగా వుంటుంది. దీనిని నడుముకు కట్టుకొని వినసొంపుగా కొట్టుతుంటారు. పర్రై, డోలు ఏది కొట్టిన ఇది వాటికి తోడుగా వుంటేనే వాటి మోతకు ఇది జత కలిస్తేనే శృంగారంగా వుంటుంది. ఇది వాయించడం చాలా కళాత్మకంగా వుంటుంది. ఇది చాలా తేలికైన పరికరం అయినప్పటికి స్త్రీలు దీనిని ఎక్కువగా ముట్టుకోరు. బరువు సిద్ధాంతం ఇక్కడ పనిచేయడం లేదు.

4) నంగోర్ : బయట 'నగరా' అనే పదం బహుశా నంగోర్ నుండే వచ్చి వుండాలి. నంగోర్లు రెండుంటాయి. ఈ పరికరాన్ని ఎక్కువగా దైవ కార్యములందు వాడుతారు. కూచోని ఒకరు దీన్ని వాయిస్తుంటారు. అన్ని పరికరాలను గొడ్డు తోలుతో కడితే దీన్ని మాత్రం మేకతోలుతో చుడతారు. లేకుంటేనే గొడ్డు తోలును వాడుతారు. దీన్ని చాలా భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. ఇంట్లో పూజ మందిరం (పేను మండివి) లో దీన్ని భద్రపరుస్తారు. దీని శబ్దం 10 కిలోమీటర్ల పైన పోతుంది. ఇది వాయించేటప్పుడు పూజార్లకు పూనకం వస్తుంది శబ్ద తరంగాలే కారణమై వుండాలి. చైత్రమాసంలో దీని వాడకం ఎక్కువ. దీనిని మట్టితో చేస్తారు. క్రమంగా దీని ఉనికి అడుగంటి పోతుంది.

5) తుడుం : దనోరా పట్టీలో 'నిషాన్' అంటారు. మిగిలిన ఏటపల్లి సిరోంచ, అహిరి తాలూకాల్లో తుడుంగానే వ్యవహరిస్తారు. అయితే యిది గతంలో పరధాన్ కులస్థులకే వాయించే విషయం పరిమితమై ఉండేదంటారు. పెళ్ళి, పూజ సందర్భాల్లో దీని వాడకం చాలా జాస్తి. ఇది పెద్ద సైజ్‌లో వుండి ఒకే దగ్గర పెట్టి కూచోని కొట్టడానికి వీలు వుంది తప్ప వెంట మోసుకెళ్ళడానికి వీలుండదు. దీనిని మట్టితో కుమ్మరి చేస్తాడు.

6) హోకుం: (పూతకొమ్ము)ఇది కర్సడ్‌నాడు లేదా పట్టి దేవుడంటూ చేసే సందర్భాల్లో వాడుతారు. తాడిమట్ట, వెదురుతో చేసినవి. ఇర్రె కొమ్ములతో చేసిన

దాన్లో శబ్దం యివ్వదు. ఇవి ఈ ప్రాంతంలో అరుదుగానే వున్నాయి. అక్కడక్కడ తేలికగా చేసే తాడిమట్ట, వెదురు హాకుంలను వినోదానికి పిల్లలు వూదుకుంటారు.

పై పరికరాలతో ఎగరడం సాగించే మాడియలు ఇవిలేకుండా పాటలు పాడితే కూడా చాలా శ్రద్ధగా ఉంటుంది. ఇవన్నీ వుపయోగిస్తూ వాటిలో రకరకాల పద్ధతులు మారుస్తూ, చూపర్లను ముగ్ధులను చేసే ఈ కళ ఎన్నెన్నో తరాలుగా మరెన్నో ఇతర కళారూపాల పోటీని తట్టుకుంటూ నిలబడడానికి పోటీ పడుతుంది.

ముగింపు :

అర్ధ వలస-అర్ధ భూస్వామ్య దేశమైన భారతదేశములో, అసమాన అభివృద్ధి గలిగిన ఈ భారతదేశములో ఆదివాసీలను ఉద్ధరించడానికి ప్రభుత్వం ఎన్నెన్నో కుసంస్కరణలు ప్రకటించినా ఆదివాసీలకు జరిగేదేమీ లేదని తేలిపోయింది. ఆదివాసీల క్షేత్రాలను ఆనవాయితిగా సందర్శించే మంత్రులు, ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రితోసహా తలకు బర్రెకొమ్ములు తగిలించుకొని వారితో చిందులువేసినా, సినిమా ఫక్కీలో కోయ డాన్సులు కాపీచేసినా అవి అన్నీ నిజమైన ఆదివాసీ ప్రజల కళా విలువలను అపహాస్యం చేయడమే.

"రేలారే- రేలారే- అంటూ జంబక్ జుంబక్ జంబక్ బాల" అంటూ నెత్తురు చిందే గొంతుకలో నుండి తన ఆశయాలను ఎలుగెత్తి పాట పాడే గద్దర్ పాట RD బర్మాన్ సంగీతాన్ని, ముకేశ్ గళాన్ని మించిందంటూ బూర్జువా పత్రికలు ఒప్పుకున్నాయి. ఆదివాసీ ప్రజల కళలను తన సొంతం చేసుకొని విశాల ప్రజారాశుల్లోకి తీసుకెళ్ళడానికి ఆ విప్లవకారుడు పెడుతున్న కృషి ఎంత అభినందనీయమైనప్పటికీ, ఇంకనూ అది ఆదివాసీ ప్రజల్లో జీవించిఉన్న వారి కళావిలువలను సొంతం చేసుకోవలసి ఉందని ఆ పాట దరువు- తెలుపుతుంది. కాలి గజ్జెలు గళ్ళు గళ్ళు మనగా, శ్రోతల హృదయాలను ఆకర్షించి ఆకట్టుకున్న కామ్రేడ్ గద్దర్ డాన్సు ఆంధ్ర ప్రజానీకాన్ని ఎంతగా ఆ పాటలో లీనం చేస్తుందో అడవిలో అనేకనేక బాధలను భరిస్తూ ఆ పాటలోని భావానికి ప్రాణం పోస్తూ సజీవ పోషకులుగా జీవితం కొనసాగిస్తున్న గొంతు గుండెలు ఆ పాట పల్లవిని అందుకోవడం అంత కష్టమే.

" కళ కళ కోసం కాదంటాడు మావో, కళ ప్రజలకోసం- ప్రజాకళలు వర్ధిల్లాలి"

సాహిత్యంపై నిషేధాలూ, నిర్బంధాలు

— చలసాని ప్రసాద్

సమాజంతోపాటే పుట్టింది సాహిత్యం. సమాజ హృదయమే సాహిత్యం. లేఖనం కన్నా చాలా ముందునుంచే వుంది సాహిత్యం. ఆమెతలు, సామెతలు; నుడులు, నానుడులు: కథలు, పొడుపుకథలు అపారమైన మన సాహిత్య సంపద. 'రాత'లో వుండేదే సాహిత్యం అనే ఒక మూసకి ఏనాటినుంచో అలవాటు పడిపోయాం మనం. ప్రజల నోళ్ళల్లో నాని, నాలుకలపై నాట్యమాడి, గుండెల్లో పదిలంగా వుండే సాహిత్యం తరతరాలుగా, యుగయుగాలుగా మనకి అందుబాటులో వుంది. 'రాత'తో నిమిత్తం లేకుండా నిలచిపోయినవే వేలకొలది పల్లెపాటలూ, మన వేమన పద్యాలు. 'అక్షరం' పుట్టి, 'రాత' పెరిగిన చాలా ఏళ్ళకి గాని అచ్చుయంత్రం అమలులోకి రాలేదు. అక్షరం అంటే నశింపులేనిది అని అర్థం. అచ్చు పడిపోతే ఇక శాశ్వతంగా వుండిపోతుందనే భ్రమకి లోనయి, ఇవాళ పనికిరాని చెత్తంతా అచ్చు వేస్తున్నారు కొందరు. కాని ప్రజలతో మమేకమై వాళ్ళ కాలులో కాలయి, వేలులో వేలయి, వేలాది సభల్లో లక్షలాది మందిని ఉత్తేజపరిచే పాటలు నోటిమాటలుగా పుట్టి తమ మనుగడని నిలబెట్టుకున్న కొన్నేళ్ళకి గాని 'రాత' రూపంలోకి రావడం లేదు, అచ్చుకెక్కడం లేదు. ఈ మాట ఈనాటి విప్లవ సాహిత్యానికి పూర్తిగా అన్వయిస్తుంది. ప్రజల పోరాటాలనుంచి పాటలు పుడుతున్నాయి. ఉద్యమాలనించి

కళ తరతరాల సృష్టి. ఒక్కొక్క తరం తన వారసత్వంగా భవిష్యత్‌తరాల వారికి భద్రంగా పదిలపరచి అందిస్తున్న కళారూపాలు ఒడిగిపోతున్న తరాలవారి కళా విలువకు జీవం పోస్తుండగా నవతరం సమకాలీన ప్రపంచములోని విభిన్న కళా రూపాలను తమలో ఇముడ్చుకొని పాత, కొత్తల కలయికలో పురోగమిస్తున్నది. ఆదివాసీ సమాజములోని కళారూపాలను నూతన ప్రజాతంత్ర విప్లవంలో భాగంగా విప్లవీకరించబడుతున్నాయి. వారి కళా విలువలను గౌరవంగా సొంతం చేసుకోని వాటిని విప్లవీకరిస్తున్న కృషి త్వరత్వరగా అభివృద్ధి కాగలదని ఆశిద్దాం-

కథలు మొలకెత్తుతున్నాయి. గుండెలో వుండే ఆరాటమే పాట రూపం తీసుకుంటోంది. ఉద్యమం పట్ల ఆసక్తి అనేక కథలుగా, నవలలుగా తన ఉనికిని స్థిరపరచుకుంటోంది. అక్కడ మనం ముఖ్యంగా గుర్తించవలసిన అంశం ఒకటి వుంది. మన ఒంట్లో గుండెకాయమీద ఎన్ని ఒత్తిళ్ళు వుంటాయో అలాగే ఈనాటి సాహిత్యంమీద కూడా అంతే. ఎన్నో ఒరిపిడులు, రాపిడులు, సంఘర్షణలు ఎదురవుతున్నాయి. మన ఒంటిలోని అన్నిచోట్ల నుంచి గుండెకాయకి రక్తప్రసారం జరుగుతుంది. మళ్ళీ గుండెకాయ ఊపిరితిత్తుల సాయంతో ఆ రక్తాన్ని శుభ్రపరిచి అన్నిచోట్లకీ పంపుతుంది. అలాగే కవి, కళాకారుడు, శిల్పి, చిత్రకారుడు, రచయిత జనం నుంచి ఇతివృత్తాలు తీసుకుని సృజనాత్మకతని జోడించి చైతన్యవంతం చేస్తాడు. దీనినే మావో 'ప్రజలనించి ప్రజలకే'- 'From the masses to the masses'— అన్నాడు. అంతేకాదు. జీవితం అనే గనిలోనించే సాహిత్యానికి కావలసిన ముడి పదార్థం వస్తుంది అని కూడా అన్నాడు. అందుకనే సాహిత్యం వెలువడ్డాక దానిమీద వచ్చే నిర్బంధాలు, నిషేధాల గురించే మనం ఇంతకాలంగా పట్టించుకుంటూ వచ్చాం. మనలో పేరుకుపోయిన మూస ధోరణికి ఇది నిదర్శనం. వేల ఏళ్ళుగా పిడచకట్టుకుపోయిన ఈ మూస ఒకంత కదలదు, వదలదు.

పనిచేసేవారు పాటకులు. వీళ్ళే పాలితులు. పనిచేయనివారు పెత్తందార్లు. వాళ్ళే పాలకులు. వీళ్ళకీ, వాళ్ళకీ ఎప్పుడూ చుక్కెదురే. చరిత్రలో పాలితులు మెజారిటీ. పాలకులు మైనారిటీ. అంటే ఇంత కాలంగా మెజారిటీని మైనారిటీ అదుపు చేస్తోంది. అణచివేస్తోంది. తన భావజాలాన్ని జనంమీద రుద్దుతోంది. కాని జనం గుండె ఎప్పుడూ జనం గొంతులో కదలాడి నోటిమాటగా నలుగురికీ చేరేది. అలాంటి మాటలు పాలితులని ఉర్రూతలూగించేవి. పాలకులకి గంగవెర్రు లెత్తించేవి. వారూరుకుంటారా మరి? జనం గుండె మీద తిష్టవేసి, వాళ్ళ గొంతుపిసికి, వాళ్ళ నోళ్ళు నొక్కి తమ ఏలుబడిని ఇంతకాలంగా కొనసాగించుకుంటూ వచ్చారు. చెప్పుకింద తేలులాగా జనాన్ని తొక్కిపట్టి వుంచారు. కాని ప్రజలు కలకాలం పాలకుల కాళ్ళకింద అణిగి మణిగి పడి వుండరు. కాళ్ళకింద దుమ్ములా పడివున్న ప్రజలు ప్రభువుల కళ్ళల్లో పడక మానరు. అప్పుడు ప్రభువులు కళ్ళు నులుముకుని, గుడ్లురిమి, రంకెలువేసి ఏ కోకీడు మూడిందని నలుగురినీ నమ్మించ చూస్తారు. తమ కాళ్ళ కింద నేల కదల బారిందని తెలుసుకుని ప్రజల నెత్తిమీద శిలలు దిగ్గొడతారు.

ప్రజల తరపున ఒక పిట్ట గొంతెత్తినాసరే, ప్రభువులు దాని రెక్కలు విరిచి నెత్తురు తాక్క మానరు. నాటినుంచి నేటివరకు ప్రభువుల నైజం ఇదే. ఈ పరిస్థితిలో మార్పులేదు. ఇవేవీ అటే చరిత్రలో కెక్కలేదు. లిఖిత సంప్రదాయానికి అలవాటు పడ్డ మనం వీటిని అంతగా పట్టించుకోలేదు.

కాలం ఎవరికోసం ఆగనట్టే మనకోసమూ ఆగదు. ఆగలేదు. నోటిమాట చేతిరాతగా మారింది. చేతిరాత అచ్చుయంత్రం పొదిగిటిలో ఒదిగిపోయింది. చరిత్రలో, సమాజంలో వచ్చే మార్పువల్ల మామూలుగా పాలకులే ముందు బాగు పడతారు. ఆ మార్పువల్ల వనరులనీ, ఉపయోగాలనీ వారే రెండు చేతులా జుర్రుకుంటారు. విరివిగా, విస్తృతంగా లాభాలు పొందుతారు. పాలకులతో సంబంధాలు వుంటాయి కనక —సమాజంలో ఇవి తప్పనిసరి—ఆలస్యంగానయినా పాలితులు కళ్ళు తెరుస్తారు. తమకి తెలియకుండానే ఆ మార్పులు తమని ప్రభావితం చేస్తాయి. వాటిని పట్టించుకోక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఏదో ఒక మేరకయినా వాటిని వినియోగించుకోక తప్పదు. అయితే ఈ ప్రయత్నంలో పాలకులతో పాలితులు పోటీ పడి నెగ్గలేరు. కనక జీవితాన్ని అంటి పెట్టుకుని వుండి, ఉద్యమాన్ని విడనాడకుండా వుంటే ప్రజాసాహిత్యానిదే ఎప్పుడూ పైచేయి. అందుకని పాలకులు అస్తమానం ఒక కన్ను వేసి వుంచుతారు. ఏ ప్రజలయితే తమ సాహిత్యాన్ని సృష్టించుకున్నారో ఆ ప్రజలే ఆ సాహిత్యాన్ని పదిలపరుచుకుంటారు. అలా కాకపోతే ఇన్నివేల పల్లెపాటలు, అందాకా ఎందుకు—ఈ వేమన పద్యాలు ఇవాళ మనకి దక్కి వుండేవి కావు. కాలం త్రాసులాంటిది. కాటు వేస్తే మొగ్గు ఎప్పుడూ పురోగామి శక్తివైపే వుంటుంది. అంటే మెజారిటీదే పైచేయి అవుతుంది. మెజారిటీని అసలు నోరెత్తకుండా చేస్తే సమాజం కుళ్ళిపోతుంది. సమాజం ముందుకు నడవదు. గిరీశం అన్నట్టు సివిలిజేషన్ హాల్టయిపోతుంది. అందుకని మైనారిటీకి ఎంత కంటగింపుగా వున్నాసరే మెజారిటీ ప్రజానీకం చొరవ, కృషి, నిమగ్నత ఇవే సమాజానికి చోదక శక్తులు. ఇది సత్యమని తెలిసినా గాని పాలకులు చేతులు ముడుచుకు కూర్చోరు. తమ తమ అవసరాలకి అనుగుణంగా, తమ సింహాసనాలు చెక్కుచెదరకుండా వుండేందుకు కొన్ని కొన్ని వికృత చర్యలకి పాల్పడతారు.

మొదటి మౌఖిక సాహిత్యమే పిమ్మట లిఖిత సాహిత్యమౌతుంది. సాహిత్యంలో లెక్కలేనన్ని ప్రక్రియలున్నాయి. మళ్ళీ ప్రతి ప్రక్రియలోనూ ఎన్నెన్నో

రూపాలుంటాయి. ఆ రూపాలు నిరంతరం మారుతుంటాయి. కనక సాహిత్యంమీద నిషేధాలనీ, సాహిత్యకారులమీద నిర్బంధాన్ని గురించి సాగే మన పరిశీలన లిఖిత సాహిత్య ఆధారంతోనే జరుగుతుంది.

పుస్తకాలని నిషేధించడం బి. సి. నాటినుంచీ వుంది. చార్వాకుల బోధనలని తొక్కేసిన 'ఘనత' మన భారతదేశానిది. బౌద్ధుల గ్రంథాలని నామరూపాలు లేకుండా నాశనం చేసిన 'మహిమ' మన హిందూ జాతిది.

నిషేధానికి 387 B. C. లో హోమర్ ఇలియడ్, 250 B. C. లో కన్ఫ్యూషియస్ అనలెక్ట్స్, 553 క్రీ. శ. బైబిల్, 1542లో కొరాన్, 1597లో షేక్స్పియర్ రిచర్డ్ III, 1931లో మర్చెంట్ ఆఫ్ వెనిస్ గురయినాయంటే ఈ పట్టిక హనుమంతుడి తోకలాగా పొడుగాటిదని చెప్పుకోవచ్చు. ఆనాడు కొరాన్‌ని నిషేధిస్తే, ఈనాడు ఆ కొరాన్‌నీ, ప్రవక్తనీ కించపరిచాడని రష్దీ శటానిక్ వర్సెస్‌ని నిషేధించారు. ఇరాన్ ఖొమైనీ ఏకంగా రష్దీని పాతాళానికేగినా పట్టుకుని చంపుతానని బాహాటంగా ప్రకటించాడు అలనాటి గయుడికి అర్జునుడు అభయహస్త మిచ్చినట్లుగా, ఈనాడు ఇంగ్లండు రష్దీని కాపాడుతోంది. రష్దీ సైంధవుడులా అప్పుడప్పుడు పాశ్చాత్య దేశాలలోని నేలమాళిగల లోంచి తలెత్తి తూర్పు దేశాలవైపు చూస్తున్నాడు. గిరీశం చెప్పినట్లు ఒపీనియన్సు అప్పుడప్పుడూ ఛేంజ్ చేస్తున్నాడు. ప్రాణభయం వుందనుకున్నప్పుడు తూర్పుకి, ప్రాణభయం లేదనుకున్నప్పుడు పడమరకి మొగ్గుతున్నాడు. ఇంతకీ ఇస్లాం మత సారాంశాన్ని విమర్శించడంవేరు, ప్రవక్తని కించపరచడంవేరు. పడమర సామ్రాజ్యవాదుల గూటి చిలకగా రష్దీ మారాడని అనుకోవడంలో అసందర్భంలేదు. ఆధునిక యుగంలో ఖొమైనీని ఎవరూ వెనకేసుకురారు. కాని రష్దీని మాత్రం సామ్రాజ్యవాదులు తమ కీలుబొమ్మగా వాడుకొంటున్నారు. వాళ్ళని ఎదురొడ్డి నిలబడినందుకే ఇరాన్‌ని మట్టుపెట్టాలని చూశారు. ఈ కుట్రలో భాగంగానే రష్దీని పెంపుడు చిలకలా పెంచుకుంటున్నారు.

ప్రాచీన, మధ్యయుగాలు దాటి అమాంతం ఆధునిక యుగంలోకి గెంతాం.

తెల్లవాడి ఏలుబడిలో నిషేధానికి గురయిన తెలుగు రచనల జాబితా వేరే ఇస్తున్నాం. కాంగ్రెసు, తెలుగుదేశం వారి హయాంలలోని పట్టిక కూడా వేరే ఇస్తున్నాం.

ఆంధ్ర యూనివర్సిటీ తొలి కులపతి కట్టమంచి రామలింగారెడ్డిగారి ఆగ్రహా నికి గురయి మార్క్సిస్టు పుస్తకాలు, రష్యా పుస్తకాలు లైబ్రరీ నుంచి ఉడా యించాయి.

నాజీ జర్మనీ (10-5-1933)లో 25000 పుస్తకాలని హిట్లర్ అనుయాయి గోబెల్సు దగ్గరుండి తగలపెట్టించాడు. దీన్ని 40,000 మంది స్వయంగా చూశారు. ఈ పుస్తకాల రచయితలు 35 మంది. వారిలో కొందరి పేర్లివిగో.

మార్క్స్
ఎంగెల్స్
స్టాలిన్
ట్రాట్స్కీ
రోజా లక్సెంబర్గ్
గోర్కీ
సిగ్మండ్ ఫ్రాయిడ్
హెలెన్ కెల్లర్
హెమింగ్వే
థామస్ మాన్
హెన్రీ బార్బుసే
అప్టన్ సింక్లయర్

ఈ అడుగుజాడల్లోనే 'స్వతంత్ర' భారతదేశంలోని తొలి కాంగ్రెస్‌ప్రభుత్వం తెలుగునాటి బెజవాడలో ప్రజాశక్తి ప్రచురణాలయం వారి వేలకొలది గ్రంథాలని చిందరవందర చేసి విధ్వంసం చేసింది. 1948 మేలో దీని కొనసాగింపుగానే 22-12-69న సుబ్బారావు పాణిగ్రాహి ప్రాణాలుతీసింది. విరసం స్థాపించాక (1970) రచయితలమీద, కవులమీద నిర్బంధాలు పెచ్చు పెరిగాయి.

చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్లను 1971లోనూ, చెరబండరాజు, వరవరరావు, M.T. ఖాన్‌లని 1973లోనూ జైల్లో పెట్టారు.

విరసం ప్రముఖులపై కుట్ర కేసు బనాయించి 1974 నుంచి 1989 వరకు కొనసాగించారు.

ఈనాటి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామంత్రి పి.వి. రంగారావు (ప్రధానిగారి కుమారరత్నం)గారు ఇటీవల ఒక అమూల్యమైన సత్యాన్ని బయటపెట్టారు. వేదం 82 పన్నాలు ఒక్క దమ్మిడీ ఖర్చులేకుండా చదువుకున్న (అగ్నిహోత్రావధాన్లు వారసులు) తూర్పుగోదావరి పండితులు చెప్పింది సరిగ్గా వినందువల్లనే 'హిట్లర్' ఓడిపోయాడు. అంటే "సరిగ్గా వినివుంటే ఈపాటికి హిందూదేశం కూడా 'వేయిపడగల' నీడకింద సుఖిశంగా వుండేది. ఆ ప్రయత్నం ఆనాడు విఫలమయింది. ఈనాడు విజయవంతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అందుకే అక్కడ-అంటే హస్తినలో మా నాన్న రాజయ్యాడు. ఇక్కడ- భాగ్యనగరంలో- నేను మంత్రినయినాను".

తస్మాత్ ! జాగ్రత్త.
మనమంతా హిందువులం
ధర్మగంగ బిందువులం

ఆ మాటకొస్తే అలనాడు కంచికచెర్లలో, ఈనాడు పదిరికుప్పంలో, కారంచేడులో, నీరుకొండలో, తిమ్మసముద్రంలో, చుండూరులో, గోకరాజుపల్లెలో చంపినవారూ, చనిపోయినవారు కూడా హిందువులే మరి. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ చెప్పనే చెప్పాడు- "చంపేదెవరు ? చచ్చేదెవరు ? వాళ్ళు ఇప్పటికే చచ్చిపోయే వున్నారు. నువ్వు నిమిత్తమాత్రుడివి. అందుకని నువ్వు లే. చంపు" మన వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత బోధనల నిగ్గు ఇదే. అవును. మనది వేదభూమి, కర్మభూమి, ధర్మభూమి, రామజన్మభూమి, చిట్టచివరికి శ్రీకృష్ణ జన్మస్థానము. హిందూఫాసిజాన్ని కాదనేవారందరికీ శ్రీకృష్ణ జన్మస్థానమే శరణ్యం. అన్యథా శరణం నాస్తి. ఎదురు తిరిగితే విష్ణుచక్రానికి తలలు తెగిపోతాయి.

15-12-1991

తెల్లవాడి ఏలుబడిలో
1921 నుంచి 1945 వరకు
నిషేధానికి గురయిన తెలుగు రచనలు

1. భారత గీతములు
2. హిందూదేశము, పూర్వ ప్రస్తుత పరిస్థితులు

3. పాంచాల పరాభవము
4. స్వరాజ్య గీతామృతము
5. స్వరాజ్య మంత్రము
6. శాంతసారంగధర నాటకము
7. చీరాల పేరాల గాంధి దేశ నాటకము
8. సహాయ నిరాకరణము
9. శ్రీభారతీయ విలాపం
10. స్వప్న ప్రయాణము
11. స్వరాజ్య గీతములు
12. 'మాకొద్దీ తెల్లదొరతనం' గరిమెళ్ళని అరెస్టు చేశారు
13. సత్యార్థ ప్రవేశము
14. స్వరాజ్య జెండా, స్వరాజ్య శంఖం
15. శాంతి సంగ్రామము
16. మహారాణి ఝాన్సీ లక్ష్మీభాయి నాటకం
17. జాతీయ స్వరాజ్య పాఠము
18. నవయుగము, గాంధీ యుగము
19. బ్రిటిష్ వస్తు బహిష్కరణము
20. దారిద్ర నారాయణ గేయము
21. రాజనీతి సారము
22. భారత స్వరాజ్య యుద్ధము
23. గాంధీమహాత్ముని నీతి మంజూరి
24. నేటి రష్యా (నార్ల)
25. వినాయక సవర్కారు జీవితము
26. కృష్ణా పత్రిక, 14-7-1934 సంచిక
27. అమ్మ (గోర్కీ)
28. ఆత్మజ్యోతి
29. సర్దార్ భగత్‌సింగ్
30. మన్య విప్లవం (అల్లూరి సీతారామరాజు)
31. అన్న

32. రష్యా విప్లవం
33. వాహిని 3-9-1933 సంచిక
34. గోరాబాబు
35. మాలపల్లి (ఉన్నవ నవల)
36. 'జమీన్‌రైతు' అనే నాటకం
37. కష్టజీవి, అల్లూరి సీతారామరాజు (బుర్రకథలు)
38. 'మాభూమి' నాటకం

పై పట్టికలోని నాటకాల ప్రదర్శనలను కూడా నిషేధించారు.

39. డాక్టర్ జివాగో 1960

కాంగ్రెస్, తెలుగుదేశం హయాంలో నిషేధానికి గురయిన పుస్తకాలు

1. మార్చ్ - కవితా సంకలనం విప్లవ కవులు, సంకలన కర్త కిషన్‌రావు 1971 మార్చి
2. ఝంఝ - కవితా సంకలనంసంపాదకుడు కె.వి. రమణారెడ్డి విరసం తొలి ప్రచురణ 1971
3. లే - కవితా సంకలనం - సంకలన కర్త సుభాష్ 1971
4. ఇప్పుడు వీస్తున్న గాలి - విరసం తొలి కథా సంకలనం సంపాదకుడు కొడవటిగంటి కుటుంబరావు 1972
5. రక్తగానం, కవితా సంకలనం అనంతపురం చైతన్య సాహితి ప్రచురణ
6. శంఖారావం - విప్లవ గేయాల సంకలనం
   సోషలిస్టు పల్లి కేషను
7. నెత్తుటి దీపం
8. బందూక్ - కవితా సంకలనం అనంతపురం చైతన్య సాహితి ప్రచురణ
9. సృజన సంచికలు కొన్ని
   1972 మార్చి, మే
   " 73 ఏప్రిల్, మే
   " 74 మే
10. విమోచన సంచికలు రెండు
11. భవిష్యత్తు చిత్రపటం
   (వరవరరావు కవితా సంకలనం : 1987 జనవరి.)

అమెరికాలో రచయితలపై నిఘా

-వి. తిరుపతిరావు

అమెరికాలో రచయితలమీద అమెరికన్ గూఢాచారి సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (FBI) నిఘా ఎక్కువ అవుతోంది. గడచిన ఇరవై సంవత్సరాలలో అమెరికన్ రచయితలమీద FBI సేకరించిన రిపోర్టులు ఒక్కొక్క రచయిత మీద వందల పేజీలు వుంటాయి. ప్రముఖ రచయిత సింక్లెయిర్ లూయిస్‌మీద నూటయాభై పేజీల రిపోర్టు భద్రపరిచారు. హెమింగ్వే మీద నూటఇరవై రెండు పేజీలు, సైన్యంలో వర్ణ వివక్షతను విమర్శించినందుకు ఫెరల్‌బక్‌మీద రెండువందల యెనభై పేజీల పైన రిపోర్టులు తయారుచేశారు. డుర్తి పార్కర్, అలన్ గిన్స్‌బర్గ్ లాంటి వాళ్ళుకూడా ఇందుకు మినహాయింపు కాదు. దీనికంతటికి కారణం పై వ్యక్తులందరూ సొంత అభిప్రాయాలు కలిగివుండటం, వాళ్ళకి నచ్చిన అభిప్రాయాలు సమర్థించటం, తమకి నచ్చిన ఉద్యమాలలో పాల్గొనటమే. కొన్ని సందర్భాలలో వాళ్ళ ఉత్తరాలలోని భాగాలను కూడా రికార్డు చేసిపెట్టారు.

FBI అనేది అమెరికన్ న్యాయవ్యవస్థలోని ఒక భాగం. దీనిని గురించి 'Concise Columbia Encyclopedia' (Penguin) ఈ క్రింది విధంగా వివరించింది. "(FBI) A division of the U.S. Department of Justice charged with investigating all violations of federal law except those specifically assigned to other federal agencies. The FBI investigates espionage, sabotage, kidnapping, bank robbery civil rights violations and fraud against the government, and conducts security clearances'. పై వివరణ ప్రకారం పైన చెప్పబడ్డ రచయితలు ఈ నేరాలలో పేటిని చేయలేదు. అందువల్ల FBI రచయితల మీద కేంద్రీకరించిన నిఘా అంతా కూడా దానియొక్క పరిధిని అతిక్రమించటంగా మనం అర్థం చేసుకోవాల్సి వుంటుంది. 1908లో స్థాపించబడ్డ FBI, 1924-72వరకు దాని డైరెక్టరుగా వున్న జె. హెడ్గార్ హోవర్ క్రింద దాని పరిధిని విపరీతంగా పెంచుకుంది. హోవర్ చివర వరకు కూడా వివాదాస్పదమైన వ్యక్తిగానే మిగిలిపోయాడు. ఇతని

కాలంలో అమెరికన్ సమాజంలో ప్రజలకి రాజ్యాంగం ఇచ్చిన అనేక హక్కులు ఉల్లంఘించబడ్డాయి. రాజకీయ కక్ష సాధింపులకి FBIని వాడుకోవటం జరిగింది.

నల్లజాతి రచయిత జేమ్స్ బాల్డ్విన్ మీద అతని కార్యకలాపాల మీద 1960 లలో 1,750 పేజీల రిపోర్టు రూపొందించారంటే మనకు ఆశ్చర్యం కలగక మానదు. అమెరికాలో నల్లజాతి రచయితల మీద నిఘా వేసి వాళ్ళని వెంటాడటానికి 'సమైక్యత' (integration) అనే ఒక్కమాట చాలు. FBI దృష్టిలో కమ్యూనిస్టులకి, లిబరల్స్‌కి ఏమాత్రం తేడా లేదు. పౌరహక్కుల ఉద్యమ నాయకుడు మార్టిన్ లూథర్ కింగ్‌ని కూడా FBI వాళ్ళు వెంటాడటం మానలేదు. ఆయన చర్చికి సంబంధించిన వ్యక్తి అయినప్పటికి నల్లజాతి పౌరుల్ని వేరుచేసి చూడటాన్ని ఖండిస్తూ ఉద్యమాలు నడిపాడు. ఆయన ఉద్యమాలన్నీ శాంతియుతంగానే నడిపాడు. 1960లో వియత్నాంలో యుద్ధాన్ని బహిరంగంగా ఖండించి వ్యతిరేక ప్రచారం చేశాడు. ఈ సంవత్సరంలోనే ఆయన నడిపిన పౌరహక్కుల ఉద్యమంపట్ల కూడా FBI ధోరణి చాలా దుర్మార్గమైనది. అది నల్లజాతి నాయకత్వానికి ఏమాత్రం సహకారం అందించకపోగా అడ్డంకిగా తయారయింది. మార్టిన్ లూథర్‌పై తీవ్రమైన నిఘా ఏర్పాటు చేశారు. ఆయన తిరిగే ప్రాంతాలలో దాదాపు పదిహేనుకోట్ల బగ్స్(Bugs)ఏర్పాటు చేశారు. దీని ఉద్దేశం ఆయనని అప్రతిష్టపాలు చేయటం, క్రిమినల్ కేసులలో ఇరికించటం, తద్వారా ఆయన Character assasinationకి పాల్పడటం.

ఇంకొక నల్లజాతి రచయిత రిచర్డ్ రైట్ సమానహక్కులకోసం పోరాడాడు. 1930లలో ఆయన కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు కూడా. FBI ఆయనమీద రూపొందించిన రిపోర్టులు ఆయనను కోర్టులలో విచారించేంతవరకు దారితీశాయి. ఆతరువాత ఆయన దేశం వదిలి వెళ్ళిపోవటానికి ఇది ఒక కారణం అయింది. 1947లో ఆయన అమెరికా వదలి పారిస్ చేరుకున్నాడు. అక్కడ కూడా ఆయనను FBI వెంటాడుతూనే వుంది. 1960లో ఆయన చనిపోయేటంతవరకు తన మిత్రులను కూడా గూఢచారులేమోననే స్థితికి ఆయన నెట్టబడ్డాడు. తన జీవిత కాలంలో ఆయన విపరీతమయిన మానసిక ఆందోళనకి గురయ్యాడు. కొద్దినెలల్లో చనిపోతాడనగా ఆయన మిత్రునికి రాసిన లేఖ ఈ విషయాన్ని తెలియజేస్తుంది- "నేను ప్రమాదంలో వున్నానని విచారించవద్దు. నాకేదయినా ప్రమాదం జరగాలని నేననుకోవటంలేదు, కాని నాకేదయినా జరిగితే అది ఎవరివల్ల జరుగుతుందో నామిత్రులకి స్పష్టంగా తెలుస్తుంది".

ఆయన చనిపోయినప్పటినుండి అమెరికన్ సెక్యూరిటీ ఏజెంటు ఎవరయిన ఆయన మరణానికి కారణం కావచ్చని అతని మిత్రుల గట్టి నమ్మకం.

రైట్ అమెరికా వదిలి వెళ్ళేనాటికే అంతర్జాతీయంగా పేరుపొందిన రచయిత. తన నవల 'NATIVE SON' ఒక నల్లజాతి యువకుడి కథ. ఈ నవల 1940 బెస్ట్ సెల్లర్‌గా వున్న 'ది గ్రేప్స్ ఆఫ్ రాత్' అనే స్టెయిన్‌బాక్ నవలా స్థానాన్ని ఆక్రమించింది. ఆ తరువాత అయిదు సంవత్సరాలకి రాసిన 'BLACK BOY' ఆయనకి విపరీతమయిన పేరు తెచ్చిపెట్టింది. ఒకసారి సార్త్రే, రైట్ గురించి మాట్లాడుతూ అమెరికాలో నీగ్రో సమస్య వున్నంతవరకు అతని రచనలు నిలచి వుంటాయని ప్రశంసించాడు.

1941లో రైట్ 'ఫ్రాంకో-అమెరికన్ ఫెలోషిప్' అనే సంస్థని ప్రారంభించాడు. దాని లక్ష్యం పారిస్‌లో వర్ణవివక్షతని ఎత్తిచూపటం. దీనిని FAF అంటారు. FBI దీనిని కమ్యూనిస్టు సంస్థగా చిత్రీకరించింది. ఈ FAF నిర్వహించిన సమావేశాల్లో FBI వాళ్ళు పాల్గొంటూవచ్చారు. ప్రతిచోట రైట్‌కార్యకలాపాల్ని, అతన్ని వెంటాడుతూ పసిగట్టసాగారు. 'యునైటెడ్ స్టేట్స్ ఇన్ఫర్మేషన్ ఏజన్సీ', ఫారిన్ లైజియన్ సర్వీస్, సైనిక, నౌకా దళాలలోని గూఢచారులు అందరూగూడా రిపోర్టు తయారుచేశారు. వీటన్నింటిని FBI తన రికార్డులలో చేర్చుకుంది.

జేమ్స్ బాల్డ్‌విన్ అనే వేరొక అమెరికన్ రచయిత 1948లో పారిస్ వచ్చి రైట్ స్థాపించిన FAFలో అయిష్టంగానయినా చేరాడు. ఈయన రైట్ రచనలలోని తిరుగుబాటు (Protest) ధోరణిని మొదటినుండి విమర్శిస్తూనే వచ్చాడు. రైట్‌కి వ్యతిరేకంగా బాల్డ్‌విన్ అభిప్రాయాల్ని, విమర్శల్ని FBI తన రికార్డులలో చేర్చుకుంది. అమెరికా బయట అమెరికా వ్యతిరేక భావాల్ని రైట్ రెచ్చగొడుతున్నాడు అనే విషయం FBIకి బాల్డ్‌విన్ అందజేసినట్టుగా రికార్డయింది. ఇటువంటి తప్పుడు రికార్డులవల్ల రక్షణ దళాలవాళ్ళు రైట్‌లాంటి వాళ్ళని వెంటాడుతూనే వున్నారు. ఎందుకంటే వాళ్ళు 'ప్రమాదకరమైన వ్యక్తులు'. 1953లో ఒక దశాబ్దం తరువాత రైట్, 'THE OUT SIDER' అనే నవల రాశాడు. ఆ తరువాత 'SAVAGE HOLIDAY' అనే వేరొక నవల రాశాడు. ఈ రెండు నవలలు కూడా తిరస్కారానికి గురయ్యాయి. కారణం రైట్‌కి వ్యతిరేకంగా అమెరికాలో FBI చేసిన ప్రచారం అని వేరే చెప్పనవసరం లేదు. ఈ విషయం రైట్ స్పష్టంగా అర్థం చేసుకున్నాడు.

తను అమెరికన్ పౌరుడు అయినప్పటికి తన పాస్‌పోర్టు తరచు రెన్యూ చేసుకోమని వత్తిడి చేశారు. తాను తొందరలో తన పాస్‌పోర్టు కోల్పోవచ్చునని ఆయన మిత్రులు ఆయనను హెచ్చరించారు. ఇది తనని తన కుటుంబాన్ని విపరీత భయాందోళనలకు గురిచేసింది. దానితో ఆయన కమ్యూనిస్టుపార్టీతో తెగతెంపులు చేసుకోవాల్సివచ్చింది ఆ తరువాత రైట్ కమ్యూనిస్టుపార్టీ వదిలివేయటానికి కారణం అది విప్లవాత్మక మైనది కాకపోవటమేనని FBI వాళ్ళు సూత్రీకరణ చేశారు.

FBI వల్ల రైట్ అనుభవించిన మానసిక వత్తిడి ఇంకొక నల్లజాతి రచయిత ఎవరూ అనుభవించి వుండరు.

1956లో నీగ్రో- ఆఫ్రికన్ రచయితల మొదటి సమావేశం పారిస్‌లో జరిగింది. దీనిని వామపక్ష పత్రిక 'ప్రెజన్సీ ఆఫ్రికన్' నిర్వహించింది. దీనికి రైట్ ప్రధాన ఉపన్యాసకుడిగా ఆహ్వానింపబడ్డాడు. దీనికి ఆహ్వానించబడ్డ ప్రముఖుల్లో బాల్డ్‌విన్ ఒకడు. అంతవరకు బాల్డ్‌విన్‌కి FBI నుండి గాని, CIA నుండిగాని ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. ఆ తరువాతనుంచి, ముఖ్యంగా 1960లో జరిగిన పౌరహక్కుల ఉద్యమంతో ఆయనపైకూడా FBI కన్ను పడింది. అప్పటికి రైట్ చనిపోయాడు. అప్పటినుండి రైట్ జీవితంలాగే బాల్డ్‌విన్ జీవితంకూడా FBIనీడలో నడిచింది.

రైట్‌ని వెంటాడినట్టే బాల్డ్‌విన్‌యొక్క ప్రతి కదలికను FBI వాళ్ళు గమనింపసాగారు. ఏదయిన ఒకచోట బాల్డ్‌విన్ మాట్లాడుతూవుంటే అక్కడ FBI గూఢచారులు బాల్డ్‌విన్‌యొక్క ఉపన్యాసాన్ని నోట్సు రాసుకుంటూవుండేవారు. దీని ఉద్దేశ్యం అతని మాటల్లో తీవ్రవాదం ఏ స్థాయిలో వుందో అంచనా వేయటంకోసం. ఈ గూఢచారులు బాల్డ్‌విన్ ఇంటి పరిసరాలలో మెదులుతూ తమను బాల్డ్‌విన్ బంధువులుగా పరిచయం చేసుకొని అతనిని గురించిన వివరాలు సేకరించేవారు. జాతి సమస్యలలో తాను మునిగి వుండటంవల్ల తాను క్రమంగా సృజనాత్మక సాహిత్య రచనకి దూరమై రాజకీయాలవైపు నెట్టబడ్డాడు. 1970లో FBI వత్తిడి తీవ్రతరం కావటంతో బాల్డ్‌విన్‌కూడా పారిస్‌లో స్థిరపడ్డాడు. దీనితో అతని జీవితం, సాహిత్యం రైట్ జీవితంలాగా అమెరికాలో తెరమరుగవటానికి FBI వాళ్ళు చేయగలిగినంత చేశారు.

బాల్డ్విన్ మీద FBI రూపొందించిన రిపోర్టులు FBI లోని ప్రతి పై స్థాయి నాయకుడికి చేరాయి. అమెరికన్ సమాజపు సమస్యలు కేవలం విప్లవం ద్వారా మాత్రమే పరిష్కరించబడతాయని, ఉరిశిక్ష రద్దు చేయాలని ప్రచారం చేస్తున్నాడని బాల్డ్విన్ మీద ప్రధాన ఆరోపణలు FBI చేసింది. అయితే బాల్డ్విన్ అంత తేలిగ్గా లొంగిపోయే స్వభావం కలవాడు కాకపోవటంవల్ల అమెరికన్ ప్రభుత్వ విధానాలను విమర్శించటం మానుకోలేదు. FBI కి తమ మీద బాల్డ్విన్ పుస్తకం రాయబోతున్నాడని తెలిసింది. ఆ తరువాత F B I అతనిని నైతికంగా దెబ్బతీయటానికి కూడా వెనుకాడలేదు. 1964, జులై 20న ఈ క్రింది రిపోర్టు రూపొందించి ప్రచారం చేసింది.

"జేమ్స్ బాల్డ్విన్‌కి సంబంధించిన సమాచారం : అతను (బాల్డ్విన్) పర్వర్ట్ (pervert) ఔనా ! కాదా ! అనేది సమస్య కాదు. అతని మూడు నవలల్లో రెండింటిలో హోమోసెక్సువాలిటీ ప్రముఖంగా చిత్రించబడ్డది. అతను హోమో సెక్సువల్ అని చెప్పటానికి అవకాశం లేకపోయినప్పటికీ, అతనికి హోమో సెక్సు వాలిటీ మీద సానుభూతితో కూడిన అభిప్రాయం వుంది. దానిని ఆయన అనేక సందర్భాలలో వ్యక్తంచేశాడు". 1966 మార్చి 29న రూపొందించిన ఇంకొక రిపోర్టులో ఇంకో అడుగు ముందుకుపోయి వాను హోమో సెక్సువల్ అని నిర్ణ యించి బహిరంగ చర్చకు పెట్టారు.

"నల్లజాతి నవలా రచయిత, నాటకకర్త జేమ్స్ బాల్డ్విన్ ప్రస్తుతం ఎక్కడ వుంటున్నాడో తెలియదు. అమెరికన్ హోటల్‌లో పాల్ రాబ్సన్ నిర్వ హించిన ఒక కార్యక్రమంలో బాల్డ్విన్ పాల్గొన్నాడు. బాల్డ్విన్ హోమో సెక్సు వల్ అని అనుకుంటున్నారు". దీనితో ఆయనమీద హోమో సెక్సువల్ ముద్ర పడి పోయింది.

పాల్ రాబ్సన్ (ఈయన గురించే మహాప్రస్థానం పీఠికలో చలం పేర్కొంది) అమెరికాకు చెందిన ప్రముఖ నటుడు, నాయకుడుగా యుజిన్ ఓనీల్ (Eugene O' Neill) నాటకం 'ఎంపరర్ జోన్స్'లో ఆయన వేసిన పాత్రలు ఆయనకి విపరీతమయిన పేరును తెచ్చిపెట్టాయి. వామపక్ష భావాల్ని బహి రంగంగా సమర్థించటంవల్ల ఆయన కూడా FBI నుండి అనేక చిక్కుల్ని ఎదు ర్కొనవలసి వచ్చింది. 1976లో ఆయన చనిపోయాడు.

సాంకేతికాభివృద్ధి - సాహిత్యం

— ఎన్. వేణుగోపాల్

కళలకూ శాస్త్రాలకూ మధ్య, కళలకూ సాంకేతికాభివృద్ధికీ మధ్య పూడ్చలేని అఖాతం ఉన్నదని, రెండూ వేరు వేరు రంగాలని బలమైన అభిప్రాయం ప్రచారంలో ఉంది. అటువంటి చోట సాహిత్యం - సాంకేతికాభివృద్ధి అనే అంశం చిత్రంగా ధ్వనిస్తుంది. ఏమాత్రం సంబంధంలేని రెండు అంశాల మధ్య సంబంధం వెతక డానికి ప్రయత్నిస్తున్నట్టనిపిస్తుంది. కాని నిజానికి ఇవాళ ఈ రెండు అంశాల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం పెరుగుతోంది. అత్యున్నత సాంకేతిక విధానంగా కనబడే ఉపగ్రహ ప్రసార సాధనాల సహాయంతో ఒకవైపు కాలం చెల్లిన విలువలు, మరోవైపు అత్యాధునికంగా కనబడే సామ్రాజ్యవాద విలువలు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. సాంకేతికాభివృద్ధికి మన జీవితంలో, అన్ని సామాజిక చైతన్య రూపాలలో పాత్ర పెరుగుతున్నప్పుడు, సాంకేతికాభివృద్ధిని సాహిత్యం వైపు నుంచి కూడ అర్థం చేసుకోవడం అవసరం. సాంకేతికాభివృద్ధికీ సాహిత్యానికీ ఉన్న సంబంధాన్ని, పరస్పర చర్య - ప్రతిచర్యలను, సామాజిక జీవితంలో సాంకేతికాభివృద్ధికీ, సాహిత్యానికీ ఉన్న పాత్రను అర్థం చేసుకోవడం అవసరం.

మొట్టమొదట వేసుకోవలసిన ప్రశ్న సాంకేతిక అభివృద్ధి అంటే ఏమి టనేది. మానవులు తమ మనుగడను, తమ పరిసరాలను మెరుగు పరచుకొనేందుకు కనిపెట్టిన, కనిపెడుతున్న పద్ధతులను సాంకేతిక విధానం అని పిలుస్తాం. ఏ జీవి కైనా పరిసరాలలో సహజ వనరులు ఎన్నో ఉంటాయి. ఆ సహజ వనరుల్లో సజీవ

---

55 ఏళ్ళ వయసులో చనిపోతూ రైట్ అన్న మాటలతో ఈ వ్యాసం ముగిస్తాను. "All that I possessed were words and a dim knowledge that my Country had shown no example of how to live a human life".

('Times Literary Supplement'లో జేమ్స్ కాంప్‌బెల్ రాసిన వ్యాసం ఆధారంగా)

మైనవీ ఉండవచ్చు, నిర్జీవమైనవీ ఉండవచ్చు. ఆ వనరులకు వేరు వేరు ఉపయోగాలుంటాయి. అయితే ఆ వనరుల వైవిధ్యం గురించీ, వాటి వేరువేరు ఉపయోగాల గురించీ మనిషి కాక మిగిలిన జీవులు పట్టించుకోవు. మనిషి కాక మిగిలిన ఏ ప్రాణి అయినా దాని జాంతవిక అవసరాలు తీర్చుకునేవరకు మాత్రమే పరిసరాల గురించి పట్టించుకుంటుంది. ఆ అవసరాలు తీర్చే పదార్థాలు ఎట్లా ఏర్పడ్డాయో, ఎందుకు ఉపయోగపడతాయో జంతువులు ఆలోచించవు. కాని మనుషులు మాత్రం ఆ వనరుల వైవిధ్యం గురించీ, ఆ వనరుల్లో ప్రతి ఒక్కదాని ప్రత్యేక లక్షణాల గురించీ, వాటి వేరు వేరు ఉపయోగాల గురించీ ఆలోచించారు, ఆలోచిస్తారు. ఏ పదార్థాన్ని, ఏ రకంగా ఉపయోగిస్తే తన మనుగడ మెరుగవుతుందో ఊహలు చేశారు, ప్రయోగాలు చేశారు. ఇట్లా వందల సంవత్సరాలపాటు సాగిన ఆలోచనలు, ఒక తరం తర్వాత మరొక తరం నిరంతరంగా చేరుస్తూ వచ్చిన అభివృద్ధి కలిసి అనేక పద్ధతులు రూపొందాయి.

భూమిమీద మానవజాతి అవతరించిన తర్వాత జరిగిన ముఖ్యమైన మార్పు ఆ మనిషిలో నిరంతర అభివృద్ధి కాంక్ష ఉండడం, కుతూహలం ఉండడం. ఎన్ని నాగరికతలు పుట్టి, పెరిగి, నశించిపోయినా మానవ జాతిలో ఈ నిరంతర అభివృద్ధి కాంక్ష తొలగిపోలేదు. బహుశా ఇంకా పెరుగుతోంది. ఈ కాంక్ష నుంచే సహజ వనరులను ఎంత ఎక్కువగా, ఎంత వైవిధ్యంలో, ఎంత పొదుపుగా, ఎంత లాభసాటిగా వాడుకోగలమనే స్పృహ పెరుగుతూ వచ్చింది. ప్రకృతి మీద మనిషి పోరాటం ఒక తరం నుంచి మరో తరానికి మరింత నిశితమూ గాఢమూ అవుతూ వచ్చింది. ఈ పోరాటానికి వ్యక్తీకరణ రూపమే సాంకేతిక విధానం. ఈ క్రమంలోనే సాంకేతిక విధానం అంటే జ్ఞానాన్ని ఆచరణలోకి అనువదించే విధానం అనే అర్థం వచ్చింది.

ఇప్పుడు సర్వసాధారణంగా సాంకేతిక విధానం అంటే ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ఉత్పత్తిలో, ఆచరణలో వాడే పద్ధతి అనీ, సాంకేతిక అభివృద్ధి అంటే ఆధునిక శాస్త్ర విజ్ఞానంలో జరుగుతున్న కొత్త అన్వేషణలనీ అర్థం చెప్పుకుంటున్నాం. మరో మాటలో చెప్పాలంటే, ఒకానొక నిర్దిష్ట చారిత్రక దశలో ఆ సమాజ ఉత్పత్తి శక్తులలో భాగంగా ఉండే నైపుణ్యాన్ని సాంకేతిక విధానం అని పిలుస్తున్నాం. ఆ నైపుణ్యాల పెరుగుదలను సాంకేతిక అభివృద్ధి అంటున్నాం.

సమాజంలో సాంకేతికాభివృద్ధిని అలా ఉంచి, సాహిత్యానికి సంబంధించి ప్రత్యేకమైన సాంకేతికాభివృద్ధి ఉంటుందా? నిజానికి సమాజపు సాంకేతిక అభివృద్ధికే మొత్తంగా అన్ని సామాజిక చైతన్య రూపాల మీదా అధికారం ఉంటుంది. కాని, సాహిత్యాన్ని ఉత్పత్తి చేయడంలో, ప్రచారం చేయడంలో ఉపయోగించే సంవిధానాల అభివృద్ధిని సాహిత్యానికి సంబంధించిన సాంకేతికాభివృద్ధిగా చూడవచ్చు. లిపి ఆవిష్కరణ, కాగితం ఆవిష్కరణ, రాత సాధనాలలో మార్పులు, అచ్చుయంత్రం ఆవిష్కరణ, అచ్చుయంత్రంలో స్వయం చాలిత (ఆటోమేటిక్) పద్ధతులు, అచ్చు పనిలో ఎలక్ట్రానిక్ పద్ధతులు ఇప్పటికి సాహిత్య సంవిధానాలలో ప్రధానంగా వచ్చిన మార్పులు. ఇవి అంతర్గతంగా సాహిత్య రూపాల్లోనూ వస్తువులోనూ కూడ మార్పులు తేగలిగాయి.

ఇంతకన్న ముఖ్యంగానూ, విస్తృతంగానూ సామాజిక రంగాలలో సాగిన సాంకేతిక అభివృద్ధి సాహిత్యంలో ఎన్నో పరిణామాలకు దారి తీసింది. అట్లాగే సాహిత్యం ఒక సామాజిక చైతన్య రూపంగా సాంకేతిక అభివృద్ధి క్రమం మీద, ఒక సాంకేతిక అభివృద్ధిని సామాజికంగా ఉపయోగించుకునే పద్ధతుల మీద కూడ ప్రభావం వేసింది. అంటే సాహిత్యానికీ, సాంకేతికాభివృద్ధికీ మధ్య సంబంధం ఏకముఖంగా కాక పరస్పర చర్యల రూపంలోనే ఉన్నది.

ఈ సంబంధాన్ని గుర్తించడం, ఈ సంబంధం పట్ల చైతన్యయుతంగా ఉండడం విప్లవ రచయితలకు నాలుగు కారణాల వల్ల అవసరం. ఒకటి-సాంకేతిక అభివృద్ధి ఉత్పత్తి సాధనాలకూ, శ్రామికుల నైపుణ్యానికీ సంబంధించినదిగా ఒక పునాది అంశం అవుతుంది. సాహిత్యం ఒక ఉపరితల అంశం. విప్లవ రచయితలు తప్పనిసరిగా గుర్తించవలసిన పునాది–ఉపరితల సంబంధాలను ఈ అంశంలో అధ్యయనం చేయవచ్చును. దీన్నే మరో మాటలో చెప్పాలంటే సాంకేతిక విధానం ఉనికికి సంబంధించింది. సాహిత్యం చైతన్యానికి సంబంధించింది. ఉనికికీ చైతన్యానికి మధ్య గల సంబంధాలను అర్థం చేసుకునేందుకు కూడ ఈ అంశాన్ని అధ్యయనం చేయాలి.

రెండు-శాస్త్ర, సాంకేతిక విషయాల చుట్టూ సాధారణంగా మాయ అల్లుకుని ఉంటుంది. ఆ విషయాలు సాధారణ మానవులు మాట్లాడడానికి వీల్లేని విషయాలు అయిపోయాయి. అందువల్ల సామ్రాజ్యవాద దోపిడీ గాని, దాని విష ప్రభావాలు

గాని, భూస్వామ్య విలువలు గాని సాంకేతిక విధానం రూపంలో వచ్చినప్పుడు సందేహరహితంగా తీసుకోవడం జరుగుతున్నది. అంతేగాక సాంకేతిక విధానమే 'అభివృద్ధి'కి సూచన అనే తప్పుడు నిర్వచనం వల్ల మన సమాజం లాంటి సమాజాలలో సాంకేతికాభివృద్ధి సామ్రాజ్యవాదుల బలమైన ఆయుధంగా ఉంటోంది. ఆ ఆయుధాన్ని భావజాల రంగంలో సామ్రాజ్యవాదులు, భూస్వామ్య వర్గాలు ఎట్లా ప్రయోగిస్తున్నారో అర్థం చేసుకోవడం విప్లవ రచయితలుగా మన కర్తవ్యం.

మూడు—ఒక కొత్త సాంకేతిక విధానం అంటే ఉత్పత్తి శక్తులలో ఒక ముందడుగు. ఈ ముందడుగు ప్రజల ప్రాపంచిక దృక్పథంలో దానికి సమానమైన ముందడుగును తేలేకపోతే సాంకేతిక అభివృద్ధి వక్రీకరణకు గురవుతుంది. కంప్యూటర్ లాంటి నూతన సాంకేతిక అభివృద్ధి, కొబ్బరికాయ కొట్టడానో్న, జంతుబలి ఇవ్వడానో్న, జ్యోతిష్యం చెప్పడానో్న ప్రోత్సహిస్తే ఆ కంప్యూటర్ నిజానికి 'అభివృద్ధి' కాకుండా పోయినట్టే. ప్రాపంచిక దృక్పథంలో మార్పుకు సాహిత్యం ఒక సూచికగా ఉంటుంది గనుక సాంకేతిక అభివృద్ధికీ, ప్రాపంచిక దృక్పథంలో మార్పుకూ సంబంధాన్ని సాహిత్యంలో గుర్తించవచ్చు.

నాలుగు—సాంకేతిక విధానం, సాంకేతిక అభివృద్ధి ఉత్పత్తితో ముడిబడి ఉంటాయి గనుక వాటిలో ఒక అవిచ్ఛిన్నత ఉంటుంది. సాంకేతికాభివృద్ధి చరిత్రను అంతకంతకూ పైకి పోయే అభివృద్ధి రేఖగా గుర్తించవచ్చు. కాని సాహిత్య అభివృద్ధిలో ఆ రకంగా అవిచ్ఛిన్నతనుచూడలేము. కొశాంబి ఈ విషయాన్ని ప్రతిపాదిస్తూ "ఆర్కిమెడిస్, న్యూటన్, గాస్ వరుసగా ఒక గొలుసులో ముక్కలుగా ఉంటారు. ప్రతి ఒక్కరూ తమ కంటె ముందరి వారితో సంబంధంలో ఉంటారు. మొదటివారి పరిశోధనలు లేకుండా రెండోవారి పరిశోధనలు సాధ్యమయ్యేవి కావు. కాని సాహిత్యంలో షేక్స్పియర్ కన్న ముందు తప్పనిసరిగా ఎస్కిలస్సో, కాళిదాసో ఉండాలని ఏమీ లేదు. ఇక్కడ ముగ్గురికీ స్వతంత్ర అస్తిత్వం ఉంటుంది" అన్నాడు. సాంకేతికాభివృద్ధికీ, సాహిత్యానికీ మధ్య సంబంధాన్ని గురించి చర్చించేటప్పుడు ఈ విషయం కూడ దృష్టిలో ఉంచుకోవాలి.

ఒక కొత్త సాంకేతిక విధానం రాగానే దాని చుట్టూ ఒక ఆరాధనా భావంతో వస్తోంది. ఇప్పుడిప్పుడే మన నగరాల్లో ప్రవేశిస్తున్న డిష్ అంటెన్నా గాని, కొన్నాళ్ళ కింద ప్రవేశించిన కేబుల్ టెలివిజన్ గాని, అంతకు ముందరి టెలివిజన్

గాని, ఈ మధ్య కాలంలో శరవేగంతో పెరిగిపోతున్న టెలిఫోన్ సౌకర్యాలు గాని వాటి మాయవల్ల సమాజంలో సగౌరవంగా ప్రవేశించి స్థిరపడుతున్నాయి. ఈ గౌరవానికి కారణం సాంకేతిక అభివృద్ధే సర్వస్వమనే ఒక అవగాహన. ఈ అవగాహన ప్రకారం సాంకేతిక అభివృద్ధి దానంతటదే స్వయంగా రూపొందుతుంది. అందువల్ల ఆధునిక సాంకేతిక అభివృద్ధి అంతా అనివార్యమైనది. దాన్ని యథాతథంగా స్వీకరించడం వినా మనకు గత్యంతరం లేదు. శాస్త్ర, సాంకేతిక అధ్యయనం నుంచి, ప్రయోగాల నుంచి మాత్రమే ఒక కొత్త అన్వేషణ రూపు దాల్చిందని, అది ఇక ప్రవేశించిన రంగాన్నంతా మార్చేస్తుందని, సమాజమంతా దానికి అనుకూలంగా మారిపోక తప్పదని ఈ అవగాహన భావిస్తుంది. సాహిత్యంలో, తెలుగు సాహిత్యంలో కూడ ఈ అవగాహన ప్రతిఫలనాన్ని మనం గమనించవచ్చు.

నిజానికి కొత్త సాంకేతిక విధానం అనేది కేవలం శాస్త్రాన్వేషణా ఫలితంగా వచ్చి సమాజాన్ని మార్చేసేది కాదు. ఒక నిర్దిష్ట సమాజంలో కొన్ని ప్రత్యేక సామాజిక, రాజకీయ, ఆర్థిక కారణాల వల్ల ఒక ప్రత్యేక సాంకేతిక విధానం అభివృద్ధి చెందుతుంది. లేదా ఒక సాంకేతిక విధానపు వేరు వేరు ఉపయోగాలలో కొన్ని ఉపయోగాలు ప్రాచుర్యంలోకి వస్తాయి. (గర్భస్థ శిశుపు ఆరోగ్యాన్ని పరిశోధించే అమ్నియోసెంటెసిస్, ఆడ శిశువును చంపడానికి ఉపయోగపడ్డట్టు) ఏ అన్వేణకైనా కొన సాగుతున్న సాంఘిక సంబంధాల, సాంస్కృతిక రూపాల నేపథ్యం తప్పనిసరిగా ఉంటుంది. ఒక సాంకేతిక అన్వేషణను కేవలం శాస్త్ర, సాంకేతిక దృష్టినుంచి చూస్తే దానికదిగా దానికి ఏ సామాజిక ప్రాముఖ్యతా ఉండదు. ఫలానా సాంకేతిక విధానంలో పెట్టుబడి పెట్టాలని, పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని అనుకున్నప్పుడే, ఆ సాంకేతిక విధానాన్ని ప్రత్యేక సామాజిక అవసరాల కోసం వినియోగించాలని అనుకున్నప్పుడే ఆ సాంకేతిక అన్వేషణకు ప్రాముఖ్యత వస్తుంది. అంటే ఒక సాంకేతిక విధానం 'అన్వేషణ' స్థాయి నుంచి ఉపయోగించుకోదగిన 'సాంకేతిక విధానం'గా మారినప్పుడే దానికి ప్రాధాన్యత వస్తుంది. అనేక అన్వేషణలలోంచి-ఒక అన్వేషణనో, ఒక అన్వేషణకు గల అనేక ఉపయోగాలలోంచి ఒక ఉపయోగాన్నో ఎంపిక చేసుకోవడం, దానిపై పెట్టుబడి పెట్టడం, దాన్ని అభివృద్ధి చేయడం అనేవి సాంఘిక, ఆర్థిక, రాజకీయ కారణాల వల్ల జరిగేవే గాని ఆ అన్వేషణలోని అంతర్గత లక్షణాల వల్ల జరిగేవి కావు. యుద్ధ సాంకేతిక విధానం విపరీతంగా అభివృద్ధి

రాపగానికీ, అత్యవసరమైన రోగ చికిత్సల సాంకేతిక విధానం అభివృద్ధి కాకపోవ డానికీ తేడా చూస్తే ఈ విషయం అర్థమవుతుంది.

సాహిత్యానికీ, కళా సాహిత్యాల ప్రచారానికీ సంబంధించిన సాంకేతిక విధానం గనుక ఉపగ్రహ ప్రసారాల విషయమే తీసుకుందాం. రేడియో ప్రసారాలలో ఉపయోగించే సంకేతాలను సమాచార ఉపగ్రహాలు ఇంకా విస్తారిస్తాయనీ, ఇంత వరకూ అందుబాటులో లేని ప్రాంతాలకు అవి సంకేతాలను చేరవేస్తాయనీ మొదట ఊహించారు. (అయితే 'అందుబాటులో లేని ప్రాంతాలు' అనే మాటకే రాజకీయ అర్థాలున్నాయి !)

అసలు విషయం చెప్పాలంటే ఉపగ్రహ సాంకేతిక విధానంలో అభివృద్ధి అంతా సైనిక రంగంలో పరిశోధన, అభివృద్ధి పెట్టుబడుల ఫలితంగా జరిగింది. సైనిక రాకెట్ల వాడకం, సైనిక సమాచార సంబంధాలు, గూఢచార వ్యవస్థలు - ఇవీ సమాచార ఉపగ్రహాల అన్వేషణకు దారి తీసినవి. కొంత కాలానికి ఉపగ్రహా లను టెలిఫోన్, టెలిగ్రాఫ్ వ్యవస్థలతో అనుసంధానించారు. అప్పటికే సుస్థిరంగా ఉన్న టెలివిజన్ ప్రసార వ్యవస్థలకు కూడ ఈ ఉపగ్రహ సాంకేతిక విధానం అందుబాటులోకి వచ్చింది. ఈ దశవరకూ సాంకేతిక అభివృద్ధి ఎంతో కొంత "తటస్థంగా" ఉన్నట్టు కనిపిస్తుంది. సంకేతాలను అభివృద్ధి చేయడానికీ, విస్తరించ డానికీ ఉపగ్రహ వ్యవస్థను వాడవచ్చు. సుదూర సంకేతాలను త్వరితంగా రిలే చెయ్యా డానికి ఉపగ్రహ వ్యవస్థను వాడవచ్చు. ఈ రెండు రకాల అభివృద్ధి కూడ సమా చార సంబంధాలకు అవసరమైనదీ, ఉపయోగకరమైనదీ. కాని వాస్తవంగా జరిగిన అభివృద్ధి ఇది కాదు. వాస్తవ అభివృద్ధి మరో దిశలో పయనించింది. అడుగు పెట్టిన ప్రతిచోటనూ అనివార్యమైనదని ప్రకటించింది.

మొదట ఉపగ్రహాలు పంపించే సమాచారాన్ని స్వీకరించే సంస్థలు, ప్రభుత్వ రంగంలోనూ, ప్రైవేట్ రంగంలోనూ విరివిగా తలెత్తాయి. ఉపగ్రహ సమాచారాన్ని స్వీకరించి, ఇతరులకు పంపిణీ చేసే వ్యవస్థలు తయారయి ప్రభుత్వాలకు, చిన్న చిన్న సంస్థలకు అమ్మడం ప్రారంభించాయి. ఇట్లా ఉపగ్రహ సమాచార వ్యవస్థ, ఖరీ సమాచార, ప్రసార కార్పొరేషన్లు కలగలిసి సాగాయి. మరోవైపు ఈ సమా చారాన్ని అందుకునే వ్యక్తిగత సెట్లు - టెలివిజన్ సెట్ల- తయారీ అమ్మకం

విజృంభించాయి. అవి వాయిదాల పద్ధతిమీద అమ్మకం దగ్గరి నుంచి ప్రారంభించి, ప్రభుత్వరంగ ఉద్యోగులకు, ప్రైవేటురంగంలోని పెద్ద పరిశ్రమల ఉద్యోగులకు సులభవాయిదాల మీద ఇవ్వడం వరకు సాగాయి. ఇదంతా పైకి చూస్తే సాంకేతికాభివృద్ధిగా, ప్రజల సమాచార వ్యవస్థ అభివృద్ధిగా కనబడుతున్నప్పటికీ వాస్తవం అది కాదు. ఈ అభివృద్ధి అంతా కూడ సామ్రాజ్య వాద పారిశ్రామిక సంస్థల ఆర్థిక కారణాల మీద ఆధారపడి సాగిందే.

రెండు, మొదటి కారణాన్నయినా కొంతవరకు సాంకేతిక పదజాలంలో కప్పివేయవచ్చుగాని, రెండో కారణం పూర్తిగా ఆర్థిక, రాజకీయ రంగాలకు సంబంధించినదే. ఉపగ్రహ సాంకేతిక విధానాన్ని వినియోగించాలనే ఆలోచన వెనుక ఇప్పటికే ఉన్న జాతీయ రాజకీయ, సాంస్కృతిక, వాణిజ్య సరిహద్దులను అధిగమించాలనే ప్రయత్నం ఉంది. స్థానిక 'జాతీయ' ప్రభుత్వాలు, తమ స్వంత పద్ధతిలో పాలించపడుతున్న సమాజాలు విధించుకున్న సాంస్కృతిక, వాణిజ్య పరిమితులను రద్దు చేయడానికి ఉపగ్రహం ఉపయోగపడుతుంది. అంటే ఉపగ్రహం నిరంకుశంగా సరిహద్దులను చెరిపేస్తుంది. సినిమాలను, క్రీడలను. ఇతర టెలివిజన్ కార్యక్రమాలను తయారుచేసే, ప్రసారం చేసే బహుళజాతి కార్పొరేషన్‌లకు ఉపగ్రహం ఒక విశాల మార్కెట్‌ను సంపాదించి పెడుతుంది. సాంకేతిక అభివృద్ధిగా కనబడే ఉపగ్రహం సారాంశంలో సామ్రాజ్యవాద ప్రచార, పంపిణీ అవసరాలను తీరుస్తుంది. ఆ క్రమంలో సాధికారతను, స్థానిక ఆభాసను కల్పించుకునేందుకు, ఆయా సమాజాలలో సామూహిక తప్పుడు చైతన్యంగా ఉండే భూస్వామిక విలువలనూ, సాహిత్యాన్ని, సంస్కృతినీ ఉపగ్రహం ప్రసారం చేస్తుంది.

మూడో కారణం దీనితో కలగలిసి ఉండేదే. రాజకీయంగా పరిమితులు ఉన్న ప్రాంతాలలోకి, సాపేక్షికంగా రాజకీయ గుత్తాధిపత్యం అమలవుతూ, విధి నిషేధాలు ఉన్న ప్రాంతాలలోకి ప్రవేశించాలనే కోరిక నుంచి ఉపగ్రహ సాంకేతిక విధానం అభివృద్ధి చెందింది. పూర్వకాలంలో ఏ దేశంలోనైనా కొన్ని చోట్ల ఫొటోలు తీసుకోగూడదని నిషేధం ఉండేది. కొన్ని ప్రాంతాలకు సంబంధించిన సమాచారం కీలకమైనదనే పేరు మీద ఇతరులకు అందుబాటులో ఉండేది కాదు. కాని ఇప్పుడు ఉపగ్రహాలు ఆ నిషిద్ధ ప్రాంతాల నుంచి సమాచారం సేకరించగలవు. ఆ ప్రాంతాలలోకి తమ సమాచారాన్ని ప్రసారం కూడ చేయగలవు. ఇంతకు ముందే షార్ట్‌వేవ్

రేడియో తరంగాల ద్వారా ఈ ప్రయత్నం జరిగింది. కాని ఉపగ్రహ దృశ్య, శ్రవణ ప్రసారాల ద్వారా రేడియోకన్న శక్తివంతంగా ఈ హద్దులను, విధి నిషేధాలను అధిగమించవచ్చు.

ఈ కారణాల వైపు నుంచి చూస్తే సాంకేతిక విధానం పేరుమీద నిజానికి జాతీయ సార్వభౌమత్వం, దేశ ఆకాశ సరిహద్దులు, కీలక సమాచారం ప్రచారం మీద ఆంక్షలు మొదలయిన అంశాలన్నిటినీ రద్దుచేసే ప్రయత్నం జరుగుతున్నదని అర్థమవుతుంది.

ఈ చర్చ అంతా పెట్టుబడిదారీ దేశాలలో, సామ్రాజ్యవాద, బహుళ జాతి కార్పొరేషన్ల కనుసన్నలలో జరిగిన సాంకేతికాభివృద్ధికి సంబంధించినది. ఇది భారత దేశం లాంటి అర్ధ వలస - అర్ధ భూస్వామ్య దేశంలో మరింత వికృతంగా జరుగుతుంది. ఇక్కడ సాంకేతికాభివృద్ధి పేరు మీద జరిగే కార్యక్రమాలు కూడ స్వంతంగా చేసేవి కావు. అర్ధ వలసగా ఉన్న దేశంలో దళారీ పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలు ఎంత మేరకు నెరవేరుతాయో అంతమేరకే సాంకేతికాభివృద్ధి ప్రవేశిస్తుంది. ఆ దళారీ పెట్టుబడిదారీ వర్గానికి భూస్వామ్య వర్గంతో సంబంధం తప్పని సరైనది గనుక జరిగే సాంకేతికాభివృద్ధి అంతా భూస్వామ్యాన్ని, భూస్వామ్య సంస్కృతీ సాహిత్యాలను బలోపేతం చెయ్యడానికి ఉపయోగపడుతుంది.

ఈ రెండు అంశాలకు ఉదాహరణగా భారత సామాజిక, పారిశ్రామిక చరిత్ర నుంచి ఎన్నో ఉదంతాలు చూపవచ్చు. సాంకేతికాభివృద్ధికి సంబంధించి తాజా ఉదాహరణ ఐబిఎం-టాటా ఒప్పందం. కంప్యూటర్లలో అత్యాధునిక సాంకేతికాభివృద్ధిని సాధిస్తూ కూడ భారతదేశానికి మాత్రం కాలం చెల్లిన, పాతబడిన సాంకేతిక విధానాన్నే అమ్మిందనే కారణంమీద ఐబిఎంను 1977లో జనతాప్రభుత్వం వెళ్ళగొట్టింది. ఇప్పుడు ఆ ఐబిఎంనే సగౌరవంగా ఆహ్వానించి టాటా ఉమ్మడి ఉత్పత్తులు సాగించబోతున్నాడు. మరెన్నో సాంకేతిక విధానాలలో సామ్రాజ్యవాద కార్పొరేషన్లు కాలం చెల్లిన యంత్రాలను అంటగట్టినా భారత దళారీ పెట్టుబడిదారులు ఎప్పుడూ కిక్కురుమనలేదు.

మరోవైపు ఉపగ్రహ సాయంతో దేశంలోని అన్ని లోపవర్ ట్రాన్స్మిట

ర్లకు ప్రసారాలు అందడం మొదలయిన తర్వాత వరుసగా రామాయణ, మహాభారతం, చాణక్య వంటి భూస్వామ్య భావజాలపు పట్టుగొమ్మలు మాత్రమేగాక మరెన్నో కార్యక్రమాలలో భూస్వామ్య విలువలకు ప్రాచుర్యం దొరుకుతోంది.

అంటే ఏదైనా ఒక కొత్త సాంకేతిక విధానం ప్రవేశిస్తున్నదంటే అది కేవలం మెరుగైన సాంకేతిక విధానం గనుకనో, ఉన్న సాంకేతిక విధానం మీద అభివృద్ధి గనుకనో ప్రవేశించడం లేదు. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక లక్ష్యాలకోసం ప్రవేశిస్తోంది.

'కొత్త సాంకేతిక విధానం ప్రతిదీ మంచిదే, అనివార్యంగా వస్తుంది' అనే అవగాహనకు సమానంగానే ఒక రకమైన నిరాశావాదంకూడ వినిపిస్తుంది. కొత్త సాంకేతిక విధానం సంస్కృతిని దిగజారుస్తుందని ఈ నిరాశావాదం భావిస్తుంది. ప్రతి కొత్త సాంకేతిక విధానాన్నీ ఈ వాదన వ్యతిరేకిస్తుంది. గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్ అనే అవగాహన ఈ వాదనకు పునాది. కొత్త సాంకేతిక విధానాలు సంస్కృతిని మంది దగ్గరికి తీసుకుపోతాయనీ, మూకసంస్కృతిని ప్రచారం చేస్తాయనీ, అందుకు వ్యతిరేకంగా శిష్ట సంస్కృతిని కాపాడాలనీ ఈ వాదన భావిస్తుంది. పూర్వకాలంలోనైతే ఇది రాజాస్థాన సంస్కృతి. ఇప్పుడు ఈ సంస్కృతిని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద పడింది. ఆధునిక సాంకేతికాభివృద్ధి ఫలాలను తిరస్కరించిన ఈ సంస్కృతీపరులు ఆధునిక ప్రభుత్వ పోషణను మాత్రం అంగీకరిస్తారు. పన్నుల ద్వారా 'మూక'నుంచి సేకరించిన నిధుల్నే ప్రభుత్వాలు ఈ శిష్ట సంస్కృతిమీద ఖర్చు పెడతాయి. ఆధునిక సాంకేతిక ప్రచార, ప్రసార సాధనాలు ప్రభుత్వం చేతిలోనే ఉన్నందువల్ల ఈ సంస్కృతికి అక్కడకూడ ప్రాచుర్యం దొరుకుతుంది. ప్రభుత్వ నిధులుకూడ చాలక ఈ సంస్కృతి ప్రత్యక్ష నిధుల సేకరణకూడ ప్రారంభిస్తుంది. అంటే వ్యాపార సంస్కృతితో తనకు ఏ భేదం ఉన్నదని చెప్పుకుంటున్నదో ఆ భేదం కూడ వర్తించని స్థితికి ఈ శిష్ట సంస్కృతి చేరుతుందన్న మాట. ప్రత్యక్ష నిధులకే మరో పేరు ప్రాయోజిత కార్యక్రమాల పద్ధతి, వ్యాపార ప్రకటనల పద్ధతి. అంటే ఆధునిక సాంకేతికాభివృద్ధిని ఖండిస్తూ బయల్దేరిన శిష్ట సంస్కృతి, భూస్వామ్య సంస్కృతి. ఆధునిక సాంకేతికాభివృద్ధి మీదనే ఆధారపడే వ్యాపార సంస్కృతిగా మారిపోతుంది. దళారీ, నిరంకుశ పెట్టుబడిదారీ వర్గానికీ

భూస్వామ్యవర్గానికి ఉన్న మిలాఖత్తుగా ఈ సాంకేతికాభివృద్ధి- సాహిత్య సంబంధం వి స్తరిస్తుంది.

ఇందుకు భిన్నంగా సాంకేతికాభివృద్ధిని ప్రాపంచిక దృక్పథాన్ని మార్చే సాధనంగా చూసినప్పుడు, సాహిత్యాన్ని మారుతున్న ప్రాపంచిక దృక్పథాన్ని ప్రతి ఫలించే, ఆ ప్రాపంచిక దృక్పథాన్ని బలోపేతం చేసే సాధనంగా చూసినప్పుడు సాంకేతికాభివృద్ధికి- సాహిత్యానికి మధ్య ఉన్న సంబంధం గురించి ప్రత్యామ్నాయ ఆలోచనలు చేయగలుగుతాము. అప్పుడు సాంకేతికాభివృద్ధి అనేది వైవిధ్యాన్నీ, సమా నత్వాన్నీ సాధించేదవుతుంది. అది లాభాకాంక్షతో ఉండదు. అప్పుడు ప్రతి కొత్త సాంకేతిక అభివృద్ధీ ప్రజల జీవన స్థితిని మరింత మెరుగు పరిచేదవుతుంది. ఆ అభి వృద్ధి ఫలాలు ఏ కొద్దిమందికో మాత్రమే అందడానికి వీల్లేని స్థితి ఉంటుంది.

సాంకేతికాభివృద్ధికి సాహిత్యానికి మధ్య ఉన్న సంబంధాన్నీ, ఉండవలసిన సంబంధాన్నీ అర్థం చేసుకోవడానికి తప్పనిసరిగా ఆ రెంటినీ వర్గసమాజంలో, వర్గ పోరాటంలోనే గుర్తించవలసి ఉంటుంది. లేకపోతే రెండూ రెండు శుద్ధ పదార్థాలు గానూ, సంబంధం లేనివిగానూ కనబడతాయి. సాంకేతికాభివృద్ధి వంటిది రచయితలు పట్టించుకోనవసరం లేనిదిగా కనబడుతుంది.

*

[ఈ సంచిక కోసం ఈ అంశంమీద వ్యాసం రాయవలసి ఉంటుందని విన్న ప్పుడు ఇది సులభమైన పనే అనుకున్నాను. కాని రాయడం ప్రారంభించాక చూస్తే తెలుగు సాహిత్య విమర్శలో ఈ అంశం మీద కృషి పెద్దగా జరగలేదని తేలింది. అంటే ఇది నలిగిన బాట కాదు. యూరోపియన్ మార్క్సిస్టు సాహిత్య విమర్శలో, ముఖ్యంగా రేమండ్ విలియమ్స్ రచనల్లో ఈ చర్చ ఎక్కువగానే సాగింది. ఈ వ్యాసంలో కొంత చర్చకు రేమండ్ విలియమ్స్ రాసిన 'ద పాలిటిక్స్ ఆఫ్ మాడర్ని జమ్' అనే పుస్తకంలోని కల్చర్ అండ్ టెక్నాలజీ అనే వ్యాసం ఆధారం. అయితే ఆ చర్చ సాంఘిక నేపథ్యం దృష్ట్యా మనకు చాల సుదూరమైనది. మొత్తానికి ఈ అంశం మీద చర్చ జరగవలసిన అవసరాన్నైనా ఈ వ్యాసం గుర్తింపజేస్తే నా కృషి ఫలించినట్టే-

రచయిత

'ఖఫన్' కవిత —

వస్తురూప విశ్లేషణ

—వరవరరావు

తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి 'ఖఫన్'

నగరంమీద ఈ ఖఫన్ కప్పింది ఎవరు?
నీకూ, నాకూ
ఈ జాతికీ కూడా
తలో తెల్లగుడ్డా ఇవ్వకూడదూ!
రోడ్లమీద మెరిసే గాజుముక్కలు
నెత్తుటి కళ్ళాపిలో మొలకెత్తిన
అశ్రు బీజాలు
అవి పేగాని మృత్యువృక్షాలై నగరాన్ని నల్లటి నీడలో కప్పుతాయి
మీరు మ్యూజికల్ చైర్స్ ఆడుకోండి
తెగిన కుత్తుకల కేకలు
కరవాలాల కోలాట ధ్వనులు
ఆర్కెస్ట్రాలో ఇమిడిపోతాయి
మనల్ని చూసి మృగాలు
కన్నీళ్ళు పెట్టుకుంటున్నాయి
ఈ గాయాలు చెమరుస్తూనే వుంటాయి
వాళ్ళ కళ్ళే చెమ్మగిలవు
నగరంమీద ఖఫన్
ఏ ఉదయ శిశువు తొలగిస్తాడో
అందాకా అందరం ఈ మృతదేహానికి కాపలా;
రథ సప్తమినుంచి రంజాన్ దాకా
ఏడుస్తూ
అందాకా
తెగిపడ్డ పసివాళ్ళ శిరస్సులే
నగరానికి వార్మినార్లు.

['కంజిర' పొయిట్రీ బులెటిన్ 2
మార్చి 1991]

కంజిర (పొయిట్రీ బులెటిన్ 2, మార్చి 1991) లో తల్లావజ్ఝల పతంజలి శాస్త్రిగారు రాసిన కవితను మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించ వచ్చుననుకుంటాను. ఆ కవిత శీర్షిక 'ఖఫన్' (కఫన్ అనాలి).

హైదరాబాదు నగరంలో 1990 చివరలో జరిగిన 'మత హత్యలు' 'మత ఘర్షణలు' అందులో వస్తువు.

ఇవి మత ఘర్షణలు, మత హత్యలు కావని రాజకీయ స్వప్రయోజనాల కోసం స్వార్థపరశక్తులు ప్రారంభించి, రెచ్చగొట్టి నిర్వహించినవని వివేకంగల ప్రజలందరివలెనే కవికూడ సరిగానే ఊహించాడు.

మీరు మ్యూజికల్ ఛైర్స్ ఆడుకోండి
తెగిన కుత్తుకల కేకలో
కరవాలాల కోలాట ధ్వనులు
ఆర్కెస్ట్రాలో ఇమిడిపోతాయి

ఇది కవితలో 'ఘర్షణల' నేపథ్యంగా కవి అవగాహన. చాలమంది ప్రజాతంత్రవాదుల, ప్రగతిశీలుర విశ్లేషణకూడ అదే.

నగరంమీద ఈ ఖఫన్ కప్పింది ఎవరు?
నీకూ, నాకూ
ఈ జాతికీ కూడా
తలో తెల్లగుడ్డా ఇవ్వకూడదూ!

'కఫన్' అంటే శవంమీద కప్పే తెల్లగుడ్డ. జెండాల మాటున ·అంటే రాజకీయాల ప్రయోజనంతో ఈ జాతిని మృత్యువువైపు నెడుతున్నవాళ్ళు స్వార్థపర రాజకీయవాదులని కవి ఉద్దేశం. మనమూ దేనికి మౌనప్రేక్షకులమై శవ ప్రాయులమై పోయాం గనుక, జాతి (అంటే కవి మనసులో మానవజాతి) కూడ నిశ్చేతనమై పోయింది గనుక మనమీద కూడ ఈ దుర్మార్గులను తెల్లగుడ్డ కప్పమంటున్నాడు. మన నిష్క్రియా పరత్వంపై Self indictment - ఆత్మక్రోధం!

అంతా అయిపోయాక 'నీవూ నేనూ ఈ జాతీ' ఎత్తే శాంతి జండాలు కూడ కావచ్చు ఈ తెల్లగుడ్డలు.

మనల్ని చూసి మృగాలు
కన్నీళ్ళు పెట్టుకుంటున్నాయి

హత్యాకాండ నిర్వహణలో అమానుషంగా (సాధారణంగా చెప్పుకునేట్లు మృగప్రాయంగా) ప్రవర్తించినందుకూ, మృగాలయినా తమ పిల్లల్ని తాము చంపవు (పులి మాత్రమే నిర్విచక్షణగా చంపుతుందనీ, తన పిల్లల్ని కూడ చంపుతుందని అంటారు) అందుకు అవి కన్నీళ్ళు పెట్టుకుంటున్నాయి. మృగాలు తమ పై ఇతర మృగాలు, లేదా ప్రకృతి లేదా మనిషి చేసే దాడిని ఎదుర్కోవడానికి తమకు చేతనైన ప్రయత్నం తాము చేస్తాయి. మనం ఆ ప్రయత్నం కూడ చేయనందుకు అవి మనల్ని చూసి కన్నీళ్ళు పెట్టుకుంటున్నాయి.

ఈ గాయాలు చెమరుస్తూనే వుంటాయి
వాళ్ళ కళ్ళే చెమ్మగిలవు

ఎంతో కవితాత్మకంగా ఈ వ్యవస్థలో పొంచివున్న ప్రమాద పునరావృతాన్ని సూచిస్తున్నాడు కవి.

నగరాన్నంతా మృతప్రాయం చేసి వాళ్ళు నగరం మీద కఫన్ కప్పారు.

నగరం మీద ఖఫన్
ఏ ఉదయ శిశువు తొలగిస్తాడో
అందాకా అందరం ఈ మృతదేహానికి కాపలా;

ఒక ప్రగతిశీల కవికి వుండవలసిన ఉదయ శిశువు ఆకాంక్ష కూడా వుంది కవికి.

ఒక మతాన్ని నిందించడం కూడలేదు. ఈ పని 'సెక్యులర్' భావాలు కల వాళ్ళు అంతహా చేస్తున్నదే.

రథసప్తమి నుంచి రంజాన్ దాకా
ఏడుస్తో

హైదరాబాద్ నగరానికి చార్మినార్ సంకేతం. నైజాం పాలనకు, ఫ్యూడల్ ప్రతిష్ఠకు - కాకపోతే నైజాంకాలపు వాస్తుశిల్పానికి. ఆ చార్మినార్ మీంచే నలుగురు అక్కచెల్లెళ్ళు, ఒక అసహాయ సోదరుడు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఇపుడింక ఈ మారణకాండలో

తెగిపడ్డ పసివాళ్ళ శిరస్సులే
నగరానికి చార్మినార్లు

హైదరాబాదు నగరం పేరు చెప్పగానే ఇపుడింక చార్మినార్ గుర్తురాదు. వచ్చినా వెంటనే 'మతఘర్షణలు' గుర్తుకు వచ్చి ఒళ్ళు జలదరిస్తుంది.

అటవిక తెగలకు గుర్తులు (totems) వున్నట్లు మన ఈ అటవిక హింసా సంస్కృతికి గుర్తుగా

ఉదయ శిసవు తొలగించేదాకా
ఈ తెగిపడ్డ పసివాళ్ళ శిరస్సులుంటాయి

మొత్తం చూసినపుడు ఈ కవిత సున్నితమైన మనస్కతతో మానవ విలువల కోసం తపిస్తూ, నేరస్తులనే కాక, తననీ మనల్నీ ముద్దాయిలను చేస్తూ ఆవేదన, ఆక్రోశం ప్రకటించే మానవతావాద కవిత అవుతుంది. ఇందులో చాల sensitiveగా చెప్పిన విషయాలున్నాయి. కవి sensibilitiesకు దాఖలాగా చూపగలిగిన వ్యక్తీకరణ వుంది.

రెండు మతాల మధ్యన కవి సమపత్తిగా వీలయినంత balancedగా ఉండాలని ప్రయత్నించాడు. పదచిత్రాలు, దృశ్యాలు, పోలికలు రెండు సంప్రదాయాల నుంచి సమానంగా తీసుకోవడానికి చాల మెలకువతోనే పూనుకున్నాడు.

ఈ కఫన్ కప్పింది ఎవరు ? - తలో తెల్లగుడ్డా ఇవ్వకూడదూ.
రోడ్లమీద మెరిసే గాజు ముక్కలు - నెత్తుటి కళ్ళాపిలో మొలకెత్తిన అశ్రు బీజాలు

ఇట్లా వాతావరణం అయా సంప్రదాయాలను సూచిస్తుంది. పాతనగరం రోడ్ల మీద మెరిసే గాజుముక్కలు. ముస్లిం సంప్రదాయాన్ని, జీవన విధానాన్ని, నాజూకుతనాన్ని, చిట్లిపోయిన గతవైభవాన్ని పదచిత్రంలో పెడితే 'కళ్ళాపి' శబ్దం హిందువుల విశ్వాసాలకు, సంప్రదాయాలకు సంకేతంగా గ్రహించి ఇద్దరి విషాదాలనూ చిత్రిస్తాడు.

అయితే సమతౌల్య లౌల్యంలో యతి మతితో రంజాన్‌కు దీటయిన పండుగ రథసప్తమి కాదని మరచిపోయాడు. హిందూ ముస్లిం సంఘర్షణలకు సాకు వినాయక చవితి అయినంతగా హిందువుల పండుగల్లో ఇటీవలి కాలంలో మరేదీ కావడం లేదని ఈ సంవత్సరం సంఘటనలు కూడ ఋజువు చేసాయి.

మ్యూజికల్ చైర్స్ ఆట, ఆర్కెస్ట్రా సంగీతం సంక్లిష్ట ఆధునిక నాగరిక పారిశ్రామిక సమాజానికి చెందిన వినోద విశ్రాంతి క్రియలు.

తెగిన కుత్తుకల కేకలు, కరవాల కోలాట ధ్వనులు ఫ్యూడల్ అనాగరిక సమాజ చేష్టలు.

ఇవి మరి మ్యూజికల్ చైర్స్ ఆటకిచ్చే ఆర్కెస్ట్రాలో ఇమిడిపోయాయంటే సామ్రాజ్యవాద సంరంభం / కుట్రలో భూస్వామ్య స్వభావం, / దౌర్జన్యం ఒదిగి పోతుందని ధ్వని. అందుకే మనల్ని చూసి ఆటవిక యుగ స్వభావానికి సంకేతమైన మృగాలు కన్నీళ్ళు పెట్టుకుంటున్నాయి.

సామ్రాజ్యవాదం వ్యవసాయ దేశాల్లో భూస్వామ్య ఆర్థిక విధానంతోనేకాదు సంస్కృతితోకూడా సహజీవనం చేస్తున్నది. అంతేకాదు భూస్వామ్య సంస్కృతిని ప్రోత్సహించి పోషిస్తున్నది.

మత వైషమ్యాలు, కలహాలు, ఘర్షణలు భారతీయ సమాజాల్లో కొత్త కాక పోవచ్చు కానీ పాలక వర్గాల రాజకీయ ప్రయోజనాల కోసం ఇవి ఎజెండా మీదికి రావడం వలస పాలనతోనే మొదలయింది.

'ఇమిడిపోతాయి' క్రియలో కవి అసంకల్పితంగానైనా ఈ అవగాహనను వ్యక్తం చేశాడు.

అయితే పీడితుల కన్నీళ్ళూ, కష్టాలూ ఎన్నిటికైనా రాజుకొని ఆ కష్టాలు కన్నీటి వ్యవస్థను అంతం చేస్తాయనే చారిత్రక అవగాహనకు బదులు

రోడ్లమీద మెరిసే గాజుముక్కలు
నెత్తుటి కళ్ళాపిలో మొలకెత్తిన
అగ్నిబీజాలు
అవి పేదల మృత్యువృక్షాలై
నగరాన్ని నల్లటి నీడలో

కప్పుతాయనుకోవడం మార్క్సిస్టు దృక్పథానికే కాదు మానవతావాదానికి కూడ పరిహార్యమే.

హైదరాబాదు పాతనగరంలో, చార్మినార్ పరిసరాల్లో 'రోడ్లమీద మెరిసే

గాజు ముక్కల'ను 'మత ఘర్షణల్లో' చూడగలగడం కవిగా దృశ్యాన్ని సరిగా పట్టుకోగలగడమే.

అక్కడి గాజుల తయారీ, అందులో పాల్గొంటున్న మహిళల జీవితాలు-ఉర్దూ భాషతో హృదయానికీ - గాజుకూ వున్న సాహిత్య అనుబంధం - ఊహించ గలిగినవారికి స్ఫురించి ఒక వాతావరణాన్ని రూపు కడతాయి.

కాని 'సెరిసే', 'మొలకెత్తే' 'నేహాని' వంటి అభివృద్ధి సూచకమైన క్రియలు, 'ఆగ్ర వీణాలు' వంటి వర్తమాన పరాజయంలో చావని భవిష్యత్తుపై ఆశను సూచించే రూపకం

మృత్యువృక్షాలు కావడమైనా
నగరాన్ని నల్లటి నీడలో కప్పుతాయనుకోవడమైనా

నిరాశావాదం మాత్రమేకాదు శిల్పరీత్యా కవి పై చరణాల్లో చేస్తూ వస్తున్న నిర్మాణానికి, రచనకు పొసగనివి.

ఇందుకు కారణం - కవితలో 'ఉదయశిశువు'పై ఆశ వున్నా మనంగా ఎప్పటికీ స్పందించమనే ఒక నిస్పృహ వుంది.

మనమేమో 'తలో తెల్లగుడ్డ' ఇవ్వకూడదా ఆ దుర్మార్గుడని నగరాన్ని కప్ప బోయే 'నల్లటినీడ' గురించి ఆక్రోశిస్తుంటాం.

'గాయాలు చెమరుస్తుంటాయి' మనం పాల్గొనే ఒకే ఒక్క మానవక్రియ - 'మృతదేహానికి కావలా'. కఫన్ ఉదయ శిశువు తొలగింపాల్సిందే. అందాకా అందరం నిరీక్షకులమే. మానవ దేహాలకు కాదు మృత దేహాలకు కావలా కాసే హిందువులం, ముస్లింలము.

అందాకా - అనే ఒక పరిమితే లేకపోతే ఈ కవిత పూర్తిగా ఆశాభంగ సందేశమే అయ్యేది.

ఎంత అమానుష కృత్యాన్ని అభివ్యక్తీకరించేప్పుడయినా భవిష్యత్తు పట్ల ఆకాంక్షను చిగురింపచేయడానికి ప్రయత్నించవలసిందే. కవులు దృశ్యాలను, వాతావరణాన్ని, మూడ్‌ను బింబ ప్రతిబింబాలుగా చిత్రించేవాళ్ళు మాత్రమే కాదు. సారాన్ని పట్టుకొని వర్తమానంలోని గతాన్ని, భవిష్యత్తును 'హృదయానికి' 'చూప' గలిగేవాళ్ళు, తద్వారా హృదయ స్పందన, ఉద్దీపన కలిగించేవాళ్ళు కూడ కావాలి.

'కఫన్' కవిత విశ్లేషించిన తర్వాత నా దృష్టికి ఈ కవి రాసిన 'గుండె గోదారి' కవితా సంకలనం వచ్చింది. ఆ సంకలనం 90 సెప్టెంబర్‌లో వెలువడినట్లున్నది. 'అభినందనం' పేరుతో ఆర్. ఎస్. సుదర్శనంగారు దానికి ముందుమాట రాసారు. అందులో కవి ప్రాపంచిక దృక్పథం గురించి మాత్రమే కాక, కవికి ఆ దృక్పథం అలవడడానికి కారణాలు కాదగిన పుట్టుక మొదలైన విషయాలు చర్చించారు.

'నవ్యసాహిత్య' పరిషత్తు సభాపతి శివశంకరశాస్త్రి పితామహుడు; బారిష్టరు పార్వతీశం సృష్టికర్త మొక్కపాటి నరసింహశాస్త్రి మాతామహుడు; సాహితీ మూర్తి కృత్తివాస తీర్థులు తండ్రి-పతంజలిశాస్త్రి మరి కవిత్వం వ్రాయకుండా, నడివయసు దాకా ఉండిపోవడమేమిటి ? కారణం వుంది........'

అని తనకు తోచిన కారణాలు వివరించి పతంజలి తన్నుతాను వెదుక్కుంటూ ఉన్నాడు. ఆ అన్వేషణ ఏదో కొలిక్కి వచ్చేదాకా సాహిత్య రచనకు పూనుకో లేదు !

పతంజలి అంతరాంతరాల్లో చేరుకున్న గమ్యం ఒకటి ఉంది .... ఆ ప్రయాణంలో మజిలీలు ఉన్నాయి.

అస్తిత్వపు లోతుల్లోనుంచి ప్రకృతినీ, మానవసృష్టి దర్శించడం ద్వారానే ఆయన 'మానవాళి మౌన విషాద సంగీతాన్ని వినగలిగాడు'. కనుక పతంజలి అస్తిత్వవాద కవి అనదలుచుకున్నాడు. భావస్ఫూర్తి, సంక్షిప్తత, అనుభూతి సాంద్రత లక్షణాలుగా తేటతెలుగు కవిత్వం చెప్పిన తిలక్, ఇస్మాయిల్‌గార్ల కోవలోకే వస్తాడు పతంజలి' అని కూడ అభినందిస్తాడు.

భావస్ఫూర్తి, సంక్షిప్తత, అనుభూతి సాంద్రత - అభివ్యక్తికి సంబంధించిన లక్షణాలు. అవి కవిత్వానికి కండబలమే కానీ గుండెబలం కావు. కవి భావస్ఫూర్తిని తానుపొంది, అతని అనుభూతి సాంద్రతలో తానూ తాదాత్మ్యం చెంది 'still sad music of humanity' లో మునిగిపోతే పాఠకుడు ఇంక తేలడు; తేలినా ప్రాణంతో మాత్రం రాదు. కవిత్వం ప్రాణాన్ని, వికాసాన్ని, చైతన్యాన్ని ఇవ్వాలి.

ఎందుకంటే 'మానవాళి మౌన విషాద సంగీతం' still (నిశ్చలమైన) చిత్రం కాదు. అదీ చలన సూత్రంలోని ఒక దశ. ఒక పార్శ్వం. అది అర్ధ సత్యమే.

పతంజలియే 'సూర్యకవి' అనే కవితలో చెప్పదలుచుకున్నట్లు అర్థ సత్యాలు చెప్పేవాడు సూర్యుడు అర్థవంతమైన సత్యాలు చెప్పవలసినవాడు 'రవికానని చో....' కానగల కవి.

కల్లోల వర్తమానానికి 'భూమిక'

—స్నేహమాల

'భూమిక' కథా సంకలనం వెలువడి పదినెలలు కావస్తోంది. ఈ పదినెలలుగా భారతదేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ పెనుమార్పుల పరంపర కొనసాగుతోంది. సోవియట్ కోటకు కుప్ప కూలిపోవడం, ప్రపంచాధిపత్యం కోసం ఒకప్పుడు వియత్నాంలో చావు దెబ్బతిని మళ్ళీ కోలుకొని గల్ఫ్‌యుద్ధం ద్వారా తిరుగులేని మొనగాడుగా రంగం మీదకు వచ్చిన అమెరికన్ సామ్రాజ్యవాదం - భారతదేశంలో సనాతన కుటుంబ పాలన కూలిపోయి-ఎన్నిరకాల అసంబద్ధ కలయికలతోనైనా లుకలుకలుగా తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం రావడం - ఇదంతా ప్రపంచ వ్యాపితంగా ఏలినవారి రాజకీయ చిత్రం. మరో పక్క ప్రజలు అన్ని ప్రాంతాల్లో తిరుగుబాట్లు చేస్తున్నారు. ఈ సమకాలీన చరిత్ర లోతులను, యీ పెను తుఫాను కేంద్రస్థానాన్ని ఈ కథల పుస్తకం ఒక్కొక్క జీవితం ద్వారా చూయించ ప్రయత్నించింది. 'భూమిక' వెంటాడిన పైనాన్ని సమీక్ష చేయకుండా వుండలేని స్థితి.

అబింపి ప్రచురణల మూడవ పుస్తకంగా వచ్చిన 'భూమిక' కథా సంకలనంలోని కథలు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రామిక జీవుల కష్టనష్టాలతో కూడుకున్న జీవితాన్నీ, కష్టాలను పోగొట్టుకొనేందుకు వాళ్ళుచేసే తంటాలనూ సమగ్రంగా దర్శింపచేస్తాయి. ఇవి కథలు మాత్రమే కాదు. నేటి ఆంధ్రదేశ చరిత్ర- చరిత్రను ప్రజల జీవితాలు నేపథ్యంగా రాశారు ఈ కథా రచయితలు. ఇంతవరకూ తెలుగులో వచ్చిన కథా సంకలనాలకు ఇది పూర్తిగా భిన్నమయింది. మనసుపెట్టి చదివితే, బతుకుపై ఆర్ద్రతపుంచే యీ సంకలనం ఒక నవల అనిపిస్తుంది.

దుర్భరమౌతున్న జీవితం- కసాయి కరువు, కాకులు - గ్రద్దలూ (విముక్తి), తిరుగుబాటు, పద్మ, అరణ్యపర్వం, పుల్లర, పిలగాని ఏడుపు ద్వారా విపులీకరించబడింది. అయితే చెడ్డ రోజులొచ్చాయని ఎవ్వరూ చచ్చిపోరుగదా! చచ్చిపోకూడదు. మంచిరోజులుగా మార్చుకోడానికి ప్రయత్నించాలి. ఈ ప్రయత్నాన్ని ప్రజలే తమ స్థానిక సమస్యలూ, చుట్టూవున్న తోటి శ్రామికుని తోడునూ తీసుకుని నిర్ణయించుకుంటారు. యీ సంకలనంలో రచయితలు దర్శించిన కొందరు ప్రజల పరిష్కార

ప్రయత్నాలు - పులుసు, మలుపు, పుల్లర, ఇల్లు, అన్నరొచ్చిను కథలలో చెప్పారు. ఇంకొంతమంది వలసలు వెళ్తున్నారు. ఈ జీవిత శకలాలు - కసాయికరువు, వలస, లాకౌట్, పద్మ, పిలగాని ఏడుపు కథల్లో కనిపిస్తాయి. కొన్ని శ్రామిక జీవితాలు నిల కడగా వున్నట్లు అనిపిస్తాయి. ఆ నిలకడగా కనిపించే జీవితాల వెనుక పెనువుప్పె నలు ఎలావున్నదీ - చెదలు, మట్టిగుండె, మబ్బుతునకా - మట్టిముద్దా. పిలగాని ఏడుపు, మనిషిలోపలి విధ్వంసం, ముంజలు, దొంగలు, ఇల్లు - కథలద్వారా తెలుస్తుంది.

కథలను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం. 'కసాయికరువు' కథ నేటి రాయలసీమ రైతు జీవితాన్ని స్పష్టంగా చిత్రిస్తుంది. కడుపు నింపుకోవడం కోసం ఆవును అమ్ముకున్న ఓ తల్లి "ఆ గంగతల్లికి కరుణలేదు. రాజ్జమేలే మారాజుల గుండెలా కరగలా: ఆకిరికి కసాయి వ్యాపారులే కనికరించారు. రాజ్జమేలే పాపిష్టి మనుషులకన్నా గొడ్లేమేలు" అనే ఆలోచన కొస్తుంది. అన్ని విధాలా నష్టాలకు గురౌతున్న రాయలసీమ రైతు ప్రాణప్రదమైన వ్యవసాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చేసే వీలులేక ఒక రోడ్డు కార్మికునిగా మారిన వైనం 'విముక్తి' కథ. ఇదిట్లా వుంటే సీమ రైతుకూలి పరిస్థితి 'కాకులా-గ్రద్దలా' కథలో తెలుస్తుంది.

తెలంగాణా ప్రాంతం రైతు పడుతున్న ఒత్తిడి అంతా రాజారాం రూపంలో 'మనిషిలోపలి విధ్వంసం' కథలో దర్శనమిస్తాడు. నానాటికీ ఛిద్రమైపోతున్న మనిషి జీవితాన్ని ఇందులో ఎనలైజ్ చేశాడు రచయిత. ఈ కథ అలవోకగా ప్రారంభమై పోనుపోను కడుపులోని పేగులను మెలితిప్పి గుండెను కోత పెడుతుంది. రాజారాం తనలో తనే "తను నాగలిపట్టేనాటికి పదెకరాల భూమి - బాయికోసం అంజుమన్ అప్పు - అప్పు తీరలేదు - తను మిర్చిపంట - ఇంజనుకోసం మళ్ళీ అప్పు - కొరు కుడు రోగం - హల్లీకల్లీ సున్నకుసున్నా - వెంకినాళ్ళు పెద్దబండి తీసుకపోవటం—" గుర్తుచేసుకుంటాడు. రెక్కలొచ్చిన చెట్టంత కొడుకు రైలుకింద మరణించినా రాజా రాం కళ్ళు చెమ్మగిల్లవు. 'తన ఏడుపు ఎక్కడ తెగిపోయింది? తను బండరాయా? తన నరాలు ఒక్కొక్కటే పుటుక్కు పుటుక్కున తెంపిందెవలు? చదువు ఆపి పెద్దకుటుంబాన్ని సాదుక వచ్చినపుడా? మిరపతోటకు కొరుకుడు రోగం తగిలి మాడి పోయినపుడా? అంజుమన్ అప్పులా, తనఖా వెంకొవాళ్ళ వేలం పాడినపుడా!

సత్వం ఒక్కొక్కటే పీడ్చుకపోయి రైతు కూలీగా మారినపుడా? కాదు. ఈ అన్ని జాగాలల్లో తన జీవనాడులు ఒక్కొక్కటే తెగిపోయినయ్".

కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పల్లెల్లో వ్యవసాయం చేసుకునే స్వేచ్ఛ రైతుబిడ్డలకు లేదు. ఈ కోణాన్ని 'పిలగాని ఏడుపు' కథ తెలియచేస్తుంది. మామూలుగా ప్రారంభమైన ఈ కథ సర్జన్ కత్తివలె అనుకున్న లక్ష్యంవైపు వడివడిగా సాగిపోతుంది. చివర్లో ప్రతి తల్లి కొడుకులను పేటకుక్కలు పీక్కుతిన్నట్లుగనే నరహరికి అనిపిస్తుంది. ఈ కథ చదివిన పాఠకుడ్ని - పరిస్థితులు ఇంత దారుణంగా ఎందుకుమారాయా? అనే ప్రశ్న వెంటాడుతూనే వుంటుంది. రైతును కల్తీ మందులు, గిట్టని ధరలు, ప్రభుత్వ సంస్థలు ఎలా మోసగిస్తుంది 'చెదలు' కథ చెపుతుంది.

మరి అన్నిరకాల వనరులూ కలిగిన కోస్తారైతు పరిస్థితి ఎలావుంది? వ్యాపార సంబంధాలు గ్రామాల్లో ప్రవేశించి మానవ సంబంధాలను ఎలా అతలాకుతులం చేసిందీ 'మట్టిగుంపె' కథ తెలుపుతుంది ప్రశాంతతకు ఆటపట్టులనుకొనే పల్లెజీవితాల్లో విభేదాలు అవతరించాయి. కుటుంబంలో అంతఃకలహాలు, పల్లెలో ముఠా రాజకీయాలూ.... నేడు కోస్తా గ్రామాల్లో అప్పులేని సాధారణ రైతు లేదు. చివరకు కథకుడన్నట్లు - ఈ దారుణాలకు కారణమైన శక్తుల్ని ఎదుర్కొనే బలం ఎప్పటికైనా ఆ పూళ్ళనుంచే వస్తుందని ఆశిద్దాం. రైతుమీద పెట్టుబడులు పెట్టే గణపతిశెట్టి ఎలా బాగుపడిందీ, ఆరుగాలం కష్టంచేసే రైతు రామయ్యతాత ఎలా దగాపడిందీ తెలియచెప్పేకథ - "మబ్బుతునకా.... మట్టిముద్దా" పత్తిరైతుల ఆత్మహత్యలు - వాటి నేపథ్యం సంపూర్ణంగా 'పద్మ' కథలో తెలుస్తుంది.

రైతాంగం అలా వుంటే మరి కార్మికులు? రైతు బజారులో అమ్మకంకోసం వస్తూత్పత్తి చేసినకొద్దీ సామాజిక శ్రమ విభజన విస్తరించింది. వ్యవసాయం నుంచి వృత్తిపనులు విడదీయబడ్డాయి. అలా విడదీయబడ్డపుడు 'సరుకుమార్పిడి సంబంధాలు' - 'సరుకు-డబ్బు సంబంధాలు'గా మారినాయి. ఈ మార్పులకు గురై పల్లెలో బతకలేక పట్నం వలసివచ్చి, అక్కడా వీలుకాక నగరానికి తరలిన చేనేత కార్మికుని కథే 'వలస'. బొగ్గుగని కార్మికులకు తెలంగాణా ప్రాంత రైతు ఉద్యమాల ప్రభావం వుంది. అందువల్ల వీరు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారానికి వుద్యమించ గలుగుతున్నారు. ఈ ప్రయత్నాలలో ఒకటి 'ఇల్లు' కథద్వారా తెలుసుకోవచ్చు. బండచాకిరికి మారుపేరుగా మారిన పాలమూరు కార్మికుల 'తిరుగుబాటు' కథ, సర్

సిల్క్ ఫాక్టరీ లాకౌట్ వెనుకగల సంగతులూ, దానిమూలంగా మానవ జీవితాల్లోని మార్పులు ఈ 'లాకౌట్' కథలో తెలుసుకోవచ్చు.

గిరిజన అభివృద్ధి పథకాలన్నీ ఎవరి అభివృద్ధికి తోడ్పడుతున్నయ్, ఈ పథకాలన్నీ ఆచరణలో ఏమయ్యాయి? ప్రభుత్వరంగ సంస్థలు ఆచరణలో ఎలా విఫలమౌతున్నదీ తెలుసుకునేందుకు 'అరణ్యపర్వం', 'అన్నలొచ్చిన్రు' కథలు ఉపయోగపడతాయి.

మరి ఇన్ని సమస్యలతో సతమతమౌతున్న శ్రామికులకు పరిష్కారం ఏది? అంద ఎవరు? 'మలుపు' కథలో అన్నట్టు "వీళ్ళకు మాటలకన్నా చేతలు కావాలె - చేతలు చేసుకుంట మాటలు చెప్పాలె". అదీ చెయ్యాల్సింది - శ్రామిక శ్రేయోభిలాషులంతా. ఈ రచయితలు కొన్ని పరిష్కారమార్గాలు ప్రకటించారు. ఇంకా ఎన్నెన్నో పరిష్కారాలను ప్రజలు ఆచరణద్వారా కనుక్కొంటారు. దేశం వాళ్ళకు ఒక మార్గం చూపాలి. లేదా వాళ్ళే దేశానికి ఒకమార్గం చూపిస్తారు.

అయితే ఈ సంకలనం కార్మికుల, గిరిజనుల జీవితాలను అన్ని ప్రాంతాల నుంచి అందించలేదు. మన రాష్ట్రంలో పేపర్ మిల్లులూ, నూలుమిల్లులూ, చక్కెర ఫాక్టరీలూ, వార్తా పత్రికలు.... ఇంకా ఎన్నో పరిశ్రమలున్నాయి. బహుశ ఆ పరిశ్రమల కార్మిక జీవితాలపై సరైన కథలు వచ్చివుండకపోవచ్చు. రాయలసీమ ప్రాంతంలోని నల్లమల, పాపికొండలలోని గిరిజనుల జీవితాలు 'భూమిక'లో లేవు. వీటి గురించికూడా సరైన కథలు వచ్చివుండకపోవచ్చు. రాబోయే సంవత్సరాలలోనైనా జన జీవితాన్ని చుట్టుకొని కథలల్లే రచయితలు ఈ జీవిత శకలాలనూ కథా సాహిత్యంలోకి తేగలరని ఆశిద్దాం.

ఈ సంకలనంతో 'ప్రచురణకూడా ఒక సాహితీ ప్రక్రియే' అని అబంపి ప్రచురణకర్తలు ఋజువుచేశారు.

మనలను మనం తెలుసుకోవాలన్నా, మంది గురించి తెలుసుకోవాలన్నా, మనం నిలబడ్డ భూమిక తెలుసుకోవాలన్నా - మానవుల భూమిక తెలుసుకోవాలన్నా- వర్తమానాన్ని దాని నిజమైన రూపంలో చూడాలన్నా - భవిష్యత్‌ను ఊహించాలన్నా 'భూమిక' తప్పనిసరిగా చదవవలసిన పుస్తకం.

(భూమిక కథా సంకలనం - అబంపి ప్రచురణ - వెల : సాదాప్రతి రు. 17- లైబ్రరీ ప్రతి రు. 25/- ప్రతులకు - బంగారు కిష్టయ్య బుక్‌స్టాల్, శివాజీనగర్, గోదావరిఖని — 505 209).

(2వ పేజీ తరువాయి)

తెలంగాణా కవులకీ, సర్కారు జిల్లాల కవులకీ ఒక అనుసంధానం ఏర్పరచటానికి సి.నా. రెనీ, దాశరథినీ మా కాలేజికి ఆహ్వానించారు. ఊర్లో ఒకసారి కాళోజీ నారాయణరావుని పిలిపించి మీటింగ్ ఏర్పాటు చేశారు. క్లాసులో పాఠం చెపుతుంటే మేము మైమరచిపోయేవాళ్ళం. పానశాలలో "అంతములేని ఈ భువనమంత...." సీతా పరిత్యాగ సన్నివేశంలో "అడలడిచి నెమ్మనంబున...." పద్యాల్ని ఆయన వివరించినప్పటి అద్భుతమైన అనుభవం ఈనాటికీ వెన్నాడుతూనే ఉంది. వావిలాల గోపాలకృష్ణయ్యతో సన్నిహిత పరిచయం, పేరు నాకు గుర్తులేదు కానీ ఒక దగ్గర బంధువు కమ్యూనిస్టు కావటం, ఆనాటి గుడివాడ వాతావరణం వామపక్ష భావాల విషయంలో ఆయన బహిరంగ వ్యతిరేకతకి అడ్డం వచ్చి ఉండొచ్చు. ఆయన విద్యార్థుల్లో ఎక్కువమంది A.I.S.F. వాళ్లు కావటం కూడా ఒక కారణం కావచ్చు. అప్పుడు ఆయన కమ్యూనిస్టు వ్యతిరేకి అనే భావమే నాకు కలగలేదు. పైగా మాష్టారి సాంగత్యంలో నా తలలో కమ్యూనిస్టు భావాలే పెరిగాయి అని అంటే చాలామందికి ఆశ్చర్యం కలగవచ్చు. కానీ అది నిజం. శాస్త్రిగారి క్లాసులోనూ, విద్యార్థుల్లో కమ్యూనిస్టుగా గుర్తింపు పొంది, నేను.ఆరాధించిన హిష్టరీ మాష్టారు సుందరరామిరెడ్డిగారూ, మా ప్రిన్సిపల్ త్యాగరాజుగారి క్లాసుల్లో తప్ప అన్ని క్లాసుల్లోనూ నేనూ చాలా అల్లరి చేసేవాడ్ని. ముఖ్యంగా అమ్మాయిల మీద కాస్త మితిమీరి జోక్స్ వేసేవాడిని. కొంత మందిని చాలా అన్యాయంగా బాధపెట్టాను కూడా. ఈ విషయంలో నన్ను సవరించటానికి ఒక్కరు కూడా ప్రయత్నం చెయ్యలేదు. ఈ ధోరణి తర్వాత జీవితంలో కూడా నాకు చాలా అపకారం చేసింది. "అసలే కుమార్గ విషయాగ్ని భూతచేతస్కుతన్ నానా మార్గముల చరింతును, ఈ నన్నున్ విలానాతిడింధమ మూది ఊది ఈ ధవ శాజ్ఞల్ బహూరెచ్చగొట్టెదరు స్వామీవారి వారింపవే" అని శాస్త్రిగారే తన ఆనంద చేతన కావ్యంలో చెప్పారు. నాకు స్వామి కూడా లేదు, ఇంకా వారించే వాడెవడు, జీవితంలో చెప్పుదెబ్బలు తప్ప.

రామకోటి శాస్త్రిగారు హైదరాబాద్ వెళ్ళిపోయారు. నేను ఆనర్సు చదవటానికి విశాఖ వెళ్ళాను. చేకూరి రామారావుకి విశాఖపట్నం నిరంతర ఆకర్షణ ఎందుకోకానీ నాకు మాత్రం జీవితంలో ఆ మూడు సంవత్సరాలు పరమ అసహ్యకరమైన చీకటి రోజులు. ఒక గంట అయినా ఉత్తేజకరంగా పాఠం చెప్పినవాళ్లు లేరు. మాష్టర్లలో ఒక్కరికి కూడా ఒక ఫిలాసఫీ లేదు పాడూలేదు. వానపాము బతుకు. ఏటూ దారు

ప్రసాద్‌లాంటి వాళ్ళు ఫెడరేషన్‌లో తిరుగుతుండేవారు. అదీ నిర్జీవంగా ఉండేది. ఈ నీరసంలో ఉత్సాహం కోసం శాస్త్రిగారి కోసం మనస్సు మథన పడేది. ఆయన అడ్రసు తెలీదు. హైదరాబాద్ వెళ్ళిం తర్వాత ఆయన విశ్వనాథ ముఠాలో చేరి పోయారు. గురజాడ కన్యాశుల్కం మీద ఆయన వ్యాసం చూసి బాధపడ్డాను. నా బాధకి కారణం గురజాడ మీద నాకున్న అభిమానం కాదు. ఆ వ్యాసంలో మాస్టారు పొందిన దారుణమైన ఓటమి. భయంకరమైన పరాభవం. పనికిమాలిన సంస్కృత నాటక లక్షణాలు శాస్త్రిగారిని సిగ్గుతో తలవంచుకునేటట్టు చేశాయి. కన్యాశుల్కం విజయగర్వంతో ఆయనను అవహేళన చేసింది. విమర్శకుడికి ఇంతకంటే బాధాకర మైన విషయం మరొకటి ఉండదు. తర్వాత 'జయంతి' పత్రికలో ఆయన విమర్శ-విమర్శకులు వంటి వ్యాసాలు రాశారు. నా మనస్సు గందరగోళంలో పడిపోయింది. మాస్టారు ఏదో అయిపోతున్నారు. ఆయన వ్యాసాల్లో జీవకాంతి కంటే చావుకంపు ఎక్కువగా కనపడుతోంది. భాషకూడా మ్యూజియం భాషలా ఉండేది. అయినా ఆయన నాలో కదులుతూనే ఉన్నారు. అక్కడా ఇక్కడా కొన్ని నెలలు ఉద్యోగం చేసి తిరుపతిలో చేరాను. మా కాలేజీలో విద్యార్థుల్తో నాటకాలు వేయించే బాధ్యత ఇచ్చారు. వాల్మీకి జయంతి పెద్ద ఎత్తున జరిపారు. ఆ సందర్భంలో వాల్మీకి జీవితం మీద 'ఆదికవి' అనే నాటకం రాశాను. దాని ప్రదర్శనని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ప్రశంసించారు. ఆ నాటకాన్ని "నా జ్ఞాపకాల పొరలలో, అనుభవాల అలలలో నిరం తరం విహరించే కేతవరపు రామకోటి శాస్త్రిగారికి అంకితం" ఇచ్చాను. జయంతి సంఘంవాళ్ళు అచ్చువేసిన ఆ నాటకాన్ని వరంగల్లో ఉన్న మాస్టారికి పంపించాను. ఆయన ఎంతో సంతోషపడుతూ పెద్ద ఉత్తరం రాశారు. ఆ ఉత్తరంలో విశ్వనాథ భావజాలం ఏమీలేదు.

1972 వేసవిలో తెనాలిలో జరిగిన విరసం సర్వసభ్య సమావేశంలోనే మొదటిసారి విరసం నాకు కార్యదర్శి బాధ్యతని ఇచ్చింది. అప్పుడు అక్కడే జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్నాను. నా ఉపన్యాసం పూర్తికాగానే మాస్టారు ఎవరి తోనో కబురు చేశారు. నేను వేదిక దిగివెళ్ళి ఆయనను కలుసుకున్నాను. ఒక దశాబ్దం తర్వాత ఆయనని కలుసుకున్నందుకు ఎంత సంతోషపడ్డానో చెప్పలేను. ఏ మార్గం మంచిది, ఏ మార్గం మంచిది కాదు ఎలా చెపుతామయ్యా, నువ్వు ఇలాంటి మార్గంలోనే ప్రయాణం చేస్తావని నాకు తెలుసు. నీకు నచ్చిన పంథాలోనే పనిచెయ్యి

మన్నారు. అరసంకంటే ఇదే మేలు అన్నారు. అనాటి విశ్వనాథీయుల కంటే భిన్నంగా విరసం అంటే సహనభావం ఉందని నాకు అర్థమైంది. ఎమర్జన్సీ అయిపోయేదాకా ఆయనతో సంబంధం కొనసాగలేదు. 78లో కాబోలు వరంగల్ వెళ్ళాను. తిక్కన కవిత్వం మీద తన పరిశోధనా గ్రంథాన్ని ఇచ్చారు. భూపతి లక్ష్మీనారాయణ రావు భారతము-తిక్కన రచన తర్వాత తిక్కనమీద వచ్చిన పరిశోధక గ్రంథాల్లో శాస్త్రిగారి గ్రంథం చాలా ఉదాత్తంగా ఉందనిపించింది. భావాల్లో ఒరిజినాలిటీ ఉంది. అయితే అనేక ఇతర పరిశోధక గ్రంథాల్లాగానే ఇదీ పెద్దగా ప్రచారంలోకి రాలేదు. దాదాపు ఆ కాలంలోనే వరంగల్ పట్టణంలోనూ, కాకతీయ విశ్వవిద్యాలయంలోనూ ఉపన్యాసాలు చెప్పాను. అప్పటికి శాస్త్రిగారు శేషేంద్రశర్మ కవిసేన మానిఫెస్టోని ప్రస్తుతిస్తూ విమర్శినిలో వ్యాసం రాశారు. నా ఉపన్యాసంలో ఆ మానిఫెస్టోలో దేశ కాల స్పృహ లేదనీ, చారిత్రిక దృష్టి లేదనీ, అందులో నిర్ధారణలన్నీ పూర్తిగా తప్పు అనీ చెప్పాను. మాష్టారు దిగ్భ్రాంతి చెందారు. వరంగల్ విరసం పాఠశాలలో చరిత్ర-సాహిత్య చరిత్ర మీద నా పాఠం ఆద్యంతం విన్నారు. 80 దశాబ్దంలో నాకు ఆయనలో స్పష్టంగా ఒక మార్పు కనిపించింది. ఆధునిక, ప్రాచీన సాహిత్యాల మధ్య సమన్వయం చేయాలనే తపన. విప్లవ సాహిత్యోద్యమం, మార్క్సిజం విషయంలో తన ప్రేమని బహిరంగంగానే ప్రదర్శించారు. ఈ దశాబ్దంలో మళ్ళీ మాష్టారితో నా సంబంధాలు సన్నిహితం అయ్యాయి. తరచుగా ఉత్తరాలు రాయటం, తిరుపతి వచ్చినప్పుడల్లా కలుసుకోవడం, గంటల తరబడి సాహిత్య చర్చలు చేయటం జరిగింది. విశ్వనాథ మీద భక్తి తగ్గ లేదు. కానీ, విశ్వనాథ భక్తి బృందం నుంచీ, ఆర్. యస్. యస్. విశ్వహిందూ పరిషత్ భావజాల వలయం నుంచీ బయటపడి ప్రజాస్వామిక దృక్పథాన్ని అలవరచుకున్నారు. ఉదారవాదాన్ని పెంచుకున్నారు. తనకు ఏకాభిప్రాయం ఉన్నా లేక పోయినా అవతలివాడి అభిప్రాయం సహేతుకంగా ఉంటే ఆమోదించేవారు. విప్లవ పోరాటాలూ, దళిత, స్త్రీ విముక్తి ఉద్యమాలూ అవసరమే అని అంగీకరించారు. అన్ని రకాల ధోరణుల్తోనూ విస్తృత సంబంధాన్ని పెంచుకున్నారు. కావలిలో జరిగిన విరసం సాహిత్య విమర్శ వర్క్‌షాప్‌లో ధ్వని సిద్ధాంతాన్ని ఆధునిక కవిత్వంతో అన్వయించటానికి ప్రయత్నం చేశారు. అది విఫల ప్రయత్నమే. పరస్పర విరుద్ధ విషయాల మధ్య సమన్వయం కుదరదనీ, ఆ ప్రయత్నం మాను

కోవటం మంచిదని ఎన్నిసార్లు చెప్పినా చూద్దామయ్యా అనేవారే కానీ తన పట్టు దలని వదులుకోలేదు. భావ, భౌతికవాదాల మధ్య సమన్వయం అనే ఒక అసాధ్య మైన అశాస్త్రీయ ధోరణిని పట్టుకు వేలాడటం వల్లనే వ్యక్తిగా నలుగురిలోనూ గౌరవాభిమానాలు పొందగలిగినా 80-90 మధ్యకాలంలో మాష్టారు ఏమీ రాయలేక పోయారు. సాహిత్య చర్చలకీ, సంభాషణలకీ ఆయన సాహిత్య వ్యాసాంగం పరిమితమైపోయింది. ఖండితంగా మాట్లాడటం కూడా పోయింది. ఏమోలా, అటలా, కావచ్చులా, ఇలాగూ ఉండొచ్చు, అలాగూ ఉండొచ్చు అనే సంశయాత్మక ఉపన్యాసాలు పెరిగిపోయాయి. దాన్తో శ్రోతల్ని ప్రభావితం చేసే శక్తి తగ్గిపోయింది.

ఇటీవల విశ్వనాథ సాహిత్యంమీద నా వ్యాసాలు మాష్టార్ని ఇబ్బందిలో పడ వేశాయి. వాటిమీద ఎలాంటి వైఖరిని తీసుకోవాలనే విషయంలో ఊగిసలాడారు. నేను ఆయన్ని గట్టిగా నిలపెట్టి ప్రశ్నించాను. నేను రాస్తున్నదాంట్లో తప్పు ఏముంది? ఎక్కడ నేను హేతు ప్రదర్శన లేకుండా రాస్తున్నాను? చెప్పండని నిలదీశాను. ఉత్తరం మీదఉత్తరం రాశాను. చివరికి సుబ్రహ్మణ్యం వ్యాసం మీద తనకి ఏ మాత్రం ఏకాభిప్రాయం లేదని నువ్వు రాస్తున్న విషయాల్తో ఏకీభవిస్తున్నాననీ స్పష్టంగా రాశారు. అక్టోబర్‌లో మాష్టారు మా ఇంటికి వచ్చారు. దాదాపు 5 గంటలు మాట్లాడు కున్నాం. విశిష్టాద్వైత రస సిద్ధాంతం, పెద్దన మనుచరిత్రనుంచీ విజయ రాఘవ నాయుడు దాకా ఉత్తర మధ్యయుగ సాహిత్యంమీద విశిష్టాద్వైత ప్రభావం గురించీ వివరంగా నా ఆలోచనల్ని ఆయన ముందు పెట్టాను. ఆయన ఆశ్చర్యపడిపోయారు. 100 పేజీల్లో అయినా సరే తాత్త్వీక దృక్పథం నుంచీ తెలుగు సాహిత్య చరిత్ర రాయవయ్యా, అచ్చు సంగతి నేను చూస్తాను అన్నారు. ఎన్నో రాయాలని ఉంది కానీ ఏమీ రాయలేను. శారీరకంగా, మానసికంగా నాకు అనుకూల పరిస్థితులు లేవు. ఏ వరవరరావో పదే పదే ఉత్సాహపరిస్తే, ఏదైనా జి. వి. సుబ్రహ్మణ్యం వ్యాసంలాంటి తుచ్ఛ రచనని చూసి కోపంవస్తేనో తప్ప ఏమీ రాయలేనండీ అనే వేదాంతంలో పడి పోయాను. నా శక్తిని నేను వృథా చేసుకున్నానని ఆయన అభిప్రాయం. నాకు అసలు శక్తేలేదని ఉద్యమం రాయిస్తే రాయటమే అనీ నా అభిప్రాయం. ఎంత చిన్న పుస్తకమైనా సరే సాహిత్య చరిత్ర రాయమని పదే పదే చెప్పి వెళ్ళిపోయారు.

ప్రకటన

ఏజెన్సీ అడవులూ, మారుమూల గ్రామాలు, తెలంగాణా పట్టణాలు దాటి యెన్‌కౌంటర్లు రాజధాని నగరానికి చేరాయి. కరుడుగట్టిన నక్సలైట్లూ, గుర్తు తెలియని తీవ్రవాదులూ, పౌరహక్కుల నాయకులూ, కార్మికులమీంచి యెన్‌కౌంటర్ల గురి నిరుద్యోగులు, పాత్రికేయుల మీదికి మళ్ళింది.

బూటకపు ప్రజాస్వామ్యంలోని నాలుగు 'ఎస్టేట్ల'లో మూడు అంతర్ధానమయ్యాయి. రాజ్యం యిప్పుడు పోలీసు ఎస్టేట్‌గా మారిపోయింది. తుపాకీ బాయ్‌నెట్ మీద నిలబడివుంది. యిది ఫాసిజానికి స్పష్టమైన రూపం.

యిప్పుడు పోలీసులు యేమైనా మాట్లాడగలరు. రాజధాని నగరంలో పని చేస్తున్న ఒక పాత్రికేయుడిని కాల్చిచంపి ఎన్‌కౌంటర్ అనగలరు. ఒక నిరుద్యోగిని నిలువునా కాల్చేసి తీవ్రవాదిని చంపామని చెప్పగలరు. ఎందుకంటే అది నరహంతకుల పరిభాష. రాజధాని నగరం అడవిగా మారి, పోలీసులు క్రూరమృగాలుగా సంచరిస్తూ, రాజకీయ ఆంబోతులు రంకెలేస్తున్నప్పుడు ప్రజల క్షేమాన్నికోరే ఒక జర్నలిస్టు 'నక్సలైట్'గా, అతని కలం తుపాకీగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. ఒక నిరుద్యోగి 'నక్సలైట్' కావడంలో అవాస్తవమేమీ లేదు.

కానీ, ఈ నరహంతకుల నయవంచన ఎంతకాలం? నాలుగుముక్కలై పోయిన జనం ఒక్కటయ్యేంతవరకే! ఆరోజు దగ్గరలోనే వుందని విరసం నమ్ముతున్నది. రసూల్, విజయప్రసాద్ హత్యలకు కన్నీరు పెడుతూనే విరసం ఆ నరహంతకుల అంతిమగడియలని వూహిస్తున్నది.

విరసం

అక్టోబర్ 20న ఉత్తరం రాశారు. మాండూక్యోపనిషత్తు శంకర వ్యాఖ్యానం మరో రెండు పుస్తకాలూ పంపారు. ఇక అంతే-

ప్రమాదంలో మరణించారని టెలిగ్రాం.

, ఆయన అభిప్రాయాల్లో పరస్పర విరుద్ధమైన అంశాలు ఉండవచ్చు. విశ్వనాథ మీద భక్తి చివరిదాకా ఉండి ఉండవచ్చు. ఆయన సాహిత్య విమర్శ మీద ఒక అంచనాకి రావటం ఇప్పుడు సాధ్యం కాకపోవచ్చు. ఆయన విరసం మిత్రుడు. నా జీవితంలో ఆయన స్థానం అచంచలం.



న్యాయవాది కావడానికి సాహసం అవసరం లేదు. న్యాయం కోసం వాదించడానికి సాహసం కావాలి. కోర్టులోనయినా బయటయినా.

అప్పుడప్పుడు సాహసం చేయడానికి కూడా పెద్దగా సాహసం అక్కరలేదు. ప్రతిక్షణం సాహసించడానికి చాలా కావాలి.

కొందరి సాహసం రౌడీయిజం నుండి పుడుతుంది. కొందరిని మంచితనం సాహసులను చేస్తుంది. మంచితనం వల్ల చాలా మంది పిరికివాళ్ళవుతారు. కొందరు మట్టుకు సాహసులవుతారు. వాళ్ళు గొప్ప మనుషులు.

నర్రా ప్రభాకరరెడ్డి గొప్పమనిషి.

హయగ్రీవాచారిని చంపినందుకు ప్రతీకారంగా ప్రభాకరరెడ్డిని చంపారని విజ్ఞులు సంపాదకీయాలు రాశారు. అది అబద్ధం. అది ప్రభాకరరెడ్డికి అవమానకరం.

హయగ్రీవాచారికి అంతటి యోగ్యత లేదు. ప్రజలకే వుంది. ప్రజలకు తన గుండె బలాన్ని అంతగా ఇచ్చినందుకు ప్రభాకరరెడ్డిని చంపారు. ఆ గుండె బలానికి ప్రజలే వెలకడతారు. మూల్యం వసూలు చేస్తారు.

122

124 ARUNATARA - DEC 91/ JAN 92 H/GTR-70
Annual Subscription Rs. 40/- Single Issue Rs. 4/-

విరసం 13వ మహాసభల్ని జయప్రదం చేయండి !

1992 జనవరి 11, 12, 13 తేదీలలో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో (గాంధీపార్క్ పక్కన) విరసం 13వ మహాసభలు జరుగుతాయి. ఈ సభలలో నాలుగంశాల పైన ప్రసంగాలు, చర్చలు ఉన్నాయి. భారత దేశ ఆర్థిక వ్యవస్థపై సామ్రాజ్యవాద ఆధిపత్యం గురించి పౌరహక్కుల సంఘ కార్యదర్శి కా॥ బాలగోపాల్, రష్యా పరిణామాల గురించి విరసం కార్య వర్గ సభ్యులు కా॥ చలసాని ప్రసాద్, విరసం సాంస్కృతిక కర్తవ్యాల గురించి విరసం కార్యదర్శి కా॥ వి. చెంచయ్య, దళిత ఉద్యమం పట్ల విరసం అవగాహన గురించి విరసం కార్యవర్గ సభ్యులు కా॥ సి. యస్. ఆర్. ప్రసాద్ ప్రసంగిస్తారు. కామ్రేడ్స్ నారాయణస్వామి, సౌదాల నిర్వహణలో 11వ తేదీ సాయంత్రం 'కవిసభ' జరుగుతుంది. ఈ మూడు రోజులూ విరసం, జననాట్యమండలి, అరుణోదయ సంస్థల సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. కా॥ జి. కళ్యాణరావు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ప్రస్తుతం దేశంలో యుద్ధ వాతావరణం ఉంది. దేశవ్యాప్తంగా అనేక ఉద్య మాలు చెలరేగుతున్నాయి. ప్రజలు తమ సమస్యల పరిష్కారంలో చైతన్యంతో ముందుకు వస్తున్నారు. అదే సమయంలో ప్రజా ఉద్యమాలపైన పాలకవర్గ నిర్బంధం తీవ్రమవుతోంది. భూమికోసం పోరాడుతున్న తెలంగాణా ప్రజలు సరిహద్దు భద్రతా దళాలు ఎక్కుపెట్టిన తుపాకుల కింద తమ మనుగడ సాగిస్తున్నారు. ప్రజల సమస్య లకు పరిష్కారం చూపలేని ప్రభుత్వం తుపాకీతో రాజ్యపాలన చేస్తోంది. నక్సలైట్ల ఏరివేత పేరుతో దొరికినవాళ్ళను పట్టుకొని పోయి కాల్చి చంపుతున్నారు. పౌర హక్కుల సంఘనాయకుడు, న్యాయవాది అయిన నర్రా ప్రభాకరరెడ్డి హత్యగాని, జర్నలిస్టుగా నిర్భయంగా ప్రజల సమస్యలను వెలికి తెచ్చిన గులాం రసూల్ హత్య గానీ పోలీసుల పాశవిక చర్యలకు పరాకాష్ఠ. ఈ నిర్బంధ నేపథ్యంలో రచయితల పాత్ర ఎంతో బాధ్యతాయుతమైంది. రచయితలు ప్రజల సమస్యలను పట్టించుకోవాలి. ప్రజల బాధల్ని, గాథల్ని తమ కలాల్లో, గళాల్లో పలికించాలి. నిర్బంధం విరుచుకు పడ్డ కీలక సమయాల్లో కూడా రచయితలు నిర్భయంగా ప్రజల పక్షం నిలవాలి. ఈ నేపథ్యంలో జరుగుతున్న విరసం మహాసభల్ని జయప్రదం చెయ్యాల్సిందిగా ప్రజలను, రచయితలను, కళాకారులను విరసం కోరుతోంది.

వి. చెంచయ్య రాష్ట్ర కార్యదర్శి, విరసం.

Printed at Nagendra Press, VJA-2. on behalf of Venkataramana Printers, Guntur-1 Revolutionary Writers' Association

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M104
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	137
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	[illegible]
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	Jayamma
స్కాన్ చేసినది	Priyaulod
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good